# UNIVERSITY OF HYDERABAD
## LIBRARY
## HYDERABAD (A. P.)

*Cl. No.* ____________ *Acc. No.* 311

## DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

# కథాసరిత్సాగరము

## తృతీయ భాగము,

వేదము వేంకటరాయశాస్త్రి ప్రణీతము.

వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్.

4. మల్లికేశ్వరస్వామిగుడి సందు, లింగిసెట్టివీధి,

జి. టి. మదరాస్.

THE ANDHRA BOOK HOUSE

CHECKED
JUNE 1981

CHECKED June 85

తృతీయ ముద్రణము

చంద్రికా ముద్రణాలయము, చాకలపేట,

మదరాసు, నవంబరు—1952.

UNIVERSITY OF HYDERABAD.
Acc. No. 311
Date 8 AUG 78
LIBRARY

1982

# కథాసరిత్సాగరము.

## తృతీయభాగము, విషయానుక్రమణిక.

### సూర్యప్రభలంబకము.


| విషయము. | పుట. |
|---|---|
| వజ్రప్రభుని యాగమనము | 713 |
| సూర్యప్రభుని కథ | 714 |
| ఇంద్రుఁడు చంద్రప్రభునికడకు దూత్యము పంపుట | 731 |
| చంద్రప్రభుఁడు సునీథదేహముం జొచ్చుట | 735 |
| కాలుఁడను విప్రుని కథ | 738 |
| సునీథుఁడు తల్లిని లీలావతిని దర్శించుట | 743 |
| సునీథుఁడు బలినిదర్శించుట | 745 |
| కలావతి సూర్యప్రభునికడకు వచ్చుట | 748 |
| సూర్యప్రభుఁడు ప్రహ్లాదుని దర్శించుట | 751 |
| మహల్లిక | 754, 758 |
| కళావత్యాదులవివాహము | 761 |
| కశ్యప సందర్శనము | 765 |
| సూర్యప్రభుఁడు శ్రుతశర్మతో పోరసమకట్టుట | 771 |
| దివ్యతూణీరమును ధనూరత్నమును సాధించుట | 776,779 |
| వయస్యులు దివ్యధనువులను సాధించుట | 780 |
| సూర్యప్రభుఁడు మోహినీపరివర్తినులను సాధించుట | 781 |
| శ్రుతశర్మకడకు దూత్యము | 784 |
| రణదీక్ష | 787 |
| విలాసినీసమాగమము | 788 |
| ఓషధీసాధనము | 790 |
| ప్రభాసునిపూర్వచరిత్రము | 791 |
| యుద్ధయాత్ర | 795 |
| సంగ్రామము | 798 |
| సూర్యప్రభునిపత్నులసల్లాపములు | 803 |
| ప్రభాసునియుద్ధము | 806 |
| గుణశర్మకథ | 819 |
| యుద్ధాంతము | 842 |
| సూర్యప్రభునివిజయము | 850 |

ముగా చేసిన చక్రవర్తియందు భక్తుఁడనై తన కరుణచేత శత్రువులకు అజయ్యుఁడ నగుదు నని నాకు ఆదేశింపఁగా ఇప్పుడిచటికి ప్రభుదర్శనార్థము వచ్చినాఁడను. 'కామాంశసంభవుఁడైన వత్సరాజసుతుఁడు నరవాహనదత్తుఁడు మర్త్యుఁడయ్యును చంద్రశేఖరుని యాజ్ఞవలన మాకు ఒక దివ్యకల్పము ఉభయవేదర్ధచక్రవర్తి యగును.' అని నే నిప్పుడు విద్యాప్రభావముచేత తెలిసికొంటిని, పూర్వము సూర్యప్రభుఁ డను మనుష్యుఁడు శంకరుని ప్రసాదమున ఒకదివ్యకల్పము విద్యాధర చక్రవర్తి యాయెను. అయినను ఆయన దక్షిణవేదర్ధమునకు మాత్రమే చక్రవర్తి యై యుండెను. ఉత్తరవేదర్ధమునకు శ్రుతశర్మ చక్రవర్తిగా నుండెను. రెండువేదర్ధములకును ఒక కల్పము చక్రవర్తి కాఁగల పుణ్యాత్ముఁడవు, దేవా, నీ వొక్కఁడవే.

ఇట్లు పలికిన యావిద్యాధరుని కుతూహలముచేత నరవాహనదత్తుఁడు తండ్రియుం డానును 'ఎట్లు సూర్యప్రభుఁడు మనుష్యుఁడే అయ్యును విద్యాధరచక్రవర్తిపదమును పొందినాఁడు ? చెప్పుము.' అని యడిగెను. అంతట విజనమందు దేవేరుల యెదుటను మంత్రుల యెదుటను వజ్రప్రభుఁడు ఈ కథను చెప్పం దొడంగెను.

## సూర్యప్రభుని కథ.

మద్రదేశములో పూర్వము శాకల మను పుర ముండెను. అందు అంగారప్రభునికొడుకు చంద్రప్రభుఁ డను రాజు ఉండెను,

అతఁడు లోకమునకు ఆహ్లాదము చేయుటచేత అన్వర్థ నాముఁడై, శత్రువులకు సంతాపకారి యగుటచే అగ్నిప్రభుఁడై యుండెను. ఆయనకు కీర్తిమతి యను దేవియందు అభ్యుదయమును సూచించునట్టి సకలశుభలక్షణములుం గల పుత్త్రుఁడుఁ పుట్టెను. అపుడు 'ఈతఁడు శంకరుని ప్రసాదమున సూర్యప్రభుఁ డనుపేర విద్యాధరచక్రవర్తి కాఁగలఁడు.' అని ఆకాశవాణి చంద్రప్రభుని శ్రవణములకు అమృతవర్షముగా పలికెను. శంకరుని ప్రసాదముచే ఉత్సవవంత మయిన తండ్రియింట సూర్యప్రభుఁడు ఎదుగుచుండెను. యథాకాలముగా ఆ బుద్ధిమంతుఁడు గురువులవలన సకల కళలను సకల విద్యలను నేర్చెను. పదునాలేండ్లు నిండఁగానే గుణములచే ప్రకృతులకు ప్రియుఁ డయిన యా కుమారుని చంద్రప్రభుఁడు యువరాజును చేసి తన మంత్రిపుత్త్రులను భాస ప్రభాస సిద్ధార్థ ప్రహస్త ప్రభృతులను అనేకులను అతనికి ఇచ్చెను.

వారితో నతఁడు యౌవరాజ్యము నిర్వహించుచుండఁగా ఒకనాఁ డచటికి మయుఁ డను గొప్ప యసురుఁడు వచ్చి చంద్రప్రభునివలన ఆతిథేయసత్కారములు పొంది అతనితో సూర్యప్రభుఁడు వినుచుండ నిట్లనియె:—'రాజా, విద్యాధరేశులకు చక్రవర్తిగా, శూలపాణి ఈ కుమారుని ఏర్పఱిచి యున్నాఁడు. ఇతఁ డేల ఆపదము నిచ్చు విద్యలను సాధింపఁడు? అందులకే శంభువు నన్ను ఇచటికి పంపినాఁడు. నెల విమ్ము,

ఇతనిని కొనిపోయి విద్యాధరేంద్రపదము నిచ్చునట్టి విద్యలను నేర్పి తెచ్చెదను. ఇతనికి శత్రువు విద్యాధరేశ్వరుఁడు శ్రుతశర్మ యనువాఁడు కలఁడు. వానికి ఆపదవిని ఇంద్రుఁ డిచ్చినాఁడు. ఇతఁడు అతనిని జయించి విద్యాధరచక్రవర్తి యగును.' ఇట్లు మయుఁడు పలుకఁగా చంద్రప్రభుఁడు 'ధన్యుల మయితిమి, ఇతఁడు పుణ్యవంతుఁడు, నీ యిచ్చప్రకారము కొనిపొమ్ము.' అనెను. అంతట మయుఁడు రాజును వీడ్కొని సూర్యప్రభుని అమాత్యసమేతముగా పాతాళమునకు కొని పోయి అచట రాజపుత్రునికి తపస్సులు నేర్పెను. వానివలన రాజపుత్రుఁడు మంత్రిపుత్రులతోఁ గూడ శీఘ్రముగా విద్య లెల్ల నేర్చెను. మయాసురుఁడు సూర్యప్రభునికి విమానసాధనవిద్యను నేర్పెను. దానిచేత సూర్యప్రభుఁడు భూతాసన మను విమానమును కల్పించుకొనెను. అం దెక్కించి యతనిని మంత్రులతోఁగూడ మయాసురుఁడు అతని శాకలపురమునకు కొనిపోయి తండ్రికి ఒప్పగించి యువరాజుతో 'అయ్యా, నేను పోయెదను ; నీవు సిద్ధభోగములను అనుభవించుచుండుము ; నేను మరల వచ్చెదను.' అని పలికి సత్కృతుఁ డై పోయెను. కుమారునికి విద్యలు లభించినందులకు చంద్రప్రభుఁడు సంతోషించెను.

అది మొదలు సూర్యప్రభుఁడు విద్యా ప్రభావముచే మంత్రులతోఁ గూడ విమాన మెక్కి సర్వదా నానాదేశముల కేఁగి విలాసముగా సంచరించుచుండెను. ఎక్క డెక్కడఁ గాని

ఇతనిని జూచిన రాజకన్యక లెల్లరును కామ మోహితలై వచ్చి స్వయముగా వరించుచుండిరి. మొదటిది తామ్రలిప్తీశ్వరుఁ డయిన వీరభటుని కూఁతురు మదనసేన. రెండవది పశ్చిమ దేశాధినాథుఁ డయిన సుభటునికూఁతురు, సిద్ధులచే ఇంటినుండి తేఁబడి ఎక్కడనో వదలఁబడిన చంద్రికావతి. మూఁడవది కాంచీ రాజు కుంభీరుని కూఁతురు రూపశాలిని వరుణసేన. నాలవది లావాణకరాజు పౌరవుని కూఁతురు చారులోచన సులోచన యనునది. ఐదవది చీనరాజు సురోహుని కూఁతురు కాంచన నేత్రి విద్యున్మాల. ఆఱవది శ్రీకంఠదేశాధీశుఁడు కాంతి సేనరాజు కూఁతురు కాంతిచే అచ్చరలను గెలిచినది కాంతిమతి. ఏడవది కౌశాంబీనగరిపతి యైన జనమేజయుని కూఁతురు మంజు భాషిణి పరపుష్ట యనుపేరిది. ఈకన్యలను సూర్యప్రభుఁడు విద్యాబలాధికుఁడు తమ యెుఱుక లేక హరింపఁగా తద్బంధువులు చేయునది లేక వేతసవృత్తి నవలంబించి యుండిరి. సూర్య ప్రభుఁడు విద్యామహిమచే పెక్కు దేహములు దాల్చి ఆకాశ విహార సంగీత పాన గోష్ఠులయందు విద్యలతోను౦బోలె ఆయం గనలతోను ప్రహస్తాది మంత్రులతోను యథేచ్ఛ భోగము లనుభవించుచుండెను. చిత్రకళ ఎఱిఁగినవాఁడై విద్యా ధరాంగనల రూపములను వ్రాసి పరిహాస వక్రోక్తులు పలికి ఆప్రియలకు అలుకఁ బుట్టించుచు, బొమముడియు నరుణేక్షణ ములుం గల వారివదనములచేతను, కెమ్మోవికంపిల్ల నస్పష్టముగా వారు పలికిన వచనములచేతను, ఆనంద మనుభవించు చుండెను.

తామ్రలిప్తికి ఆ రాజసూనుఁడు ఆకాశమార్గమున బోయి అందలి యుద్యానవనములలో మదనసేనతో విహరించుచుండెను. ప్రియతమలను అచట ఉంచి ప్రహస్తు నొకనిని వెంటఁగొని భూతాసనవిమానము నెక్కి వజ్రసారపురమునకుఁ బోయి అచట తన్ను వలచి మదనాగ్నిచే వేఁగుచున్నదానిని రంభమహారాజు కొమారితను తారావళిని తండ్రి చూచుచుండఁగా హరించుకొని తామ్రలిప్తికి వచ్చెను. అచట ఱేని మఱియొక్క కూఁతును విలాసిని యనుదానిని స్వీకరించెను. అందులకై కోపగించి యెదుర్కొనిన యామెభ్రాతను సహస్రాయుధుఁడనువానిని గర్వితుని విద్యచేత స్తంభితునిఁ జేసెను. విలాసినిని కొనిపోవుటకు ఆతనికి తోడుగా వచ్చిన యతని మేనమామను స్తంభితునిఁ జేసి తల గొరిగించెను. వారిపై కుపితుఁ డయ్యును భార్యాబంధువు లనుకరుణచేత వారిని తెగటార్చ లేదు. గర్వభంగముమాత్రము పూర్ణముగా చేసి అవమానపఱిచి వెలవెలఁ బుచ్చి హసించి విడిచిపెట్టెను.

పిమ్మట తండ్రి పిలువ నంపఁగా సూర్యప్రభుఁడు తొమ్మండుగురు భార్యలతో నిజనగరము శాకలమునకు పోయెను. అంతట ఇతనితండ్రియొద్దకు వీరభటనరపతి తామ్రలిప్తినుండి దూతను పంపెను. 'నీకుమారుఁడు నాకుమారితలను హరించినాఁడు, అతఁడు విద్యాసిద్ధుఁడు గాన వారికి తగిన పతియే; నాపై

మీఁకు స్నేహము కలదేని ఇట రండు, వివాహాచారసఖ్యము చేయుదము గాక.' అని దూత్యము పంపెను. చంద్రప్రభుఁడు ఆదూత్యము విని, దూతను సత్కరించి మఱునాఁడే అచటికి పోవుటకు నిశ్చయము చేసికొనెను. వీరభటమహారాజుయొక్క సత్యము నిశ్చయించుకొనుటకై చంద్రప్రభుఁడు, దూతపోయి వచ్చుటకు విలంబమగు నని ప్రహస్తమంత్రిని పోయి రమ్మని పంపెను. ప్రహస్తుఁడు త్వరగా పోయి వీరభటుని దర్శించి అతని కార్యము నడిగి అతనివలన సత్కారములు నడసి, ఆశ్చర్యపడుచున్న యతనితో 'ఱేపు మాప్రభువులు వత్తురు' అని చెప్పి, గంటసేపులో మరల శాకలపురమునకు పోయి తన ప్రభువుతో వీరభటుఁడు సిద్ధపడి యుండుటను చెప్పి, యతనివలన గౌరవము వడసెను.

అంతట చంద్రప్రభుఁడు కీర్తిమతీదేవితోను, సూర్యప్రభుఁడు విలాసినీ మదనసేనలతోను, భూతాసనవిమాన మెక్కి అమాత్యపరివారసమేతముగా ప్రాతఃకాలమున బయలువెడలి జాముప్రొద్దెక్కునప్పటికి తామ్రలిప్తికిపోయి, కన్నులెత్తి చూచుచున్న యచటి జనులందఱకు ఆశ్చర్య మొదవించుచు, ఆకసమునుండి దిగిరి. వీరభటమహారాజు ఎదురువోయి సత్కరించి వారిని నగరికి తోడ్కొని పోయెను. పురమెల్ల అలంకృతమై యుండెను. అడుగడుగునను వీధులలో మంచిగంధము కలయంపి చల్లిరి. పౌరస్త్రీల కటాక్షములు సల్లగలువ తోరణములు

వోలె నొప్పుచుండెను. వీరభటుఁడు సంబంధిని అల్లుని చక్కఁగా పూజించి యథావిధిగా తనయలను దానము చేసి వివాహ మహోత్సవము నడపించెను. వేయిబారువుల బంగారమును, రత్నాభరణములభారములతోడి నూఱు లొట్టియలను, నానా వస్త్రభారములతోడి తేనూఱు లొట్టెపిట్టలను, ఏఁడువేలగుఱ్ఱములను, అయిదువేల యేనుఁగులను, రూపాభరణవతు లయిన వారస్త్రీలను వేవురను, వీరభటమహారాజు వేదియందు కొమారిత లిరువురకు ఇచ్చెను. అల్లునికిని సంబంధికిని సద్రత్నములతోను దేశములతోను ఉపచారములు చేసి వారి మంత్రులను ప్రహస్తాదులను కూడ యథార్హముగా సమ్మానించెను. పురజనులెల్ల హర్షించు నట్లుగా మహోత్సవము చేసెను. సూర్యప్రభుఁడు తంత్రియు దానును ప్రియాన్వితుఁడై ఆసమయమందు నానాహారపానగేయాదిభోగము లనుభవించుచుండెను.

ఇంతలో శంభునియొద్దనుండి వజ్రసారనగరమునుండి దూత వచ్చి ఆస్థానములో తనబోరమాటగా ఇట్లు విన్నపించెను. 'విద్యాబలగర్వితుఁడైన యువరాజు మాకొమారితను హరించి మమ్ము అవమానపఱచినాఁడు. ఇప్పుడు మాకు తెలిసినది. వీరభటమహారాజుతో ఎట్టి సంబంధము చేసితిరో తత్సమానవ్యసనుఁడ నయిన నాతోను అట్లే చేయవలయు నని కోరుచున్నాను. మాసంధిని అంగీకరించి మీరు ఇచటికి వత్తురేని సరియే, రానియెడల మృత్యువువలన, మాకష్టము తీఱును,'

దానిని విని చంద్రప్రభుఁడు వీరభటుని హెచ్చరికమీఁద ప్రహస్తుని పిలిచి "నీవే పోయి రంభునితో మామాటగా 'ఏల చింతిల్లెదవు ? నీయల్లుని శంకరుఁడు విద్యాధరచక్రవర్తిగా నిర్ణయించి యున్నాఁడు. అతనికి ఈకన్యలు భార్య లగుదురని సిద్ధులు ముందే పలికియున్నారు. నీకౌమారిత తనచోటు చేరినది. కర్కశుఁడవు గావున నిన్ను ప్రార్థింపలేదు. నీవు మాకు సఖుఁడవు. సంతోషింపుము, మేము అచటికి వచ్చెదము.' అని చెప్పుము." అని పలుకఁగా అతఁడు జాముసేపులో వజ్రసారపురమునకు పోయి రంభునికి ఆ వార్త చెప్పి అతని యంగీకారమును కొని చంద్రప్రభునియొద్దకు వచ్చి ఆవృత్తాంతమును తెలిపెను. చంద్రప్రభుఁడు ప్రభాసుఁ డనుమంత్రిని పంపి అతనిచే శాకలమునుండి రంభునికూఁతును తారావళిని తెప్పించెను. సూర్యప్రభునితోను వీరభటాదులతోను కూడుకొని విమాన మెక్కి చంద్రప్రభుఁడు వజ్రసారమునకు పోయెను. తనరాకను జనులెల్ల నెదురు సూచుచుండ, రంభుఁడు ఎదురు వచ్చి తోడ్కొని పోఁగా, చంద్రప్రభుఁడు రాజమందిరమునకు పోయెను. అచట రంభుఁడు వివాహోత్సవము జరిపి కౌమారితకు లెక్క లేని సువర్ణ గజాశ్వ రత్నాదికము నిచ్చెను. అల్లునికి గొప్ప సత్కారములు చేసి సొంతభోగములను మఱపించెను.

వా రందఱు అచటనే ఉత్సవముగా సుఖ ముండఁగా కాంచీనగరినుండి రంభునియొద్దకు దూత వచ్చెను. అతని సందేశ

మును విని రంభుఁడు చంద్రప్రభునితో "దేవా, నాయన్న కుంభీరమహారాజు కాంచీపురము నేలుచున్నాఁడు. ఆయన కడనుండి దూత వచ్చి యిట్లు చెప్పినాఁడు: 'సూర్యప్రభుఁడు ముందుగా నాకౌమారితను హరించి పిమ్మట నీకౌమారితను హరించినాఁడు, నీవు వారితో సఖ్యము చేసితి వని వింటిని, కనుక నాకును వారితో సఖ్యము కల్పింపుము. వారు నా యింటికి వత్తురుగాక, సూర్యప్రభునికి నాచేతిమీఁదుగా వరుణసేనను ఇచ్చెదను గాక.' ఇది యతనిప్రార్థన, మీరు నెఱవేర్పవలయును." అని చెప్పెను. అతనిమాటను పాటించి చంద్రప్రభుఁడు వెంటనే ప్రహస్తునిచేత శాకలమునుండి వరుణసేనను తెప్పించి మఱునాఁడు పరివారసమేతముగా సూర్యప్రభుని రంభ వీరభటాదులను తోడ్కొని కాంచీపురమునకు పోయెను. కుంభీరుఁడు ఎదురు రాఁగా వీరు గుణగుంభిత మై భూదేవీకాంచికంబోని కాంచీపురిని ప్రవేశించిరి. కుంభీరుఁడు యథావిధిగా కౌమారితను సూర్యప్రభుని కిచ్చి ఆవధూవరులకు విస్తారము ధన మిచ్చెను.

వివాహ మై భోజన మై సుఖముగా కూర్చుండియున్న చంద్రప్రభునితో ప్రహస్తుఁడు అందఱు వినుచుండ ని ట్లనియె:– 'దేవా, నేను దేశాటనము చేయుచు ఒకప్పుడు శ్రీకంఠదేశమునకు పోయియుండి కాంతిసేనమహారాజును చూచితిని. ఆయన తనకౌమారితను సూర్యప్రభుఁడు హరించినట్లును, తనయింటికి

వచ్చిన యథావిధిగా తాను అల్లుని సత్కరించునట్లును, రాని యెడల సుతాస్నేహముచే ప్రాణములు వదలునట్లును, చెప్పి నాఁడు. నేను నీతో యిప్పుడు చెప్పితిని.' వెంటనే చంద్రప్రభుఁడు 'కాంతిమతిని కాంతిసేనునియొద్దకు చేర్పుము, మేమును అచటికే వచ్చెదము.' అని ప్రహస్తుని కాజ్ఞాపించెను. ప్రహస్తుఁడును అట్లే చేసెను. తెల్లవాఱఁగానే కుంభీరమహారాజు కూడ రాఁగా అందఱును విమాన మెక్కి ఆకాశమార్గమున శ్రీకంఠదేశమునకు పోయిరి. కాంతిసేనమహారాజు వీరికి ఎదురు వచ్చి యింటికి తోడ్కొనిపోయి యథావిధిగా కొమార్త వివాహము జరిపెను. కాంతిమతికిని సూర్యప్రభునికిని ఆతఁ డిచ్చిన బంగారపురాసులు చూచి ఆరాజు లెల్ల ఆశ్చర్యపడిరి.

వారందఱును అచటనే నానాభోగములలో నుండఁగా కౌశాంబినుండి దూత వచ్చి యిట్లనియె:— "జనమేజయ మహారాజు మీతో చెప్పు మన్నమాట:—'ఎవడో ఇప్పుడే నాసుతను పరపుష్ట యనుదానిని హరించినాఁడు. పరపుష్ట సూర్యప్రభుని చేతిలో చిక్కియున్న దని ఇట మాకు తెలిసినది. ఆమెను తోడ్కొని అతఁడు మాయింటికి నిశ్శంకముగా వచ్చును గాక, సత్కరించి సభార్యునిఁగా పంపెదను. రానియెడల మీకు మేము మాకు మీరు శత్రువులమే.' అని" ఇట్లు పలికి దూత విరమింపఁగా చంద్రప్రభుఁడు రాజులందఱితోను ఏకాంతములో 'ఇంతగర్వముగా పలుకుచున్న యతనియింటికి పోవచ్చునా?'

అనెను. ఆమాటకు సిద్ధార్థుఁడనుమంత్రి 'దేవా, వేఱువిధముగా తలంపఁగూడదు. ఆయన యిట్లు పలుకుట అర్హమే. ఆరాజు మహాదాత, సత్కులప్రసూతుఁడు, పండితుఁడు, శూరుఁడు, అశ్వమేధయాజి, పరాజయ మెన్నఁడు నెఱుఁగనివాఁడు. ఆయన ఉన్నది యున్నట్లు తెలిపినాఁడు, అతనివలన విరుద్ధ మేమున్నది? అతఁడు ప్రస్తావించిన శత్రుత్వము ఇంద్రుఁడు కల్పించినది. కనుక అతనియింటికి పోవలసినది. ఆరాజు సత్యసంధుఁడు. అయినను ఆయన మనస్సును తెలిసికొనుటకై దూతను పంపుఁడు అని చెప్పఁగా అందఱును అంగీకరించిరి.

అంతట చంద్రప్రభుఁడు జనమేజయుని యభిప్రాయమును తెలిసికొనుటకై ప్రహస్తుని పంపి జనమేజయునిదూతను సత్కరించెను. ప్రహస్తుఁడు కౌశాంబికి జనమేజయునియొద్దకు పోయి ఇచటి యుద్దేశ్యములను ఆయనకు తెలిపి ఆయనవలన జాబు గ్రహించి చంద్రప్రభునికి తెచ్చి యిచ్చెను. అంతట రాజు ప్రహస్తునే శాకలమునకు పంపి పరఫుష్టను అతనితో జనమేజయుని యొద్దకు పంపెను. అంతట చంద్రప్రభాదులు కాంతిసేనా సూర్యప్రభసహితులై కౌంశాంబికి పోయిరి. అచట వియ్యంకుని అల్లుఁడు మొదలయినవారిని జనమేజయుఁడు వినయముతో సన్మానించెను. కుమారికి వివాహము చేసి, అయిదువేల యేనుఁగులను, లక్ష వరాశ్వములను, రత్నకాంచన సద్వస్త్రకర్పూరాగురుభారములతో క్రుంగుచున్న యైదువేలలొట్టియలను ఇచ్చి

వాద్యనృత్యమయము గాను సమ్మానిత సర్వరాజకము గాను పూజితబ్రాహ్మణోత్తమముగాను లోకమహోత్సవము చేసెను.

ఆసమయములో ఆకస్మికముగా ఆకాశము ఎఱుపెక్కి సూర్యప్రభునికి కానున్న రక్తారుణత్వమును సూచించునదివోలె నొప్పెను. ఆకాశమార్గమున వచ్చిన పరసైన్యమును చూచి భయపడినవియుంబోలె దిక్కులెల్ల సంకులశబ్దములు సేయు చుండినవి. ఆక్షణములో ఖేచరులతోడి యుద్ధముకై భూచరులను ఎగురఁజేయునదివోలె మహావాతము వీవసాగెను. క్షణములో తేజోరాజితదిక్చక్రమై విద్యాధరసైన్యము దిక్కులు పిక్కటిల్ల సింహధ్వనులు సేయుచు మహావేగముతో వచ్చెను. దానినడుమ మిక్కిలి యందగాని విద్యాధరకుమారుని చూచి సూర్యప్రభాదులు ఆశ్చర్యపడిరి. 'ఆషాఢేశ్వరునికుమారుఁడు దామోదరుఁడు యువరాజు సర్వోత్కృష్టుఁడు. ఓరి మనుష్యుఁడా భూచరా సూర్యప్రభుఁడా, అతనిపాదములలో పడురా ఓరి జనమేజయుఁడా, మాప్రభువునకు నమస్కరింపుము. నీకొమారితను అనర్హుని కిచ్చితివి. ప్రణిపాతమునఁగాని మాప్రభువు నిన్ను క్షమింపఁడు.' అని ఆసమయమున విద్యాధరవంది ఆకాశముననుండి దామోదరునియెదుట బిగ్గరగా పలికెను.

సూర్యప్రభుఁడు ఆమాట విని ఆసైన్యమును చూచి, డాలు, కత్తియు, కేలఁబూని కోపముతో ఆకాశమున కెగసెను. వెంటనే ప్రహస్తుఁడు, భాసుఁడు, సిద్ధార్థుఁడు, ప్రజ్ఞాఢ్యుఁడు,

సర్వదమనుఁడు, వీతభీతి, శుభంకరుఁడు ననుమంత్రులు ప్రభువుతో ఆకాశమున కెగసిరి. వారితో విద్యాధరులకు గొప్ప యుద్ధము జరిగెను. సూర్యప్రభుఁడు దామోదరునిమీఁదికి పోయి ఎదిరినవారిని కత్తితో నఱుకుచు వారియాయుధముల దెబ్బలకు డాలుతో తన్ను కాచుకొనుచు నుండెను. ఆయుద్ధములో మనుష్యులు కొంచెమమంది, విద్యాధరులు లక్షమంది; అయినను, ఇరువాగును పరస్పరము సమానముగానే పోరెను. రుధిరారుణములును ఆకులములును నై ఖడ్గలతలు యమధర్మరాజుదృష్టులుం బోలె శూరకాయములందు పడుచుండినవి. భయపడి శరణుఁజొచ్చినవియుంబోలె విద్యాధరులశిరములును శరీరములును భూమిమీఁద చంద్రప్రభునియెదుట పడినవి. సూర్యప్రభుఁడు లోకులకుఁ బ్రత్యక్షమైన ఖేచరశ్రీతో నొప్పుచుండెను. ఆకాశము సిందూరపూర్ణముంబోలె రక్తముచేత కెంపెక్కెను. సూర్యప్రభుఁడు కత్తియు డాలును చేతఁ బూని దామోదరునితో పోరెను. పోరుచు కరణప్రయోగముచేత అతనియందు ప్రవేశించి కత్తితో డాలు తెగ నఱికి అతనిని నేలఁ గూల్చెను. సూర్యప్రభుఁడు త్రుళ్లిపడుచున్న యరియొక్క శిరమును తెగ నఱుక నుండఁగా ఆకాశమునుండి విష్ణువు హుంకరించెను. దానిని విని హరిని చూచి నమ్రుఁడై సూర్యప్రభుఁడు హరిగౌరవముచేత దామోదరుని వదలెను. చావు తప్పిన నిజభక్తుని దామోదరుని తోడ్కొని హరి ఎచటికో

పోయెను. ఆదేవుఁడు సద్భక్తులను ఇహపరములందు రక్షించువాఁడు గదా. దామోదరుని యనుచరు లెల్ల ఎచటివారు అచటికి పోయిరి. సూర్యప్రభుఁడును ఆకాశమునుండి తండ్రి యొద్దకు దిగెను. మంత్రిసమేతముగా గాయపడక కుమారుఁడు రాఁగా చంద్రప్రభుఁడు సంతోషించెను. ఇతరరాజులును సూర్య ప్రభుని పరాక్రమమును ప్రత్యక్షముగా చూచినవారై అతనిని పొగడిరి.

అందఱు తుష్టులై ఆజయకథనే మరల చెప్పుకొనుచుండఁగా సుభటమహారాజునొద్దనుండి దూత వచ్చి చంద్రప్రభుని యెదుట ఒకజాబు నుంచెను. సిద్ధార్థుఁడు దానిని పగులఁగొట్టి సభలో ఇట్లని చదివెను:— 'శ్రీమంతుఁడు ఉన్నతవంశ మౌక్తికమణియు నగు చంద్రప్రభభూపతికి కొంకణదేశమునుండి సుభటుఁడు సాదరముగా వ్రాయునది.—నాకొమారితను ఏదో సత్త్వము రాత్రి అపహరించికొని పోయినది. ఆమె నీకుమారునికి దొరకిన దని విని సంతోషించితిని! కనుక మీరు మీ కుమారుని తోడ్కొని మాయింటికి వచ్చిన నాకొమారితను పరలోకమునుండి మరల వచ్చినదానింబోలె చూచి సంతోషించి వివాహకార్యము నెఱవేర్చెదను.' ఇట్లు సిద్ధార్థుఁడు చదువఁగా చంద్రప్రభుఁడు సరియే యని దూతను సత్కరించెను. తత్క్షణమే పడమటిదేశమునకు సుభటునియొద్దకు ప్రహస్తునితో చంద్రికావతిని పంపెను. మఱునాఁడు ఎల్లవారును సూర్య

ప్రభుని తోడ్కొని జనమేజయసమేతముగా విమాన మెక్కి పడమటిదిక్కునకుఁ బోయిరి. సుభటరాజు తన కొమారిత దొరకి నందులకు సంతోషించి వారిని మిక్కిలి పూజించి కొమారితకు వివాహమహోత్సవమును జరిపెను. అతఁడు కొమారిత కిచ్చిన రత్నాదికమును చూచి వీరభటాదులు తా మిచ్చిన స్వల్పమునకు లజ్జితు లయిరి.

సూర్యప్రభుఁడు అచటనే మామగారియింట నుండఁగా లావాణకమునుండి పౌరవరాజు దూత వచ్చి తన యేలిక వచనముగా ని ట్లనియె:— 'నాకొమారితను మీ కుమారుఁడు అపహరించినాఁడు. అందులకు నాకు చింత లేదు. మీరు అతనిని తోడ్కొని మాయింటికి రాఁ గూడదా? లోకాచారమయిన వివాహకార్యమును చేసెదను.' వెంటనే చంద్రప్రభుఁడు ప్రహస్తునితో సులోచనను తండ్రియొద్దకు పంపి మఱునాఁడు సుభటునిఁగూడ తోడ్కొని ఎల్లవారును సులోచనా సూర్యప్రభులతో విమాన మెక్కి లావాణకమునకు పోయిరి. పౌరవుఁడు వివాహోత్సవము జరిపి రాజుల నెల్ల సత్కరించెను.

అతనివలన ఉపచర్యలు పొందుచు వీ రందఱు అచట నుండఁగా చీనన రేంద్రుఁడు సురోహుఁడు దూతను పంపెను. కన్యలను కోలుపోయిన యితరరాజులవలె తానును వారిని తనయింటికి రమ్మని దూతముఖముగా నడిగెను. అంతట చంద్రప్రభమహారాజు సంతోషించి సురోహునికూఁతును విద్యున్మా

లను తండ్రియొద్దకు ప్రహస్తునితో పంపించెను. మఱునాఁడు చంద్రప్రభాదులు అందఱు సూర్యప్రభునితోఁ గూడ పౌరవ రాజుతోఁ గూడ చీనదేశమునకు పోయిరి. చీనరాజు వారికి ఎదురు వచ్చి తనకోటకు తోడ్కొని కొమారిత వివాహము జరిపి వధూవరులకు లెక్కలేని సువర్ణగజాశ్వరత్నచీనాంబరాదుల నిచ్చెను. అచట చంద్రప్రభాదులు నానాభోగములను అనుభవించుచు కొంతకాలము సుఖముండిరి. సూర్యప్రభుఁడు అచట విలసత్ఘనయౌవనుండై ప్రావృట్కాలమువోలె విద్యున్మాలచే శోభితుఁడై యుండెను.

ఇట్లు సూర్యప్రభుఁడు మామగార్ల యిండ్లలో ఆయా కాంతతో సబాంధవుఁడై భోగములు అనుభవించుచుండెను. పిమ్మట సూర్యప్రభుఁడు సిద్ధార్థాది మంత్రులతో నాలోచించుకొని వీరభటాదిరాజులను వారివారి దండుతో ఇండ్లకు పంపి సురోహమహారాజును వీడ్కొలిపి భూతాసనవిమాన మెక్కి శాకలనగరమునకు పోయెను. నృత్యములు ఒకచోట, సంగీతకరసము ఒకవంక, పానక్రీడలు ఒకయెడ, సుందరీజనుల యలంకారవిధాన మొకతావున, కోరినకోరికలు తీఱిన వైతాళికుల స్తుతి రవములు ఎల్లయెడలనుండగా, పుర మంతయు సూర్యప్రభు రాకచే ప్రమదపూర్ణమై యుండెను. పుట్టినిండ్ల నున్న భార్యల నందఱను రప్పించినవాఁడై వారితోను వారితండ్రులు వారికిచ్చిన ధనరాసులతోను, ఆరాసుల బరువుచే వంగిన వీఁపులు

గలవై లెక్కకు మిక్కుటమైన లొట్టిపిట్టలతోను, పురము ప్రవేశించి తనయొక్క దిగ్విజయ విభవములను విలాసముగా లోకులకు చూపి వినోదము చేసెను.

ఆ సమయమందు ఆ మహాభోగి యున్న యా శాకల నగరము బహువసువును భూరినిధానము నై అమరావత్యలకా భోగవతీ నగరములనే ఒకటిగా చేర్చి నిర్మించినయట్లు ఒప్పు చుండెను. సూర్యప్రభుఁడు మదనసేనతో యథాభిమతభోగము లనుభవించుచు, తండ్రితోను, మంత్రులతోను, తనయితర భార్యలతోను సుఖ మున్నవాఁడై మయాసురుఁడు వచ్చెద నన్నప్రకారము అతనిరాక నెదురు సూచు చుండెను.

---

## ౨ - వ తరంగము.

---

అనంతరము ఒక నాఁడు చంద్రప్రభ మహారాజును సూర్యప్రభుఁడును తమ యాస్థానమందు సమస్తసచివసమేతు లై యుండఁగా, సిద్ధార్థాదులు చెప్పుచున్న కథలలో మయా సురుని ప్రస్తావము స్మృతియు రాఁగా ఆకస్మికముగా సభా మధ్యములో భూమి బొక్కపడి అందునుండి మొదట సశబ్ద ముగా పరిమళవంత మయిన వాయువు వీచి పిమ్మట మయా సురుఁడు వెలువడెను. కృష్ణోన్నతశిరుఁడును, శృంగజ్వాలత్కోశ మహౌషధియు రక్తాంబరోచ్చలద్ధాతువు నై రాత్రియందు పర్వ

తమువోలె మయాసురుఁడు వచ్చెను. చంద్రప్రభమహారాజు వలన యథోచిత సత్కారములు వడసి రత్నాసనాసీనుఁడై మయాసురుఁ డిట్లు పలికెను. "మీరు భూలోక భోగము లనుభవించితిరి. ఇఁక వేఱుభోగముల కొఱకు యత్నించుటకు కాలము కనుక ఇప్పుడు ఆయత్నము ఆరంభింపుఁడు. దూతలను పంపి మీసంబంధి .బాంధవు లయిన రాజులను పిలిపింపుఁడు, పిమ్మట పోయి విద్యాధరేంద్రుఁడైన సుమేరువుతో కలయుదము. శ్రుతశర్మను జయించి విద్యాధరైశ్వర్యమును పొందుదము. సుమేరుని ఆదిలోనే శంకరుఁడు 'సూర్య ప్రభుని కాపాడుము, అతనికి నీకొమారిత నిమ్ము.' అని ఆజ్ఞాపించియున్నాఁడు." ఇట్లు మయాసురుఁడు పలుకఁగా చంద్రప్రభుఁడు ఆకాశగాము లయిన ప్రహస్తాదులను సకలరాజుల యొద్దకు దూతలనుగా పంపెను. సూర్యప్రభుఁడు మయుని పంపున తనభార్యలకును మంత్రులకును అంతకు ముస్ను తాను ఇయ్యనివిద్యల నన్నిటిని ఇచ్చెను.

## ఇంద్రుఁడు చంద్రప్రభునికడకు దూత్యము పంపుట.

వా రచట నుండఁగానే ప్రభా భాసిత దిఙ్ముఖుఁ డగుచు ఆకాశమునుండి నారదమహాముని దిగెను. సంగతి యెఱిఁగి కూర్చుండి మహాముని చంద్రప్రభునితో "రాజా, ఇంద్రుఁడు నన్ను పంపినాఁడు, నీకు ఈవార్త చెప్పుమన్నాఁడు:—'మీరు మనుష్యదేహుఁడై యున్న యీ సూర్యప్రభునికి శంకరుని

యాదేశముచేతను మయాసురుని తోడ్పాటుచేతను సర్వవిద్యాధరచక్రవర్తి పదమును సాధింపఁ జూచుచున్నా రను సంగతిని నే నెఱుంగుదును. మీ రట్లుచేయఁ గూడదు. ఆ యధికారమును మేము శ్రుతశర్మకు ఇచ్చినారము. విద్యాధరవంశాంభోధిచంద్రుఁ డైన యతనికి అది వంశక్రమాగతము గదా. మాకు విరుద్ధముగా మీరు ఏమిచేసినను దానివలన మీకు వినాశమే కలుగును. పూర్వము నీవు రుద్రయజ్ఞము చేయువాఁడ వై ముందుగా అశ్వమేధము చేయు మని నేను బోధింపఁగా నామాట చేయ వైతివి. అట్లు దేవతలను లక్ష్యపెట్టక రుద్రుని మాత్రము ఆశ్రయించి మీరు చేయుపని మీకు మేలునకు గాదు.' అని"

ఇట్లని నారదమహాముని ఇంద్రసందేశమును చెప్పఁగా నవ్వుచు మయాసురుఁ డిట్లనియె:— "మహామునీ, ఇంద్రుని మాట ఉచితము గాదు. సూర్యప్రభుఁడు మర్త్యమాత్రుఁ డని ఇంద్రుఁడు పలుకుచున్నాఁడు గదా! ఆ మర్త్యత్వము ఎట్టిదో దామోదరునితోడి యుద్ధములో ఇంద్రుఁడు చూడలేదా! ఆ మర్త్యత్వము వలన అతని కేమి లోపము? మర్త్యులే సత్త్వవంతులు, అన్ని సిద్ధులకు అధికారులు. పూర్వము నహుషాదులు ఇంద్రపదమును సాధింపలేదా! తాను ఈసామ్రాజ్యమును శ్రుతశర్మకు ఇచ్చినట్లును, అది అతనికి క్రమాగత మనియును, ఇంద్రుఁడు పలుకుచున్నాఁడు గదా. అదియు అయుక్తమే.

మహేశ్వరుఁడు దాత యయినచోట ఇతరుని కేవనికి ఏమియధి కారము కలదు ? హిరణ్యాక్షునికి జ్యేష్ఠాగత మయిన యింద్ర త్వము ఎట్లు తప్పింపఁబడినది ? మేము శత్రుత్వమును వూను చున్నా మనియు అధర్మములోఁ బ్రవేశించుచున్నా మనియు చెప్పుచున్నాఁడు గదా, అదియు పొరఁబాటు. అతఁడే మా ప్రయోజనమందు మాపై బలాత్కారముగా ద్వేషము వహిం చుచున్నాఁడు. మేము శత్రువును జయింపఁ జూచుచున్నాము. మునిభార్యను హరింపలేదు, బ్రహ్మహత్య చేయలేదు, మాకు అధర్మ మెక్కడిది ? అశ్వమేధము చేయుమియు దేవతలను తిర స్కరించుటయును ప్రస్తావించుచున్నాఁడు గదా. రుద్రయజ్ఞము చేసినచోట ఇతర యజ్ఞమువలన ఏమి ప్రయోజనము ? దేవ దేవేశుఁ డయిన శంభువును ఆరాధింపఁగా ఏదేవుని అర్చించి నట్లు గాదు ? రుద్రునియందు మాత్రము భక్తియుంచి ఇతర దేవతలను సరకు గొనమి ఉచితము గా దనుచున్నాఁడు గదా, అది పొరఁబాటు ! హరుఁడు వెలుఁగుచోట ఇతరదేవసమూహ ములవలన ఏమి పని ? సూర్యుఁడు ఉదయింపఁగా ఇతర జ్యోతి స్సులు వెలుఁగునా ? మహామునీ, ఇది సర్వమును నీవు ఇంద్రు నికి చెప్పవలయును. మేము మాకు ప్రస్తుత మయిన దానిని చేయుచుండెదము, అతనికి తోఁచినట్లు అతఁడు చేయునుగాక.”

ఇట్లు మయాసురుఁడు పలుకఁగా నారదుఁడు వల్లె యని యా ప్రతిసందేశమును గ్రహించి యింద్రునియొద్దకు పోయెను.

అతఁడు పోఁగా ఇంద్ర సందేశమునకు వెఱచుచున్న చంద్రప్రభ మహారాజుతో మయాసురుఁ డిట్లు పలికెను:- "మీకు ఇంద్రుని వలన భయము వలదు. అతఁడు మనమీఁది ద్వేషముచే యుద్ధములో దేవగణములతోఁగూడ శ్రుతశర్మపక్షములో నుండును. ప్రహ్లాదాధిష్ఠితుల మయిన మేము లెక్కలేనివారము దైత్య దానవులతోఁగూడ నీపక్షమున నుండెదము. త్రిపురాంతకుఁడు మనకు ప్రసన్నుఁడై యుద్యుక్తుఁడై యుండఁగా ఇతరులకు ముక్కిడులకు ఈ మూఁడులోకములలో ఏమి శక్తి కలదు? కనుక మీరు ఈపనిలో ప్రయత్న మారంభింపుఁడు." ఇట్లు మయుఁడు పలుకఁగా చంద్రప్రభాదు లంగీకరించి సంతోషించిరి.

పిమ్మట దూతలవలన వార్తల నంది క్రమముగా వీర భటాదిరాజులు మిత్త్రబాంధవులు సైన్యసమేతులై వచ్చి యుచిత సత్కారములు పొంది యుండఁగా మరల మయా సురుఁడు చంద్రప్రభరాజుతో నిట్లనియె.— 'రాజా, నీవు ఈ రాత్రి రుద్రునికి మహాబలి యిమ్ము. తరువాత నేను చెప్పునట్లు సర్వము చేయుదువుగాక.' ఆమాటప్రకారము చంద్రప్రభుఁ డును రుద్రబలిసంభారము సిద్ధము చేయించెదను. పిమ్మట రాత్రి అడవికి పోయి చంద్రప్రభుఁడు మయుఁడే పురోహితుఁడు కాఁగా స్వయముగానే రుద్రబలిని సర్వమును శ్రద్ధతో చేసెను. అతఁడు నిశ్శంకముగా హోమము చేయుచుండఁగా భూత గణాధిపుఁడు నందీశ్వరుఁడు ప్రత్యక్షమై రాజుచే విధ్యుక్తముగా

సత్కృతుఁడై యి ట్లనియె:—'నాముఖముగా సాంబమూర్తి స్వయముగా చెప్పుచున్నాఁడు. నీకు నూఱుగురు ఇంద్రులు ఎత్తివచ్చినను భయము అక్కఱలేదు. సూర్యప్రభుఁడు విద్యాధరులకు చక్రవర్తి కానే అగును.' ఇట్లు శంకరాజ్ఞను నివేదించి తనబలిభాగమును గ్రహించి నందీశ్వరుఁడు భూతగణములతో గూడ అంతర్ధానము పొందెను. పిమ్మట చంద్రప్రభుఁడు కుమారుని యభ్యుదయమున నమ్మకము గలవాఁడై బలిని ముగించి మయాసురునితోఁ గూడ నగరమునకు పోయెను.

## చంద్రప్రభుఁడు సునీథదేహముం జొచ్చుట.

మఱునాఁడు ఉదయమున కుమారునితోను దేవితోను మంత్రులతోను సుఖాసీనుఁడై యున్న చంద్రప్రభభూపతితో మయుఁ డి ట్లనియె:—'రాజా, చిరరక్షిత మయిన రహస్య మొకటి చెప్పెదను. నీవు సునీథుఁ డను దానవుఁడవు, నా కుమారుఁడవు, మహాబలుండవు. సూర్యప్రభుఁడు సుముండీకుఁడు నీతమ్ముఁడు. మీరు లిరువురును దేవతలతోడికయ్యములో మడిసి ఇచట తండ్రికొడుకులై పుట్టితిరి. నీదానవశరీరమునకు ఘృతాదులను ఓషధులను శాస్త్రోక్త యోగ ప్రకారము పూసి దాఁచి రక్షించి యున్నాను. కనుక బిలప్రవేశముచేసి పాతాళమునకు పోయి నీసొంతదేహములో నా చెప్పెడి యుక్తిచేత ప్రవేశింపుము. అందులో చొరఁగానే తేజోవీర్యబలాధికుఁడ వై దేవతలను యుద్ధములో జయించువాఁడ వగు

దువు. సూర్యప్రభుఁడు ఈ సుందరాంగముతోనే విద్యాధరే శ్వరుఁ డగునుగాక.' ఇట్లు మయుఁడు పలుకఁగా చంద్రప్రభుఁడు సంతోషించి అంగీకరించెను.

ఆ సమయమందు సిద్ధార్థకుఁడు ఇట్లు అడిగెను. 'వేఱు దేహము చొచ్చినవాఁడు, చచ్చినవాఁడే, ఈ మార్పు వలన మా కేమి సంతోషము? మఱియు ఇతఁడు దేహాంతరప్రవిష్టుఁ డై పరలోకగతునివలెనే మమ్ము మఱచును. అంతట ఇతఁ డెవరో మే మెవరమో?' మయు డి ట్లనియె:—'యోగ మహిమచే స్వతంత్రుఁడై పరకాయప్రవేశము చేయు నితనిని మీరు కూడ వచ్చి చూడుఁడు. ఆదేహము చేరియు ఇతఁడు మిమ్ములను మఱవఁడు. కారణము వినుఁడు. అస్వతంత్రుఁ డై చచ్చి గర్భములో పుట్టినవాఁడు మరణాదిక్లేశములచే స్మృతి పోయి ఏమియు జ్ఞప్తియుంచుకొనఁ జాలఁడు. స్వాతంత్ర్యముచే వేఱుదేహములో యోగయుక్తిచే అంతఃకరణముతోను ఇంద్రియములతోను చొచ్చు జ్ఞాని యోగేశ్వరుఁడు, మనోబుద్ధులు చెడక, యింటినుండి యింటికి పోవువాఁడు వోలె, సకలమును స్మరించును. కనుక మీకు సందేహము వలదు. ఈరాజు ఇందువలన జరారోగవివర్జిత మైన దివ్యదేహమును పొందును. మీ రందఱును దానవులే. రసాతలము చొచ్చి అమృతము త్రాగి రోగరహిత మయిన దివ్యదేహములు పొందుఁడు' మయుని యీమాటలు అందఱు నమ్మి శంక మాని యుండిరి.

అతనిమాట ప్రకారమే మఱునాఁడు చంద్రప్రభుఁడు సకలరాజులను తోడ్కొని ఇరావతీచంద్రభాగల సంగమమునకు పోయి, అచట వెలుపల రాజులను ఉంచి, సూర్యప్రభుని యంతఃపురములను వారికి అప్పగించి, నీళ్లలో మయుఁడు చూపిన బిలములో సూర్యప్రభునితోను దేవితోను సిద్ధార్థాది మంత్రులతోను ప్రవేశించి, బహుదూరము పోయి ఒకదివ్య దేవాలయము చూచి అంరఅతోను అందులోపలికి పోయెను. ఇంతలో వెలుపలనున్న రాజులమీఁదికి విద్యాధరులు ఆకాశమునుండి వచ్చి వారిని తమవిద్యలచే స్తంభితులను చేసి సూర్యప్రభుని భార్యలను చెఱ గొనిపోయిరి. ఆక్షణములో ఆకాశమున 'ఓరి శ్రుతశర్మా, పాపాత్ముఁడా, చక్రవర్తియొక్క యీ భార్యలను తాఁకితివేని తత్క్షణమే సైన్యములతోఁగూడ చత్తువు. కనుక వీరిని నీవు తల్లులనుగాచూచుచు గౌరవముతో రక్షించుచుండుము. ఇప్పుడే నిన్ను చంపి వీరి నేల విడిపింపననఁగా, ఇందులకు కారణము గలదు. నీయొద్దనే ఉందురు గాక.' అని దివ్యవాక్కు వినఁబడెను. అంతట విద్యాధరులు అదృశ్యులైరి. ఆ రాణివాసములను కోలుపోయిన యవమానమునకు వీరభటాది రాజులు ప్రాణత్యాగముచేయుటకై ఒండొరువులతో పోరసమకట్టిరి. మీకొమారితలకు నాశము లేదు, వారిని మీరు మరల కలసికొనియెదరు. సాహసము చేయకుఁడు. మీకు మేలు కలుగును.' అని పలికి ఆకాశవాణి వారియత్నమును మాన్పెను.

ఈలోపల అందఱతోను పాతాళములో దేవాలయములో నున్న చంద్రప్రభునితో మయుఁడు:— 'రాజా, ఏకాగ్ర చిత్తుఁడ వై వినుము. నీ కిపుడు పరకాయప్రవేశయోగమును ఉపదేశించెదను.' అని హెచ్చరించి యోగమును సాంఖ్యమును రహస్యములతోఁ గూడ నేర్పి దేహాంతర ప్రవేశయోగమును గూడ ఉపదేశించి యిట్లనియె:—ఇదే ఆ సిద్ధి. అణిమాద్యైశ్వర్య ములకు కారణ మయినజ్ఞానమును స్వాతంత్ర్యమును ఇదే. ఈ యైశ్వర్యమం దున్నవా రై సురేశ్వరులు మోక్షమును గూడ అపేక్షింపరు. ఇతరులు మహానుభావులు దీనికొఱకే జప తప ములు చేయుదురు, లభించిన స్వర్గభోగములను కూడ అంగీక రింపరు. ఇందులకు నిదర్శనము వినుము.—

### కాలుఁడను విప్రుని కథ.

పురాకల్పమున కాలుఁడని ఒక బ్రాహ్మణుఁ డుండెను. అతఁడు పుష్కరద్వీపమునకుఁ బోయి దివానిశము జపము చేయుచుండెను. ఆరీతిని రెండువందల దివ్యవర్షములు గడచెను. అంత అతనిశిరస్సునుండి అవిచ్ఛిన్నముగా మహాజ్వాల యొకటి పుట్టెను. వెలు వడిన యాజ్వాలచేత ఆకాశములో సూర్యా దులగతి నిలిచి పోయినది, మూఁడు లోకములును మండి పోయినవి. బ్రహ్మాదిదేవతలు అతనియొద్దకు వచ్చి 'బ్రాహ్మణా, నీకు కావలసిన వరమును అడుగుము, నీతేజస్సుచేత లోక ములు మండి పోవుచున్నవి.' అని యడిగిరి. 'నాకు జపము

చేయుచుండుట కంటె వేఱు విషయమున నా బుద్ధి ప్రవేశింప కుండును గాత, ఇంత కన్న వేఱువరము నాకు అక్కఱ లేదు.' అని ఆతఁడు వారికి ఉత్తరము చెప్పెను. వారు నిర్బంధింపగాఁ అతఁడు ఆచోటు వదలి హిమవంతము నుత్తరభాగమున చేరి జపము చేయుచుండెను. అచట ఆతేజము మఱియు వృద్ధమై అసహ్యము కాఁగా ఇంద్రుఁడు విఘ్నార్థము దేవాంగనలను పంపెను. మరులుగొలుపుచున్న యాయచ్చరలను ఆ ధీరుఁడు సరకుగొనఁ డాయెను. అంతట దేవతలు కార్యనిర్వాహమునకు సర్వాధికారమును ఇచ్చి అతనియొద్దకు మృత్యువును పంపిరి. మృత్యుదేవత వచ్చి ఆయనతో 'బ్రాహ్మణుఁడా, మనుష్యులు ఇంత కాలము బ్రదుకరు, లోక మర్యాదను అతిక్రమింపకుము. దేహత్యాగము చేయుము.' అనెను. 'నా యాయుస్సు ముగిసినయెడల నీవే నన్నేల కొనిపోవు? కను పెట్టి యున్నావేమి? ఓరి పాశహస్తా, నేను స్వయముగా దేహత్యాగము చేయను. బుద్ధి పూర్వకముగా శరీరమును వదలిన ఆత్మఘాతి నగుదును.' అని బ్రాహ్మణుఁడు పలికెను. అతనిని తానే కొనిపోవుటకు ప్రభావము చాలక మృత్యువు వచ్చిన దారినే పోయెను. అంతట కాలుని జయించిన యాకాలుని ఇంద్రుఁడు భుజముమీఁద ఎత్తుకొని సురలోకమునకు కొనిపోయెను. అచటను అతఁడు ఎడతెగక జపము చేయుచునే యుండఁగా ఇంద్రుఁడు అతనిని దింపివేసెను. అంత నతఁడు మరల హిమా

లయమునకు పోయెను. మరల ఇంద్రాదులు అతనిని వరము గ్రహింపు మని వేడుకొనుచుండిరి.

ఆసమయములో ఇక్ష్వాకు వను రాజు ఆమార్గమున వచ్చెను. ఆయన యావద్వృత్తాంతమును తెలిసికొని జాపకునితో 'అయ్యా, దేవతల వలన వరము గొనవేని నావలనఁ గొనుము' అనెను. జాపకుఁడు నవ్వి 'దేవతలవలనఁగూడ వరము గొనని నాకు వర మిచ్చుటకు నీవు శక్తుఁడవా?' అని రాజుతో ననియెను. 'నాకు శక్తి లేదు, నీకుఁ గలదు, కనుక నీవే నాకు వర మిమ్ము.' అని రాజు చెప్పెను. 'నీకోరిక అడుగుము, ఇచ్చెదను.' అని బ్రాహ్మణుఁడు పలికెను. రాజు ఆలోచింప సాగెను. 'నేను ఇచ్చుట ఈబ్రాహ్మణుఁడు పుచ్చుకొనుటయు ఉచిత క్రమము, ఇతఁడు ఇచ్చుట నేను పుచ్చుకొనుటయు విపరీతముగా నున్నది.' అని ఆరాజు సంశయించుచు విలంబము చేయుచుండఁగా, ఆసమయములో అచటికి ఇద్దఱు బ్రాహ్మణులు వివాదపడుచు వచ్చిరి. వారు ఆరాజును చూచి న్యాయార్థము చెప్పుకొనిరి. ఒకఁడు 'అయ్యా, ఇతఁడు నాకు గోవును దక్షిణతో ఇచ్చినాఁడు. దానినే నేను మరల ఇచ్చిన నావలన ప్రతిగ్రహింపఁడు.' ఇతరుఁడు 'అయ్యా, నేను ఇంతవఱకు ప్రతిగ్రహము చేసిన వాఁడను గాను, నాకు అక్కఱ కూడ లేదు, ఇతఁ డేల నన్ను బలాత్కారముగా ప్రతిగ్రహము చేయింప వలయును?' అంతట రాజు 'ఆక్షేపకుని పక్షము శుద్ధము గాదు,

ఇతఁడు మొదట పుచ్చుకొని ఆగోవును ఇచ్చినవానికే మరల ఏల యీయ వలయును ?' అనియెను. ఆసందర్భము గొని ఇంద్రుఁడు రాజుతో 'రాజా, ఇంత యెఱుఁగుదు వేని, న్యాయ్య ముగా జాపకునివలన వరము వేఁడి ఏల నీవు పుచ్చుకొనవు ?' అనెను. అంతట ఉత్తర మేమియు చెప్ప లేక రాజు బ్రాహ్మణు నితో 'బ్రాహ్మణోత్తమా, నీజపములో సగము ఫలము నా కిమ్ము ఇదే నావరము.' అనెను. 'సరియే, నాజపములో సగము ఫలము నీకు కలుగును గాక.' అని జాపకుఁడు వర మిచ్చెను. అందువలన ఆరాజు సర్వలోకగమనము పొందెను. జాపకుఁడును శివ మను పేరి దేవలోకగమనము పొందెను. అచట అనేక కల్పములు ఉండి మరల భూతలమునకు వచ్చి యోగమువలన స్వాతంత్ర్యమును పొంది శాశ్వతసిద్ధిని పొందెను. ఇట్లు పెద్దలు స్వర్గాదిభోగము లను లక్ష్యపెట్టక సిద్ధినే కోరుదురు. దానిని నీవు పొందితివి, స్వతంత్రుఁడవై నీదేహములో ప్రవేశింపుము.—

ఇట్లు మయుఁడు యోగవిద్య నిచ్చి పలుకఁగా చంద్ర ప్రభుఁడు భార్యా తనయ మంత్రులతోఁ గూడ మిగుల సంతో షించెను. పిమ్మట మయుఁడు, రాజును పుత్త్రాదులతోఁ గూడ రెండవ పాతాళమునకుఁ గొనిపోయెను. అచట వా రందఱు గొప్ప యోషధులతోను నేతితోను అభ్యక్తుఁడై వికృతాకృతిచే భయంకరుఁడై విషణ్ణవదనాంభోజలైన దైత్యరాజకన్యలచే ఆవృతుఁడై యున్న యొక మహాపురుషుని మహాప్రాశయన

మందు పవ్వళించి నిద్రితుఁడుంబోలె నున్నట్టి వానిని చూచిరి. 'ఇందులో ప్రవేశింపుము. ఇదియే నీపూర్వదేహము, దీనిచుట్టు నుండు వీరు నీ పూర్వభార్యలు.' అని మయుఁడు పలుకఁగా ఆరాజు మయుఁడునేర్పిన యోగముచే తన దేహమును వదలి ఆదానవ దేహము చొచ్చెను. అంతట శయనములోని పురుషుఁడు ఆవులించి మెల్లమెల్లగా కన్నులు తెఱచి నిద్రమేల్కొన్నవాఁడుంబోలె పడకనుండి లేచెను. అంతట అసురాంగనలును సంతోషించి 'ఆహా మాప్రాణనాథుఁడు సునీథుఁడు బ్రదికినాఁడు' అని కేకవేసిరి. ప్రాణహీనమై పడిపోయిన చంద్రప్రభ దేహమును చూచి సూర్యప్రభాదు లందఱును దుఃఖితులైరి. సునీథుఁడును సుఖనిద్రనుండి మేలుకొన్నవాఁడుం బోలె లేచి తన తండ్రిని మయుని చూచి పాదముల వ్రాలి నమస్కరించెను. తండ్రియు అతనిని కౌఁగిలించుకొని ఎల్లవారియెదుటను 'పుత్త్రా, నీ విప్పుడు రెండు జన్మములను స్మరించుచున్నావా ?' అని యడిగెను. అతఁడు 'స్మరించుచున్నాను' అని పలికి చంద్రప్రభ సునీథ జన్మములయొక్క వృత్తాంతములను చెప్పి, కీర్తిమతీదేవిని సూర్యప్రభాదులను పూర్వభార్య లయిన దనుజాంగనలను ఒకరొకరిని పేర్కొని ఓదార్చెను. ఎప్పటికైన పనికివచ్చు నని చంద్రప్రభ దేహమును మయుఁడు ఆజ్యౌషధులచేత కాపాడి యుంచెను. అతనికి స్మృతి యున్నందుకై సూర్యప్రభాదులు సంతోషించిరి.

అంతట మయాసురుఁడు వారి నందఱను అటనుండి కొనిపోయి హేమరత్నఖచిత మయిన మఱియొక పురమునకు తోడ్కొని పోయెను. అచటికి పోయి వారు సుధారసముతో నిండిన వైదూర్యపుబావిని చూచి దానియొద్దనుఁ గూర్చుండిరి, అమృతాధిక మయిన యా సుధారసమును విచిత్ర మణిపాత్రములతో సునీథభార్య తెచ్చి యీయఁగా త్రాగిరి. ఆపానముచే అందఱు కైపెక్కి నిద్రించి మేలుకొన్న వారుంబోలె అయి దివ్యదేహులును మహాబలపరాక్రములును అయిరి.

## సునీథుఁడు తల్లిని లీలావతిని దర్శించుట.

మయాసురుఁడు చంద్రప్రభ సునీథునితో 'పుత్త్రా, రా చిరకాలమునకు మీయమ్మను చూతువు గాని.' అని అతనిని సూర్యప్రభాదులతో నాలవ పాతాళమునకు కొనిపోయెను. అచట వారు నానాధాతుమయము లయిన చిత్రపురములను చూచుచు నేఁగి రత్నస్తంభమయమై సర్వసంపదాస్పద మయిన యొక సౌవర్ణ నగరమందు సురాంగనలను గెలిచిన రూపవతిని అసురకన్యాపరివృతను సర్వాభరణభూషితను సునీథునితల్లిని లీలావతిని చూచిరి. ఆమెయు సునీథుని చూచుచునే తొట్రుపాటులో లేచెను. సునీథుఁడు నమస్కరించి ఆమె పాదముల వ్రాలెను. ఆమె చిరకాలమునకు అగపడిన యాకుమారుని ఆనందబాష్పములు గురియుచు కవుంగిలించుకొని, అతనిని తెచ్చి చూపించినందులకు తనపతిని మయుని కొనియాడెను. 'దేవీ,

ఈ సూర్యప్రభుఁడు నీ రెండవ కుమారుఁడు సుముండీకుఁడు. ఇతఁడు నీపుత్త్రునికి ఈసునీథునికి పుత్త్రుఁడుగా జన్మించినాఁడు. ఇతఁడు విద్యాధరులకు ఈ దేహముతోనే చక్రవర్తి యగు నని రుద్రుఁడు నియమించి యున్నాఁడు.' అని మయుఁడు చెప్పెను. ఆమాట విని ఉత్సుకదృష్టులతో చూచుచున్న తల్లిపాదముల సూర్యప్రభుఁడు మంత్రులతోఁగూడ వ్రాలెను. 'పుత్త్రా, సుముండీక దేహ మేల? ఇదే బాగుగా నున్నది.' అని లీలావతి దీవించెను.

ఆ పుత్త్రాభ్యుదయ సమయములో మయుఁడు తన కూఁతురు మందోదరిని విభీషణుని స్మరింపఁగా వారును వచ్చిరి. విభీషణుఁడు వచ్చి సత్కారము పొంది 'దానవేంద్రా, నా మాట చేయుదువేని, నే నొకటి చెప్పెదను. దానవులలో నీ వొకఁడవే సుకృతివి, శుభజీవితుఁడవు, నీవు నిష్కారణముగా దేవతలతో ద్వేషింపఁ గూడదు. వారితో ద్వేషించుటవలన మీకు అపాయమేగాని గుణ మేమియు లేదు. యుద్ధములో దేవతలచే అసురులు మడిసిరిగాని, అసురులచేత సురలు నశింప లేదు.' అనెను. 'మేము బలాత్కారముగా ఏమియు చేయము. ఇంద్రుఁడు హాతమునం జేయు చుండఁగా ఎట్లు సహింతుము? చెప్పుము. దేవతలచేఁ గూలిన యసురులు ప్రమత్తులుగా నుండిరి. అప్రమత్తు లయిన బలి ప్రభృతు లే మయిన హాతు లయిరా?' అని మయుఁడు పలికెను. అంతట విభీషణుఁడు మందోదరిని తోడ్కొని తన నివాసమునకుఁ బోయెను.

సునీథుఁడు బలిని దర్శించుట.

అంతట మయుఁడు సూర్యప్రభాదిసమేతుని సునీథుని బలిచక్రవర్తి దర్శనార్థము మూఁడవ పాతాళమునకుఁ గొని పోయెను. స్వర్గముకంటె అధిక మయిన యాపాతాళమున వారందఱును హాటకకిరీట ధారి యయి దైత్యదానవ పరివృతుఁడై యున్న బలిని చూచిరి, సునీథాదులు క్రమముగా అతనిపాదముల వ్రాలిరి. అతఁడును వారిని యథోచిత సత్కారములచే గౌరవించి మయునివలన వృత్తాంతము విని సంతోషించి శీఘ్రముగా ప్రహ్లాదాది దానవులను రావించెను. సునీథాదులు వారి పాదములకును నమస్కరించిరి. వారును ఆనంద నిర్భరులయి ప్రణతులను వీరిని అభినందించిరి. బలి యిట్లనియె:— 'మన యీసునీథుఁడు భూమిలో చంద్రప్రభుఁడుగా అవతరించి యుండి మరల తనదేహమును పొంది బ్రదికి వచ్చినాఁడు. సుముండీకుని యవతార మైన యీసూర్యప్రభుఁడును వచ్చి యున్నాఁడు. ఇతఁడు విద్యాధరచక్రవర్తి యగు నని శంకరుఁడు అనుగ్రహించి యున్నాఁడు. వీరి యజ్ఞ ప్రభావముచేత నా బంధనములు ఊడినవి. కనుక వీరు దొరకుటచే నిశ్చయముగా మనకు అభ్యుదయము కలుగును.' ఇట్లు బలి పలుకఁగా అతని గురువు శుక్రాచార్యుఁ డిట్లనియె:—'ధర్మసత్యపూర్వకముగా వ్యవహరించు వారికి అనభ్యుదయ మెన్నఁడును కలుగదు. కనుక ధర్మ్యముగా నడచుకొనుఁడు. ఇప్పటికిని నామాట జరు

పుఁడు.' ఆమాట విని అచటఁ గూడియున్న సప్తపాతాళపతులు వల్లె యని ప్రతిజ్ఞ చేసిరి. సునీథుఁడు మరల లభించినందులకు బలియు అచట ఉత్సవము చేసెను.

ఈలోపల నారదముని వచ్చి అర్ఘ్యపాద్యములు పొంది ఆసీనుఁడై దానవులతో నిట్లనియె:—'నన్ను ఇంద్రుఁడు ఇటకు పంపినాఁడు. సునీథుఁడు బ్రదికినందులకు తనకు పరమసంతోష మనియు, ఇపుడు మరల నిష్కారణముగా మీరు వైరము పూన వల దనియు, తన యాశ్రితుఁ డయిన శ్రుతశర్మమీఁద ద్వేషింప వల దనియు, ఇంద్రుఁడు మీకు తెలుపుచున్నాఁడు.' నారదుఁడు ఈయింద్రసందేశమును ముగింపఁగా, ప్రహ్లాదుఁడు పలికెను.—'ఇంద్రునికి సునీథుఁడు బ్రదికినందులకు తృప్తిగా కేమి? అకారణవిరోధము మేము చేయము. ఇప్పుడే గురువు నెదుట ప్రతిజ్ఞ చేసి యున్నాము. శ్రుతశర్మ తనకు సహాయు లున్నారు గదా యని బలాత్కారముగా మాకు విరోధము చేయుచున్నాఁడు. మాయందు దోష మేమి? సూర్యప్రభునికి తదారాధన ప్రసన్నుఁ డయిన శంకరుఁడు ముందే ఈపదమును అనుగ్రహించి యున్నాఁడు. ఈశ్వరుఁడు ఆజ్ఞాపించిన యీ కార్యమందు మే మేమి చేయఁగలము? కనుక ఇంద్రుఁడే నిష్కారణముగా అనుచితములు పలుకుచున్నాఁడు.' ఇట్లు దానవేంద్రుఁడు ప్రహ్లాదుఁడు పలుకఁగా, అ దంతయు సరియే యని, ఇంద్రునే నిందించి నారదముని అదృశ్యుఁ డాయెను.

అతఁడు పోఁగానే శుక్రాచార్యుఁడు దానవేంద్రులతో ని ట్లనియె:— 'ఈవిషయములో ఇంద్రుఁడు బద్ధద్వేషుఁడు. మనకు మహేశ్వరుఁడు సుప్రసన్నుఁడై యుండఁగా ఇంద్రుఁడేమి చేయఁగలఁడు? అతని విష్ణుభక్తివలన ఏమి ప్రయోజనము?' ఇట్లు గురువు పలుక దానవులు అంగీకరించి బలిప్రహ్లాదుల వలన సెల వొంది నిజాలయముల కరిగిరి. పిమ్మట ప్రహ్లాదుఁడు తన నివాస మైన నాలవపాతాళమునకు పోఁగా, బలియు కొలువు వదలి లోనగరికి పోయెను. మయుఁడును సునీథ సూర్యప్రభులును బలికి నమస్కరించి తమ నివాసములకు పోయిరి.

అచట భోజనపానము లైన పిమ్మట తల్లి లీలావతి సునీథునితో 'పుత్రా, ఈ నీభార్యలు గొప్పవారి కొమారితలు, ఎఱుఁగుదువు గదా; తేజస్వతి ధనేశునికూఁతురు, మంగలావతి తుంబురుని కూఁతురు, చంద్రప్రభశరీరములో నీవు వివాహ మాడిన కీర్తిమతి ప్రభాసుఁడను వసువుకూఁతురు, ఈముగ్గురను నీవు సమదృష్టితో చూచుకొనుచుండ వలయును.' అనిచెప్పి ఆముఖ్యభార్యలను ముగ్వురను అతనికి సమర్పించెను. ఆరాత్రి సునీథుఁడు పెద్దభార్య యైన తేజస్వతితోడ శయన మంగీకరించెను. అచట చిరోత్సుక యయిన యామెతో భుక్తపూర్వము లయినను నూతనములఁ బోలె నానాక్రీడలను అనుభవించెను. సూర్యప్రభుఁడు మఱియొక పడుకయింట మంత్రులతోఁగూడ ఆరాత్రి భార్య లేక శయనించి యుండెను. 'స్నేహ

హీనుఁ డయి భార్యలను బయట విడిచి వచ్చిన యితనితో నేమి పని?' అనియుంబోలె స్త్రీనిత్యుఁ డయిన యితఁడు ఇప్పుడు ఏకాకిగా నున్నను ఇతనియొద్దకు నిద్ర రాకుండెను. కార్య చింతాసంగి యను నీర్ష్యచేతనుంబోలె ప్రహస్తునియొద్దకును నిద్ర రాకపోయెను. ఇతరులు వీరిచుట్టు సుఖముగా నిద్రించు చుండిరి.

### కళావతి సూర్యప్రభునికడకు వచ్చుట.

ఇంతలో అచటికి సఖీయుతముగా నొకకన్యారత్నము వచ్చి అ యిరువురకు అగపడినది. ఆమెను సృజించి 'ఈమెవలన నాచేసిన సురాంగనాసృష్టి వెలవెలఁబోకుండును గాక' యని బ్రహ్మదేవుఁడు పాతాళములో నుంచెనా యనునట్లు ఆకన్నియ వన్నెమీఱి యుండెను. ఆమె ఎవతెయో యని సూర్యప్రభుఁడు ఆలోచించుచుండఁగా, ఆమె అతని చెలికాండ్రను ఒక్కొక్కరిని సమీపించి చూచి చక్రవర్తి చిహ్నహీనులను గా నెఱింగి వారిని వదలి, తల్లక్షణాన్వితుని తన్మధ్యశాయిని సూర్య ప్రభునిఁ దఱిసి, చెలితో 'సఖీ, ఇతఁడే అతఁడు, ఇతనిని నీటిచే చల్ల నయినచేతులతో తాఁకి మేల్కొలుపుము,' అనియెను. సఖియు అట్లే చేయఁగా సూర్యప్రభుఁడును వ్యాజనిద్రను మాని కన్నులు తెఱచి చూచి ఆకన్యలను 'మీ రెవరు ? ఇచటి కేల వచ్చితిరి ?' అని యడిగెను. సఖి చెప్పుచున్నది. "దేవా, వినుము. రెండవపాతాళములో అమీలుఁ డని హిరణ్యాక్ష

సుతుఁడు జయ శీలుఁడు నైదైత్యేంద్రుఁ డున్నాఁడు. ఈమె కలావతి యని యతనికి ప్రాణాధిక యయిన కూఁతురు. ఆయన ఇప్పుడు బలియొద్దనుండి వచ్చి యి ట్లనియె:—'ఆహా! ఈ దినము సునీథుఁడు బ్రదికి వచ్చినాఁడు; సుముండీకావతారము సూర్యప్రభుఁడను చిన్నవాఁడును అగపడినాఁడు. అతనిని విద్యాధర చక్రవర్తినిగా శంకరుఁడు ఏర్పరించి యున్నాఁడు. కనుక ఇప్పుడు సునీథునికి ఆనందసమ్మానము చేసెదను. నాకుమారిని కళావతిని సూర్యప్రభునికి ఇచ్చెదను. సునీథుఁడు ఏకగోత్రుఁడగుటచేత ఈమెను ఈయఁ దగదు. సూర్యప్రభుఁడు ఇతనికి రాజజన్మములో కుమారుఁడు గాని అసురజన్మములోఁ గాఁడు. కనుక ఆకుమారునికి సమ్మానము చేసిన అది తండ్రికి సమ్మానమగును.' తండ్రి యిట్లు పలుకఁగా నీగుణములు లాగఁగా ఈమె నిన్నుఁ జూడఁ గోరి వచ్చినది" సఖి యిట్లు పలుకుచుండఁగా సూర్యప్రభుఁడు కళావతియొక్క యభిప్రాయమును తెలియఁ గోరినవాఁడై కపటనిద్రను పాటించి యుండెను. అంత నాకన్య మేలుకొని యున్న ప్రహస్తునియొద్దకు పోయి సఖీముఖముగా సర్వము అతనికి తెలిపి వెడలి పోయెను.

ప్రహస్తుఁడు వచ్చి సూర్యప్రభుని 'దేవా, మేలుకొని యున్నావా లేదా?' అని యడిగెను. మిత్త్రమా, మేలుకొనియే యున్నాను. ఏకాకి నయిన నాకు ఇప్పుడు నిద్ర యెక్కడిది? విశేష మొకటి చెప్పెదను. నీయొద్ద దాఁపవలసినది నా

కే మున్నది ? ఇప్పుడే ఇచటికి ఒకకన్య చెలితోఁగూడ వచ్చి నాకు అగపడినది. ఆమెకు సాటి యయినది ఈ త్రైలోక్యమందు లేదు. ఆమె నామనస్సును హరించి క్షణములో ఎచ్చటికో పోయినది. ఇచటనే ఎచటనో ఉండును. తత్క్షణమే వెదకి తెమ్ము.' అని సూర్యప్రభుఁడు పలికెను. ప్రహస్తుఁడు వెలుపలికి పోయి సఖీ సహిత యై యచట నున్న యా కన్యను చూచి "దేవీ, నీకొఱకు నేను నాస్వామిని మేలుకొలిపితిని, నీవు నా కొఱకు నాస్వామికి మరల దర్శన మిమ్ము. కన్నులపండు వైన యతనిరూపమును మరల కనుము. నీచూపునకే వశ్యుఁ డయిన యతండును నీరూపును మరల చూచును గాక. మేలుకొలిపి అతనితో నీప్రస్తావము చేయఁగా, 'ఎటనుండి యైనను తెచ్చి యాకలికిని నాకు చూపుము, అట్లు చేయవేని నేను బ్రదుకుట యెక్కడిది ?' అని యతఁడు పలుకుచున్నాఁడు. నేను నిన్ను వెదకుకొని వచ్చినాఁడను. రమ్ము." అని ప్రహస్తుఁడు పలుకఁగా, లజ్జాపరవశు రా లయి ఆమె పోఁజాలక సంశయించుచుండఁగా, ప్రహస్తుఁడు ఆమె కేలు పట్టుకొని పోయి సూర్యప్రభునికి అర్పించెను. వచ్చి ప్రక్కను నిలిచిన యామెతో సూర్యప్రభుఁడు 'చండీ, నీవు చౌర్యముచే ప్రవేశించి నిద్రించుచున్న నాహృదయమును దొంగలించితివి. అందులకు దండింపక దొంగను నిన్నెట్లు వదలుదును ?' అనెను. ఆమాట విని వెరవరి యైన యామెచెలి యి ట్లనియె:— 'ఈమె దొంగ యని ముందుగా ఎఱిఁగియే

యీ మెతంత్రి దండనార్థము ఈమెను నీకు ఇయ్య నిశ్చయించు కొని యున్నాఁడు. అట్టిచో నిన్ను ఇచట అడ్డగించువాఁ డెవఁడు? ఈమె దొంగతనమునకు తగిన దండన ఏల చేయవు ?' అంతట సూర్యప్రభుఁడు కవుంగిలించుకొనఁబోఁగా లజ్జిత యై 'వలదు ఆర్యపుత్రా, వలదు ; కన్యను గదా నేను.' అని కళావతి పలికెను. అంతట ప్రహస్తుఁడు 'దేవీ, నీకు సందేహము అక్కఱ లేదు, సకల వివాహములలోను శ్రేష్ఠమైన గాంధర్వవివాహము సుమా యిది.' అని వాకొని, ఇతరానుచరుల నందఱను తోకొని, వెడలి పోయెను. వెంటనే సూర్యప్రభుఁడు కళావతిని భార్యను చేసికొని ఆమెతో అతర్కితోపనత మయి మర్త్య దుర్లభ మైన నవసంభోగమును పొందెను. తెల్లవాఱుజామున కళావతి నిజనివాసమున కేఁగెను.

## సూర్యప్రభుఁడు ప్రహ్లాదుని దర్శించుట.

సూర్యప్రభుఁడు సునీథమయాసురులకడకు పోయెను. వా రందఱు గూడి ప్రహ్లాదునియొద్దకు పోయిరి. అతఁడు వారిని యథార్హముగా సమ్మానించి మయునితో 'సునీథుని యీ యభ్యుదయమందు మన మందఱము ఉత్సవము చేయ వలసినది, కనుక ఈదినము మన మందఱము ఒక్కచోటనే భుజింతము.' అనెను. 'అట్లే చేయుదము దోష మేమి ?' అని మయుఁడు పలుఁకగా ప్రహ్లాదుఁడు దూతలను పంపి అసు రాధిపతులను రప్పించెను. అందఱును ఎల్లపాతాళములనుండి

వరుసగా వచ్చిరి. మొదట, లెక్క లేని మహాసురులు వెంటఁ గొలుచుచు రాఁగా బలిచక్రవర్తి యేతెంచెను. పిమ్మట వరుసగా అమీలుఁడు, దురారోహుఁడు, వీర్యవంతుఁడు, సుమాయుఁడు, తంతుకచ్ఛుఁడు, వికటాక్షుఁడు, ప్రకంపనుఁడు, ధూమకేతుఁడు, మహామాయుఁడును, ఇక కడమ యసురేశ్వరులును ఒక్కొక్కఁడును తనతన వేగురు సామంతులు వెంటఁ గొలుచుచు రానేతెంచి పరస్పరవందనములు చేసికొని యా సభను నిండించిరి. ప్రహ్లాదుఁడు వారిని క్రమముగా కూర్చుండఁబెట్టి సమ్మానించెను. భోజనవేళ కాఁగానే వారందఱు మయునితోఁ గూడ నేఁగి, గంగలో స్నానమాడి మహాసభకు భోజనమునకు వచ్చిరి. ఆసభ నూఱుయోజనముల వెరివి గై రత్నస్తంభముల చేతను బంగారపుగచ్చుతోడి మణులనెలకట్టుచేతను వెలుంగుచు మణిమయము లయిన విచిత్ర భోజన పాత్రములతో నిండి యుండెను. అందు ప్రహ్లాదునితోను సునీథమయులతోను సచివయుక్తుఁ డయిన సూర్యప్రభునితోను కూడి మహాసురులు నానావిధ భక్ష్యభోజ్యలేహ్యాదికమును షడ్రస మయిన దివ్యాన్నమును భుజించి ఉత్తమ మయిన పానమును సేవించిరి. అందఱును భుజించి త్రాగి మఱియొకశాలకు పోయి అందు దైత్యదానవ కన్యలయొక్క యుత్తమనృత్యమును దర్శించిరి.

ఆసందర్భములో ప్రహ్లాదుని యాజ్ఞచేత తత్పుత్రి మహల్లికయు నృత్య మాడెను. తన లావణ్యముచే దిశలను

వెలిఁగించుచు చూపరనేత్రములకు అమృతవృష్టి యై పాతాళమునకు వేడుకచే వచ్చిన చంద్రమూర్తియో యన నొప్పారుచుండెను. లలాట తిలకోపేతయు చారు నూపుర పాదికయు స్నేహదృష్టియు నైన యా తరుణి, నృత్తవిద్యనే ఆరూపున బ్రహ్మదేవుఁడు సృజించెనా యను నట్లు ఉండెను. వంకరకురులు శిఖరిరదనములు వృత్తవక్షోజములును గలిగి క్రొత్తవృత్తమును సృజించునదియుం బోలె రాజిల్లుచుండెను. అట్టి యా కన్నెను సూర్యప్రభుండు చూచిన మాత్రాననే ఆ చండి అంతకుమున్ను ఇతరలు హరించినదానినే అయినను అతని హృదయమును హఠమున హరించెను. హరుఁడు కాల్పఁగా బ్రహ్మ మరల సృజించిన స్మరుఁడో యన నా యసురేంద్రుల నడుమ నొప్పు చున్న యా సూర్యప్రభుని ఆమెయు చూచి చూచినమాత్రాన అతనికి లోనయి పోయెను. ఆ యువినయమునకు కోపగించినది వోలె ఆమెయొక్క యాంగికాభినయము నిలిచి పోయినది. సభాస్తారులును ఆ యిరువుర యా భావమును కనిపట్టి 'ఇఁక ఆట చాలును, రాజసుత బడలినది' అని మాన్పించిరి. మహల్లిక సూర్యప్రభుని ఓరచూపులు చూచుచు తండ్రిచే సెలవు పొంది దానవేంద్రులకు నమస్కరించి అంతఃపురమునకు పోయెను. అసురేంద్రు లందఱు తమతమ యిండ్లకు వెడలిరి. సాయంకాలమున తన నివాసమునకు పోయి సూర్యప్రభుఁడును రాత్రి కళావతి మరల రాఁగా ఆమెతో లోపల

నిద్రించు చుండెను. అనుచరు లందఱును వెలుపల నిద్రించు చుండిరి.

### మహల్లిక సూర్యప్రభునికడకుం బోవుట.

అంతలో మహల్లికయు నమ్మక మయిన యిరువురు చెలికత్తియలం దోడ్కొని అతనిం జూడ వేఁడి అచటికి వచ్చి లోపలికి పోఁజూచుచుండఁగా, ఆక్షణమందే నిదుర మేల్కొని ప్రజ్ఞాఢ్యుఁడను సూర్యప్రభసచివుఁడు 'దేవీ, క్షణముండుము; నేను లోపలికిం బోయి వచ్చెదను.' అనెను. 'మీ రెవరు ? వెలుపలనే మమ్ము నిలుపుటకు కారణ మేమి?' అని శంకితయై యామె యడుగఁగా ప్రజ్ఞాఢ్యుఁడు, 'దేవీ, యథేచ్ఛముగా నిద్రితుఁడై యున్న వానియొద్దకు తటాలున పోవచ్చునా ? వ్రతవశముచేత మా ప్రభువు ఒంటరిగా నిద్రించుచున్నాఁడు.' అనెను. ఆమె ఆశ్చర్యపడి 'అట్లే కానిమ్ము, లోపలికి పో.' అని పలుకఁగా ప్రజ్ఞాఢ్యుఁడు లోపలికి పోయి, కలావతి నిద్రించుచుండుటను గాంచి, సూర్యప్రభుని నిద్ర లేపి మహల్లికరాకను నివేదించెను. సూర్యప్రభుఁడు తెలిసికొని మెల్లగా లేచి వెడలి వచ్చి సఖీద్వయముతోఁడి మహల్లికను చూచి యిట్లనియె:— 'ఈ యభ్యాగతుఁడు కృతార్థుఁడైనాఁడు, ఈచోటు గూడ కృతార్థ మగును గాక. ఇదిగో ఆసనము అలంకరింపఁబడును గాక.' అంతట మహల్లిక చెలికత్తెలతో కూర్చుండెను. సూర్యప్రభుఁడును ప్రజ్ఞాఢ్యసమేతుఁడై కూర్చుండి యిట్లనియె:— 'ఓ తన్వీ,

నీవు సభలో నన్నుం బోలె ఇతరులను గూడ చూచుటచేత నాకు అవమానము చేయనే చేసితివి. అయినను ఓ చపలాక్షీ, నీనృత్తమును సౌందర్యమును చూచినమాత్రాన నానేత్రములు సఫలము లయినవి.' ఆమె 'ఆర్యపుత్రా, ఇది నాయపరాధము గాదు, సభలో అభినయము తప్పి లజ్జ పొందునట్లు నన్నెవఁడు చేసినాఁడో 'వానిది ఈ తప్పు.' అనెను. 'ఓడితిని'. అని నవ్వుచు పలికి సూర్యప్రభుఁడు బలాత్కార గ్రహణము చేతనో యనునట్లు చెమర్చుచును వడంకుచును ఉన్నయామె కేలిని తనకేలఁ బట్టెను. 'ఆర్యపుత్రా, వదలుము, నేను కన్యను; తల్లిదండ్రుల వశములో నున్న దానను.' అని యామె పలుకుచుండఁగా ప్రజ్ఞాఢ్యుఁడు ఇట్లనియె:—'దేవీ, కన్యలకు గాంధర్వ వివాహము లేదా? నీతండ్రి నీయభిప్రాయ మెఱిఁగి యున్నాఁడు. నిన్ను మఱి యొకనికి ఈయఁడు. ఆయన నిశ్చయముగా ఇతనికి సమ్మానము చేయును. కనుక భయము వలదు. ఈసమాగమము అవిఫల మగును గాక.'

ఇట్లు ప్రజ్ఞాఢ్యుఁడు పలుకు సమయములో లోపల కళావతి మేలుకొని, శయనీయమందు ప్రాణేశ్వరునిఁ గానక, కొంచెము సేపు లేచి శంకించి బయటకి వచ్చి మహాల్లికతో నున్న నిజవల్లభునిఁ గాంచి సకోపయు సభయయు సలజ్జయు ఆయెను. ఆమెను చూచి మహాల్లికయు లజ్జాభయములు పొందెను. సూర్యప్రభుఁడు వ్రాసిన ప్రతిమవలె నిశ్చేష్టుఁడాయెను. 'నన్ను

చూచినారు: ఇఁక ఎట్లు తొలఁగుదును? నాకు అవమానము ఈర్ష్యయు అగుచున్నవి.' అని తలంచి కళావతి వారియొద్దకే పోయి అసూయతో మహల్లికను 'సఖీ, కుశలమా? ఈరాత్రి వేళ ఇట్లు ఎచటికి వచ్చితివి?' అని యడిగెను. 'ఇది నాయిల్లు, నీవు అన్యపాతాళగృహమునుండి వచ్చిన దానవు, నీవే ఇపుడు నాకు అతిథివి లభించితివి.' అని మహల్లిక పలికెను. కళావతి నవ్వుచు ని ట్లనియె:—'సరి! సరి! అగపడుచునే యున్నది. నీవు ఇచ్చటికి వచ్చినవాని కెల్ల అతిథి సత్కారములు చేయుచునే యుందువు.' మహల్లిక యి ట్లనియె:—'నేను ప్రీతితో పలికిన, నీవు సిగ్గులేక ద్వేషముతో నిష్ఠురము లాడుచున్నావు. నే నేమి నీబోఁటిదాననా? నేనేమి బంధువులు ఈయకయే దూరమునుండి వచ్చి పరస్థలములో రహస్యముగా రాత్రి ఏకాకినిగా పరుని శయనమందు పరుంటినా? నేను నాతండ్రి యతిథిని నా చోటనే చూచుటకు అతిథి సత్కారమునకు ఇరువురు చెలులను తోడ్కొని వచ్చితిని. ఈ మంత్రి మమ్ము వంచించి లోపలికి వచ్చినప్పుడే ఇది నే నెఱింగితిని. ఇప్పుడు నీవే బయట పెట్టుకొంటివి.' ఇట్లు మహల్లిక పలుకఁగా, కళావతి ప్రియునిపై రోష కషాయవీక్షణములు అడ్డముగా నిగిడించి అటనుండి వెడలిపోయెను. మహల్లికయు 'బహువల్లభ, పోయివచ్చెదను.' అని సూర్యప్రభునితో రోషమున పలికి వెడలెను. ఆసమయమందు సూర్యప్రభుఁడు విమనస్కుఁ డాయె ననుట ఉచితమే

గదా. ఎట్లనఁగా, అతనిమనస్సు కాంత లిరువురకును తగులు కొని వారితోనే పోయినది గదా.

అంతట సూర్యప్రభుఁడు కళావతియొక్క కలహాంతర చేష్టితమును తెలిసికొని రక్షని తత్క్షణమే నిద్ర లేపి ప్రభాసుఁడను మంత్రిని పంపెను. అట్లే మహల్లిక కడకు ప్రహస్తుని పంపి తాను వారి నెదురు చూచుచు ప్రజ్ఞాఢ్యునితోఁ గూర్చుండి యుండెను. ప్రభాసుఁడు కలావతీచేష్టితమును కనిపట్టి వచ్చి రాజును గాంచి అతఁ డడుగఁగా నిట్లనియె:—"దేవా, నేను నావిద్యలచే అదృశ్యుఁడనై యిటనుండి రెండవ పాతాళములో కళావతీ నివాస గృహమునకు పోయి, అచట వెలుపల ఇద్దఱు చేటికల సంభాషణను వింటిని. ఒకతె అడిగినది:—'సఖి, ఏమి ఇప్పుడు కళావతి దిగులుపడియున్నది?' రెండవది చెప్పినది:— 'సఖి, కారణమును వినుము. ఇప్పుడు నాలవ పాతాళములో సుముండీకావతార మైన సూర్యప్రభుఁడు మదనుని జయించిన రూపవంతుఁడు వచ్చి యున్నాఁడు. మననెచ్చెలి స్వయముగా అతనికి తన్ను అర్పించుకొన్నది. ఈరాత్రి ఈమె అతనియొద్దకు పోఁగా అచటికి ప్రహ్లాదునికూఁతురు మహల్లికకూడ స్వయముగా వచ్చినది. ఆమెతో ఈమె ఈర్ష్యాకలహము ఆడి వచ్చి ఆత్మహత్య చేసికొనుటకు యత్నించుచుండఁగా ఈమెను తోఁబుట్టువు సుఖావతి చూచి నివారించి రక్షించినది. అంతట లోపలికి వచ్చి శయనముమీఁద వ్రాలినదై తనవృత్తాంతమును

ఆ తోఁబుట్టువు అడుగఁగాఁ జెప్పి ఆమెతోఁ గూడ నున్నది. ఆమెయు మిగుల దిగులుపడి యున్నది?' ఇట్లు చేటికలు సంభాషింపగా విని లోపలికి పోయి ఆతీరుననే యున్న కళావతీ సుఖంవతులను సమానాకృతులను చూచి వచ్చితిని."

### మహల్లికా వివాహము.

ఏకాంతమున ప్రభాసుఁడు ఇట్లు చెప్పి ముగింపఁగానే ప్రహస్తుఁడు వచ్చి యడుగఁబడి యిట్లు పలికెను:—'నేను ఇట నుండి మహల్లికయింటికి పోవునప్పటికి ఆమెయు కలఁకఁబాఱిన చిత్తముతో సఖులతోఁగూడ ప్రవేశించినది. నేను విద్యాప్రభావముచేత అదృశ్యుఁడనై వారివెంటనే లోపలికి పోయి అచట ఆమెవంటివారిని తత్సఖులను పండ్రెండుగురను చూచితిని. వారును రత్నాలమంచముపైఁ గూర్చున్న యా మహల్లిక చుట్టును ఉపవేశించిరి. వారిలో నొకతె యడిగినది.— 'చెలీ, ఏల నీవు ఆకస్మికముగా బెంగపడిన ట్లున్నావు? వివాహము సిద్ధమయి యుండఁగా నీకు ఈకొందల మేమి?' అంతట ప్రహ్లాద తనయ పరికించి 'నాకు వివాహమా? ఎవనికి నన్నిచ్చినారు? నీతో ఎవరు చెప్పినారు?' అని యడిగెను. వా రనిరి. 'ఱేపు ఉదయము నీకు వివాహము నిశ్చయింపఁబడినది. నిన్ను సూర్యప్రభునికి ఇచ్చినారు. నీవు ఇక్కడ లేక పోయితివి, మాయమ్మ దేవి ఇప్పుడే వచ్చి ఈవృత్తాంతము నిచటచెప్పి నిన్ను పెండ్లికూఁతును జేయు మని మమ్ములను ఆజ్ఞాపించి పోయినది. కనుక

ఎవనిని చూచినయంగనాజనులు తద్రూపలుబ్ధలై రాత్రి నిద్ర లేక వేఁగుదురో ఆసూర్యప్రభుఁడు పతి యయినట్టి నీవు ధన్యురాలవు. ఇఁకను మే మెవరమో నీ వెవరవో? అతనిని భర్తఁగా పొంది నీవు మమ్ము మఱతు వని మేము విషణ్ణలమై యున్నాము' మహల్లిక 'మీ రేమయిన అతనిని చూచితిరా? మీ మనస్సు అతనిపై తగులుకొన్నదా?' అని యడిగెను. 'మేము మేడ మీఁదినుండి అతనిని చూచినారము. చూచినమాత్రాన అతని పై మనస్సు తగులని స్త్రీయును ఉండునా?' అనిరి. 'అట్లయిన నేను నాయన నడిగి మిమ్ములను కూడ అతనికే ఇప్పించెదను. అట్లు జరిగిన మనకు ఎడఁబాపు కలుగదు.' అని మహల్లిక చెప్పఁగా వారు కలంగి 'చెలియరో, అట్లు చేయకుము. అది తగదు. మాకు లజ్జ యగుచున్నది.' అనిరి. 'ఏమి తప్పు? నన్ను ఒకతెనే ఆతఁడు వివాహ మాడునా? దైత్యదానవులు అందఱును అతనికి కొమార్తెలను ఇయ్యఁ బోవుచున్నారు. ఇప్పటికే అతఁడు వివాహ మాడిన రాజకన్యలు భూలోకములో నున్నారు. అనేక విద్యాధరకన్యలను కూడ అతఁడు వివాహ మాడఁగలఁడు. ఇంతఱలో మీరు కూడ అతనిని పెండ్లి యయిన నా కేమి నష్టి? పరస్పరము సఖుల మయిన మనము సుఖముగా ఒకచోటనే ఉండుదము. నాకు విరుద్ధ లయిన యితరలతో ఏమి పని? ఈవిషయములో మీ కేమి సిగ్గు? సర్వమును నేను నెఱవేర్చెదను,' అని మహల్లిక చెప్పెను.

ఇట్లు వారు నీయందు సక్తచిత్తలై భాషించుచుండఁగా నేను వెలువడి నీయొద్దకు వచ్చితిని. ప్రహస్తునివలన నిట్లు విని సూర్యప్రభుఁడు నిద్ర పట్టకయే సంతోషముతో ఆరాత్రి గడపెను.

తెల్లవాఱఁగా సూర్యప్రభుఁడు మయసునీథులతోఁగూడ అసురాధిపతిని ప్రహ్లాదుని దర్శించుటకై అతనిసభకు పోయెను. ప్రహ్లాదుఁడు సాదరముగా సునీథునితో నిట్లనియె:— 'ఈ సూర్యప్రభునికి నాకూఁతురు మహల్లికను ఇచ్చెదను. ఇతనికి అతిథిసత్కారమును, నీకు ప్రియమును నేను చేయవలసిన వాఁడను గదా.' 'అందులకు సునీథుఁడు సంతోషించి యంగీకరించెను. అంతట ప్రహ్లాదుఁడు మధ్యజ్వలితపావక మయిన వేదిమీఁద మహల్లికను కూర్చుండఁబెట్టి, ఆమెప్రభచేత రత్నస్తంభములు దేదీప్యమానములై ఆవేదిని వెలింగించుచుండఁగా, సూర్యప్రభునికి అసుర సామ్రాజ్యమునకు తగినవిభూతులతోఁ గూడ మహల్లికను ప్రదానము చేసెను. కొమరితకును అల్లునికి ప్రహ్లాదుఁడు దేవతలను గెలిచి తెచ్చిన రత్నరాసులను మేరు శిఖరములవంటివానిని ఇచ్చెను. 'నాయనా, నాచెలికత్తెలను పండ్రెండుగురను కూడ ఇతనికే ఇమ్ము' అని మహల్లిక యడుగఁగా ప్రహ్లాదుఁడు 'పుత్రీ, వారు నాభ్రాతకు స్వాధీనలు. నేను ఇచ్చుట యుక్తము గాదు.' అనెను. వివాహ మయి సాయంకాలము కాఁగా రాత్రి సూర్యప్రభుఁడు మహల్లికతోఁ

గూడ శయనగృహము ప్రవేశించి సర్వకామోపచారభూయిష్ఠ మయిన సంభోగ మనుభవించెను.

## కళావత్యాదుల వివాహము.

మఱునాఁడు ప్రహ్లాదుఁడు అనుచరసమేతముగా సభకు వచ్చినప్పుడు అమీలుఁ డను దానవాధీశుఁడు ప్రహ్లాదాదులతో ని ట్లనియె:—'ఇప్పుడు మీరందఱు నాయింటికి రావలయును. *అచట నేను సూర్యప్రభునికి ఆతిథ్యము చేసెదను.' మీకును సమ్మతియేని నాకొమారితను కళావతిని అతని కిచ్చెదను.' అందు లకు అందఱును సరియే యని యంగీకరించిరి. అంతట అంద ఱును మయ సూర్యప్రభాదిసమేతు లై రెండవ పాతాళమునకు పోయిరి. అచట అమీలుఁడు తన తనయను కళావతిని అంతకు ముందే ఇచ్చుకొన్న దానినైనను ఆచారార్థ మై మరల సూర్య ప్రభునికి ఇచ్చెను. ప్రహ్లాదునియింట వివాహము జరిపి అసుర సమేతుఁడై భుజించి సూర్యప్రభుఁడు ఆదినము గడపెను. మఱునాఁడు దురారోహుఁడను నసురేశ్వరుఁడు అందఱను పిలిచి అయిదవది యయిన తన పాతాళమునకు కొనిపోయి సూర్యప్రభునికి కుముదావతి యను పేరి తన కొమారితను అన్యులు చేసినట్లే ఆతిథ్యార్థము విధ్యుక్తమార్గమున ప్రదా నము చేసెను. పగలు అందఱితోను భోగములలోఁ గడపి సూర్యప్రభుఁడు రాత్రి త్రిలోకసుందరి యైన కుముదావతితో శయనగృహమున నానాభోగము లనుభవించెను. మఱునాఁడు

తంతుకచ్ఛుఁడు ప్రహ్లాదాది సమేతముగా సూర్యప్రభుని పిలిచి ఏడవ పాతాళమందలి తన నివాసమునకుఁ గొనిపోయి, తప్త జాంబూనద ప్రభ యయిన తన కూఁతును మనోవతిని రత్నాభరణ సమేతముగా అతనికి ప్రదానము కావించెను. సూర్యప్రభుఁడు పగలు అందఱతోను సుఖముండి రాత్రి మనోవతీ సవాశ్లేష సుఖములలో కడపెను. మఱునాఁడు నిమంత్రించి సుమాయుఁడను నసురేశ్వరుఁడు తన దైన యాఱవపాతాళమునకు ఘారినెల్లఁ గొనిపోయి సూర్యప్రభునికి పంచశరమయమూర్తియో యన నొప్పు దూర్వాలతా శ్యామలాంగిని సుభద్ర యను తనకొమారితను ఇచ్చెను. సంభోగయోగ్య యయిన యాసుభద్రా పూర్ణేందువదనతో సూర్యప్రభుఁడు ఆదినము గడపెను. మఱునాఁడు ఆప్రకారమే బలిచక్రవర్తి అతనిని తనదైన మూఁడవ పాతాళమునకుఁ గొనిపోయి సుందరి యనుపేరి తన కొమారితను లేఁ జిగురువన్నె దానిని బండిగురివెందపూలగుత్తియుం బోని కన్యారత్నమును అతనికి సమర్పించెను. ఆ కన్యారత్నముతో సూర్యప్రభు డు దివ్యభోగరంజితుఁడై ఆదినము గడపెను. మఱునాఁడు మయుఁడు గూఁడ అతనిని మరల తన దైన నాలవపాతాళమునకు స్వమందిరమునకు తోడ్కొని పోయెను. మయమాయావినిర్మిత మయిన యామందిరము విచిత్ర రత్న ప్రాసాద భాసురం బయి సిరిచే ఎప్పటి కప్పటికి వేఱువిధముగా క్రొత్తదిగా అగపడుచుండెను,

అందు మయుఁడు మూర్తీభవించిన తన శక్తియో యన నున్న సమాయ యను తన కొమారితను జగ దాశ్చర్య రూపను సూర్యప్రభునికి ఇచ్చెను. మనుష్యదేహముఁ దగుటచేత ఇయ్య వచ్చు నని మయుఁడు నిశ్చయించి అట్లు చేసెను. ఆమెతో సూర్యప్రభుఁడు ఆదినము క్రీడించుచుండెను. విద్యాప్రభావము చేత సూర్యప్రభుఁడు పెక్కుదేహములు దాల్చి ఏకకాలమందే సకలాసురకన్యలతోను విహరించుచుండెను. విశేషించి ప్రియ తమ మయిన ప్రహ్లాదాసురకన్యక మహల్లికతోడ తాత్త్వికదేహముతో క్రీడించుచుండెను.

ఒకనాఁడు సూర్యప్రభుఁడు అభిజాత యయిన యా మహల్లికను ప్రస్తావవశమున రాత్రి 'ప్రేయసీ, నీతోడఁ గూడ ఆరాత్రి వచ్చిన చెలికత్తె లిరువురును ఎక్కడివారు? ఎక్కడికి పోయినారు? మరల అగపడ లే దేమి?' అని యడిగెను. మహల్లిక యి ట్లనియె:—'ఆర్యపుత్త్రా, చక్కఁగా జ్ఞాపకము చేసితివి. వారు ఇద్దఱు మాత్రమే గారు. నాకు అట్టి వయస్యలు పండ్రెండుగురు కలరు. వారిని నా పెదతండ్రి స్వర్గమునుండి అపహరించి బందీగ్రాహముగా తెచ్చినాఁడు. అందు ఒకతె పేరు అమృతప్రభ, రెండవది కేశిని, వీ రిరువురును పర్వతముని కొమారితలు. మూఁడవది కాళింది, నాలవది భద్రక, అయిదవది చారులోచన, వీరు దేవలమహాముని కొమారితలు, ఆఱవది సౌదామని, ఏడవది ఉజ్జ్వల, వీ రిరువురు

హాహాగంధర్వుని తనయలు. ఎనిమిదవది పీవర యనునది హుహూగంధర్వుని కూఁతురు. తొమ్మిదవది అంజనిక కాలుని కూఁతురు. పదియవది కేసరావళి పింగళుఁ డనుగణోత్తముని కూఁతురు. పదునొకండవది మాలిని కంబళుని యాత్మజ. పండ్రెండవది మందారమాల వసువుకూఁతురు. వీరందఱు అప్సరస్సంభవలు దివ్యాంగనలు. నాకు వివాహము కాఁగానే వారు ప్రథమపాతాళమునకు పోయినారు. వారినిఁ గూడ నీకే ఇయ్య వలసినది, అట్టయిన మాకు వియోగ ముండదు. వారికి నే నీ యర్థమును ప్రతిజ్ఞ చేసి యుంటిని. వారియందు నా స్నేహ మట్టిది. మా నాయనతో అట్లు చేయు మని నేను చెప్పఁగా ఆయన అన్న యభిప్రాయము నెఱుఁగువాఁడై నేను కోరినట్లు చేయఁ డాయెను.' ఇట్లు ఆమె చెప్పఁగా ఆశ్చర్యపడి సూర్య ప్రభుఁడు 'ప్రేయసీ, నీవు మహానుభావురాలవు, కాని ఇట్లు నే నెట్లు చేయుదును ?' అనెను. అంతట రోషించి మహల్లిక 'నాయెదుట యితరలను పెండ్లి యాడుదువు. ఎవరిని బాసి నేను క్షణ మయినను రక్తి నుండఁ జాలనో ఆ చెలులను మాత్రము అంగీకరింపవు.' అనెను. అంతట సూర్యప్రభుఁడు ఆమె యిష్టమును నెఱవేర్చుటకు సమ్మతించెను. తత్క్షణమే ఆమె అతనిని ప్రథమ పాతాళమునకుఁ గొనిపోయి వారిని పండ్రెం డుగురను అతనికి సమర్పించెను. ఆరాత్రియే సూర్యప్రభుఁడు ఆదివ్యాంగనలను పండ్రెండుగురను వరుసగా వివాహమాయెను,

మఱునాఁడు ప్రభాసుని పంపి వారిని తెప్పించి యా నాలవ రసాతలములో మహల్లికానుమతిని దాఁచి యుంచెను. తానును ఇతరులకు అదృశ్యుఁడై ఆమెతో అచటనే క్రీడించుచుండెను. యథాప్రకారము దర్శనార్థము ప్రహ్లాదుని సభకు పోయెను. అచట నాయసురేంద్రుఁడు మయసునీథులతో 'రండి అంద అము దితి దనువులను ఇరువురను దర్శించుటకు పోదము.' అనెను. అఁగీకరించి మయ సునీథ సూర్యప్రభులు రసాతలము నుండి తత్క్షణమే అనుచరులతో తమతమకు తగినట్లు బయలు వెడలి, చింతితాగత మయిన యాభూతాసన విమాన మెక్కి సుమేరుసానుగత మయిన కశ్యపాశ్రమమునకుఁ బోయిరి.

## కశ్యపసందర్శనము.

అచట సాదరముగా మునిజనులచేత నివేదితు లై దితిదనువులను దర్శించి వారిపాదములకు భక్తితో ప్రణమిల్లిరి. అనుచరసహితులను వారినందఱను చూచి ఆ యసురమాతలు సంతసిల్లి శిరములు మూర్కొని ఆశీర్వాదములు చేసి మయు నితో నిట్లనిరి.—'పుత్త్రకా, మరల బ్రతికి వచ్చిన నీయీకుమా రుని సునీథుని చూచి మానేత్రములు సఫలము లయినవి. నీవు మహాపుణ్యాత్ముఁడవు, సూర్యప్రభ దేహముతోఁ బుట్టి దివ్యా కృతియై యసాధారణగుణుఁడై భావిశ్రేయఃసూచక లక్షణగుణ సమేతుఁడై యున్న యీసుముండీకుని చూచిన సంతసముచే మేము మా దేహములలో ఇముడఁజాలక యున్నాము. పుత్త్ర

కులారా, లెండు, త్వరగా పోయి ఆర్యపుత్త్రుని ప్రజాపతిని దర్శింపుఁడు. ఆదర్శనముచే మీకు కార్యసిద్ధి యగును. వారి మాటలచొప్పున నడచుకొనుఁడు, మీకు మంగళము కలుగును.' ఇట్లు ఆ దేవేరులు పలుకఁగా తత్క్షణమే మయాదులు ఆదివ్యాశ్రమములో కశ్యపమునిని సందర్శించిరి. ఆ దేవాశ్రమమందు కరఁగిన మేల్మిబంగారమువలె వెలుంగుచు జ్వాలలంబోని కెంజడలు దాల్చి తేజోమయుఁడై యగ్నియుంబోని యా దురాధర్షుని కశ్యపమునిని గాంచి అందఱును సహోదరులుగా వరుసగా అతనిపాదముల వ్రాలిరి. ఆయన సంతోషించి ఆశీర్వదించి కూర్చుండనియమించి వారితో ని ట్లనియె.—'సుతుల నందఱను ఇట్లు చూచుటవలన నాకు పరమానంద మయినది, మయా, సత్పథము నుల్లంఘింపక సర్వవిద్యాస్పదమ వై యున్న నీవు శ్లాఘ్యుఁడవు. సునీథా, ధన్యుఁడవు నీవు. చచ్చియు మరల బ్రదికితివి. సూర్యప్రభుఁడా, నీవు పుణ్యవంతుఁడవు, విద్యాధరేశ్వరుఁడ వగుదువు. నామాట వినుఁడు, ధర్మమార్గమును తప్పకుఁడు. అట్లున్న పర మైశ్వర్యమును సుఖములను సంతతము అనుభవింపుదురు, మునుపటివలె శత్త్రువులవలన పరాభవము మీకుఁ గలుగదు; ధర్మాతిక్రమము చేసిన యసురులు గదా మురారిచక్రము పాలయినారు. సునీథా, దేవహతు లైన యసురులు మర్త్యవీరులుగా వీరే జనించినారు. నీతమ్ముఁడు సుముండీకుఁడే యీ సూర్యప్రభుఁడు. కడమ యసురులు మీ

వయస్యులు, ఇతనికే బంధువులుగా పుట్టి యున్నారు. శంబరమహా సురుఁడే ఇతని మంత్రి ప్రహస్తుఁడు. మయసచివుఁ డయిన యా త్రిశిరసుఁడే యీసిద్ధార్థకుఁడు. వాతాపిదానవుఁడు ఇతనిమంత్రి ప్రజ్ఞాఢ్యుఁడుగా జన్మించినాఁడు. ఆయులూకదానవుఁడే ఇతని కిప్పుఁడు చెలికాఁడుగా నున్న శుభంకరుఁడు. ఇతని యిప్పటి మఱియొక చెలికాఁడు వీతభీతియే కాలాసురుఁడు. వృషపర్వా సురుఁడు ఈభాసమంత్రిగా నవతరించినాఁడు. ప్రబలాసురుఁడే యీప్రభాసుఁ డైనాఁడు. రత్నమయుఁ డైనయెవఁడు శత్రువు లయిన దేవతలు యాచించినను వెనుదివియక శరీరము రెండుగా చీల్చి యిచ్చినాఁడో, ఎవని దేహమునుండి సకలరత్నములు పుట్టినవో, అందులకు సంతోషించి చండికాదేవి ఎవనికి దేహాంతరానుభవనీయ మైన వర మొసంగినదో, అతఁడే యీ ప్రభాసుఁడు; ఆ వరమహిమచేత మహాబలుఁడుగా శత్రుదుష్ప్రసహుఁడుగా పుట్టినాఁడు. సుందోపసుందు లని యుండిరి గదా! వారు అతని మంత్రు లయిన యీ సర్వదమన భయంకరులుగా అవతరించినారు. హయగ్రీవ వికటాక్షు లనువారు స్థిరబుద్ధి మహాబుద్ధి అనుపేర్ల ఇతని మంత్రులుగా జన్మించినారు. ఇతని యిప్పటి యితర మంత్రులు మామగార్లు మొదలయినవారు పూర్వము ఇంద్రాదులను పలుమాఱు జయించిన యసురులు, ఇప్పు డీ దేహముల అవతరించి యున్నారు. ఇట్లు మీపక్షము మరల క్రమముగా వృద్ధిఁ బొందినది. కనుక ధైర్యము కొనుఁడు,

ధర్మమును వదలకుండు, పరమసమృద్ధిని పొందెదరు.'

ఇట్లు కశ్యపుడు పలుకు చుండ మాధ్యందిన సవన కాలము కాగా ఆయనభార్యలు దక్షపుత్త్రికలు అదిత్యాదులు వచ్చిరి. వారు నమస్కరించిన మయాదులను దీవించి భర్త యొక్క మాధ్యాహ్ని కాజ్ఞలను నెఱవేర్చి ఉన్నట్టి సమయములో ఆ మహామునిని దర్శించుటకు ఇంద్రుడు లోకపాల సమేతముగా వచ్చెను. ఇంద్రుడు సభార్యుం డయిన కశ్యపునికి నమస్కరించి తాను మయాదులచే నమస్కారములు గొని సూర్యప్రభునివైపు రోషముతో చూచుచు మయుని 'ఈచిన్న వాడు విద్యాధరచక్రవర్తి పదమును అభిలషించినాడు గదా? ఎఱుగుదును ఎఱుగుదును. ఇతం డేల అంత స్వల్పముతోనే తుష్టి పొందినాడు? ఇంద్రత్వమునే యేల కోరడు?' అని యడిగెను. 'దేవరాజా, పరమేశ్వరునిచే ఆ యింద్రత్వము నీకును ఈఖేచరత్వము ఇతనికిని నిర్ణయింపబడినవి.' అని మయుడు పలికెను. ఆమాటకు కోపముతో నవ్వుచు ఇంద్రుడు 'సులక్షణుం డైన యితనియాకృతికి ఆ ఖేచరపదము అత్యల్పము గదా.' అనెను. 'శ్రుతశర్మ ఖేచరేంద్రత్వమునకు తగి యుండంగా ఇతనియాకృతి ఇంద్రత్వమునకు తగనే తగును సుమా' అని మయుడు చెప్పెను. అందులకు ఇంద్రుడు కోపించి మయునిమీందికి వజ్రాయుధము నెత్తి లేచెను. అంతట కశ్యపముని కోపహుంకారము చేసెను. దిత్యాదులు ఛీఛీ యనుచు

కోపముచే మొగము లెఱ్ఱచేసికొనిరి. అంతట శాపభయముచే ఇంద్రుఁడు ఆయుధము నుపసంహరించి కూర్చుండెను.

సభార్యుని ఆ సురాసురజనకుని కశ్యపమునిని పాదప్రణతుఁడై యింద్రుఁడు ప్రసన్నునిఁ జేసి కృతాంజలి యై యిట్లు విన్నపించుకొనెను— 'స్వామీ, నేను శ్రుతశర్మకు ఇచ్చిన విద్యాధరాధిరాజత్వమును హరించుటకు ఈ సూర్యప్రభుఁడు ఉద్యమించుచున్నాఁడు. సర్వప్రకారముల ఈమయుఁడు వానికై దానిని సాధింపఁ జూచుచున్నాఁడు.' అందులకు భార్యాసహితుఁడై మహాముని 'మఘవుఁడా, శ్రుతశర్మ నీకు ఇష్టుఁడు, సూర్యప్రభుఁడు ఈశ్వరునికి ఇష్టుఁడు. అతనియిచ్ఛ తప్పదు. అతఁడే మయుని యత్నింపు మని యాజ్ఞాపించినాఁడు. ఈవిషయములో మయునియందు ఏమి యపరాధ మున్నదో నీవే చెప్పుము. ఇతఁడు ధర్మనిరతుఁడు, జ్ఞాన విజ్ఞాన సంపన్నుఁడు, గురుప్రణతుఁడు, వీనిని చెనకియుంటివేని మా క్రోధాగ్ని నిన్ను ఇప్పటికి భస్మీకరించియే యుండును. ఇతని మీఁదికి నీకు శక్తి లేదు, ఇతని ప్రభావమును ఎఱుఁగవా?' ఇట్లు ముని సభార్యుఁడయి పలుకఁగా ఇంద్రుఁడు లజ్జా భయాన్వితుఁడై తలవాంచి యుండెను. అంతట ఆశ్రుతశర్మ ఎట్టివాఁడో తెచ్చి చూపుమని అదితి యడిగెను. వెంటనే శక్రుఁడు మాతలిని పంపి శ్రుతశర్మను రప్పించెను. వినతుఁ డయిన యతనిని, సూర్యప్రభుని, చూచి, కశ్యపుని ఆయిరువురలో ఎవఁడు రూపలక్షణాధికుఁడో

చెప్పు మని భార్యలు అడిగిరి. 'ఇతనికి కాఁడు గదా ఇతని సచివునికి కూడ శ్రుతశర్మ సమానుఁడు కాఁడు, సాటిలేని యితనికి సమానుఁ డెట్లగును? సూర్యప్రభుని రూప లక్షణములు దివ్యములు. వాని ప్రభావముచే ఇంద్రత్వ మైనను ఇతనికి యత్నించిన సిద్ధించును.' అని కశ్యపమహాముని వచించెను. అంద ఱును 'బాగు బాగు' అని యామాటను శ్రద్ధతో గ్రహించిరి. కశ్యపముని ఇంద్రుఁడు వినుచుండఁగా మయునికి ఇట్లు వర మిచ్చెను:—'పుత్రకా, ఇంద్రుఁడు నీపై ఆయుధ మెత్తి వచ్చినను నీవు నిర్వికారుఁడ వై యుంటివి గదా, అందువలన నీవు అజరామరుఁడవు వజ్రమయాంగుఁడవు అక్షతుఁడవును అయితివి. మహాసత్త్వులైన యీసునీథ సూర్యప్రభులు కూడ నీకు సమానులును శత్రువర్గమునకు అజయ్యులును అగుదురు. శరత్కాల చంద్ర కాంతి యయిన యీనాకుమారుఁడు సువా సుఁడు ఆపద్రాత్రులయందు తలంచినమాత్రాన వచ్చి మీకు తోడ్పడును.' ఇట్లు మహాముని చెప్పఁగా ఆయనభార్యలును ఋషులును లోకపాలురును అందఱును సభలో మయాదులకు వరము లిచ్చిరి. అంతట అదితి శక్రునితో 'ఇంద్రా, ఈ యవినయము మానుము, మయుని ప్రసన్నునిఁ జేసికొనుము. ఇతనికి ఇప్పుడు కలిగిన సద్వరములు చూడఁగా నీకు వినయ ఫలము తెలియ లేదా?' అని హెచ్చరించెను. ఆమాట విని ఇంద్రుఁడు మయుని కేలు పట్టుకొని సంభావించెను. సూర్య

ప్రభాభిభూతుఁడై శ్రుతశర్ముఁడు పగలిటిచంద్రునివలె నాయెను. ఇంద్రుఁడు సురాసురగురువును అకశ్యపమహామునిని సకల లోక పాలక సమేతుఁడై నమస్కరించి, వచ్చిన దారినే పోయెను. మయాదులు మునివరుని యాజ్ఞ పొంది ప్రకృతకార్య సిద్ధికై ఆశ్రమమునుండి వెడలిరి.

---

## 3 - వ తరంగము.

### సూర్యప్రభుఁడు శ్రుతశర్మతో పోర సమకట్టుట.

పిమ్మట కశ్యపాశ్రమమునుండి, మయ సునీథ సూర్య ప్రభులు తమ మిత్రబాంధవులైన రాజులబృందము సూర్య ప్రభునికై కనుపెట్టుకొనియున్న యాయైరావతీ చంద్రభాగాసంగమమునకు పోయిరి. మరల వచ్చిన సూర్యప్రభుని చూచి యీ రాజులు ఏడ్చుచు విషణ్ణులై మరణోన్ముఖులై లేచిరి. చంద్రప్రభుఁడు అగపడనందున వారికీ ఈదుఃఖము కలిగిన దని తలఁచి సూర్యప్రభుఁడు జరిగినవృత్తాంత మంతయు వారికి చెప్పెను. అప్పటికిని వారు దుఃఖితులు గానే యుండిరి. సూర్యప్రభుఁడు అడుగఁగా అతని భార్యలను శ్రుతశర్మ హరించుటయు ఆయవమానముచేత తాము దేహత్యాగము చేసికొన నిశ్చయించుకొనుటయు దివ్యవాణి తమ్ము ఆప్రయత్నమునుండి మాన్పుటయు ఎట్టకేలకు విన్నవించిరి. అంతట కోపావేశముచేత

సూర్యప్రభుఁడు 'బ్రహ్మాది దేవత లందఱు అడ్డపడి రక్షింప వచ్చినను నిశ్చయముగా నేను పరదారాపహారణమందు కపట ప్రాగల్భ్యము కలవానిని ఆ శఠుని శ్రుతశర్మను నిర్మూలము చేయవలసినదియే' యని ప్రతిజ్ఞచేసి, ఆతనిమీఁదికి వెడలు వాఁడై, వెంటనే గణకులు ఏడవదినమందు మంచిలగ్నము నిర్ణయింపఁగా, ఆలగ్నమున బయలుదేఱుటకు నిశ్చయించుకొనెను. విజయార్థము పయనము సమకట్టి యున్న యా సూర్యప్రభుని మఱియు దృఢపఱిచి మయుఁ డిట్లనియె:—'నిశ్చయముగా నీవు విజయమునకు పోవువాఁడవే యేని చెప్పెదను వినుము. ఆకాలములో నేనే మాయను ప్రయోగించి నీప్రియలను గొని పోయి పాతాళములో దాఁచితిని. అట్లయిన నీవు త్వరగా విజయోద్యమము చేయుదువని. గాలి తోడ్పడిన మండినట్లు అగ్ని స్వయముగా మండదు గదా. కనుక పాతాళమునకు పోదము రా, నీప్రియలను నీకు చూపెదను.' మయుఁ డిట్లు చెప్పఁగా అచటి వారందఱును మిగుల సంతోషించిరి. అంతట ఆ మొదటి బిలముగుండనే అందఱును మయాసురునివెంబడి నాలవపాతాళమునకుఁ బోయిరి.

అచట నొక పడుకటిల్లు తెఱచి మయుఁడు అం దున్న మదనసేనాది భార్యలను సూర్యప్రభునికి సమర్పించెను. వారిని అసురాత్మజ లయిన తన యితరభార్యలను గ్రహించి సూర్యప్రభుఁడు మయునిబోధనచే ప్రహ్లాదుని దర్శింపఁ బోయెను.

సూర్యప్రభునికి లభించినవరము లన్నిటిని మయునివలనవిని, ప్రహ్లాదుఁడు, తనకు ప్రణమిల్లిన సూర్యప్రభునియొక్క సత్త్వమును పరీక్షించువాఁడై అతనిమీఁదికి కత్తిదూసికొని పోయి, క్రోధావేశ మభినయించుచు, 'ఓరి దురాచారుఁడా, వింటిని జుమా నాయన్న సంపాదించిన పండ్రెండుగురు కన్యలను నీవు హరించితివి. అందునకై నిన్ను చంపెదను చూడు.' అనుచు పైకొనెను. ఆమాటకు వికృతి నొందకయే యతనిని చూచుచు సూర్యప్రభుఁడు 'నాశరీరము నీయధీనము. అవినీతుని నన్ను దండింపుము' అనెను. అట్లతఁడు పలుకఁగా నవ్వి ప్రహ్లాదుఁడు 'కనుఁగొంటిని నిన్ను, నీకు గర్వము లేశ మయినను లేదు. వరము వేఁడుము మెచ్చుకొంటిని.' అనెను. సూర్యప్రభుఁడు వల్లె యని గురుభక్తియు శంకరభక్తియు వర మడిగెను. అందుల కందఱు సంతోషించుచుండఁగా ప్రహ్లాదుఁడు యామిని యను తన రెండవకొమారితను కూడ అతనికి ఇచ్చెను. సహాయులనుగా తన కుమారులలో ఇద్దఱను ఇచ్చెను.

పిమ్మట వా రందఱితోను సూర్యప్రభుఁడు అమీలుని యొద్దకు పోయెను. అతఁడును వరప్రాప్తి విని సంతోషించి, సూర్యప్రభునికి తన రెండవకూఁతును సుఖావతిని, సాహాయ్యార్థము ఇరువురు కుమారులను ఇచ్చెను. పిమ్మట కడమ యసురాధీశ్వరులను గూడ సాహాయ్యార్థము దర్శించుచు సూర్యప్రభుఁడు ఆభార్యలతో ఆదినము అచటనే గడపెను. సునీథ

భార్యలు ముగ్గురును రాజకన్య లయిన తనభార్యలును గర్భిణు లయి రని సూర్యప్రభుఁడు మయాదులగోష్ఠి నుండఁగా తెలియ వచ్చినది. వారిని దోహద మడుగఁగా అందఱును మహాయుద్ధము చూడఁ దమకు కోరిక యని పలికిరి. అందులకు సంతోషించి మయుఁడు 'ఆహా! పూర్వము హతు లయిన యసురులు వీరి గర్భములయం దున్నారు. కనుకనే వీరికి ఇట్టి కోరిక కలిగినది.' అని చెప్పెను. ఈరీతిని ఆఱు దినములు గడచినవి. ఏడవ దిన మందు సూర్యప్రభాదులందఱును భార్యాయుక్తులై పాతాళము వెలువడిరి. వారికి విఘ్నార్థము శత్రువులు ప్రయోగించిన యుత్పాతమాయను చింతితోపనతుఁడై సువాసకుమారుఁడు నాశము చేసెను.

పిమ్మట మయునిబోధనచేత చంద్రప్రభ పుత్త్రుని శిశువును రత్నప్రభుని పృథ్వీరాజ్యమునకు అభిషేకము చేసి అందఱును భూతాసనవిమాన మెక్కి గంగాతీర తపోవనమందు సుమేరుఁ డను విద్యాధరేంద్రుని నివాసమునకు పోయిరి. మయునివలన సకల వృత్తాంతమును విని శంకరునియానతిని స్మరించుకొన్న వాఁడై సుమేరువు మైత్త్రికై వచ్చినవీరిని సత్కరించెను. ఆదేశ మందే ఉండి సూర్యప్రభాదులు తమ తమ సైన్యములను బంధు మిత్త్రులను సంపూర్ణముగా రావించుకొనిరి. మొదట, సూర్య ప్రభుని మామల కొమరులు మయునియాజ్ఞచే విద్యలను సాధించి సప్రయత్నులై యున్నవారు వచ్చిరి. ఆ వారిభటాదులు పదు

నల్వురలో ఒక నొకనితోను పదివేల రథములు ఇరువదివేల కాల్బలమును వచ్చినది. పిమ్మట సంకేత మెఱిఁగి సూర్యప్రభుని మామలు, మామవంకవారును, ఇతరబంధువులును, అగు దైత్య దానవులు వచ్చిరి. హ్రస్వరోముఁడు, మహామాయుఁడు, సింహ దంష్ట్రుఁడు, ప్రకంపనుఁడు, తంతుకచ్ఛుఁడు, దురారోహుఁడు, సుమాయుఁడు, వజ్రపంజరుఁడు, ధూమకేతుఁడు, ప్రమథనుఁడు, వికటాక్షుఁడు, మొదలగువారు అనేకులు సప్తపాతాళముల నుండియు వచ్చిరి. డెబ్బదివేల రథములతో ఒకఁడు, ఎనుబది వేలతో మఱియొకడు, అఱువదివేలతో ఇంకొకఁడు, ముప్పది వేలతో ఒకఁడు, అందఱిలోను తక్కువవాఁడు పదివేలతోను వచ్చిరి. ఒకనికి కాల్బలము మూఁడు లక్షలు, మఱియొకనికి రెండులక్షలు, ఒకనికి లక్ష, అధమునికి అరలక్ష. ఇట్లే ఒక్కొ క్కనికి వానికి తగిన ఏనుఁగులదండు గుఱ్ఱపుదండును వచ్చెను. పిమ్మట మయ సునీథుల సైన్యము అసంఖ్యముగా వచ్చెను. సూర్యప్రభుని సొంతబలమును లెక్కలేనిది వచ్చెను. అట్లే వసుదత్తాదిరాజులదియు సుమేరువుదియు వచ్చెను.

పిమ్మట మయాసురుఁడు చింతితాగతుని సువాసకుమా రుని సూర్యప్రభాదిసహితుఁడై 'స్వామీ, ఈసైన్యము చెదరి యున్నది, ఇంత యని యొకమాఱుగా అగపడదు. ఒక్కచూపు లోనే ఇది యంతయు వ్యాపించి ఏచోట అగపడఁగలదు ? సెల విమ్ము,' అని యడిగెను. 'ఇచటికి యోజనమాత్రదూరమున

కలాపగ్రామ మనుపేరి ప్రదేశ మున్నది. అచట నిలిపి యీ బలము నంతయు ఒక్కదృష్టిలోనే చూడవచ్చును.' అని మునికుమారుఁడు పలికెను. అంతట అందఱును ఆకుమారుని సుమేరువును వెంటఁగొని కలాపగ్రామమునకు పోయిరి. అచట ఉన్నతస్థానస్థితులై వారు వేర్వేఱుగా అసురులసేనలను రాజుల సేనలను నిలిపి చూచిరి. అపుడు సుమేరువు పలికెను.—'శ్రుతశర్మకు బలము ఎక్కువ. అతని పక్షములో నూటయొక్కరు విద్యాధరాధీశ్వరులు ఉన్నారు. వారిలో ఒక్కొక్కఁడును ముప్పదియిద్దఱు రాజులకు అధిపతి. కానిమ్ము, వారిలో కొందఱను భేదోపాయముచే నీతో చేర్చెదను. అందులకై తేపు ప్రాతఃకాలమున వల్మీకనామక మయిన ప్రదేశమునకు పోవుదము. తేపు తిథి ఫాల్గున బహుళపక్షాష్టమి గదా. నాఁడు అచట చక్రవర్తిలక్షణ మయినయొక యమ్ములపొది యుత్పన్న మగును. దానికై అచటికి నాఁడు విద్యాధరులు పోవుదురు.'

### సూర్యప్రభుఁడు దివ్యతూణీరమును సాధించుట.

అందఱును ఆదినము సైన్య సంవిధానములోఁ గడపి మఱునాఁటి యుదయమున రథ బల సమేతులై వల్మీకమునకు పోయి అచట హిమవంతముయొక్క దక్షిణసానువున సైన్య ఘోషముతో విడిసిరి. అచటికి విద్యాధరేశులు అనేకులు వచ్చి, కుండములలో అగ్నిని జ్వలింపఁ జేసి, కొందఱు హోమమును కొందఱు జపమును ఆరంభించిరి. సూర్యప్రభుఁడును గొప్ప

వహ్నికుండము చేసెను. అందు అతనివిద్యాప్రభావముచే అగ్ని స్వయముగా జ్వలింప సాగెను. దానిని చూడఁగా సుమేరువునకు తుష్టియు విద్యాధరులకు మత్సరమును కలిగినవి. వారిలో ఒకఁ డిట్లనియె.—'ఛీ! సుమేరూ, విద్యాధరేంద్రతను మాని నీవు భూమిగోచరుని ఈ సూర్యప్రభుని అనువర్తించుచున్నావు!' ఆమాట విని సుమేరువు వానిని కోపముతో బెదరించెను. వానిపేరు సూర్యప్రభుఁ డడుగఁగా 'భీముఁ డని యొక విద్యాధరుఁడు గలఁడు. వానిభార్యను బ్రహ్మ కామించెను. బ్రహ్మకు వీఁడు జన్మించినాఁడు. రహస్యముగా బ్రహ్మకు పుట్టినాఁడు కావున బ్రహ్మగుప్తుఁ డని వీనికి పేరు. కనుక తన పుట్టుకకు తగినట్లు వీఁడు పలికినాఁడు.' అని చెప్పి సుమేరువు తానును ఒక యగ్నికుండమును చేసెను. సూర్యప్రభుఁడును అతఁడును అగ్నిలో హోమము చేసిరి. క్షణములో భూమిలోని బొక్కనుండి అతిభయంకర మయిన మహాజగర మొకటి లేచినది. సుమేరువుచే నిందితుఁ డయిన యా బ్రహ్మగుప్తుఁడు దానిని పట్టఁ బరుగెత్తెను. ఆయజగరముయొక్క బుస వానిని ఎండిన యాకునుం బోలె కొనిపోయి నూఱు బారల దూరమున పాఱవైచెను. అంతట తేజఃప్రభుఁ డను విద్యాధరాధీశుఁడు దానిని పట్టవచ్చి మొదటివానిగతినే పొందెను. పిమ్మట దుష్టదమనుఁ డను విద్యాధరాధీశ్వరుఁడు వచ్చి ఆ యిద్దఱవలెనే దూరమున పడెను. విరూపాక్షుఁ డనెడు విద్యాధరుఁడు వచ్చి దాని

బుసకు గడ్డిపరకవలె కొట్టుకొని పోయి దూరమున పడెను. అంగారక విజృంభకు లనెడు రాజులు రాఁగా అది వారిని దూరమునకు ఊఁదివైచినది. ఈప్రకారము క్రమముగా విద్యాధరాధీశు లందఱును దానిఫూత్కారముచే దూరముగాఁబడి రాతిదెబ్బలచే చూర్ణీకృతము లయిన దేహములతో ఎట్టకేలకు లేచిపోయిరి. అంతట శ్రుతశర్మ గర్వముచే ఆసర్పమునః పట్టువాఁడై వచ్చి ఇతరులవలెనే శ్వాసవాయువుచే దూరమునఁబడెను. సమీపమందే పడి లేచి మరల వచ్చి బుసచేత మఱియు దూరమున పోయి నేలఁబడెను. ఈప్రకారము ఒడ లంతయు నలిఁగి శ్రుతశర్మ విలక్షుఁడై లేనఁగా ఆపామును బట్టుటకు సుమేరువు సూర్యప్రభుని ప్రేరించెను. 'చూడుఁడు చూడుఁడు! అజగరమును పట్టుటకు వీఁడును లేచినాఁడు! ఆహా! మనుష్యులు కోఁతులవంటివారు, బుద్ధి లేనివారు ఇతరులు ఏమి చేయఁగా చూతురో దానిని అనుకరింతురు.' అని విద్యాధరులు సూర్యప్రభుని పరిహసించిరి. నవ్వు చున్న యా విద్యాధరులను లక్ష్యపెట్టక సూర్యప్రభుఁడు పోయి అజగరమును నోరు పట్టి బిలమునుండి పైకి లాగెను. తత్క్షణమే ఆసర్పము ఉత్తమ మయిన యమ్ములపొది యాయెను. సూర్యప్రభుని యాదలను ఆకాశమునుండి పువ్వులవాన గురిసెను. 'సూర్యప్రభా, నీకు ఈ యక్షయ తూణరత్నము సిద్ధించినది. దీనిని పుచ్చుకొమ్ము.' అని యాకాశమునుండి యశరీరవాణి ఘోషిం

చెను. అంతట విద్యాధరులు ఖిన్నులైరి. సూర్యప్రభుఁడు తూణమును పుచ్చుకొనెను. మఱియు సునీథ సుమేరులు సమ్మోదము నొందిరి. శ్రుతశర్మ విద్యాధరబలమును వెంటఁగొని వెడలి పోఁగా అతనిదూత వచ్చి సూర్యప్రభునితో 'సూర్యప్రభుఁడా, శ్రీమంతుఁడు శ్రుతశర్మ నీవు బ్రదుకఁ గోరిన వాఁడవేని యీ యమ్ముల పొదిని తనకు ఇమ్మని నీకు ఆజ్ఞాపించుచున్నాడు' అని చెప్పెను. సూర్యప్రభుఁడు ఇట్లు బదులుచెప్పెను.—'దూతా, అతని శరీరమే నాబాణములచే ఆవృతమై అతనికి తూణ మగునని చెప్పుము.' ఈ ప్రతిసందేశము గొని దూత మరలి పోఁగా అందఱు శ్రుతశర్మయొక్క యా రభస వచనమునకు నవ్విరి. సుమేరువు సూర్యప్రభుని కవుంగిలించి 'ఆహా, శివుని వాక్యము ఫలించినది. సంశయము లేదు. ఈ తూణరత్నము సిద్ధించినందున నీకు చక్రవర్తిత్వము సిద్ధించినదే. ఇఁక రమ్ము, నిరాకులుఁడవై ధనూరత్నములు సాధింతువు గాని.' అనెను.

## సూర్యప్రభుఁడు ధనూరత్నమును సాధించుట.

ఇట్లు సుమేరునివలన విని సూర్యప్రభాదు లందఱును, అతఁడే ముందు నడువఁగా, అటనుండి హేమకూటమునకు పోయి దాని యుత్తర పార్శ్వమందు మానస సరోవరమును సముద్రనిర్మాణార్థమైన బ్రహ్మదేవుని వర్ణకముంబోని దానిని చేరిరి. అందు జలక్రీడ లాడుచున్న దివ్యాంగనల ముఖములు వికసించియున్న కనక కమలములవలన తెలియ రాకుండెను.

ఆసరస్సుయొక్క సొంపును వారు చూచు చుండఁగా అచటికి శ్రుతశర్మాదులు కూడ వచ్చిరి. అంతట సూర్యప్రభాదులు అచట ఘృతాంబుజములతో హోమమును ఆరంభించిరి. క్షణములో భయంకర మయిన మేఘము ఒకటి ఆసరస్సు నుండి లేచి ఆకాశమును ఆవరించి మహావర్షము కురిసెను. ఆమేఘము నడుమనుండి నల్లపాము ఒకటి రాలెను. సుమేరువు హెచ్చరింపఁగా సూర్యప్రభుఁడు లేచి దానిని పట్టి కొట్టెను. అంతట ఆసర్పము ధను స్సాయెను. అది ధనుస్సు కాఁగానే ఆమేఘమునుండి మఱియొక నాగము పడెను. దాని విషాగ్ను లకు భయపడి విద్యాధరు లందఱును పాఱిపోయిరి. దానిని మునుపటివలెనే సూర్యప్రభుఁడు పట్టుకొనెను. అదియు ధను ర్గుణ మాయెను. 'సూర్యప్రభుఁడా, అమితబల మయిన యీ ధనుస్సు నీకు సిద్ధించినది. అచ్ఛేద్య మయిన యీగుణమును సిద్ధించినది. ఈ రెండురత్నములను గ్రహింపుము.' అని ఆకాశ వాణి పలికెను. పుష్పవర్షము గురిసెను. సూర్యప్రభుఁడు గుణ యుక్తమయిన యాధనుస్సును గ్రహించెను. శ్రుతశర్మ దుఃఖితుఁ డయి అనుచరసమేతుఁ డై తపోవనమునకు పోయెను. మయా దులు అందఱు సంతోషించిరి. ధనుస్సుయొక్క పుట్టుకను మయాదులు అడుగఁగా సుమేరుఁ డిట్లనియె.—

## వయస్యులు దివ్యధనువులను సాధించుట.

'అయ్యా, ఇచట బొంగువెదుళ్లయడవి గొప్పది యొకటి

యున్నది. అందునుండి కొట్టితెచ్చి యీసరస్సులో వైచిన వెదుళ్లు గొప్ప దివ్య ధనుస్సులు అగును. వానిని పూర్వము దేవతలు అసురులు గంధర్వులు విద్యాధరోత్తములును సాధించిరి. వాని నామధేయములు వేలువేలు. అమృతబలము లను పేరిచక్రవర్తి ధనుస్సులను ఇందు సురలు పెట్టి యుండిరి. అవి పుణ్యాత్ములకు భవిష్యచ్చక్రవర్తు లగుకొందఱకు ఈశ్వ రేచ్ఛచే ఇట్టి క్లేశములచే లభించును. అట్టి యీ మహాధనుస్సు సూర్యప్రభునికి సిద్ధించినది. ఇతని వయస్యులును తమకు తమకుఁ దగిన యీధనువులను సాధింతురు గాక. సిద్ధవిద్యు లయిన యీ వీరులకు వీనిని సాధించుటకు యోగ్యత కలదు. ఇప్పటికిని అవి యోగ్యులకు తగినట్లు సిద్ధించును.' సూర్యప్రభునివలన ఇట్లు విని సూర్యప్రభుని వయస్యులు ప్రభాసాదులు ఆకీచకవనమునకు పోయి తద్రక్షకుఁ డయిన చండదండుఁ డసురాజును కొట్టి వెదుళ్లను తెచ్చి ఆసరస్సులో పడవైచి ఆతీరమందు ఉపవసించి జపహోమములు చేయుచుండిరి. ఏడుదినములలో వారికి ధనుస్సులు సిద్ధించినవి. వారు వచ్చి సిద్ధిని తెలుపఁగా మయా దులతో సూర్యప్రభుఁడు సుమేరునితపోవనమునకు పోయెను.

## సూర్యప్రభుఁడు మోహినీ పరివర్తినులను సాధించుట.

అచట సుమేరువు సూర్యప్రభునితో నిట్లనియె: "నీ మిత్రులు అజయ్యుని చండదండుని జయించుట అద్భుతముగా నున్నది. అతనియొద్ద మోహిని యనువిద్య యున్నది. దానిచే

అతఁడు దుర్జయుఁడు. దానిని అతఁడు నిశ్చయముగా ప్రధాన శత్రువ వయిన నీకొఱకు దాఁచి యున్నాఁడు. కనుకనే అతఁడు దానిని నీవయస్యులమీఁదికి ఇప్పుడు ప్రయోగింప లేదు. అది ఒకపర్యాయమే అతనికి ఫలించును, మరల మరల ఫలింపదు. అతఁడు పూర్వము దానిని తత్ప్రభావ పరీక్షార్థము ప్రయోగించెను. అంతట గురువు కోపించి అతనికి అట్లు శాపమిచ్చెను. ఈవిద్యలయొక్క ప్రభావము దురాసదము. అందులకారణము మహానుభావుని మయుని అడుగుము. ఈయన యెదుట నేనేమి చెప్పఁగలను? సూర్యునియెదుట దీపము ఎట్టిది ?'

మయుఁ డిట్లనియె:—'సత్యము చెప్పినాఁడు సుమేరువు. నేను సంగ్రహముగా చెప్పెద విను. అవ్యక్తమునుండి ఆ యా శక్త్యనుశక్తులు పుట్టును. అందుండి ప్రాణశక్తి అనునాదము పుట్టి బిందుమార్గమును పొంది పరతత్త్వ కళాన్విత మయి విద్యాది మంత్రత్వమును పొందును. ఆమంత్రవిద్యలను ఎఱుఁగుటచేఁ గాని తపస్సుచేఁగాని శిద్ధాజ్ఞచేఁగాని సిద్ధిపొందిన వారిమహిమ దురతిక్రమముగా నుండును. పుత్త్రా, నీకు అన్ని విద్యలు సిద్ధించినవి గాని రెండుమాత్రము లేవు. మోహినీ పరివర్తినీ విద్యలు నీకు తెలియవు. అవి యాజ్ఞవల్క్యునియొద్ద నున్నవి. ఆయనయొద్దకు పోయి వేఁడుము.'

అంతట సూర్యప్రభుఁడు ఆమహర్షియొద్దకు పోయెను. ఆయన అతనిని పాములమడుగులో ఏడుదినములు, అగ్ని

మధ్యములో మూఁడుదినములు, ఉంచి తపస్సు చేయించెను. ఏడు దినములు పాముకాటులు సహించిన పిమ్మట మోహినీ విద్యను, మూఁడు దినములు అగ్నిదాహమును సహించిన పిమ్మట పరివర్తినీవిద్యను, ఆముని యితనికి ఇచ్చెను. మునీంద్రుఁడు ఇతనిని మరల అగ్నికుండములో ప్రవేశింపు మని ఆజ్ఞాపించెను. అట్లే ఇతఁడును చేసెను. తత్క్షణమే సూర్యప్రభునికడకు ఆకాశగామి యగు మహాపద్మ విమానము వచ్చెను. దాని యందు నానారూప మహారత్న వినిర్మితము లయిన నూట యెనిమిది రేకులును అన్ని నగరములును అలంకారములుగా నుండెను. 'ఇది చక్రవర్తివిమానము; నీకు సిద్ధించినది. దీని నగరములలో నీయంతఃపురములను ఉంపుము. అట్లు చేసిన వారు నీశత్రువులకు సాధ్యులు కానేరరు' అని ఆకాశమునుండి అశరీరవాణి పలికెను. అంత నతఁడు యాజ్ఞవల్క్యునికి ప్రణమిల్లి గురుదక్షిణను వేఁడ్కొని తన్ను కృతార్థుని చేయు మని ప్రార్థించెను. 'నీయభిషేక కాలమందు నన్ను తలంచుకొనుము' ఇదే దక్షిణ. నీసైన్యమునొద్దకు 'పొమ్ము.' అని ముని యానతిచ్చెను. అంతట మునికి నమస్కరించి, ఆ విమానము ఎక్కి సూర్యప్రభుఁడు సుమేరు నివాసమునందలి తనసైన్యము నొద్దకు పోయెను. అచట సిద్ధవిద్యావిమానుని ఇతనిని చూచి వృత్తాంతమును ఇతనివలననే విని మయాదులు సంతోషభరితు లైరి.

## శ్రుతశర్మకడకు దూత్యము.

అంతట సునీథుఁడు సువాసకుమారుని స్మరించెను. అతఁడు వచ్చి మయాదులతోను రాజులతోను 'అయ్యా, విమానమును విద్యలును అన్నియు సూర్యప్రభునికి సిద్ధించినవి గదా. మీరు ఇప్పటికిని శత్రుజయవిషయమై యుదాసీనులై యున్నారేమి?' అనెను. అందులకు మయుఁడు 'మీరు చెప్పునది యుక్తము. ముందుగా దూతను పంపి, నీతిని ప్రయోగింతము గాక.' అని పలికెను. 'అట్లే చేయ వచ్చును ఆక్షేప మేమి? ఈప్రహస్తుని పంపుఁడు. ఇతఁడు ప్రతిభావంతుఁడు, వాచాలుఁడు, గడుసు వాఁడు, సహిష్ణువు, సర్వ దూత గుణాన్వితుఁడు.' అని ముని కుమారుఁడు పలికెను. అందఱును ఆమాటకు సంతోషించి ప్రహస్తునికి సందేశము కఱపి శ్రుతశర్మకడకు పంపిరి. అతఁడు పోఁగానే సూర్యప్రభుఁడు వారందఱకు తాను కన్నకల యొకటి చెప్పెను: 'ఈరాత్రి వేకువజామున స్వప్నములో మనల నంద ఱను గొప్పజలప్రవాహము కొట్టుకొనిపోవు చుండెను. అందు మనము మునుఁగక నృత్యము చేయుచుంటిమి. అంత నాప్రవా హమును ఎదురుగాలి లేచి త్రిప్పివైచినది. ఆసమయములో జ్వలితతేజసుఁడు ఒక మహా పురుషుఁడు మనల నెత్తి నిప్పులో వైచెను; మనము కాల లేదు. ఇంతలో మేఘము వచ్చి నెత్తురు ప్రవాహమును వర్షించినది. ఆప్రవాహము దిక్కుల నన్నిటిని ముంచినది. అంతలో నేను మేలుకొంటిని.' సువాసకుమారుఁ

డి ట్లనియె:—‘ఈకల ఆయాసపూర్వక మయిన యభ్యుదయ మును సూచించుచున్నది. ఆ జలప్రవాహమే యుద్ధము, మునుఁగక నీళ్లలో కొట్టుకొనిపోవుచుండియు నర్తించుచు ఉండుటయే ధైర్యము, దానిని మరలించిన వాయువు మీకు శరణ్యుఁడయిన యొకరక్షకుఁడు, మిన్ముట్టిన జ్వాలత్తేజుఁడు సాహాయ్యంకరుఁడు, అతఁడు మిమ్ము అగ్నిలో వేయుట యుద్ధములో ప్రవేశపెట్టుట. అంతట మేఘోదయ మగుట మీకు మరల భయము కలుగుట, రక్తవర్షము భయవినాశనము. దిక్కులు రక్తముతో నిండుట మీకు మహైశ్వర్యము. స్వప్నము నానావిధము, అనార్థము, యథార్థము, అపార్థము, అని. ఏది వెంటనే అర్థమును సూచించునో అది అనార్థము, ప్రసన్న దేవ తాదేశరూపమైన స్వప్నము యథార్థము, గాఢానుభవచింతాదికృతమైన స్వప్నము అపార్థము. మనస్సు రజోమూఢము బాహ్యార్థవిముఖమును అగుడు నిద్రావశమున నున్న జంతువు నానాకారణములచే స్వప్నము కనును. అది కాలవిశేషమును బట్టి చిరఫలమును శీఘ్రఫలమును సూచించును. రాత్ర్యంతదృష్ట మయిన యీస్వప్నము శీఘ్రఫలమును ఇచ్చును.’ మునికుమారుఁడు ఇట్లు చెప్పఁగా సంతోషించి సూర్యప్రభాదులు లేచి దినకృత్యములను నిర్వర్తించిరి.

ఇంతలో ప్రహస్తుఁడు శ్రుతశర్మయొద్దనుండి మరలి వచ్చి మయాదులతో యథావృత్తము నిట్లు వర్ణించెను.— “నేను

ఇటనుండి త్రికూటాచలమందలి యాబంగారపునగరికి త్రికూట పతాకకు పోయితిని. అందు ద్వారపాలక నివేదితుఁడనై పోయి ఆ యావిద్యాధరాధిపతులు చుట్టునుం గొలువఁ గూర్చుండి యున్న శ్రుతశర్మను చూచితిని. తండ్రియగు త్రికూటసేనుఁడును, విక్రమశక్తి, ధురంధరుఁడు, దామోదరుఁడు మొదలయిన శూరు లును ఓలగంబున నుండిరి. నేను కూర్చుండి శ్రుతశర్మతో నిట్లు పలికితిని: 'నన్ను శ్రీమంతుఁడు సూర్యప్రభుఁడు నీయొద్దకు పంపి నాఁడు. ఆయన నీకిట్లు చెప్పుచున్నాఁడు: శంకరుని ప్రసాదముచే నేను విద్యలను రత్నములను భార్యలను సహాయులను సాధించి తిని. కనుక నీవు ఈవిద్యాధరేశ్వరులతోఁగూడ వచ్చి నాసైన్య ములో చేరవలసినది. నేను విరోధులను నాశము చేయుదును, ప్రణతులను రక్షింతును. నీవు తెలివి లేక సునీథతనయను కామ చూడామణిని హరించితివి గదా. ఆ కన్యను వదలుము, అనని నీకు అశుభము.' నేను ఇట్లు పలుకఁగా అందఱు కోపించి 'మాకు గర్వముతో ఇట్లు సందేశము పంపువాఁడు వాఁ డెవఁడు? మను ష్యులకు ఇట్లు పంపును గాక. విద్యాధరులకా మనుష్యమాత్రుఁ డయ్యును ఈవరాకుఁడు ఇట్లు సందేశము పంపును? ఈగర్వ మునకు వాఁడు నశించును.' అనిరి. దానిని విని నేను 'ఏమి ఏమి! అతఁ డెవరో చెప్పెదను వినుఁడు. అతనిని మీకు చక్రవర్తినిగా శంకరుఁడు నిర్మించినాఁడు. మర్త్యుఁ డని శంకయేని, మనుష్యులు దేవత్వమునుగూడ సాధించియున్నారు. విద్యాధరులు మనుష్యుఁ

డయిన యతనిపరాక్రమమును చూచియే యున్నారు. అతఁడు ఇచటికి వచ్చిన, మీకు నాశము కలుగును.' అని పలుకఁగా ఆసభ యంతయు క్షోభము పొందెను. నన్ను చంపుటకు శస్త్ర శస్త్ర ధురంధరులు నామీఁదికి వచ్చిరి. 'మంచిది మీశౌర్య మెట్టిదో, చూచెదను రండి' అని నేను పలికితిని. అంతట దామోదరుఁడు లేచి వారిని 'ఇతఁడు దూత, బ్రాహ్మణుఁడు; ఇతనిని చంపఁగూడదు' అని బోధించి నివారించెను. అంతట విక్రమశక్తి నాతో 'దూతా, పోపో, నీస్వామినిం బోలె మమ్ము అందఱను ఈశ్వరుఁడే నిర్మించినాఁడు. కనుక అతఁడు ఇచటికి వచ్చును గాక, చూచెదము. అతనికి ఆతిథ్యము మేము చేయఁ గలము.' అని పలికెను. నేను నవ్వుచు 'ఆకాశ మెల్ల నాక్ర మించుచు వచ్చుచున్న మేఘమును చూచువఱకు హంసలు పద్మవనములో సుఖముగా నుండి నాదము చేయుచుండును.' అని తిరస్కరించి లేచి వెడలి యిటకు వచ్చితిని.''

## రణదీక్ష.

ఇట్లు ప్రహస్తునివలన విని మయాదులు సంతోషించిరి. అంతట సూర్యప్రభాదులు యుద్ధోద్యోగమును నిశ్చయించి రణదుర్మదుఁ డయిన ప్రభాసుని సేనాపతిని చేసిరి. అందఱును సువాసకుమారుని నిదేశమున ఆదినమే నియతవ్రతులై రణదీక్ష వహించిరి.

### విలాసినీ సమాగమము.

రాత్రి సూర్యప్రభుఁడు ప్రతశయ్యాగృహాంతరంబున అనిద్రుఁడై శయనించి యుండఁగా అపూర్వ మయిన యొక కన్యారత్నము వచ్చెను. మంత్రులు నిద్రించుచుండిరి. సూర్యప్రభుఁడు నిద్రితునివలె నటించెను. ఆమె యతని యొద్దకు వచ్చి చెలితో నిట్లనియె.—'నిద్రించుచున్నప్పుడే యితని విశ్రాంత విశాల మయిన రూపశోభ యిట్లుండఁగా మేలుకొని యున్నప్పుడు ఎట్టిదిగా నుండునో గదా! ఇతనిని మేలుకొలుప నక్కఱ లేదు. నాకౌతూహలము తీఱినది. నాహృదయమును మిక్కిలి ఇతనిమీఁద కట్టి ఏమి ప్రయోజనము! ఇతనికి శ్రుతశర్మతో యుద్ధము కలుగును గదా. అందు ఎవనికి ఏమి కలుగునో ఎవరికి తెలియును? రణోత్సవము శూరులప్రాణములు వ్యయమగుటకై సంభవించును. అందు ఇతనికి జయము కలుఁగును గాక. పిమ్మట మనము తెలిసికొందము. కామచూడామణిని ఆకాశమార్గమునఁ బోవుచు చూచిన యితని హృదయమును నాబోఁటిది ఎవతె రంజింపఁగలదు?' సఖి యిట్లనియె.— 'చండీ, నీ కేమి యితనియందు విరక్తి గలిగినది? ఏమి చెప్పితివి? ఎవఁడు కామచూడామణి మనస్సును హరించినాఁడో అతఁడు మఱి యొకతె అరుంధతియే యైనను దాని మనస్సును హరింపఁడా? ఇతనికి యుద్ధములో మేలు కలుగు నని విద్యాప్రభావముచేత ఎఱుఁగవా? చక్రవర్తి కాఁబోవునితనికి భార్య

లగుదు రని మిమ్ముఁ గూర్చి సిద్ధులు చెప్పి యుండలేదా? కామ చూడామణి, నీవు, సుప్రభయు ఒకగోత్రమువారు. ఈనడుమనే సుప్రభను ఇతఁడు వివాహ మాడియున్నాఁడు. ఇట్లుండఁగా ఇతనికి యుద్ధములో అకల్యాణము ఎక్కడిది! సిద్ధవచనము అబద్ధ మగునా! సుప్రభ ఎవనిచిత్తమును హరించినదో వాని చిత్తమును నీవు హరింపవా? నీవు ఆమెకంటె రూపవతివి. ఆమె బంధు వని నీకేమయిన శంకయేని అది యుక్తము గాదు. సతులకు భర్తకంటె బంధువు లేఁడు.' సఖి యిట్లు చెప్పఁగా విని ఆకన్యారత్నము పలికెను.—'ఓచెలీ, నీమాట సత్యము. నాకు ఇతరబంధువులతో పని లేదు, ఆర్యపుత్త్రునికి యుద్ధములో జయము కలుగు నని యెఱుఁగుదును. ఇతనికి రత్నములు విద్య లును సిద్ధించినవి. ఓషధులు మాత్రము సిద్ధింపలేదు. అందు చేత నామనస్సు శంకాకులమై యున్నది. అవి యన్నియు చంద్రపాదపర్వతమందు గుహాలో నున్నవి, పుణ్యాత్ముఁ డయిన చక్రవర్తికే అవి సిద్ధించును. ఇతఁడు అచటికి పోయి సకలౌ షధులను సాధించునెడల' తేపే యుద్ధము సంభవించినను ఇతఁడు జయించును.' అది యెల్ల విని సూర్యప్రభుఁడు వ్యాజనిద్రను మాని ఆకన్యతో వినయముగా ని ట్లనియె.— 'ఓ మృగాక్షీ, నీవు నాయందు మిక్కిలి పక్షపాతమును చూపితివి. అట్లే నేను అచటికి పోయెదను. నీవు ఎవరవో చెప్పుము.' అంత నామె అతఁడు సర్వము వినె నని లజ్జచే తల వాంచి యుండెను. సఖి

యి ట్లనియె.—'ఈమె విద్యాధరేంద్రుఁ డయిన సుమేరువు యొక్క తమ్ముని కూఁతురు. ఈమె పేరు విలాసిని; నిన్ను చూడఁ గౌతూహలగ్రస్త యిచటికి వచ్చినది.' ఇంతమాత్రము చెప్పఁగానే విలాసిని ఆచెలిని పోదము రమ్మని పిలిచి వెడలి పోయెను.

### ఓషధీ సాధనము.

పిమ్మట సూర్యప్రభుఁడు తనమంత్రులను ప్రభాసాదులను లేపి ఆమె పలికిన యోషధీసాధనమును తెలిపెను. తత్సాధనార్థము ఆవృత్తాంతము మయ సునీథ సుమేరువులకు తెలుపుటకు యోగ్యుని ప్రహస్తుని పంపెను. వారు వచ్చి యంగీకరింపఁగా సూర్యప్రభుఁడు రాత్రి మంత్రులతోఁగూడ చంద్రపాద పర్వతమునకు పోయెను. పోవుచుండఁగా వారిని దారిలో యక్ష గుహ్యక కూష్మాండులు నానాయుధోద్యతులై అడ్డిరి. వారిని కొందఱను అస్త్రములచేత మూర్ఛితులను చేసియు, కొందఱను విద్యచే స్తంభింపఁ జేసి, సూర్యప్రభాదులు చంద్రపాదగిరికి పోయిరి. అచట వీరు గుహాద్వారము చేరఁగానే విచిత్రవికృతాననులు శంకరుని ప్రమథులు వచ్చి అడ్డపడిరి. 'వీరితో యుద్ధము చేయఁగూడదు, చేసిన హరదేవునికి కోపము కలుగును. కనుక ఆయనయొక్క అష్టోత్తరనామములతో ఆయనను స్తుతింతము; అంత నాయన వర మిచ్చును; అంతట వీరు ప్రసన్ను లగుదురు.' అని యప్పుడు సువాసకుమారుఁడు

వారికి బోధించెను. అంతట అందఱును హరుని స్తుతించిరి. ప్రమథులును స్వామిస్తుతిచే ప్రసన్నులై వారి కిట్లనిరి.— 'ఈగుహను వదలితిమి, ఇందలి మహౌషధులను గ్రహింపుఁడు. ఇందు సూర్యప్రభుఁడు స్వయముగా ప్రవేశింపఁగూడదు. ప్రభాసుఁడు ప్రవేశించును గాక. ఇతనికి ఆపని సులువు.' ఆగణవాక్యమునకు అందఱును సంతోషించిరి. అట్లే ప్రభాసుఁడు ప్రవేశింపఁగా ఆగుహ బద్ధాంధకార మయ్యును ప్రకాశభరిత మాయెను. మహాఘోరరూపులు రాక్షసులు నలువురు కింకరులు లేచి ప్రణమిల్లి అతనిని ప్రవేశింపుము అని పలికిరి. ప్రవేశించి ఏడు దివ్యౌషధులను తెచ్చి ప్రభాసుఁడు వెలువడి వచ్చి సూర్యప్రభునికి ఇచ్చెను. 'సూర్యప్రభా, ఇప్పుడు మహాప్రభావము లయిన యీ ఓషధులు ఏడు నీకు సిద్ధించినవి.' అని ఆసమయమున ఆకాశవాణి పలికెను. ఆవాణిని విని సూర్యప్రభాదు లందఱు సంతోషించి సుమేర్వాశ్రమమందలి తమ సైన్యము నొద్దకు పోయిరి. అచ్చట సునీథుఁడు సువాసకుమారుని 'మునీ, సూర్యప్రభుని మాని ప్రభాసుని ప్రవేశపెట్టుటకు కారణ మేమి? ఇతనిని గుహలో కింకరులు సత్కరించుటకు కారణ మేమి?' అని యడిగెను. మునికుమారుఁ డిట్లనియె—

## ప్రభాసుని పూర్వచరితము.

ప్రభాసుఁడు సూర్యప్రభునికి అతిహితకారి, అతఁడే ఇతఁడు, వీరికి భేదము లేదు. మఱియు శౌర్యప్రభావములలో

ప్రభాసునికి సముఁడు లేఁడు. ఆగుహ ప్రాగ్జన్మ సుకృతములచేత ఇతనిది. ఇతఁడు పూర్వము ఎవఁడో చెప్పెదను వినుఁడు. నముచి యని పూర్వము దానవశ్రేష్ఠుఁడు ఉండెను. ఆదానవ వీరుఁడు శత్రువునకు సైతము యాచించినవానికి ఇయ్యనిది లేదు. అతఁడు పదివేల సంవత్సరములు పొగ త్రాగి తపము చేసి లోహశిలాకాష్ఠములచే చావ కుండునట్లు బ్రహ్మవలన వరము పొందెను. పిమ్మట అనేక పర్యాయములు దేవేంద్రుని జయించి తఱుమఁ గొట్టెను. అప్పుడు కశ్యపర్షి ఇతనిని ప్రార్థించి దేవతలతో సంధికి ఒడంబఱిచెను. అంతట సురాసురులు వైరము మాని కూడఁ బలికికొని పాలసముద్రమును మందరాద్రితో త్రచ్చిరి. అప్పుడు అచ్యుతాదుల పాలికి లక్ష్మీ ప్రభృతులును, నముచిపాలికి ఉచ్చైశ్శ్రవ మను గుఱ్ఱమును, వచ్చినవి. ఇతర దేవాసురులు వేర్వేఱుగా బ్రహ్మదేవుఁడు ఇచ్చిన వేలువేలు భాగములను సముద్రమునుండి వచ్చిన వస్తువులను గ్రహించిరి. మంథాంతమందు వచ్చిన యమృతమును దేవతలు హరింపఁగా వారికిని అసురులకును ద్వేష మారంభ మాయెను. వెంటనే జరిగిన యుద్ధములో ఏయే యసురులు సురలచే మడిసిరో వారిని ఉచ్చైశ్శ్రవము ఆఘ్రాణించి బ్రదికించు చుండెను. అందువలన దైత్యదానవులు దేవతలకు అజయ్యు లయిరి. అంతట దుఃఖితుఁడై యున్న యింద్రునికి ఏకాంతమందు బృహస్పతి యిట్లు బోధించెను.—'నీకు ఒకటే ఉపాయ మున్నది.

తత్క్షణమే దానిని చేయుము. నీవు పోయి నముచిని ఆ గుఱ్ఱము నడుగుము. శత్రువవైనను నీవు యాచించిన అతఁడు గుఱ్ఱమును ఇయ్యక మానఁడు. ఆజన్మసంచిత మయిన దాతృతాకీర్తిని పోఁగొట్టుకొనఁడు.' గురు విట్లు చెప్పఁగా ఇంద్రుఁడు వెంటనే దేవతలతోఁ గూడ పోయి నముచిని ఆగుఱ్ఱమును యాచించెను. 'నా యర్థి పరాఙ్ముఖుఁ డయి పోఁడు. అందు లోను వాసవుఁడా పోవును? నేను నముచి నై యితనికి గుఱ్ఱ మునా ఇయ్యకుందును? లోకములలో నేను చిరకాలము ఆర్జించి యున్న దాతృతాకీర్తి వాడిపోవు నెడల, నాసిరి యేల ప్రాణ మేల?' అని ఆలోచించి ఆ మహానుభావుఁడు నముచి శుక్రాచార్యులచే నివార్యమాణుఁ డయ్యును ఆ హాయవతం సమును ఇంద్రునికి ఇచ్చెను. హాయమును గ్రహించి విశ్వాస ము పుట్టించి శస్త్రాద్యవధ్యుని నముచిని ఇంద్రుఁడు వజ్రనష్టస్త మయిన గంగాఫేనముతో చంపెను. ఆహా! సంసారములో ఈభోగతృష్ణ! దానివలన ఆకర్షింపఁబడినవారై దేవతలు కూడ అనౌచిత్యాకీర్తులకు భయపడరు! దాని నెఱిఁగి నముచితల్లి దనువు శోకసంతప్తురాలై దుఃఖశాంతి కొఱకు 'అతఁడే నము చియే మరల నాగర్భమున బలవంతుఁడై పుట్టి యుద్ధములో సర్వదేవతలకును అజయ్యుఁడు అగును గాక.' అని సంకల్పము చేసెను. అంత నాయసురుఁడు ఆమె కడుపున సర్వరత్నమ యుఁడై పుట్టి బలయోగముచేత ప్రబలుఁ డని పేర్కొనఁబడెను.

అతఁడును తపస్సుచేసి యాచకులకు ప్రాణములను కూడ ఇచ్చు వాఁడై ఇంద్రుని నూఱుమాఱులు జయించెను. పిమ్మట దేవతలు ఆలోచించుకొని అతనియొద్దకు పోయి 'మాకు పురుష మేధార్థము నీదేహము నిమ్ము' అని యాచించిరి. అతఁడు శత్రువు లయినను వారికి తనదేహము నిచ్చెను. ఉదారులు ప్రాణముల నయినను వదలుదురు గాని పరాఙ్ముఖులను గా యాచకులను వదలరు గదా. అంతట దేవతలు ప్రబలదానవుని ఖండఖండములుగా తెగ నఱికిరి. అతఁడు మరల ఇప్పుడు మనుష్యలోకములో ప్రభాస రూపమున అవతరించి యున్నాఁడు. ఇతఁడు మొదట నముచి, పిమ్మట ప్రబలుఁడు, ఇప్పుడు ప్రభాసుఁడు. ఆపుణ్యప్రభావముచేత శత్రువులకు అజయ్యుఁడు. ఈ యోషధీగుహ ప్రబలునిది, కనుకనే అది యితనిది. కింకర సమేతముగా ఇతనికి వశ్యమై యున్నది. దానిక్రింద పాతాళమందు ప్రబలుని మందిర మున్నది. అందు ఇతని ముఖ్యభార్యలు స్వలంకృతలు పండ్రెండుగురు, వివిధరత్నములు, నానాయుధములు, చింతామణి, లక్షయోధులు, అన్ని గుఱ్ఱములతో ఉన్నారు. అది యంతయు ప్రభాసునిది పురార్జితము, ఈ ప్రభాసుఁడు అట్టివాఁడు. ఇతనియందు ఇది ఏమి యద్భుతము ? ఇట్లు మునికుమారునివలన విని సూర్యప్రభ ప్రభృతులు మయప్రభాస సమేతులై రత్నాదులను తెచ్చుకొనుటకై తత్క్షణమే ప్రబల మందిరమునకు నడవు న దైన బిలమార్గమునకు పోయిరి. ప్రభాసుఁడు ఒక్కఁడే ఆ

మార్గమునఁబోయి, తనపూర్వభార్యలను గ్రహించి, చింతామణిని గుఱ్ఱములను యోధులను సకలధనమును కొని వచ్చి సూర్య ప్రభుని మిగుల సంతోషపెట్టెను. సూర్యప్రభుఁడు అభీష్టసిద్ధి పొందినవాఁడై మయ సునీథ ప్రభాస సుమేరు ప్రభృతులును రాజులును వెంట రా, శీఘ్రముగా తన సేనా సన్నివేశమునకు పోయెను. అచట అసుర నరాధీశ్వరులు తమతమ యిండ్లకు పోఁగా సూర్యప్రభుఁడు మరల రణదీక్షితుఁడై కుశాస్త్తర మందు ఆరాత్రి శేషమును గడపెను.

---

## ౮ - వ తరంగము.

### యుద్ధయాత్ర.

మఱునాఁడు ప్రాతఃకాలమందు సూర్యప్రభుఁడు సుమేరు తపోవనమునుండి సైన్యములతో శ్రుతశర్మమీఁదికి యుద్ధ మునకు వెడలెను. అతని నివాస మయిన త్రికూటాద్రి కడకు పోయి అచటి యతనిబలమును తనబలముచే తఱుమఁగొట్టించి అచట విడిసెను. ఇతఁడు అచట విడిసి సుమేరు మయా దులతోఁ గూడ కొలువు తీఱి యుండఁగా త్రికూటేశునియొద్ద నుండి రాయబారి వచ్చి విద్యాధరేంద్రుఁ డయిన సుమేరు పుతో ననియె:— శ్రుతశర్మ తండ్రి యిట్లు నీకు సందేశించు చున్నాఁడు. 'దూరమం దున్న నీకు మేము సత్కారము చేయ మైతిమి. ఇప్పుడు నీవు మాయింటికి అతిథులతోఁ గూడ

వచ్చితివి. కనుక మీకు ఇపుడు యథోచితముగా ఆతిథ్యము చేసెదము.' ఈ శత్రు సందేశము విని సుమేరువు ఉత్తరము చెప్పెను.—'మంచిది, మావంటియతిథులు మీకు లభింపరు. ఆతిథ్యము పరలోకమందుఁ గాదు, ఈలోకమందే ఫలించును. కనుక మేము సిద్ధముగా నున్నాము. ఆతిథ్యము చేయవచ్చును.' అది విని దూత తన ప్రభువునొద్దకు పోయెను. సూర్యప్రభాదులు ఎత్తునుండి వేర్వేఱుగా విడిసిన తమ సైన్యములను చూచిరి.

## రథాదిప్రవిభాగము.

సునీథుఁడు తన తండ్రి మయాసురుని తమ సైన్యములోని రథాదుల ప్రవిభాగమును చెప్పు మనెను. వల్లె యని సర్వజ్ఞుఁ డయిన యాదానవేంద్రుఁడు వ్రేలితో చూపుచు ఇట్లు చెప్పఁ దొడంగెను.—"ఈసుబాహువు, నిర్ఘాతుఁడు, ముష్టికుఁడు, గోహరుఁడు, ప్రలంబుఁడు, ప్రమాథుఁడు, కంకటుఁడు, పింగళుఁడు, వసుదత్తాదు లయిన యీరాజులును అర్ధరథులు. అంకురి, సవిశాలుఁడు, దండి భూషణ సోమిలులు, ఉన్మత్తకుఁడు, దేవశర్మ, పితృశర్మ, కుమారకుఁడును, హరిదత్తాదులును అందఱును పూర్ణ రథులు. ప్రకంపనుఁడు, దర్పితుఁడు, కుంభీరుఁడు, మాతృపాలితుఁడు, మహాభటుఁడు, ఉగ్రభటుఁడు, వీరస్వామి, సురాధరుఁడు, భండీరుఁడు, సింహదత్తుఁడు, గుణవర్మ, కీటకుఁడు, భీముఁడు, భయంకరుఁడు,—వీరు ద్విగుణరథులు. విరోచనుఁడు, వీరసేనుఁడు, యజ్ఞసేనుఁడు, కుంజరుఁడు,

ఇంద్రవర్మ, శబరుఁడు, క్రూరకర్మ, నిరాసకుఁడు,—ఈరాజ
సుతులు త్రిగుణరథులు. సుశర్మ, బాహుశాలి, విశాఖుఁడు,
క్రోధనుఁడు, ప్రచండుఁడు,—అను నీరాజపుత్త్రులు చతుర్గుణ
రథులు. జుంజరి, వీరవర్మ, ప్రవీరుఁడు, సుప్రతిజ్ఞుఁడు, అమర
రాముఁడు, చండదత్తుఁడు, జాలికుఁడు, సింహభట వ్యాఘ్ర
భట శత్త్రుభటులు ముగ్గురును,—ఈరాజులును రాజపుత్త్రులును
పంచగుణరథులు. ఉగ్రవర్మ యను నీ రాజపుత్త్రుఁడు షడ్గుణ
రథుఁడు. విశాఖుఁడను రాజపుత్త్రుఁడు, సుతంతుఁడు, సుగముండు,
నరేంద్రశర్మ,—అనువీరు సప్తగుణరథులు. సహస్రాయు వను
నీరాజకుమారుఁడు మహారథుఁడు. శతానీకుఁడు మహారథ
యూథపతి. సూర్యప్రభుని వయస్యు లయిన సుభాస హర్ష విమ
లులు, మహాబుద్ధి, అచలుఁడు, ప్రియంకర శుభంకరులు,—అను
వీరు మహారథులు. యజ్ఞరుచి ధర్మరుచులును విశ్వరుచి భాస
సిద్ధార్థులు ముగ్గురును సూర్యప్రభుని మంత్రులు. మహారథ
యూథపతులు ప్రహస్తుఁడు, మహార్థుఁడు, అనుమంత్రులు అతి
రథయూథపతులు. ప్రజ్ఞాఢ్య స్థిరబుద్ధులు రథయూథపతులు.
సర్వదమనుఁడు, ఈ ప్రమథనుఁడు, ధూమకేతువు, ప్రవహణుఁడు,
వజ్రపంజరుఁడు, కాలచక్రుఁడు, మరుద్వేగుఁడు,—వీరు రథాతి
రథపతులు. ప్రకంపనుఁడు, సింహనాదుఁడును రథాతిరథ
యూథపతులు. మహామాయుఁడు, కంబళికుఁడు, కాలకంపన
కుఁడు, ప్రహృష్టరోముఁడు, అను నీనలువురు అసురాధిపతు

లును అతిరథయూథాధిపతులకు అధిపతులు. సర్వసేనానాయకుఁ డయినయీ ప్రభాసుఁడు సూర్యప్రభసమానుఁడు. ఇతఁడును సుమేరుతనయుఁ డైన యీకుంజరకుమారుండును ఇరువురును మహారథ యూథాధిపతి యూథాధిపతులు. వీరును ఇంక ఇతరులును మనబలములో తమతమసైన్యములతో నున్నారు. శత్రుసైన్యములో ఇంకను ఎక్కువమంది యున్నారు. అయినను మనకు మహేశ్వరుఁడు ప్రసన్నుఁడై యుండఁగా మన బలమునకు వారు చాల లేరు."

## సంగ్రామము.

ఇట్లు సునీథునితో మయాసురుఁడు చెప్పుచుండఁగా శ్రుతశర్మతండ్రియొద్దనుండి మఱియొక దూత వచ్చి యిట్లు పలికెను.—"త్రికూటాధిపతి మీకు చెప్పుచున్నాఁడు—'యుద్ధ మన శూరులకు మహోత్సవము గదా. అందులకు ఈ ప్రదేశము ఇఱుకటముగా నున్నది. కనుక ఇటనుండి కలాపగ్రామ మను విశాలప్రదేశమునకు పోదము రండు.' అని." ఈసందేశమును సునీథాదులు విని సరియే యని అందఱును సూర్యప్రభసమేతు లై కలాపగ్రామమునకు పోయిరి. శ్రుతశర్మాదులు కూడ సమరోద్యతు లై విద్యాధరబలాన్వితు లై ఆచోటికే వచ్చిరి. సూర్యప్రభాదులు శ్రుతశర్మబలములో ఏన్గు లుండుటను చూచి తమయేనుఁగుదండును తాము విమానము నెక్కించి తెప్పించుకొనిరి. శ్రుతశర్మసేనయందు సేనాపతి

దామోదరుఁడు మహాసూచివ్యూహమును రచించెను. అందు శ్రుతశర్మయు మంత్రులును పార్శ్వమందు ఉండిరి. అగ్రమందు దామోదరుఁడును ఇతరత్ర ఇతరమహారథులును ఉండిరి. సూర్యప్రభుని సైన్యములో సేనాపతి ప్రభాసుఁడు అర్ధచంద్ర వ్యూహమును రచియించి దానిమధ్యలో తాను నిలిచెను. కుంజరకుమారుఁడును ప్రహస్తుఁడును దానికోణములలోను, సూర్యప్రభ సునీథాదులు అందఱును వెనుకను నిలిచిరి. సుమేరువు సువాసకుమారునితో సమీపమున సుండెను. ఉభయ సైన్యములలోను యుద్ధవాద్యములు వాయించిరి. అంతట లోక పాలసహితుఁడై యింద్రుఁడును ఇతరదేవతలును అప్సరసలు యుద్ధమును చూడవచ్చి ఆకాశమున నుండిరి. పార్వతీసమేతుఁడై విశ్వనాథుఁడు శంకరుఁడును దేవతాగణ భూత మాతృ పరివృతుఁడై వచ్చెను. బ్రహ్మదేవుఁడు కూడ, సావిత్ర్యాదులతోను మూర్తీభవించిన వేద శాస్త్రములతోను సకల మునులతోను వచ్చెను. లక్ష్మీ కీర్తి జయాది దేవులతోఁ గూడి చక్రాయుధము కైకొని పక్షిరాజు నెక్కి విష్ణుమూర్తి వచ్చెను. భార్యలతో గూడ కశ్యపమహర్షియు వచ్చెను. ఆదిత్యులు వసువులు యక్ష రాక్షస నాగేంద్రులు ప్రహ్లాదాద్యసురులును వచ్చిరి. వారితో ఆకాశము నిండి యుండఁగా రెండు సేనలకు శస్త్ర సంపాత దారుణమై మహానాదమైన సంగ్రామము ఆరంభమాయెను. బాణజాలఘనములచే దిక్చక్రము ఆచ్ఛాదితమై అన్యోన్యశర

సంఘర్ష జాతానలతటిల్లతము కాఁగా శస్త్రక్షతగజాశ్వోద్ధుర క్త ధారావపూరితము లై వీరకాయ మహోగ్రాహము లై శోణిత మహానదులు వెల్లిగొను చుండెను. ర క్తములో న ర్తించుచు ఈఁదుచు శబ్దించుచు ఉన్న శూరఫేరవ భూతములకు ఆరణము మహోత్సవముగా నుండెను. లెక్క లేనిసై నికులు చచ్చి, దొమ్మి యుద్ధము శాంతించి, స్వపరసైన్యవిభాగము అగపడ నారం భింపఁగా యుద్ధము చేయుచున్న ప్రతిపక్ష ప్రవీరుల నామములను సుమేరువు సూర్యప్రభాదులకు చెప్పెను. అంతట మొదట సుబాహురాజునకును అట్టహాసుఁడనువిద్యాధరపతికిని ద్వంద్వ యుద్ధ మారంభ మాయెను. చాలసేపు పోరి అట్టహాసుఁడు సుబాహువు శిరమును అర్ధచంద్ర బాణముచే తెగవైచెను. సుబాహువు పడఁగా ముష్టికుఁడు కోపముతో ఎదుర్కొని అట్ట హాసునిచే హృదయమందు బాణహతుఁ డై ధర వ్రాలెను. ముష్టికుఁడు చావఁగా ప్రబలంబుఁ డను రాజు క్రోధముతో అట్ట హాసుని ఎదురుకొని బాణవర్షములో ముంచెను. అట్టహాసుఁడు వానిసైన్యమును కొట్టి, వానిని మర్మదేశములఁ గొట్టి, రథ మందే కూల్చెను. ప్రలంబుఁడు పడుటం జూచి మోహనుఁ డనురాజు అట్టహాసుని పైకొని బాణప్రహారముల ముంచెను. అట్టహాసుఁడు వానికోదండము త్రెంపి సారథిని కొట్టి వానిని దృఢముగా ప్రహరించి కూల్చెను. ఇట్లు అట్టహాసుఁడు నలువురు శత్రువీరులను చంపఁగా చూచి శ్రుతశర్మబలము జయో

త్సాహముచే సింహనాదములు చేసెను. దానిని చూచి సూర్యప్రభునిచెలికాఁడు హర్షుఁడు సైన్యసమేతుఁడై ససైన్యుఁడయిన యట్టహాసునిమీఁదికి పోయి అతనిశరములను తన శరములచే నివారించి సైన్యమును నాశముచేసి సారథిని చంపి రెండు మూఁడు మాఱులు ధనుస్సును విఱుగఁగొట్టి శరములతో అట్టహాసుని శిరమును చీల్చెను. అంతట అట్టహాసుఁడు రక్తము గ్రక్కుచు రథమునుండి నేలఁ గూలెను. అట్టహాసుఁడు కూలునంతటికి ఆ రణములో ఎట్టిక్షోభము కలిగె ననఁగా క్షణములో ఆ బలద్వయము అర్థావశిష్ట మాయెను. అశ్వగజ పదాతులు రణాగ్రమందు నిహతులై కూలి, కబంధములు మాత్రమే లేచుచుండినవి. వికృతదంష్ట్రుఁడను విద్యాధరేశ్వరుఁడు హర్షునిమీఁదికి క్రుద్ధుఁడై వచ్చి బాణవర్షము గురిసెను. హర్షుఁడును వికృతదంష్ట్రుని శర ధ్వజ సారథులను శరములతో ఎగురఁగొట్టి సుందరకుండల మయిన యాతని శిరమును ఖండించెను. వికృతదంష్ట్రుఁడు కూలఁగానే చక్రవాళుఁ డనువిద్యాధరేశ్వరుఁడు కోపముతో హర్షునిమీఁదికి వచ్చి పోరిలో బడలినట్టియు కడమకైదువులు విఱిగినట్టియు హర్షుని కార్ముకములు విఱుగఁగొట్టి తెగటార్చెను. ఆక్రోధముచేత ప్రమాదుఁడను రాజు వచ్చి పోరి చక్రవాళునిచే మడిసెను. అట్లే వాఁడు పిమ్మట ఒక్కొక్కఁడుగా వచ్చిన రాజముఖ్యులను కంకటుఁడు, విశాలుఁడు, ప్రచండుఁడు, అంకురి, యను నలువురను పరిమార్చెను.

దానిని చూచి కోపముతో నిర్ఘాతుఁడనురాజు వాని మీఁదికి పోయెను. ఆచక్రవాళ నిర్ఘాతులు చాలసేపు యుద్ధము చేసి పరస్పర రథములను చూర్ణీకరించుకొని అసిచక్రధరులై పాదచారులై కోపముతో పైకొని కత్తిదెబ్బలతో ఒండొరువుల తలలను చీల్చుకొని నేలఁ గూలిరి. ఆవీరులు కూలినం జూచి రెండుబలములును విషాదము గూటి యుండఁగా కాలకంపనుఁడను విద్యాధరేంద్రుఁడు రణాగ్రమునకు వచ్చెను. ప్రకంపనుఁడను రాజపుత్త్రుఁడు, వాని నెదుర్కొని క్షణములో వానిచే మడిసెను. అతఁడు పడఁగా, జాలికుఁడు, చండదత్తుఁడు, గోపకుఁడు, సోమిళుఁడు, పిత్రృశర్మ, అను నేవురు రాజులు కాలకంపనునిమీఁద బాణప్రయోగముచేసిరి. కాలకంపనుఁడు ఆయేవురను విరథులను చేసి ఒక్కమాఱు ఏవురను నారసముల హృదయమునఁ గొట్టెను. విద్యాధరులు హర్షనాదములు చేసిరి. మనుజాసురులు విషాదము నొందిరి. అంత ఉన్మత్తక ప్రశస్త విలంబక ధురంధరు లను నలువురు రథులు వానిమీఁద ఒక్కపరిగా పోయిరి. వాఁడు వారిని లీలగా చంపివైచి అట్లే పైకొనిన మహాసైన్యసమేతులను తేజికుఁడు, గేయికుఁడు, వేగిలుఁడు, శాఖిలుఁడు, భద్రంకరుఁడు, దండి, యను నాలుగురు రథులను నాశము చేసెను. మరల అట్లే వచ్చిన యేవురను భీమ భీషణ కుంభీర వికట విలోచను లను వీరులను గూల్చెను. కాలకంపనుని యీ యుద్ధమును చూచి సుగుణుఁ డను రాజపుత్త్రుఁడు

వానిని ఎదుర్కొనెను. ఉభయులును పోరి హతసారథు లై విరథు లయిరి. పాదచారిని సుగుణుని కాలకంపనుఁడు పాద చారి యై ఖడ్గయుద్ధమున నేలఁ గూల్చెను.

అత్తఱి విద్యాధరులతో నరులకు యుద్ధము అసంభావ్య మని ఖిన్నుఁడుంబోలె సూర్యుఁడు అస్త మొందెను. రక్తాంబు పూరభరిత మైన రణాంగణము మాత్రమే గాక సంధ్యాకృత పద మై యాకాశము కూడ ఎఱ్ఱ నాయెను. కబంధములతో భూతములు సంధ్యానృత్య మారంభింపఁగా వారు యుద్ధము నిలిపి శిబిరములకుఁ బోయిరి. ఆదినము శ్రుతశర్మబలములో ముగ్గురు వీరులు నిహతు లయిరి. సూర్యప్రభుని బలములో ముప్పదిముగ్గురు వీరులు నిహతు లయిరి. బాంధవమిత్త్రాదులు అట్లు యుద్ధములో మడిసినందులకు విషణ్ణుఁడై సూర్యప్రభుఁడు ఆరాత్రిని అంతఃపురములు లేక నిద్ర లేక మంత్రులతోఁగూడ యుద్ధప్రస్తావమే చేయుచు మరల యుద్ధమునకు ఉద్యమించుచుఁ గడపెను.

## సూర్యప్రభుని పత్నుల సల్లాపములు.

అతనిభార్యలును బంధునాశ దుఃఖిత లై ఒకచోఁగూడి ఒకరి నొకరు ఓదార్చుచుండిరి. రోదనావసర మయినను నానా విధ కథలు చెప్పుకొను చుండిరి. స్త్రీలు తమనగరకథలు చెప్పని క్షణము ఉండనే ఉండదు గదా. ఆప్రసంగములో ఒక రాజ పుత్త్రి 'ఆశ్చర్యము ఇప్పుడు ఆర్యపుత్త్రుఁడు అంగన లేక ఎట్లు

పరభార్యలను కోరరు. ఆర్యపుత్త్రునియందు ఈ దోషము లేదు. మనకు ఈర్ష్య యును తగదు.' ఇట్లు మనోవతి పలుకఁగా మదనసేనాది సూర్యప్రభాంగనలు అట్లే వేఱు వేఱు కథలు చెప్పిరి. అంతట వారు అతిరసముచే ఒకరికొకరు సురత కార్య తంత్రములను గూడ ఉపదేశించిరి; ప్రసంగమిళిత లై కథావసర సక్తచిత్త లైన స్త్రీలు ఒండొరువ్రులకు వెడలఁ గ్రక్కనిది యొకటి యుండునా? పిమ్మట రాణివాసములకు ఆ దీర్ఘకథలును, శత్రుబల విజయార్థము చీఁకటి విరియువేళను ఎదురు సూచుచున్న సూర్యప్రభునికి ఆరాత్రియు, ఎట్టకేలకు తుద ముట్టినవి.

---

## ౫ - వ తరంగము.

### ప్రభాసుని యుద్ధము.

మఱునాఁడు ప్రాతఃకాలమున సూర్యప్రభాదులును శ్రుతశర్మాదులును సబలు లై సన్నద్ధు లై యుద్ధక్షేత్రమునకు వచ్చిరి. మరల ఇంద్రాదులు బ్రహ్మ విష్ణు రుద్రులు సురాసురులు యక్షోరగ గంధర్వులును యుద్ధము సూడ వచ్చిరి. శ్రుతశర్మ బలములో దామోదరుఁడు చక్రవ్యూహమును రచియించెను. సూర్యప్రభుని బలములో ప్రభాసుఁడు వజ్రవ్యూహము చేసెను. అంతట ఇరువాగునను తూర్యారావములచేతను సుభటసింహా

నాదములచేతను దిక్కులు చెవుడ్పడునట్లు యుద్ధ మారంభ మాయెను. శస్త్రహతు లైన శూరులు తన మండలమును రంధ్రము చేయుదు, రను భయముచేతనుం బోలె సూర్యుఁడు బాణ జాలము చాటున దాఁగెను. దామోదర కృత చక్ర వ్యూహమును అన్యాభేద్యమును ప్రభాసుఁడు సూర్యప్రభాజ్ఞ చే భేదించి చొచ్చెను. ఆవ్యూహచ్ఛిద్రమును దామోదరుఁడు స్వయముగా ఆవరించి నిలిచెను. వారితో ప్రభాసుఁడు ఒకఁడే యుద్ధము చేసెను. అతఁడు ఏకాకిగా పరవ్యూహములో చొచ్చి యుండుట చూచి సూర్యప్రభుఁడు అతనివెంట ప్రకంపనుఁడు, ధూమకేతుఁడు, కాలకంపనకుఁడును, మహామాయుఁడు, మరు ద్వేగుఁడు, ప్రహస్తుఁడు, వజ్రపంజరుఁడు, కాలచక్రుఁడు, సింహ నాదుఁడు, కంబళుఁడు, వికటాక్షుఁడు, ప్రవహణుఁడు, కుంజర కుమారుఁడు, అసురాధిపసత్తముఁడయిన ప్రహృష్టరోముఁడు,- అను పది యేవురు మహారథులను పంపెను. ఆ మహారథు లందఱు అతివేగమున ఆ వ్యూహద్వారమునకుఁ బోయిరి. అచట దామోదరుఁడు ఒక్కఁడే ఆ పదు నేవురతోఁ బోరి అపూర్వ పౌరుషమును ప్రకటించెను. దానిని చూచి యింద్రుఁడు ప్రక్క నున్న నారదమునితో ని ట్లనియె:—

'ఈ సూర్యప్రభాదు లందఱు అసురావతారములు. శ్రుతశర్మ నా యంశమువాఁడు. ఈ విద్యాధరేశ్వరు లందఱు దేవాంశమువారు. కనుక మహామునీ, యుక్తిగా ఈయుద్ధము

అంతట విద్యుత్ప్రభుఁ డనువాఁడు కాలంజరగిరీశ్వరుఁడు క్రోధముతో ప్రభాసునితో యుద్ధము చేసెను. ప్రభాసుఁడు వాని మహాధ్వజమును ఛేదించి వాని విండ్లను మరల మరల క్రొత్తగా ఎన్నింటిని కైకొనినను అన్నింటిని నాశము చేసెను. అంతట విద్యుత్ప్రభుఁడు లజ్జితుఁ డై మాయచే అదృశ్యుఁ డై ఆకాశమున కెగసి ప్రభాసునిమీఁద ఖడ్గగదాదులను వర్షించెను. ప్రభాసుఁడును వాని యాయుధ పరంపరను తన యస్త్రములచేత ఎగురఁ గొట్టి ప్రకాశనాస్త్ర మేసి ఆ విద్యాధరుని అగపడునట్లు చేసెను. ఆగ్నేయాస్త్రము ప్రయోగించి దానిజ్వాలచే కాలిపోయిన విద్యుత్ప్రభుని ఆకాశమునుండి భూమిమీఁదఁ గూల్చెను. అది చూచి శ్రుతశర్మ 'చూడుఁడు, ఇతఁడు ఇద్దఱను మహారథ యూథ పతులను సంహరించి నాఁడు! ఏల యూరకున్నారు? అందఱును కలిసి ఇతనిని చంపుఁడు.' అనెను. ఆమాటచే ఎనమండుగురు రథికులు క్రోధముతో ప్రభాసుని చుట్టుకొనిరి. ఒక్కఁడు వంకటకాద్రి నివాసి రథయూథపతి ఊర్ధ్వరోముఁ డనువేరి విద్యాధరపతి. ధరణీధరశైలాధిపతి వికోశనుఁ డను విద్యాధరరాజు రెండవ మహారథుఁడు. మూఁడవవాఁడు ఇందుమాలి లీలాపర్వతవాసి వీరుఁడు అతిరథయూథపతి విద్యాధరరాజు. మలయాచల నివాసి కాకాండకుఁ డను రథయూథపతి విద్యాధరరాజు నాలవవాఁడు. నికేతపర్వతాధిపతి దర్పవాహుఁడు అయిదవ

వాఁడు. ఆఱవవాఁడు ధూర్తవయసుఁడు అంజనగిరీశ్వరుఁడు. యిరువురు విద్యాధరులును అతిరథయూథపతులు. ఏడవవాఁడు గాడిదలతేరివాఁడు వరాహస్వామి యను పేరివాఁడు కుముద పర్వతరాజు మహారథయూథపతి. అట్టివాఁడే దుందుభి పర్వత రథుఁడు మేధావరుఁడు ఎనిమిదవవాఁడు. ఈయెనమండ్రును వచ్చి, బాణములు వైవఁగా వానిని ఎగురఁగొట్టి ప్రభాసుఁడు ఒక్క మాఱుగానే ఆయందఱను బాణములం గొట్టెను. ఒకనియశ్వములను, ఒకనిసారథిని, ఒకనికేతువును, ఒకనిధను స్సును, ప్రభాసుఁడు కొట్టెను. మేధావరుని నాలుగుబాణముల హృదయమునఁ గొట్టి తత్క్షణమే ప్రాణము లెడలించి నేలం గూల్చెను. పిమ్మట ఇతరులతో పోరుచునే ప్రభాసుఁడు నడి నెత్తిమీఁద నిలువుగా తలవెండ్రుకల నెత్తి ముడిచికొనియున్న యూర్ధ్వరోముని శిరస్సును ఒక యంజలిక బాణముచే హరిం చెను. మిగిలిన యార్వురను ఒక్కొక్కభల్లముతో కంఠములను అశ్వములను సారథినిఁ గొట్టి మడియించెను. అంత ప్రభాసుని శిరమున దివినుండి విరులవాన గురిసెను. అసురమనుజులు సంతసిల్లిరి, విద్యాధరులు వెల వెలఁ బోయిరి.

పిమ్మట శ్రుతశర్మ కాచరకుఁ డను కురండకగిరీశ్వరుని, పంచకాద్రిసమాశ్రయుఁడైన దిండిమాలిని, జయపురాచల రాజయినవిభావసుని, భూమితుండకాధీశ్వరుఁ డయిన ధవళుని, ఈనలువురు మహారథులను బంపెను. ఆధనుర్ధరులు ప్రభాసుని

అడ్డగించిరి. ఆ మహారథయూథాధిపతులు ప్రభాసునిపై నొక్కు మ్మడి అయిదేసివందలబాణములను ప్రయోగించిరి. ప్రభాసుఁడు వరుసగా అవలీలగా వీరిలో నొక్కొక్కనికిని ధ్వజమును ధనుస్సును సారథిని ఒక్కొక్క బాణముతోను, గుఱ్ఱములను నాలుగింటితోను, శిరమును ఒక్కొక్క బాణముతోను, తెగనేసెను. ఇట్లు ఒక్కొక్కని ఎనిమిదేసి బాణములఁ దెగటార్చి ప్రభాసుఁడు సింహనాదము చేసెను. అంతట విద్యాధరులు మరల శ్రుతశర్మాజ్ఞచే నలుఁవురు వచ్చిరి. ఒకఁడు కువలయశ్యాముఁడు విశ్వావసువు భార్యయందు బుధునివలనఁ గలిగినవాఁడు భద్రంకర నాముఁడు. రెండవవాఁడు నియంత్రకుఁడు జంభకుని భార్యయందు బంగారకునివలనఁ బుట్టినవాఁడు అగ్నిసమానతేజుఁడు. మూఁడవవాఁడు కాలకుఁడు దామోదరుని భార్యయందు శనైశ్చరునివలనఁ బుట్టినట్టివాఁడు నల్లనివాఁడు కపిలకేశుఁడు. చంద్రునిభార్యయందు బృహస్పతి గ్రహమువలనఁ బుట్టినవాఁడు బంగారుచాయవాఁడు విక్రమశక్తి యను పేరివాఁడు నాలవవాఁడు. ఇందు మొదటిముగ్గురు అతిరథ యూథాధిపతి యూథపతులు నాలవవాఁడు మహావీరుఁడు వారికన్నను పరాక్రమవంతుఁడు. వారు ప్రభాసునితో దివ్యాస్త్రములతో బోరఁ దొడఁగిరి. ఆయస్త్రములను ప్రభాసుఁడు నారాయణాస్త్రముచే నివారించి వారిలో ఒక్కొక్కనిధనువును ఎనిమిదేసి మాఱులు తెగఁగొట్టినవాఁడై, యీఁటె గద మొదలుగా వారు వేసిన

నై దువులను గొట్టి, గుఱ్ఱములను సారథిని గూల్చి వారిని విర థులను చేసెను. దానిని చూచి శ్రుతశర్మ కేతుమాలేశ్వరుని భార్యయందు అశ్వి దేవతవలనఁ బుట్టిన దమనియములు నిరు వురకు, విక్రమ సంక్రమ పరాక్ర మాక్రమ సమ్మర్దన మర్దన ప్రమర్దన విమర్దనులను ఎనమండుగురను మకరందునికి క్షేత్రజు లయిన అష్టవసుపుత్త్రులను, ఈ పదుగురను రథయూథాధిప యూథాధిపతులను విద్యాధరేశ్వరులను త్వరగా పంపెను. వీరు వచ్చునప్పటికి మొదటినలువురు వేఱుతేరుల నెక్కిరి. కలసి బాణములు వర్షించుచున్న యీ పదునలువురతో ప్రభాసుఁడు బెదరు లేక ఒంటరిగా చిత్రయుద్ధము చేయు చుండెను.

అంత సూర్యప్రభుని యాజ్ఞచే ధవళ శ్యామ లాకారు లయిన కుంజరకుమార ప్రహస్తులు ఆయుధములు దాల్చి ఎగిరి ఆకాశమార్గమున అపరరామకృష్ణులో యన ప్రభాసునియొద్దకు వచ్చిరి. ఆయిరువురును పదాతు లయ్యును దమనియములను చాపములు కొట్టి సారథులను చంపి వ్యాకులపెట్టిరి. భయముచే దమనియములు ఆకాశమున కెగురఁగా కుంజరకుమార ప్రహ స్తులును ఆయుధపాణు లై తాము మింటి కెగసిరి. దానిని చూచి సూర్యప్రభుఁడు వేగముగా మహాబుద్ధి చలద్బుద్ధు లనెడి తనమంత్రులను వారికి ఇరువురకును సారథులనుగా పంపెను. మాయచేత అదృశ్యు లయిన యా దమనియములను ప్రహస్త కుంజరకుమారకులు సిద్ధాంజన ప్రయోగముచేత

కనిపట్టి బాణసమూహములతోఁ గొట్టఁగా ఆ యిరువురును పాఱి పోయిరి. ప్రభాసుఁడు కడమ పండ్రెండుగురతోను పోరుచు వారివిండ్లను క్రొత్తవానిని పల్మాఱు చేకొన్నను కొట్టివైచెను. ప్రహస్తుఁడు వచ్చి ఆ శత్రువుల సారథులను ఒక్కమాటే చంపెను. కుంజరకుమారుఁడు వారి గుఱ్ఱములను కూల్చెను. అంతట ఆ పండ్రెండుగురు విరథు లై ఆమువ్వురువీరుల ధాటికు ఓర్వలేక యుద్ధమునుండి పాఱిపోయిరి.

అంతట శ్రుతశర్మ దుఃఖక్రోధలజ్జావిష్టుఁ డై యిద్దఱను రథాతిరథయూథపతులను విద్యాధరులను పంపెను. ఒకఁడు చంద్రకులాద్రీంద్ర రాజుభార్యయందు చంద్రునికి పుట్టినవాఁడు అపరచంద్రుఁడో యనఁ దగు నందగాఁడు చంద్రగుప్తనాముఁడు. ఇతరుఁడు ధురంధరాచలాధీశుని భార్యయందుఁ దనకే పుట్టిన వాఁడు తనమంత్రి మహాతేజస్కుఁడు నగరంగమనాముఁడు. వీరును బాణసమూహమును ప్రయోగించి క్షణములో విరథీకృతు లయి ఆ ప్రభాసాదులతో యుద్ధము మాని పాఱిపోయిరి. అంతట మనుజాసురులు హర్షకోలాహలము చేయుచుండఁగా శ్రుతశర్మ స్వయముగా నలువురు మహారథులను వెంటఁగొని వచ్చెను. వారిపేరులు వరుసగా మహౌఘుఁడు, ఆరోహణుఁడు, ఉత్పాతుఁడు, నేత్రవంతుఁడు. వారు క్రమముగా త్వష్టకు, భగునికి, అర్యమునికి, పూషకును మలయాద్యద్రినాథు లయిన చిత్రపాదాది విద్యాధరరాజుల భార్యలయందుఁ బుట్టినవారు

మహాపరాక్రమశాలులు. కోపాంధుఁ డయిన యా శ్రుతశర్మ తోడి యాయైదుగురతోను ప్రభాసాదులు ముప్వురును పోరిరి. వారు పరస్పరము ప్రయోగించు బాణసమూహము ఆకాశములో రణలక్ష్మికి ఎండ వేఁడిమి నివారించుటకై కట్టిన మేలుకట్టువలె నుండెను. అంతట పూర్వము విరథు లయి పాఱిపోయిన విద్యాధరులును వచ్చి కలసిరి. అట్లు ప్రభాసాదులను ముప్వురను శ్రుతశర్మాదు లనేకులు మాఱ్కొనఁగా చూచి సూర్యప్రభుఁడు ప్రభాసాది సాహాయ్యార్థము మహారథు లైన వీరసేన శతానీకాది వీరులను రాజకుమారులను ప్రజ్ఞాఢ్యసహితులను మిత్త్రులను భూతాసనవిమానములో ఆకాశమార్గమున పంపెను. ఆధనుర్ధరు లందఱును రథము లెక్కఁగా మిగిలిన విద్యాధరేంద్రులును శ్రుతశర్మయొద్దకు వచ్చిరి. ప్రభాసాదులతోఁ గలసిన వీరసేనాదివీరులకును విద్యాధరేశ్వరులకును మహాసైన్యక్షయావహ మయిన మహాయుద్ధము ఆరంభ మాయెను. అచట రెండుసేనలలోను ద్వంద్వయుద్ధములు జరిగి మానుషాసురఖేచరులు అనేకులు మడిసిరి. వీరసేనుఁడు ధూమ్రలోచనుని సానుచరుని కూల్చెను. వీరసేనుఁడును హరిశర్మచే విరథీకృతుఁ డాయెను. విద్యాధరవీరుఁడు హిరణ్యాక్షుఁడు అభిమన్యునిచే చచ్చెను. అభిమన్యుని, హరిభటుని, సునేత్రుఁడు చంపెను. సునేత్రుని ప్రభాసుఁడు శిరశ్ఛేదము కావించెను, జ్వాలామాలియు

మహాయువును ఒండొరువులచే మడిసిరి. జంబీరకుఁడును నీరస కుఁడును ఖర్వుఁడును ఉగ్రవిక్రముఁ డయిన సుశర్ముయు భుజ ములు తెగిపోఁగా దంతములతో కఱచుచుం బోరిరి. శత్రు భట వ్యాఘ్రభట సింహభటు లనెడు ముగ్వురును ప్రవహణుఁ డను విద్యాధరరాజుచేత మడిసిరి. సురోహవిరోహు లిరువురును ప్రవహణుని కూల్చిరి. శ్మశానవాసి యగు సింహబలునిచే వా రిరువురుం గూలిరి. ప్రేతవాహనుఁ డగు సింహబలుఁడు, కపిల కుఁడు, చిత్రాపీడుఁడు, జగజ్జ్వరుఁడు, కాంతాపతి, సువర్ణుఁడు, కామఘనుఁడు, క్రోధపతి, బలదేవుఁడు, విచిత్రాపీడుఁడు, అను పదుగురను రాజపుత్త్రుఁడు శతానీకుఁడు పరిమార్చెను.

ఇట్లు విద్యాధరవీరులక్షయమును చూచి క్రుద్ధుఁడై శ్రుతశర్మ స్వయముగా శతానీకుని మీఁదికి పోయెను. వారికి సాయంకాలమువఱకు మహాసైన్యక్షయకర మైన యుద్ధము దేవతలకుం గూడ ఆశ్చర్యకరముగా జరిగెను. నూర్లకొలఁదియు మొండెములు ఎల్లయెడల లేచి సంధ్యానృత్తోత్సవాగమమున భూతములకు ఆలంబము లయినవి. సాయంకాలము కాఁగా యుద్ధము మాని బహుసైన్యవినాశముచే దిగులుపడి బంధు మరణ శోకార్తు లై విద్యాధరులును, జయోత్సాహవంతులై మర్త్యాసురులును, తమతమ శిబిరములకుఁ బోయిరి.

ఆసమయమున ఇద్దఱు విద్యాధరేశ్వరులు రథయూథ పాధిపతులు శ్రుతశర్మపక్షము వదలి వచ్చి సుమేరు నివేదితులై

సూర్యప్రభుని దర్శించి ప్రణమిల్లి యిట్లనిరి.— దేవా. మేము మహాయాన సుమాయు లనువారము ఇద్దఱమును, మూఁడవ వాఁడు సింహబలుఁడును, మహాశ్మశానాధిపతిత్వ సిద్ధులము. ఇతర విద్యాధరేంద్రులకు అధర్షణీయులము. మేము శ్మశానములో సుఖముగా కూర్చుండి యుండఁగా మాయొద్దకు ఒకనాఁడు శరభానన యని సదా ప్రసన్నురాలును దివ్యమహాప్రభావయు నైన యోగిని వచ్చెను. 'నీ వెక్కడ నుంటివి? ఏమి విశేషము అచట చూచితివి? చెప్పుము భగవతీ.' అని మేము ప్రణమిల్లి యడుగఁగా, ఆమె యిట్లు చెప్పినది.—"నా ప్రభువును మహాకాలదేవుని చూచుటకు యోగినులతోఁ గూడ పోయి యుంటిని. అచట బేతాళపతి యొకఁడు నేను చూచుచుండఁగా దేవునితో నిట్లు విన్నపించెను.—'దేవా, విద్యాధరేశులచేత మడిసిన మామహాసైన్యపతి యగ్నికుని కొమారితను మహార్ఘరూపను తేజఃప్రభుఁ డనువాఁడు ఆకస్మికముగా హరించి కొని పోవుచున్నాఁడు. ప్రభూ, ఆమె విద్యాధరచక్రవర్తి పత్ని యగు నని సిద్ధులు వక్కాణించి యున్నారు. కనుక ప్రభూ, చాలదూరము బలాత్కారమునఁ గొనిపోక ముందే ఆమెను విడిపించి కాపాడుము.' ఇట్లు బేతాళుఁడు మొఱపెట్టగాఁ దేవుఁడు 'పొండి, ఆమెను విడిపింపుఁడు.' అని మమ్ము ఆజ్ఞాపించెను. మేమును ఆకాశమార్గమునఁ బోయి ఆమెను చూచితిమి. 'చక్రవర్తి శ్రుతశర్మకొఱకు ఆమెను కొనిపోవుచున్నాను.'

అని పలుకుచున్న తేజఃప్రభుని మాశక్తిచే స్తంభింపఁజేసి, ఆమెను తెచ్చి మహాకాలప్రభువునొద్ద సమర్పించితిమి. ఆయన ఆమెను స్వజనమునకు ఒప్పగించెను. ఈ యద్భుతమును చూచితిని. అంతట అచట కొన్నిదినము లుండి దేవునికి సమస్కరించి యిచటికి వచ్చితిని." ఆమె ఇట్లు చెప్పఁగా 'ఎవఁడు విద్యాధర చక్రవర్తి యగును ? నీవు సర్వమును ఎఱుఁగుదువు గదా చెప్పుము.' అని మేము అడిగితిమి. 'సూర్యప్రభుఁడు అగును.' అని ఆమె పలుకఁగా, ఈసింహబలుఁడు మాతో ననియె.—'ఇది యసత్యము. దేవతలు ఇంద్రునితోఁ గూడ శ్రుతశర్మపక్షమున నడుము కట్టుకొని యున్నారు.' ఆమాటకు ఆమె మా యిరువురతో అనియె—'త్వరలోనే సూర్యప్రభునికి శ్రుతశర్మకును యుద్ధ మగును, అందులో మీరు చూచుచుండఁగానే యీ సింహబలుఁడు మనుష్యునిచే మడియును; ఆతార్కాణమును చూచి నా యీమాట సత్య మని యెఱుఁగుదురు.' ఇట్లు చెప్పి ఆయోగిని పోయెను. ఆదినములు పోయినవి. ఇప్పుడు ప్రత్యక్షముగా చూచితిమి;ఏమనఁగా, మర్త్యునిచే సింహబలుఁడు మృతిఁ బొందుట. ఆనమ్మకముచే నీవే సర్వవిద్యాధరచక్రవర్తి వని నిశ్చయించుకొని మేము నీపాదసరోజయుగ్మము నాశ్రయించి నీశాసనములో నున్నారము.—

ఇట్లు ఆమహాయాన సుమాయకులు పలుకఁగా సూర్య ప్రభుఁడు మయాదిసమేతుఁడై నమ్మి యథార్థముగా సమ్మతిం

చెను. దానిని విని మిక్కిలి భయపడుచున్న శ్రుతశర్మను ఇంద్రుఁడు విశ్వావసువుచేత 'ధైర్యముతో నుండుము. నేను రేపు ప్రాతఃకాలమున సకల దేవసమేతుఁడనై నీకు యుద్ధములో సాహాయ్యము చేసెదను.' అని దూత్యమును పంపి ఓదార్చెను. సూర్యప్రభుఁడు పరబలములో భేదమును, యుద్ధములో శత్రుపక్షముయొక్క క్షయమును, చూచినవాఁడై సంతోషించి ఆరాత్రి మునుపటివలె తన కాంతలను గూడక మంత్రులతోఁ గూడ శయన మంగీకరించెను.

---

## ౬ - వ తరంగము.

---

### గుణశర్మ కథ.

ఆరాత్రి సూర్యప్రభుఁడు కాంతావిరహితుఁడై రణోన్ముఖుఁడై శయనించి నిద్ర రాక వీతభీతి యనుసచివుని పిలిచి చిత్తవినోదనార్థమై సత్త్వపరాశ్రిత మగు నొక్క యపూర్వకథను చెప్పుమని యడిగెను. వీతభీతి ఈకథ చెప్పెను.

ఈ పృథివికి సుగుణములచేఁ గూర్పఁబడిన యశేష రత్నములతో నిండిన యలంకృతి ఉజ్జయిని యనుపురి కలదుగదా. అందు గుణిప్రియుఁడు కళైకనిలయుఁడు సూర్యేందూభయరూపధరుఁడు నగు మహాసేనుఁ డను రాజు ఏలుచుండెను. అతనికి ముల్లోకములందు సాటి లేనిరూపవతి ప్రాణప్రియ యశోకవతి

యను దేవి యుండెను. ఆమెతోఁగూడ రాజ్య మేలుచున్న యామహాసేనరాజునొద్ద గుణశర్మ యను నొక బ్రాహ్మణుఁడు మాన్యుఁడు ఉండెను. అతఁడు శూరుఁడు, అతిసుందరుఁడు, వేదవిద్యాపారంగతుఁడు, యౌవనవంతుఁడు, కళాశస్త్రాస్త్ర విదుఁడు, ఆరాజును ఎప్పుడును గొలుచుచుండెను. ఒకనాఁడు అంతఃపురమందు నృత్తప్రస్తావమున రాజును రాణియు ప్రక్క నున్న గుణశర్మతో 'నీవు సర్వజ్ఞుఁడవు, మాకు కుతూహలముగా నున్నది, నర్తింపనేర్తువేని దయచేసి మాకు నీకౌశలము చూపుము.' అనిరి. గుణశర్మ నవ్వుచు 'నేర్తునుగాని, ఆనృత్తము సభకు పనికి రాదు, అది ప్రాయికముగా నవ్వు పుట్టించునట్టి మూఢనృత్తముగా శాస్త్రనిందితముగా నుండును. అందును రాజునెదుటను రాణియెదుటను! సీ! ఎంత లజ్జ!' అనెను. రాణి కుతూహలముచే ప్రేరింపఁగా రాజు 'ఇది రంగభూమియందలి నృత్తము గాదు, అది పురుషునికి లజ్జాకరము గాని ఇది గాదు, ఇది ఏకాంతమందు మిత్రగోష్ఠిలో తననేర్పును చూపుట. నేను నీకు రాజను గాను, నీవు స్వతంత్రుఁడవు, నా చెలికాఁడవు, నీ నృత్త కౌతుకము చూడక నేఁడు నేను భుజింపను.' అనెను. ఇట్లు రాజు పట్టు పట్టఁగా ఆ బ్రాహ్మణుఁడు అంగీకరించెను. కింకపట్టువాఁ డయిన దొరమాటను భృత్యులు ఎట్లు మీఱఁ గలరు? అంతట ఆపడుచువాఁడు గుణశర్మ అవయవములతో నాడిన దెల్ల రసావేశముచేత రాజును రాణియు మనస్సులో

ఆడుచుండిరి. దానిచివర రాజు గుణశర్మ చేతికి వీణ యిచ్చి వాయింపు మనెను. గుణశర్మ సారణను మీటి రాజుతో 'దేవా, ఈవీణ పనికి రాదు. మఱి యొకటి తెప్పింపుము, దీని యీ తంత్రిలో కుక్కవెండ్రుక ఉన్నది. తంత్రీఝంకారలక్షణముల చేత దీనిని నే నెఱుఁగుదును' అని పలికి ఆవీణను తొడమీఁది నుండి తొలఁగఁబెట్టెను. అంతట రాజు ఆతంత్రిని తడిపి విప్పి చూడఁగా దానికడుపునుండి కుక్కవెండ్రుక బయట వచ్చినది. అందులకు ఆశ్చర్యపడుచు అతని సర్వజ్ఞతను కొనియాడుచు రాజు మరియొకవీణను తెప్పించెను. విప్రుఁడు త్రిమార్గగయు ఓఘసుభగయు కర్ణపావన నిస్వనయు నై గంగనుంబోని యా వీణను వాయించుచు పాడెను. ఆశ్చర్యమగ్నులయిన రాజునకును రాణికిని అతఁడు పిమ్మట వరుసగా శస్త్రాస్త్రవిద్యాకౌశలమును గూడ చూపెను. రాజు అతనిని 'బాహుయుద్ధ మెఱుఁగుదువేని చేత ఆయుధము లేక ఒకబంధకరణమును చూపుము' అని యడిగెను. 'దేవా, శస్త్రములు చేతఁ బూనుము, నన్ను వరుసగా కొట్టుము. చూపెదను బంధకరణమును.' అని గుణశర్మ చెప్పెను. పిమ్మట రాజు ఏయే ఖడ్గాద్యాయుధములను కైకొని ప్రహరించుచుండెనో వాని నెల్ల బంధకరణముచే అపహరించి యపహరించి గుణశర్మ తాను గాయపడక రాజుయొక్క చేతిని దేహమును కట్టివైచెను. అంత రాజు సర్వాతిశాయి

గ్గైన యాద్విజోత్తముని తనకు రాజ్యనిర్వాహమందు తోడ్పడఁ గలవానినిగా తలంచి స్తుతించి బహుమానించెను.

రాణి అశోకవతి అతని యసదృశరూపమును ఆగుణములను చూచి అతనిపై మరులుకొని 'ఇతనిని పొందనయేని నాజీవిత మేల?' అని యాలోచించి యుక్తి పన్ని రాజుతో ననియె. 'ఆర్యపుత్త్రా, దయచేసి గుణశర్మను నాకు వీణావాదనము నేర్పు మని యాజ్ఞాపింపుము. ఇతని యీవీణావాదనకౌశలమును చూడఁగా నాకును ఆ కళయందు ప్రాణాధికప్రియ మయిన కుతూహలము పొడముచున్నది.' ఆప్రార్థన విని రాజు గుణశర్మను దేవికి వీణావాదనము నేరుపు మని నియమించెను. 'తమయాజ్ఞ, మంచిదినము చూచికొని ఆరంభించెదను.' అని గుణశర్మ సెలవు పుచ్చుకొని యింటికి పోయెను. రాణిదృష్టి వేఱువిధముగా నుండుటం గనిపట్టి శంకించి అనేకదినములు వీణారంభము చేయకయే కాలము గడపుచుండెను.

ఒకనాఁడు మహాసేనరాజు భోజనము చేయుచుండఁగా చెంత నున్న గుణశర్మ కూర వడ్డించుచున్న వంటవానిని 'వలదు వల' దని నివారించెను. ఏ మని రాజడుగఁగా సర్వజ్ఞుఁడు ఆ గుణశర్మ 'దేవా, యీకూరలో విష మున్నది. లక్షణముల చేత నాకు తెలిసినది. వీఁడు దీనిని వడ్డించునపుడు భయముచే వణఁకుచు బెదరుచూపుల నాముఖమును చూచినాఁడు. ఎవరికైన దీనిని పెట్టినయెడల ఇప్పుడే ఈవిషయము బయల్పడును. నేను ఆవిషదోషమును పోఁగొట్టెదను.' అని పలికెను. అంతట

రాజు ఆవంటవానిచేతనే ఆకూర తినిపించెను. వాఁడును వెంట
నే మూర్ఛితుఁ డాయెను. గుణశర్మ మంత్రములచే వానివిష
దోషమును పోఁగొట్టఁగా రాజడుగఁగా సూపకారుఁడు ఉన్న
మాట ఉన్నట్టు ఇట్లు చెప్పెను:—'దేవా, నన్ను మీవైరి
గౌడరాజు మీకు విషము పెట్టు మని యిచటికిఁ బంపి
నాఁడు. నేను పరదేశిని వంటనేర్పరిని అయి, నన్ను ఏలినవారికి
తెలుపుకొని బానసంబున కొలువు కుదిరితిని. ఇప్పుడు కూరలో
విషము పొదిగి తమకు పెట్టుచుండఁగా ఈ మహాత్ముఁడు కని
పట్టినాఁడు. పై సంగతి తమకే విశదము.' ఇట్లు పలికిన యా
సూదుని దండించి రాజు ప్రాణదాతయైన గుణశర్మకు ప్రీతితో
వేయి గ్రామములు ఇచ్చెను.

మఱునాఁడు మరల రాణి నిర్బంధము చేయఁగా రాజు
గుణశర్మచే వీణావాదనశిక్షను ఆరంభింపించెను. గుణశర్మ వీణ
నేర్పుచుండఁగా అశోకవతి సదా విలాసహాసాదులు కావించు
చుండెను. ఒకనాఁడు ఆమె మదనాతుర యై ఏకాంతమున
అతనిని మాటిమాటికి గోళ్లతోఁ బొడుచుచుండెను. వారించు
చున్న యా ధీరునితోఁ 'ఓయిచెలువుఁడా, వీణావాదనమిషచే
సుందరుని నిన్ను నేను కవయఁ గోరితిని. నీపై పట్టరాని
మోహమున బడలు చున్నదాన, నన్ను నీవు స్వీకరింపుము.'
అని వేఁడుకొనెను. 'ఇట్లు చెప్పకు, నాకు నీవు ప్రభుభార్యవు.
నాబోఁటివాఁడు ప్రభుద్రోహము చేయఁడు. ఈసాహసము

మానుము.' అని గుణశర్మ పలికెను. 'ఓరి నీరసుఁడా, ఈ నీ రూపము కలావైదగ్ధ్యము నిష్ఫలములే గదా. అనురక్త నయిన యిట్టి నన్ను ఉపేక్షించుచున్నావు.' అని రాణి పలికెను. గుణశర్మ 'చక్కఁగా చెప్పితివి. ఏవి పరదారాపహరణముచే అకీర్తిమలీమసములై ఇహపరముల నరకపాతము కలిగించునో ఆరూపవైదగ్ధ్యములకు ఏమి ఫలము?' అని యుపహసించెను. అంతట రాణి అతనిపై అలిగినదియుంబోలె, 'నామాట చేయవేని నాకు చావు నిక్కము. కనుక అవమానిత నైన నేను ముందు నిన్ను చంపించి పిమ్మట నేనే చచ్చెదను.' అనెను. 'బళి! అట్లే అగును గాక!' ధర్మబద్ధ మయిన జీవితము క్షణకాల మయినను మేలు, అధర్మముతోడి కల్పకోటిశతము లయినను మేలు కావు. పాపము చేసి రాజదండన నొందుటకన్న పాపము చేయక శ్లాఘ్యుఁడ నగు నామరణము మేలు.' అని గుణశర్మ వాక్రుచ్చెను. దానిని వినియు రాణి మరల 'చెలువుఁడా, నీకును నాకును ద్రోహము చేయకు. చెప్పెద వినుము. రాజు నామాటను అశక్య మయినను దాఁటనేరఁడు. అతనితో చెప్పి నీకు దేశము లిప్పించెదను. సామంతుల నందఱను నీయనుచరులనుగా చేయించెదను. అట్లు గుణోజ్జ్వలుఁడ వైననీవే రాజ వగుదువు; అంతట నీ కేమి భయము ? ఎవఁడు నిన్ను ఎట్లు అవమానింపఁగలఁడు? కనుక నన్నుఁ గూడుము, కూడవేని ఇఁక నుండవు.' అని హెచ్చరించెను. ఆ రాజాంగన వదలక

యిట్లు నిర్బంధించుటఁ గని ఆసమయమునకు తప్పించుకొను వాఁడై గుణశర్మ యుక్తిగా 'దేవీ, ఇంత నిర్బంధమేని నీమాట నెఱవేర్చెదను. అయినను రహస్యము బయట బడు నని భయ మగుచున్నది. కనుక అవసరపడఁ దగదు. కొలఁదిదినములు ఓర్పుము. నామాట నమ్ముము. సర్వనాశము చేయునది యైన నీ విరోధము నా కేల?' అని ఆమెను ఆశ గొల్పి ఒప్పించి అచట నుండి వెలువడి ఊఱడిల్లి యింటికి పోయెను.

పిమ్మట మహాసేనరాజు సోమకేశ్వరుని కోటలో ముట్టడించెను. గౌడనాథుఁడు విక్రమశక్తి వచ్చి మహాసేనుని ముట్టడించెను. అంతట మహాసేనుఁడు గుణశర్మతో 'ఒకనిని ముట్టడించి యున్న మనము మఱియొకనిచే ముట్టడి నొందితిమి. ఇప్పుడు ఇద్దఱతో పోర మన మెట్లు చాలుదుము? యుద్ధము చేయక ముట్టడిలో ఎంతకాల ముందుము? సంకటము వచ్చినది. ఏమి యుపాయము?' అని యడుగఁగా 'దేవా, ఉపాయము చేసెదను, ధైర్యముగా నుండుము. ఆ యుపాయమున ఈ సంకటము తప్పించుకొనుటయే గాక కార్యమును కూడ సాధించెదను.' అని ఉత్సాహపఱిచి గుణశర్మ కన్నులకు అంతర్ధానాంజనము పెట్టుకొని రాత్రి విక్రమశక్తియొక్క స్కంధావారమునకుఁ బోయి నిద్రితుఁ డయి యున్న విక్రమశక్తిని లేపి 'రాజా, వినుము, నేను దేవదూతను, ఈ క్షణమే మహాసేనరాజుతో సంధి చేసికొని వెడలి పొమ్ము. అట్లు చేయ

వేని నీకు సైన్యములతోఁగూడ నిశ్చయముగా నాశము కలుగును. నీవు సంధికై అతనికడకు దూతను పంపిన అతఁడు అంగీకరించును.' అని నీకు తెలుపు మని నన్ను విష్ణుదేవుఁడు పంపినాఁడు. నీవును భక్తుఁడవు, ఆయన భక్తుల యోగక్షేమమును చూచుకొనువాఁడు గదా.' అని చెప్పెను. దానిని విని విక్రమశక్తి 'నిశ్చయముగా ఇది సత్యమే. కాదేని ఇచటికి ఎవఁడు రాఁగలఁడు. ఇది మనుష్యోచిత మయిన యాకృతి గాదు.' అని యాలోచించుకొని, గుణశర్మతో 'నేను ధన్యుఁడ నయితిని. దేవుఁడు నాకు సందేశము పంపునంతపుణ్యము నాకుఁ గలిగినది. దేవునియాజ్ఞప్రకారము చేసెదను.' అనెను. అంతట గుణశర్మ రాజునకు నమ్మకము గలిగించువాఁడై అంతర్ధానాంజన ప్రభావముచేత నంతర్హితుఁడై వెడలి పోయి, తాను చేసినది మహాసేనునికి తెలియఁ బఱచెను. ప్రాణరాజ్యప్రదుఁడయిన యాగుణశర్మను కంఠాలింగనము చేసికొని మహాసేనుఁడు సంతోషించెను. అట్లే విక్రమశక్తి మఱునాఁడు దూతముఖముగా మహాసేనునితో సంధిచేసికొని తరలిపోయెను. ఇట్లు మహాసేనుఁడు గుణశర్మప్రభావముచే సోమకుని గెలిచి ఏనుఁగులను గుఱ్ఱములను గైకొని ఉజ్జయినికి పోయెను. అచట రాజును నదీస్నానమునందు మొసలినుండియు, ఉపవన విహారమునందు పాముకాటువిషమునుండియు గుణశర్మ రక్షించెను.

తరువాత కొన్ని దినములకు ఆరాజు బలయుక్తుఁడై తన వైరి యైన విక్రమశక్తి మీఁదికి దాడి వెడలెను. అతఁడును ఇతనితో పోరుటకై తననగరు వెలువడి వచ్చెను. ఉభయుల కును ఘోరసంగ్రామము ప్రారంభ మాయెను. రాజు లిద్ద ఱును క్రమముగా ద్వంద్వయుద్ధ మారంభించి విరథీకృతు లై ఒండొరువులను కత్తి దూసికొని నఱకొనుచుండఁగా అతోట్రు పాటుచే మహాసేనుఁడు నేల పడెను. పడిన యతనిని కత్తిం బొడుచుచున్న విక్రమశక్తిని గుణశర్మ చక్రాయుధముతో భుజమును ఖండించి పరిఘముతో వక్షమునఁ గొట్టి నేలం గూల్చెను. మహాసేనమహారాజు లేచి సంతోషించి 'ఏమి చెప్పుదును. మహావీరుఁడా, ఈప్రాణములు నీ విపుడు అయిదవ మాఱు నా కిచ్చినవి' అని గుణశర్మను మాటి మాటికి పొగడు చుండెను. ఇట్లు గుణశర్మచే నిహతుఁ డయిన విక్రమశక్తి యొక్క సైన్యమును రాష్ట్రమును మహాసేనుఁడు ఆక్రమించెను. గుణశర్మయొక్క తోడ్పాటుచే ఇతర రాజులను కూడ జయించి ఉజ్జయినికి వచ్చి సుఖముండెను.

అశోకవతియు గుణశర్మకై ఉవ్విళు లూరుచుండి, వచ్చిన పిమ్మట నతనిని రేయుంబగలు ప్రార్థించుచుండెను. ఆ యకార్య మునకు అతం డెట్లును ఒప్పఁ డాయెను. సజ్జనులు దేహాము నైన వదలుదురు గాని అవినయ మాచరింపరు. అశోకవతి అతని నిశ్చయము నెఱింగిన దై కపటదుఃఖమును నటించుచు ఏడ్వ

మొగముగా నుండెను. మహాసేనుఁడు వచ్చి ఆరీతి నున్న యామెను చూచి 'ప్రేయసీ, ఏమి యిది? ఎవఁడు నీకు కోపము కలిగించినాఁడు? చెప్పుము. వాని ధన ప్రాణములను ఇప్పుడే హరించెదను.' అని పలుకఁగా, ఎట్టకేలకు రాణి 'నాకు అపకారము చేసిన వానిని నీవు దండింప శక్తుఁడవు గావు అతఁడు నీకు లొంగువాఁడు గాఁడు. కనుక నాదుఃఖమును వృథాగా వెడలఁ బుచ్చ నేల?' అనెను. రాజు నిర్బంధింపఁగా ఇట్లు అనృతములు పలికెను.—

"ఆర్యపుత్రా, అతినిర్బంధము చేసెదవు. చెప్పెదను వినుము. గౌడేశ్వరునివలన ధనము గోరి ఈ గుణశర్మ నిన్ను వెలార్చుటకు అతనితోడ ఒడంబడువాఁడై తనకు ధనము పంపు మని రహస్యముగా అతనియొద్దకు దూత్యము పంపెను. అచట ఆదూతను చూచి రాజున కాప్తుఁడు ఒకవంటవాఁడు 'దేవా, ఈకార్యమును నేను సాధించెదను. ధననాశము ఏల చేసెదవు?' అని చెప్పి, గుణశర్ముని దూతను ఖయిదు చేయించి మంత్రము బయల్పడకుండ ఇచటికి విషము ప్రయోగించుటకు వచ్చెను. ఈలోపల గుణశర్మదూత ఖయిదునుండి తప్పించుకొని వచ్చి గుణశర్మకు వృత్తాంతమును తెలిపి మన బానసీని చూపెను. ఆరీతిని ఆ వంటవాని విషప్రయోగము నెఱింగి నీకు చెప్పి ఈ బ్రాహ్మణాధముఁడు గుణశర్మ వానిని చంపించినాఁడు. ఈదినము ఆసూదుని తల్లియు భార్యయు తమ్ముఁడును వానిని

వెదకికొని రాఁగా ఈజిత్తులమారి గుణశర్మ కనిపట్టి ఆ తల్లిని భార్యను చంపించినాఁడు. తమ్ముఁడు పలాయితుఁడై దైవవశమున నానగరు సొచ్చి నన్ను శరణు వేఁడి నాతోఁ ఈవృత్తాంత మంతయు చెప్పుచుండఁగా గుణశర్మ నా పడుకటిల్లు సొచ్చెను. అతనిని చూచియు పేరు వినియు ఆసూదభ్రాత భయముచే పలాయితుఁ డాయెను. ఎచటికి పోయెనో తెలియ దాయెను. తనభృత్యులు ముందు చూపఁగా వానిని గుణశర్మ చూచి నివ్వెఱఁబోయి ఏ మేమో ఆలోచించువాఁడుం బోలె కొంత సేపుండెను. 'గుణశర్మ, ఏమి ఈదినము వేఱువిధముగా నున్నావు?' అని నేను జిజ్ఞాసచే ఏకాంతమున అడిగితిని. అతఁడు నన్నుఁ గవయఁ గోరి బయల్పడుదు ననుభయముచే ఆ సూన్య వాసకమందు నాతో 'దేవీ, నీపై వలపుఁజిచ్చుచే నేను కాలు చున్నాఁడను. నన్ననుగ్రహింప వేని నేను బ్రదుకను. నాకు ప్రాణదానము చేయుము.' అని నా పాదముల వ్రాలెను. నేను పాదములు లాగికొని తొట్రుపడుచు లేచునంతలో వాఁడును లేచి నన్ను బలిమిచే కవుంగిలించెను. ఆక్షణమందు నాచేతి పల్లవిక వచ్చినది. దానిం జూచి గుణశర్మ భయపడి వెడలి పోయెను. పల్లవిక ఆక్షణము రాదేని పాపాత్ముఁడు నిక్కముగా నన్ను చెఱిపియే యుండును. ఇట్లు నాకు సంభవించినది."
ఇట్లు కల్పించి చెప్పి ముగించి ఆరాణి ఏడ్చుచుండెను. ముందు అసత్యభాషణము పిమ్మట చెడిపలును గదా పుట్టినారు.

దానిని విని రాజు కోపముచే మండిపడెను; స్త్రీలమాట యందలి నమ్మకము మహాత్ములకును ఆలోచనను పోఁగొట్టును. రాజు కాంతతో ని ట్లనియె.—'ప్రాణనాయికా, చింతిల్లకుము, ఆద్రోహికి నిశ్చయముగా మరణదండన చేసెదను. కాని వానిని యుక్తిచేత చంపవలయును. కానిచో అపకీర్తి గలుగును. వాఁడు నాకు అయిదుమాఱులు ప్రాణ మిచ్చుట ప్రఖ్యాతము గదా. నిన్ను పైకొనిన దోషము లోకములో చెప్పఁదగినది గాదు.' 'ప్రాణేశ్వరా, అట్లయిన ఈదోషము చెప్పరానిదేని నిన్నుఁ జంపుటకు గౌడరాజుతో వీఁడు చేసిన యొడంబడికను ప్రకటింపఁ గూడదా?' అని రాణి యడిగెను. సరియే, అట్లు చేయవచ్చును.' అని పలికి రాజు ఆస్థాని కేఁగెను, రాజదర్శనమునకు రాజులు రాజపుత్త్రులు సామంతులు మంత్రులు అందఱు వచ్చిరి.

గుణశర్మకు దివాణమునకుఁ బోవుచుండఁగా దారిలో పెక్కుదుర్నిమిత్తము లాయెను. కాకి ఎడమకు పోయెను; కుక్క ఎడమనుండి కుడికి పోయెను, పాము కుడినుండి ఎడమకుఁ బోయెను; బాహువు భుజశిరముతోఁగూడ అదరెను. 'ఈయు నిమిత్తములు నిశ్చయముగా నాకు అశుభమును సూచించు చున్నవి. ఏ మయినను నాకు అగును గాక. నాద్వార మైన రాజునకు చెడుగు కలుఁగకుండును గాక. దివాణములో విరుద్ధ మేమియును కలుగకుండును గాక.'— ఇట్లు తలపోయుచు గుణశర్మ రాజాస్థానికి పోయి ప్రణమిల్లి కూర్చుండెను.

అతనిని రాజు ఎప్పటివలె గౌరవింపక క్రోధకషాయము లైన ఘోరచూపుల చూచుచుండెను. 'ఏమి ఇది!' అని గుణశర్మ శంకించుచుండఁగా రాజు ఆసనమునుండి లేచి అతని మీఁదికి దుమికి మెడమీఁదఁ గూర్చుండెను. ఆశ్చర్యమగ్ను లయిన సభ్యులతో రాజు 'నాకును గుణశర్మకును గలన్యాయ మును వినుఁడు.' అని చెప్ప నారంభించెను. అంతట గుణశర్మ 'సేవకుఁడను నేను, ప్రభువవు నీవు, మనకు సమానులకుంబోలె వ్యవహార మెట్లు ఘటించును? ఆసనమందు కూర్చుండుము, పిమ్మట ఇచ్చ వచ్చినట్లు ఆన తిత్తువు గాక.' అని విన్నపించెను. ఇట్లు ధీరుఁడు గుణశర్మ పలుకఁగా మంత్రులును బోధింపఁగా రాజు మరల ఆసనగతుఁడై సభ్యులతో నిట్లనియె: 'మీరలు ఎఱుఁగుదురు గదా, కులక్రమాగతు లయిన మంత్రులను అతిక్రమించి ఈగుణశర్మను నాతో సమానునిఁగా చేసితిని. వినుఁడు. వీఁడు దూతలను పంపి గౌడేశ్వరునితో నొడంబడి నన్ను తెగటార్చుటకు ప్రయత్నము చేసినాఁడు' ఇట్లని రాజు తాను రాణివలన విన్న కల్పనాకథ నెల్లవారికి తెలిపినాఁడు. తన్ను చెఱుప వచ్చినాఁడని యామె చెప్పిన మాటను కూడ జనులను బయటికి పొమ్మని ఆప్తులకు చెప్పినాఁడు. 'దేవా, ఇది యెల్ల కల్ల. నీ కెవరు చెప్పినారు. ఆకాశములో ప్రతిమలు ఎవరు వ్రాసినారు?' అని గుణశర్మ పలికెను. 'పాపాత్ముఁడా, ఇది నిజము గాదేని, కూరతబిలలోపల నున్న విషము నీ కెట్లు

తెలిసినది?' అని రా జడిగెను. 'సర్వము ప్రజ్ఞచే తెలియును.' అని గుణశర్మ చెప్పఁగా అది యసాధ్య మని గుణశర్మకు ద్వేషు లైన మంత్రులు పలికిరి. 'దేవా, నిజమును విచారింపక యిట్లు పలుకుట ఉచితము గాదు. ప్రభు వఁట విచారహీనుఁ డఁట! దీనిని నీతిజ్ఞులు నిందింతురు.' అని గుణశర్మ పలుకుచుండఁగా, 'ఓరి ధృష్టుఁడా!' అని పిలుచుచు అతనిని రాజు సురకత్తితో పొడిచెను. ఆపోటును కరణప్రయోగముచేత తప్పించుకోఁగా, రాజానుచరులును ఇతరులును ఆతనిని కత్తులతోఁ గొట్టిరి. అతఁడును కరణములచేత ఆ కృపాణములను తప్పించుకొని ఒడిసి తివిచి ఒకరిజుట్టు ఒకరికి ముళ్లు వేసి రాజసభనుండి వెడలి పోయెను. వెంటఁ దఱిమిన నూర్గురు జోదులను మడియించెను. వస్త్రమందు ముడిచికొనియున్న యా యంతర్ధానాంజనమును నేత్రములఁ బెట్టుకొని అదృశ్యుఁడై తత్క్షణమే ఆదేశమును వదలి పోయెను.

దక్షిణాపథమునకుఁ బోవుచు అతఁడు దారిలో ఇట్లు తలపోసెను—'నిజముగా అశోకవతి యీ మూఢుని ప్రేరించి నది. రక్త విమానిత లైనస్త్రీలు విషముకన్న క్రూరురాండ్రు సుమా! ఆహా! నిజము చూడనిరాజులు సాధు సేవ్యులు గారు గదా!' ఇట్లు తలపోయుచుఁ బోయి, గుణశర్మ ఒకగ్రామమున మఱ్ఱిచెట్టుక్రింద శిష్యులకు అధ్యయనము చెప్పుచున్న యొక బ్రాహ్మణునిఁ గాంచి నమస్కరించెను. ఆబ్రాహ్మణుఁడును ఇతనికి

అతిథిసత్కారము చేసి 'ఓ బ్రాహ్మణా, నీవు ఏశాఖ చెప్పఁగలవు? చెప్పు మ'నెను. 'బ్రాహ్మణా, పండ్రెండు శాఖలు చెప్పఁగలను. సామవేదమువి రెండు, ఋగ్వేదమువి రెండు, యజుస్సువి ఏడు, అథర్వమువి ఒకటి.' అని గుణశర్మ చెప్పెను. 'అటయిన నీవు దేవుఁడవు!' అని, బ్రాహ్మణుఁడు ఆకారముచేతనే కథితప్రభావుఁడయిన గుణశర్మను వినయము తోఁప నడిగెను: 'నీ జన్మముచే నలంకరింపఁబడిన దేశమును వంశమును ఏవి ? నీపే రేమి ? ఇంత నీ వెట్లు చదివితివి ?' అని. గుణశర్మ చెప్పఁ దొడంగెను.

ఉజ్జయినీపురియందు ఆదిత్యశర్మ యని యొక బ్రాహ్మణకుమారుఁడు ఉండెను. అతనికి బాల్యమందే తండ్రి మృతిఁ బొందెను. తల్లి సహగమనము చేసెను. అంత నాబాలుఁడు ఆపురమందే మామయింట ఎదుగుచు వేదములను విద్యలను కళలను నేర్చుచు ఉండెను. విద్యాగ్రహణము ముగిసినంతట ఇతనికి ఒక పరివ్రాజకునితో సఖ్యము సంభవించినది. ఆదిత్యశర్మతోఁ గూడి పోయి పరివ్రాజకుఁడు శ్మశానములో యక్షిణీసిద్ధికొఱకు హోమము చేసెను. అందుండి బంగారు విమానమున వరకన్యాపరివృత యై స్వలంకృత యై యొక దివ్యకన్య యావిర్భవించి మధురవాక్కుతో 'ఓసన్న్యాసీ, నేను యక్షిని, నాపేరు విద్యున్మాల. ఈ యితరులు యక్షిణులు. ఈ నాపరివారమునుండి ఒకతెను నీ కిష్ట మయిన దానిని పుచ్చుకొమ్ము. ఈ నీ మంత్రసాధనముచే నీకు ఇంతే సిద్ధించినది. నా మంత్ర

సాధనమును నీవు పూర్ణముగా నెఱుఁగ నైతివి. అందుచే నేను నీకు సిద్ధింప నైతిని. వృథాగా మరల క్లేశపడకుము.' అనెను. యక్షి యిట్లు చెప్పఁగా సన్న్యాసి ఒప్పుకొని తత్పరివారము నుండి ఒకయక్షిణిని స్వీకరించెను. విద్యున్మాల యంతర్ధాన మాయెను. పరివ్రాజకునికి సిద్ధించిన యక్షిణిని ఆదిత్యశర్మ 'విద్యున్మాలకంటె ఉత్తమురాలు యక్షిణి కలదా?' అని యడిగెను. 'సుందరుఁడా, కలదు. విద్యున్మాలయు చంద్రలేఖయు మూఁడవది సులోచనయు యక్షిణులలో ఉత్తమలు; వీరిలోను సులోచన ఉత్కృష్టురాలు.' అని చెప్పి ఆయక్షిణి యథాకాలము వచ్చునది యై అప్పటికి పోయెను. సన్న్యాసి ఆదిత్యశర్మతోఁ గూడ వానియింటికి పోయెను. అచటికి ప్రీత యయిన యా యక్షిణి అనుదినమును కాలమునకు వచ్చి ఆ పరివ్రాజకునికి ఇష్టభోగములను ఇచ్చుచుండెను.

ఒకనాఁడు ఆదిత్యశర్మ ప్రవ్రాజకముఖముగా ఆమెను 'సులోచనామంత్రవిధిని ఎవ రెఱుఁగుదురు?' అని ప్రశ్న చేసెను. యక్షిణియు పరివ్రాజకముఖముగా నిట్లు తెలిపెను:— 'దక్షిణదిక్కునందు తుంబవన మను స్థానము కలదు. అందు వేణానదీ తీరమందు విష్ణుగుప్తుఁ డను ప్రవ్రాజకుఁడు భదంత శ్రేష్ఠుఁడు నివసించుచున్నాఁడు. అతఁడు ఆమంత్రమును సవిస్తరముగా నెఱుంగును.' యక్షిణీవాక్యమువలన ఈరహస్యము తెలిసికొని ఉత్సుకుఁ డై ఆదిత్యశర్మ చెలికాఁ డయిన పరివ్రాజకుఁడు

ప్రీతిచే గూడ రాఁగా ఆదేశమునకుఁ బోయి వెదకి వెదకి ఆ భదంతుని కనిపట్టి అతనికి మూఁడువత్సరములు భక్తితో పరిచర్య చేసెను. పరివ్రాజకునికి సిద్ధించిన యాయక్షిణి తెచ్చిన యమానుషభోగములను భదంతునికి సమర్పించి యుపచరించుచుండెను. తుష్టుఁడై భదంతుఁడు ఆదిత్యశర్మకు ప్రార్థితమైన సులోచనామంత్రమును విధానపూర్వకముగా నుపదేశించెను. ఆదిత్యశర్మ ఆమంత్రమును నేర్చి పురశ్చరణమును సమాప్తి నొందించి ఏకాంతమున యథావిధిగా సంపూర్ణముగా హోమము చేసెను. అంతట విమానస్థురాలై ఆయక్షిణి సులోచన జగదాశ్చర్యకారి యగురూపముతో ప్రాదుర్భవించి ఇతనిని 'రా రమ్ము, నీకు నేను సిద్ధించితిని, కాని, నావలన మహావీరుఁడు బుద్ధిపాత్రము సర్వజ్ఞకల్పుఁడు అపరాజితుఁడు నగు తనయునిఁ బడయఁ గోరుదువేని ఆఱుమాసములు నాకన్యాత్వమును పోఁగొట్టకుము.' అనియెను. ఇతఁడును అంగీకరింపఁగా ఇతనిని విమానమున అలకాపురికి కొనిపోయెను. అచట నాదిత్యశర్మ ఆమెను చెంత సదా చూచుచు ఆఱుమాసములు అసిధారావ్రతము చరించెను. అందులకు తుష్టుఁడై కుబేరుఁడు స్వయముగా దివ్యవిధానమున సులోచనను అతనికి ఇచ్చెను.

నేనా బ్రాహ్మణునికి ఆమెయందు కలిగినకుమారుఁడను. మంచిగుణములను బట్టి నాకు మాతండ్రియే గుణశర్మ యని పేరు పెట్టినాఁడు. నేనును క్రమముగా అచటనే యక్షాధిపతి

డైన మణిధరునివలన వేదములను విద్యలను కళలను నేర్చితిని. ఒకనాఁడు ఏలాగో ఇంద్రుఁడు కుబేరునియొద్దకు వచ్చెను. అతని చూచుచునే అచటివార లెల్ల లేచి నిలిచిరి. నాతండ్రి ఆదిత్యశర్మ ఆసమయమున దైవవశమున పరధ్యానముగా నుండి తొట్రుపాటుతో లేవఁ డాయెను. అంతట ఇంద్రుఁడు కోపించి అతనిని 'ఛీ మూర్ఖుఁడా, మనుష్యలోకమునకే పొమ్ము. నీవు ఇచట తగవు.' అని శపించెను. సులోచనయు ప్రణమిల్లి ప్రార్థింపఁగా 'అట్లయిన ఇతఁడు స్వయముగా మర్త్యలోకమునకు పోవలదు. ఇతని యీపుత్త్రుఁడు పోవును గాక, పుత్త్రుఁడు ఆత్మయే యని గదా చెప్పుదురు. నాపలుకు వ్యర్థము కాకుండును గాక.' అని పలికి ఇంద్రుఁడు శాంతుఁ డాయెను. అంతట నా తండ్రి నన్ను కొని వచ్చి ఉజ్జయినియందు తన మేనమామ యింట విడిచెను. కావలసినది ఎవఁడు తప్పించుకొనఁ గలఁడు? దైవయోగమున అచటి రాజుతో నాకు సఖ్యము కలిగినది. పిమ్మట జరిగినదాని నెల్ల చెప్పెదను వినుము.—అని పలికి, గుణశర్మ ఆ మూలముగా అశోకవతి చేసిన చేఁతను రాజు చేసిన చేఁతను యుద్ధమును కూడ వర్ణించి మరల ననియె.—'ఓ బ్రాహ్మణుఁడా, ఇట్లు నేను పరారినై దేశాంతరము పోవుచు దారిలో నిన్ను చూచితిని.'

ఆబ్రాహ్మణుఁడు ఇది యెల్లను విని గుణశర్మతో 'ఓ ప్రభూ, నేను ధన్యుఁడను, నాయింటికి రమ్ము, నా పేరు అగ్ని

దత్తుఁడు ఈ గ్రామము నా యగ్రహారము. ఇందు సుఖముగా నుండుము.' అని పలికి, అతనిని సర్వసమృద్ధి గల దై ఆవులు గేదెలు గుఱ్ఱములును ఒప్పుచున్న తన యింటికి తోడ్కొని పోయి స్నానాంగరాగ వస్త్రాభరణ వివిధ భోజనములతో సత్కరించెను. దేవతలు గూడ కామింపఁ దగిన రూపవతిని సుందరి యను తనకన్యను లక్షణములు చూపుమిషచేత గుణశర్మకు చూపెను. అనన్య సామాన్య రూపను ఆ కన్యామణిని చూచి గుణశర్మ అగ్నిదత్తునితో, 'ఈమెకు సవతులు ఉందురు. నాసికయందు ఈమెకు మచ్చ యున్నది. దానిని బట్టి చెప్పితిని. వక్షమునను రెండవ మచ్చ యున్నది. వానిఫల మిది.' అని చెప్పెను. అంతట ఆమెయన్న తండ్రియానతిచే ఆమెవక్షంబున, పైఁట యెత్తిచూడఁగా, మచ్చ అగపడెను. అంతట అగ్నిదత్తుఁడు ఆశ్చర్యపడి గుణశర్మతో 'అయ్యా, నీవు సర్వజ్ఞుఁడవు; ఈమె తిలకములు అశుభములు కావు. సాధారణముగా లోకములో భర్త శ్రీమంతుఁ డేని సవతు లందురు. దరిద్రుఁడు ఒకతెనే పోషింప లేఁడు. పెక్కండ్ర నెట్లు పోషించును?' అనెను. గుణశర్మ ఆమాట విని 'అవు నయ్యా, నీవు చెప్పినది సరియే. సులక్షణ మయిన యీయాకృతికి అశుభ మెక్కడిది?' అని బదులు చెప్పెను.

ఆ ప్రసంగమున అగ్నిదత్తుఁ డడుగఁగా గుణశర్మ స్త్రీ పురుషులకు ప్రత్యవయవమందును తిలకాదుల ఫలమును వేఱు

వేలుగా వర్ణించెను. గుణశర్మను చూచిన మాత్రాన సుందరి ఉత్సుకయై చకోరిక చంద్రునిఁబోలె చూపులచే అతని త్రాఁగఁ గోరెను. అగ్నిదత్తుఁడు ఏకాంతమున గుణశర్మతో 'మహాను భావా, ఈ కన్యను సుందరిని నీ కిచ్చెదను. విదేశమునకు పోకుము. నాయింట సుఖముగా నుండుము.' అనెను. గుణ శర్మ పలికెను.—'సత్యము, ఇట్లు చేసిన నా కేమి సౌఖ్యము తక్కువ ? అయినను మిథ్యా రాజావమానాగ్నితప్తుఁడ నయిన నాకు అది ప్రీతికరము గాదు. కాంత, చంద్రోదయము, వీణ, పంచమస్వరము, అనునవి సుఖితులను ఆనందపెట్టునవి, దుఃఖి తులను వెతలఁ బెట్టును గాదె ? తన యిచ్ఛచే అనురక్తయైన భార్య వ్యభిచరింపదు. అస్వతంత్రయై తండ్రి యిచ్చినది అశోక వతివలె వ్యభిచారిణి యగును. ఆ యుజ్జయినీ నగరము ఈ వీటికి సమీపమా ఏమి ? రా జెఱిఁగెనేని నాకు ఒకవేళ యుప ద్రవము చేయును. కావున తీర్థభ్రమణము చేసి ఆజన్మసంచిత కిల్బిషమును కడిగి వైచి ఈ దేహమును వదలి సుఖితుఁడ నయ్యెద.' ఆ ప్రతివచనమునకు అగ్నిదత్తుఁడు నవ్వి, 'నీకును ఇట్టి యజ్ఞాన ముండఁగా, ఇతరుల మాట చెప్పవలయునా ? శుద్ధ హృదయునికి నీకు తెలివి మాలిన నరునివలని యవమానముచే దుఃఖము న్యాయ్యమా ? ఆకాశమున వేసిన బురద వేసినవాని నెత్తిమీఁదనే పడును. ఆరాజే త్వరలోనే విశేష మెఱుఁగ నందుల ఫలమును పొందును. మోహాంధుఁడు నవివేకియు నగు

వానిని చిరకాలము సిరి సేవింపదు. అశోకవతిని చూచి స్త్రీలయం దెల్ల వైరాగ్యము పూనితివేని, పతివ్రతలను చూచి శ్రద్ధ యేల పూనవు? లక్షణము నెఱుఁగుదువుగదా. ఉజ్జయిని చెంత నున్న దని శంకయేని, ఇట నున్న నిన్ను నెవ్వరు నెఱుఁగ కుండునట్లు చేసెదను. తీర్థయాత్ర నభిలషించెద వేని అది యథావిధి వైదికకర్మసంపత్తి యెవనికి లేదో వానికి చెప్పఁబడినది. దేవ పితృ గ్ని క్రియా వ్రత జపాదులవలన గృహామందు నిష్పన్న మగు పుణ్యము మార్గభ్రమణమున నెట్లు గలుగును? బుజముతలగడవాఁడు నేలపఱుపువాఁడు భిక్షాశనుఁడు ధన హీనుఁడు నై మార్గస్థుఁడు మునితుల్యుఁ డయ్యు క్లేశములను మాత్రము పోఁగొట్టుకోనేరఁడు. దేహత్యాగమువలన సుఖము నెదురు సూచెదవు; ఇది వట్టిభ్రమ. ఆత్మఘాతులకు పరమందు ఇక్కడికన్న దుఃఖము కలుగును. పడుచువాఁడవును విద్వాంసుఁడవు నగు నీకు ఈ యజ్ఞానము తగదు. నీవే ఆలోచించుకొనుము. అవశ్యము నామాట చేయుము. నీకు ఇట ఎవరికీ తెలియనీయక యుంచ మయిన గొప్ప నేలమాలియను చేయించెదను. సుందరిని పెండలి గ్గొని అందు గుప్తముగా యథేచ్ఛముగా నుండుము’ అని యగ్ని దత్తుఁడు బోధించెను. అందులకు బుద్ధి తిరిగి గుణశర్మ వల్లె యని యిట్లనియె.—‘నీ మాట చేసితిని, ఎవఁడు సుందరిని భార్యను వదలును? కాని, నేను కృతకృత్యుఁడను గాక ఈ నీ సుతను వివాహ మాడను.

సంయమము చేసికొని ఎవనినేని యొకదేవుని ఆరాధించి తత్ప్రసాద బలమున ఆ కృతఘ్ను రాజుపై పగఁ దీర్చుకొనియెదను.' ఆ మాటకు అగ్నిదత్తుఁడు అంగీకరించెను. ఆ రాత్రి గుణశర్మ సుఖముగా అచట విశ్రమించెను.

మఱునాఁడు అగ్నిదత్తుఁడు గుణశర్మకు సౌఖ్యముగా పాతాళవసతి యను పేర నొక నేలమాలియను కావించెను. అందు ప్రవేశించి గుణశర్మ అగ్నిదత్తునితో 'అయ్యా, చెప్పుము; ఇచట ఏ దేవుని వరదుని భక్తితో వ్రతచర్యాపూర్వకముగా ఏమంత్రముచే ఆరాధింతును?' అని యడిగెను. ఆధీరునితో నగ్నిదత్తుఁ డనియె.—'నాకు కుమారస్వామి మంత్రము గురూపదిష్ట మయినది తెలియును. శత్రుపీడితు లైన దేవతలు ఎవని పుట్టువును కోరి పంపఁగా కాముఁడు ఈశ్వరునిచే దగ్ధుఁ డయ్యెను మరల సంకల్పజన్ముఁడు ఆయెనో, మహేశ్వరుని వలనను అగ్నికుండమువలనను శరవణమువలనను కృత్తికల వలనను ఎవనిపుట్టువును చెప్పుచున్నారో, పుట్టినమాత్రముననే ఎవఁడు దుష్ప్రధర్ష మైనతేజస్సుచే దుర్జయుని తారకాసురుని సంహరించి, సర్వలోకములను ఆనందపెట్టెనో ఆసేనానిని ఆరాధింపుము. ఆమంత్రమును నావలనఁ గొనుము.' ఇట్లని యగ్నిదత్తుఁడు మంత్రమును గుణశర్మకు ఇచ్చెను. గుణశర్మ భూగృహమందు సుందరిని యతవ్రత యై ఉపచారములు సేయుచుండఁగా ఆమంత్రముచేత స్కందుని ఆరాధించెను. అంతట

షణ్ముఖ దేవుఁడు ప్రత్యక్షుఁడై 'తుష్టుఁడ నయితిని; పుత్త్రా, వర మడుగుము.' అనెను. 'నాకు అక్షయకోశము వలయును. నేను మహాసేన నరపతిని జయింపవలయును.' అని గుణశర్మ వేఁడెను. 'పుత్త్రా, నీవు అక్షీణకోశుఁడవై మహాసేనుని గెలిచి నిరంకుశముగా పృథ్వీరాజ్యము చేయుదువు.' అని వర మిచ్చి స్కందుఁడు అంతర్హితుఁ డాయెను. గుణశర్మయు అక్షయ కోశ సంపన్నుఁ డాయెను. తనమహిమకు తగిన సంపదతో గుణశర్మ అనుదినాధికానురక్తయైన సుందరిని రూపవతిని భావ్యర్థసిద్ధినిం బోలె వివాహమై, అక్షయకోశ ప్రభావముచేత లెక్క లేని గజ వాజి పదాతి సైన్యములను సంపాదించి, తన దానశక్తిచే తన్నుఁగలసికొనిన రాజుల బలములచే భూమిని ఆక్రమించుచు, ఉజ్జయినికి దాడి వెడలెను. అందు ప్రజలయెదుట అశోకవతి యొక్క దుశ్శీలమును ప్రకటించి, మహాసేనరాజును యుద్ధములో నోర్చి, రాజ్యమునుండి వెడలఁ గొట్టి, తానే అచట రాజాయెను. ఆగుణశర్మసార్వభౌముఁడు పలువుర రాజకన్యలం గూడ వివాహమై ఆసముద్రాప్రతిహతాజ్ఞుఁడై సనుందరికుఁడై చిరకాలము యథేష్టభోగము లనుభవించుచుండెను.

ఇట్లు పురుషవిశేషుని ఎఱుంగ లేక పూర్వము మహాసేనరాజు ఆపదను పొందెను. ఇట్లు కృతాత్ముఁడైన యాగుణశర్మయు ధైర్య మొక్కటియే తోడుగా మహర్ధిక సంపన్నుఁ డాయెను.

ఇట్లు రాత్రి వీతభీతి మంత్రివలన ఉదారవస్తుకథను విని వీరుఁడు సూర్యప్రభుఁడు మహాసంగ్రామసాగరమును దాఁటువాఁడై అధికోత్సాహము పొంది క్రమముగా నిద్రించెను.

---

## ౭ - వ తరంగము

---

### యుద్ధాంతము.

సూర్యప్రభుఁడు ప్రాతఃకాలమందు లేచి మంత్రులతోను దానవాది సైన్యములతోను కూడుకొని యుద్ధరంగమునకు పోయెను. శ్రుతశర్మయు విద్యాధరబలాన్వితుఁడై వచ్చెను. చూచుటకు మరల దేవాసురాదులు వచ్చిరి. ఇరుసేనలును అర్ధచంద్ర వ్యూహములు తీర్చిరి. మహాయుద్ధము ఆరంభమాయెను. ఒండొకటిం బైకొని ఖండించుచు శస్త్రారూఢములు ప్రజవులు నై శరములుంగూడ యుద్ధముచేయుచుండినవి గదా! కోశాసనాగ్రనిర్గతములు పీతశోణితములు సుతీక్ష్ణలోలములు నై ఖడ్గలతలు కృతాంతజిహ్వాలుంబోలె రాజిల్లెను. ఆ సమరమహాసరస్సు శూరోత్ఫుల్ల ముఖాంభోజ సంహత చ్ఛత్రసంహతి నై రాజహంసక్షయావహ మై యుండెను. ఖండితము లై పైకి ఎగురుచుం బడుచున్న శూరశీర్షములచే ఆ పోరు కృతాంతుని బంతియాటగా నొప్పుచుండెను. రణాంగణమున నెత్తుటికలయం పిచే దుమారము అడఁగెను. క్రోధావిష్టు లైనమహారథులకు

ద్వంద్వయుద్ధము లాయెను. సూర్యప్రభునికి శ్రుతశర్మతోను, ప్రభాసునికి దామోదరునితోను, సిద్ధార్థునికి మహోత్పాతుని తోను, ప్రహస్తునికి బ్రహ్మగుప్తునితోను, వీతభీతికి సంక్రముని తోను, ప్రజ్ఞాఢ్యునికి చంద్రగుప్తునితోను, ప్రియంకరునికి అక్రమునితోను, సర్వదమనునికి అతిబలునితోను, కుంజరకుమారునికి ధురంధరునితోను, ఇతర మహారథులకు ఇతరులతోను, ద్వంద్వయుద్ధములు ఆయెను. మొదట మహోత్పాతుఁడు సిద్ధార్థునిశరములను శరములం బొడి సేసి ధనుస్సు విలుగఁగొట్టి గుఱ్ఱములను సారథిని త్రుంచెను. విరథుఁడై సిద్ధార్థుఁడు కోపావేశమున వానిపైఁ బోయి యినుపగుదియతో వానిరథమును గుఱ్ఱములను చూర్ణీకరించి, అంతట పాదచారి యైన యామహోత్పాతుని బాహుయుద్ధముచే నేలఁ గూల్చెను. వానిని చూర్ణము చేయునంతలో వానితండ్రి సూర్యుఁడు రక్షించెను. అంతట వాఁడు లేచి పలాయితుఁ డాయెను. ప్రహస్త బ్రహ్మగుప్తులు ఒకరొకరిచే విరథీకృతు లై పాదచారు లై నానావిధ కరణములతో ఖడ్గయుద్ధము చేసిరి. ప్రహస్తుఁడు కరణక్రమమున కత్తితో బ్రహ్మగుప్తుని డాలును కొట్టివైచి వానిని నేల రాల్చెను. వానితలను నఱుక నుండఁగా వానితండ్రి బ్రహ్మ స్వయముగా నివారించెను. 'మీరు మీసుతులను రక్షించుకొనుటకు వచ్చినవారు గాని రణదర్శనమునకు వచ్చినవారు గారు.' అని దానవు లందఱు దేవతలను పరిహసించిరి. అంతలో

వీతభీతి సంక్రముని ధనుస్సు నఱికి సారథిని గూల్చి ప్రద్యుమ్నా స్త్రముచే హృదయభేదము గావించెను. ప్రజ్ఞాఢ్యుఁడు రథ నాశముచే పదాతి యై అట్లే పదాతి యైన చంద్రగుప్తుని తల నఱికెను. కౌమారుని చావునకు కినిసి చండమాహ స్వయముగా ప్రజ్ఞాఢ్యునితోఁ బోరుచుండెను. రథనాశముచే పదాతి యై ప్రియంకరుఁడు అట్లే పదాతి యైన యక్రము నొకవ్రేటున రెండు చీలికలు చేసెను. సర్వదమనుఁడు తనధనుస్సు ఛిన్నము కాఁగా హృదయమున అంకుశముతోఁ గొట్టి లీలగా అతిబలుని యమ మందిరమునకుఁ బంపెను. కుంజరకుమారకుఁడు ధురంధరుని అస్త్రప్రత్యస్త్రయుద్ధమున పలుమారు విరథుని చేసెను. విక్రమ శక్తి వానికి మరలమరల రథము పంపి ఆసంకటములో అస్త్రము లను అస్త్రములచే వారించుచు వానిని రక్షించుచుండెను. కుంజరకుమారుఁడు కోపావేశమునఁ బరు వెత్తి ఱాతి బండ యొకటి యెత్తి విక్రమశక్తియొక్క రథముపై వైచెను. చూర్ణి కృతస్యందనుఁ డై విక్రమశక్తి తొలఁగఁగా, ఆ ఱాతితోనే అతఁడు ధురంధరుని నుగ్గు చేసెను.

సూర్యప్రభుఁడు శ్రుతశర్మతో యుద్ధప్రసక్తుఁ డయ్యెను విరోచనుని చంపె నన్న క్రోధముచే ఒక బాణమున దముని చంపెను. ఆ క్రోధముచే అశ్విదేవతలు యుద్ధమునకు వచ్చిరి. వారితో సునీథుఁడు పోరెను. స్థిరబుద్ధి పరాక్రముని ఈఁటె పోటునఁ జంపి వానిచావునకు కుపితు లయిన వసువు లెనమం

డుగురతోను యుద్ధము చేసెను. ప్రభాసుఁడు భాసుని విరథీకరించిన మర్దనుని తాను దామోదరగణాసక్తుఁ డయ్యు నొక కోలం గూల్చెను. ప్రకంపనుఁడు అస్త్రయుద్ధముచే తేజఃప్రభుని సంహరించి వానివధమునకు క్రుద్ధుఁడయిన యగ్ని దేవునితో పోరుచుండెను. యుద్ధములో యమదంష్ట్రుని చంపిన ధూమకేతువునకు అందులకు అలిగిన యమునితో దారుణయుద్ధము ఆయెను. సింహదంష్ట్రుఁడు శాంతితో సురోషణుని పొడిచేసి వానివధమున కలిగిన నిరృతితో పోరఁ దొడంగెను. కాలచక్రుఁడు వాయుబలిని చక్రాయుధముతో రెండు తుండెములు చేసెను. ఆకోపముచే వాయువు మండిపడుచు వచ్చి వానితో యుద్ధముచేసెను. నాగాద్రివృక్షరూపములు దాల్చి మాయ చేయుచున్న కుబేరదత్తుని మహామాయుఁడు తార్క్ష్య వజ్ర వహ్ని రూపములు దాల్చి తెగటార్చెను. అందులకు కుపితుఁడై కుబేరుఁడు వానితో పోరసాగెను. ఇట్లు ఇతర దేవతలు తమ తమ వారి వధముల కలిగి యుద్ధములో ప్రవేశించిరి. కడమ విద్యాధరాధిపులును ఆయామనుజదానవులచే మడిసిరి.

ఆలోపల ప్రభాసునికి దామోదరునికి పరస్పరాస్త్ర ప్రత్యస్త్ర భయంకరముగా సంగ్రామము జరుగు చుండెను. దామోదరుఁడు చాపము విఱుగఁగా సారథి చావఁగా వేఱు చాపము గొని తానే కళ్లెములు చేతఁ బూని పోరుచుండెను. అందుల కతనిని బ్రహ్మపొగడఁగా ఆయనను ఇంద్రుఁడు'స్వామీ,

క్షయించుచున్న వీనివిషయ మై తుష్టి నొందెద వేల?' అని యడిగెను. బ్రహ్మ యి ట్లనియె.—'ఇంత సేపు ప్రభాసునితోఁ బోరిన యితని విషయమై తృప్తి గాకుండునా? హర్యంశమునఁ బుట్టిన దామోదరుఁడు తప్ప ఈపని మఱి యెవరు చేయుదురు? ఒక్క ప్రభాసునికి దేవత లందఱును రణములో చాలరు. పూర్వము నముచి యని సురమర్దనుఁడు అసురుఁ డుండెను గదా. అతఁడు పిమ్మట ప్రబలుఁ డనుపేర నవతరించి సర్వరత్న మయుఁడై యుండెను. అతఁడే ఇపుడు భాసపుత్త్రుఁడు ప్రభాసుఁ డైనాఁడు. ఇతని జయింప శక్యము గాదు. ఈభాసుఁడు పూర్వము కాలనేమి యను మహాసురుఁడు, పిమ్మట హిరణ్య కశిపుఁడై, తరువాత కపింజలుఁ డైనాఁడు. పూర్వము సుముం డీకుఁడై యున్నవాఁడే ఈసూర్యప్రభుఁడు, పూర్వపుహిరణ్యా క్షుఁడే యీసునీథాసురుఁడు. ఈప్రహస్తాదు లందఱును దైత్య దానవులు, పూర్వము మీచే మడిసిన యసురులే ఇప్పు డిట్లు పుట్టియున్నారు. కాన మయాదులు వీరిపక్షమును అవలంబించి నారు. సూర్యప్రభాదులు చక్కఁగా చేసిన రుద్రయాగంపుఁ బ్రభావముచే బలిచక్రవర్తి బంధనములు వీడి ఈదురము చూడ వచ్చినాఁడు చూడు. ఇతఁడు తన సత్యవచనమును కాపాడు వాఁడై నీరాజ్యకాలము ముగియువఱకు పాతాళములోనే ఉండును, పిమ్మట తానే ఇంద్రుఁ డగును. వీరిని రుద్రుఁడు అవ

లంబించియున్నాఁడు. కనుక మీకు ఇప్పుడు జయకాలము గాదు. పట్టు మానుఁడు, సంధి చేసికొనుఁడు.'

బ్రహ్మ యిట్లు పలికినంతలో ప్రభాసుఁడు పాశుపతాస్త్రమును ప్రయోగించెను. సర్వసంహారి యగు నా రౌద్రాస్త్ర విజృంభణమును చూచి హరి సుతస్నేహముచే సుదర్శన చక్రమును ప్రయోగించెను. అంత నాదివ్యాస్త్రములు రూపములు దాల్చి ఒండొరువులతో పోరఁ దొడంగినవి. ఆకాలమందు సర్వసంహార మగు నని మూఁడులోకములును వణఁకుచుండెను. నీయస్త్రమును ఉపసంహరింపుము, నాయస్త్రమును నేను ఉపసంహరించెదను.' అని హరి ప్రభాసుని అడిగెను. 'ప్రయుక్తమైన నాయస్త్రము వృథా పోదు, కనుక దామోదరుఁడు పోరు మాని పాఱిపోవుత, అస్త్రమును ఉపసంహరించెను.' అని ప్రభాసుఁడు పలికెను. 'అటయిన నాయస్త్రమును నీవును సన్మానింపుము. రెండును విఫలములు కావు గాక.' అని హరి కోరెను. ప్రభాసుఁడు కాలమెఱిఁగి 'అట్లే కానిమ్ము, నీచక్రము నారథమును కొట్టును గాక.' అని యొడంబడెను. అంత హరి దామోదరుని రణము నుండి తొలంగించెను. ప్రభాసుఁడు అస్త్రమును వెనుదివిచెను. చక్రాయుధము రథముపైఁబడెను. ప్రభాసుఁడు మఱియొక తేరెక్కి సూర్యప్రభుని యొద్దకు పోయెను. దామోదరుఁడు శ్రుతశర్మ యొద్దకు పోయెను.

ఆవేళ ఇంద్రాంశగర్వితుఁ డైన శ్రుతశర్మకును సూర్య ప్రభునికిని యుద్ధము మిక్కుటముగా నుండెను. శ్రుతశర్మ ప్రయోగించినట్టి యొక్కొక్క యస్త్రమును సూర్యప్రభుఁడు ప్రత్యస్త్రముచే వారించుచుండెను. శ్రుతశర్మ ప్రయోగించిన యొక్కొక్కమాయను సూర్యప్రభుఁడు ప్రతిమాయచే నాశము చేసెను. అంత నతికోపముచే శ్రుతశర్మ బ్రహ్మాస్త్రము నేసెను. సూర్యప్రభుఁడు పాశుపతాస్త్రము ప్రయోగించెను. దుష్ప్రధర్ష మైన యారౌద్రమహాస్త్రము ఆబ్రహ్మాస్త్రము నడంచి శ్రుత శర్మను చంపునది యై జ్వలించుచుండెను. సూర్యప్రభుఁడు ఆ మహాస్త్రమును ధ్యానించి 'స్వామీ శ్రుతశర్మను చంపవలదు. వానిని కట్టి తెచ్చి నా కప్పగింపుము.' అని విన్నవించు కొనెను. అంతట దేవత లందఱు యుద్ధసన్నద్ధు లైరి. వారిని జయింపఁ గోరి చూడ వచ్చిన యసురులును సన్నద్ధు లయిరి. ఆ క్షణమందు వీరభద్రుఁడు వచ్చి శివాజ్ఞను ఇంద్రాదుల కిట్లు చెప్పెను.— 'మీరు చూడ వచ్చినవారు, పోరుటకు ఏమి న్యాయ మున్నది! స్థితిని దాఁటుటకన్న అయుక్త మేమి కలదు?' ఇంద్రాదు లనిరి.—మాయందఱ కుమారులు చచ్చిరి, చచ్చుచున్నారు. మేము పోరక ఎట్లు ఉందుము? సుతస్నే హము వదలరానిది, కనుక వారిని చంపువారిపై యథాశక్తి పగ తీర్చుకొనుచున్నాము. ఇందు అక్రమ మే మున్నది?' ఇట్లు

దేవతలు పలుకఁగా వీరభద్రుఁడు పోయెను. దేవాసురులకు సంగ్రామము ప్రవర్తిల్లెను.

సునీథుఁడు అశ్విదేవతలతోను, ప్రజ్ఞాఢ్యుఁడు చంద్రునితోను, స్థిరబుద్ధి వసువులతోను, కాలచక్రుఁడు వాయువుతోను, ప్రకంపనుఁడు అగ్నితోను, సింహదంష్ట్రుఁడు నిరృతితోను, ప్రమథనుఁడు వరుణునితోను, ధూమకేతువు యమునితోను, మహామాయుఁడు కుబేరునితోను, అస్త్రప్రత్యస్త్రములతో దేవతలతో సమముగాఁ బోరుచుండిరి. చిట్టచివర అమరుఁడు ఏయే యస్త్రమును ప్రయోగించెనో దానినెల్ల హరుఁడు హుంకారముచే నాశముచేసెను. కుబేరుఁడు గద యెత్తఁగా శివుఁడు మంచిమాట చెప్పి నివారించెను. కడమ సుర లందఱు భగ్నాస్త్రులై యుద్ధము మాని వెడలిపోయిరి. ఇంద్రుఁడు స్వయముగా సూర్యప్రభునితో పోర వచ్చి అతనిమీఁద బాణతతిని నానాయుధములను వర్షించెను. సూర్యప్రభుఁ డాయస్త్రములను అవలీలగా ఎగురఁగొట్టి చెవివఱకు తెగఁ బాఱఁ దీసి నూఱు నారసముల నింద్రు నేసెను. ఇంద్రుఁడు క్రుద్ధుఁడై వజ్రాయుధమును కైకొనియెను. శివుఁడు హుంకారము చేసెను. వజ్రము నశించెను. ఇంద్రుఁడు పరాఙ్ముఖుఁడు కాఁగా, నారాయణుఁడు స్వయముగా ప్రభాసునితో పోరఁదొడంగి క్రోధముచే వానిపై కోటీముఖము లగు బాణము లేసెను. ప్రభాసుఁడు వెఱవక అస్త్రములను ప్రత్యస్త్రములఁ గొట్టుచుఁ బోరి హతా

శ్యుఁడై విరథుఁడై వేఱురథ మెక్కి ఆ దైత్యారితో భేదము లేకుండ యుద్ధము చేయుచుండెను. అంతట కోపగించి దేవుఁడు మండుచున్న చక్రమును ప్రయోగించెను. ప్రభాసుఁడు అభి మంత్రించి దివ్యఖడ్గమును ప్రయోగించెను. ఆయాయుధములు ఒకటితో నొకటి పోరుచుండఁగా చక్రమువలన ఖడ్గము ఓడ నుండుట గని శంకరుఁడు హుంకారము చేసెను. అంత నాచక్ర ఖడ్గములు రెండును అంతర్ధానము పొందినవి.

సూర్యప్రభుని విజయము.

అంతట సూర్యప్రభునికి జయము కలిగి శ్రుతశర్మ బద్ధుఁడు కాఁగా అసురులు సంతసిల్లిరి. సురలు విషాదము నొందిరి. అంతట దేవతలు వృషభధ్వజుని స్తుతించి పూజించిరి. సంతుష్టుఁడై అంబికాపతి దేవతలతో 'సూర్యప్రభునికి నేను ప్రతిజ్ఞ చేసినది తప్ప మీ కిష్ట మయిన వరమును వేఁడుఁడు.' అనెను. 'దేవా, నీప్రతిజ్ఞను తప్పింప నెవ్వనితరము? మఱి మేము ఈశ్రుతశర్మకు ప్రతిజ్ఞ చేసినది కూడ, ఓప్రభూ, సత్య మగునుగాక, మాయంశములకు క్షయ ముండదు గాక.' అని వేఁడి దేవతలు విరమింపఁగా, భగవంతుఁడు 'సంధి చేసిన ఇది సంఘటిల్లును. మీకు ఇట్లు సంధి యగునుగాక, శ్రుతశర్మ అను చరసమేతుఁడై సూర్యప్రభునికి ప్రణమిల్ల వలయును. అటు పయిని ఇరువురకును హితముగా చెప్పెదము.' అనెను. దేవ తలు ఆ యీశ్వరు నానతిమెయి శ్రుతశర్మచే సూర్యప్రభునికి

ప్రణామము చేయించిరి. వా రిరువురును పరస్పరము ద్వేషము మాని కంఠాలింగనములు చేసికొనఁగా దేవాసురులు శాంత వైరు లయి సంధి చేసికొనిరి. సురాసురు లెల్ల వినుచుండ భగవంతుఁడు శివుఁడు సూర్యప్రభుని కీ ట్లాన తిచ్చెను.—'దక్షిణ వేద్యర్థమందు నీవుచక్రవ_ర్తివిగానుండుము, ఉ_త్తరవేద్యర్థమును శ్రుతశర్మ కిమ్ము. పుత్త్రా, నీకు త్వరలోనే కిన్న రాది సమ_స్త వ్యోమచారులపై ఇంతకు నాలుగింతలు సామ్రాజ్యము కలుగును. అది కలుగఁ గానే దక్షిణ వేద్యర్థమును నీవు కుంజర కుమారునికి ఇమ్ము, యుద్ధములో ఉభయ పక్షములలోను మడిసినవీరులు అందఱు అక్షతాంగు లై జీవితు లై లేతురు గాక.' ఇట్లు పలికి శివుఁడు అంతర్హితుఁ డాయెను. రణనిహతు లందఱును నిదుర మేల్కొన్న వారివలె అక్షతాంగు లై లేచిరి.

## సూర్యప్రభుని యభ్యుదయము.

శత్రుమర్దనుఁ డయిన యాసూర్యప్రభుఁడు శంభుశాసనమును మౌళిని ధరించి వివి_క్తమగు విశాల ప్రదేశమునకు పోయి నిండోలగం బుండ, శ్రుతశర్మ వచ్చెను. వానిని సూర్యప్రభుఁడు తన యర్ధసింహాసనమునఁ గూర్చుండఁ బెట్టుకొనెను. ఆతని చెలికాండ్రు ప్రభాసాదులును శ్రుతశర్మమిత్త్రులు దామోదరాదులును వారికి ఇరుపార్శ్వములయందును గూర్చుండిరి. సునీథుఁడును మయుఁడును ఇతరదానవులును విద్యాధరేశ్వరులును, యథార్హాసనములం గూర్చుండిరి. ఆ యోలగమునకు

ఏడుపాతాళముల యొకిమీఁలు ప్రహ్లాదప్రభృతి దైత్యదానవేంద్రులు అందఱును సంతసమున వచ్చిరి. ఇంద్రుఁడు లోకపాలాదిసమేతుఁడై గురువును మున్నిడుకొని వచ్చెను. విద్యాధరేశ్వరుఁడు సుమేరువు సువాసకుమారాన్వితుఁడై వచ్చెను. దన్వాదికశ్యపభార్య లెల్లరును వచ్చిరి. భూతాసనవిమాన మెక్కి సూర్యప్రభుని భార్యలందఱును వచ్చిరి. వీరందఱును కృతపరస్పరప్రీత్యుచితాచారులై కూర్చుండఁగా దనుదేవిసఖి సిద్ధి యనునది ఆమెయాజ్ఞచే నిట్లనియె: 'ఓసురాసురులారా, దనుదేవి మిమ్ము ఇట్టులు బోధించుచున్నది. ఈ ప్రీతిసమాజమందు మీకు ఏతృప్తియు సుఖమును కలిగినవో అవి యెన్నఁడైనను అనుభవించి యుంటిరా? కనుక దుఃఖదారుణ మయిన యన్యోన్యవిరోధమును మీరు పెట్టుకొనకుఁడు. స్వర్గాధిపత్యముకై విరోధమును ఎవరు చేసిరో ఆ హిరణ్యాక్షాదులు పోయినారు. ఇప్పుడు శక్రుఁడే పెద్దవాఁడు, విరోధ మే మున్నది? కనుక పరస్పరము నిర్వైరముగా సుఖముగా నుండుఁడు. అందువలన మాకు సంతోషము లోకములకు క్షేమమును కలుగును.' ఇట్లు సిద్ధిముఖముగా విని శక్రుఁడు తనమొగము చూడఁగా, బృహస్పతి దానికి 'ఈ యసురులు నిర్నిమిత్తముగా దేవతలపై కలుషింపరేని దేవతలకు అసురులపై ద్వేషము ఉండదు.' అని పలికెను. అందులకు మయుఁడు 'అసురులు కలుషించు వారేని నముచి మృతసంజీవన మైన యుచ్చైశ్శ్రవమును ఇంద్రుని

కెట్లిచ్చును? ప్రబలుఁడు తన దేహమును ఈసురల కెట్లు ఇచ్చును? వారికి మూఁడులోకములు ఇచ్చి ఈబలి కారాగృహ మేల ప్రవేశించును? అయోదేహుఁడు తనదేహమును విశ్వకర్మ కెట్లిచ్చును? ఇంక నిదర్శనములు కావలయు నేని ఎన్ని చెప్పుదును? ఇట్లు నిత్యము గౌరవించుచుండునసురులను సురలు మిషచే బాధింపరేని విరోధ మెక్కడిది?' అనెను. అందులకు సిద్ధి చెప్పిన మంచిబోధనలచే దేవాసురులు అన్యోన్యమిత్రులై కంఠాలింగనములు చేసికొనిరి.

## కామచూడామణీ వివాహము.

అంతలో భవానిప్రతీహారి జయ వచ్చి పూజిత యై సుమేరువుతో ననియె:—'నన్ను దేవి పంపినది; ఆమె నీ కిట్లు ఆజ్ఞాపించుచున్నది. 'నీకు కామచూడామణి యని కన్య యున్నది గదా, దానిని నాభక్తురాలిని శీఘ్రముగా సూర్యప్రభునికి ఇమ్ము.' సుమేరువు వినీతుఁడై పలికెను.—'దేవియాజ్ఞ నాపై పరమానుగ్రహము గదా? దేవుఁడు కూడ ఈ విషయమునే పూర్వము నా కాజ్ఞాపించి యున్నాఁడు.' జయ సూర్యప్రభునితో 'నీ యందఱు భార్యలలోను ఈమెను నీవు ఎక్కువగా చూచుకొనవలసినది. ఈమె కడమయందఱు భార్యలకంటె నీకు ప్రియతర యగును. ఇట్లనియు దేవి నీకు ప్రసన్నయై ఆజ్ఞ యను గ్రహించినది.' ఇట్లు పలికి జయ సూర్యప్రభునిచే పూజిత యై యదృశ్యురా లాయెను. ఆ దినమే సుమేరువు శుభలగ్నము

నిశ్చయించి, కంబములును నెలకట్టును మణిమయముగా పెండ్లి యరఁగు చేయించి, ఆమణులకాంతిచే అగ్ని పొసఁగువడిన ట్లొప్పుచుండఁగా, కామచూడామణిని రావించెను. ఆమెలావణ్యమును లోలుపములైన దేవాసురేక్షణములు త్రాగునవియుంబోలె నుండెను. ఉమ హిమవంతునివలనఁ బుట్టినది, ఈమె సుమేరువువలనఁ బుట్టినది, అనియుంబోలె ఉమతో సమానమైన సౌందర్యము గలదై కామచూడామణి వెలుంగుచుండెను. ఆమెను పెండ్లికూఁతుఁగావించి వేది యెక్కించి సాలంకారముగా సుమేరువు సూర్యప్రభునికి దానముచేసెను. సూర్యప్రభుఁడును దనుప్రభృతులచే బద్ధకంకణమైన కామచూడామణీ పాణిపంకేరుహమును చేపట్టెను. తొలిలాజహోమమున జయ వచ్చి సూర్యప్రభునికి భవాని పంపిన యనశ్వర దివ్యమాల నిచ్చెను. సుమేరువు వెలలేని రత్నములును ఐరావణముకొడుకయిన యొక వారణేంద్రమును ఇచ్చెను. రెండవ లాజహోమమందు జయ రత్నావళి నిచ్చెను; దానిని కంఠమందుఁ దాల్చిన క్షుత్తృష్ణామృత్యువులు బాధింపవు. సుమేరువు రెండింతల రత్నరాశిని ఉచ్చైఃశ్రవముకొడుకయిన హయవతంసమును ఇచ్చెను. జయ మూఁడవ లాజమోక్షమున కంఠమున ధరించిన యౌవనమును నిలుపునదైన యేకావళి నిచ్చెను. సుమేరువు మూఁడింతల రత్నరాశిని, సర్వసిద్ధ్యుపయోగి యగు గుళికను, ఇచ్చెను.

వివాహము ముగియఁగా సుమేరువు అచ్చటఁ జేరిన సురాసుర విద్యాధర దేవ మాతృ ప్రభృతులను అందఱను 'మీ రందఱు ఈదినము మాయింట దయచేసి భోజనము చేయవలయును; ఇదిగో శిరమున అంజలి చేర్చితిని.' అని వేఁడుకొనెను. సుమేరుని యీ ప్రార్థనను విని అందఱు అంగీకరింపక ఉండఁగా, నందీశ్వరుఁడు వచ్చెను. అందఱును అతనికి ప్రణతులయిరి. అంతట నంది " 'సుమేరువునింట మీరందఱు భుజింపవలసినది. ఇతఁడు మాపరిగ్రహము గదా. ఇతని యన్నము తిన్న మీకు శాశ్వత మైన తృప్తి గలుగును.' అని మీకు త్రిశూలపాణి ఆజ్ఞాపించుచున్నాఁడు." అనెను. నందివచనము విని అందఱు అంగీకరించిరి. అంతట అచటికి లెక్కలేని సంఖ్యలుగా ప్రమథులు వినాయక మహాకాల వీరభద్రాద్యధిష్ఠితు లై వచ్చి ఆ వేదిని భోజన సన్నద్ధముగాఁ జేసి, ఆ దేవాసుర విద్యాధర మానుషులను కూర్చుండఁబెట్టి వారికి అందఱకు సుమేరు విద్యాకల్పితములును శంకరాజ్ఞచే కామధేనువు పిదికినవియు నైన యాహారములను వడ్డించిరి. ప్రతివానియొద్దకును యథార్థముగా కావలసినదానిని విచారించుచు వీరభద్ర మహాకాల భృంగి ప్రభృతులు తిరుగుచుండిరి. ఎల్లయెడలను సంతసముచే ఖేచరులు కూడు చుండ, దివ్యాంగనానృత్యసుందరముగా సంగీతకము ఘూర్ణిల్లుచుండెను. ఆహారాంతమందు వారి కందఱకు నందీశ్వరాదులు దివ్య మాల్య వస్త్రాభరణముల నొసంగిరి.

ఇట్లు దేవాదులను సమ్మానించి నందిప్రభృతి గణేశ్వరు లందఱును తమయిచ్చను బోయిరి. అంతట దేవాసురు లందఱును వారితల్లులును పోయిరి. శ్రుతశర్మాదులును సెలవు పుచ్చుకొని తమతమ ధామములకుఁ బోయిరి. సూర్యప్రభుఁడు భార్యలతోను మిత్త్రులతోను పెండ్లికొమారితతోను విమాన మెక్కి ఆ మొదటి సుమేరు తపోవనమునకుఁ బోయెను. రాజులకును రత్నప్రభునికిని తన యభ్యుదయము చెప్పు మని తనమిత్త్రుని హర్షుని పంపెను.

రాత్రి మణిమయ పర్యంకాలంకృత మైన వాసగృహమును కామచూడామణీ సహాయుఁ డై ప్రవేశించెను. అందు ఆనవవధూమణిని బిగికౌఁగిటం గ్రుచ్చి కెమ్మోవి యాని లజ్జవాపి అన్యులవలన లభింపనివి యనాస్వాదితపూర్వము లయిన రతోత్సవంబులం దేలెను. 'ఇఁకను ఇతరులు నాహృదయమునకు బైటనే ఉండురుగాక, నీవుమాత్రము నాహృదయమున లోపల నుందువు గాక.' అని పలికి సూర్యప్రభుఁడు ఆమెను రంజించెను. రతాంతసుప్తుని కాతనికి ప్రియాశ్లేష సుఖావహ లయిన నిశానిద్రలు సమాప్తి నొందినవి. తెల్లవాఱఁగానే పోయి సూర్యప్రభుఁడు ఒకచోఁ గలసి యున్న తన తొల్లిభార్యల నందఱను రంజించెను. వారు నవవధూరక్తుని అతనిని పరిహాసించుచుండఁగా, దౌవారిక నివేదితుఁ డై సుషేణుఁ డను విద్యాధరేశ్వరుఁడు వచ్చి ప్రణమిల్లి సూర్యప్రభునికి విన్నవించెను:

'దేవా, త్రికూట నా థాది విద్యాధ రేశ్వరు లెల్ల నన్ను నీ యొద్దకు పంపినారు. వారి విన్నపము నవధరింపుము: 'నేఁటికి మూఁడవనాఁడు ఋషభార్క్షిలో నీకు అభిషేకము శుభము. అందులకు ఉద్యమ మారంభింపుము.' అని." అందులకు సూర్య ప్రభుఁడు " 'మీరే ఎల్ల సరంజామును చేయుఁడు. మేము మామాత్రముగానే సిద్ధముగా నున్నాము. అందఱకు ఉచిత ముగా సంవాదనము చేసెదము.' అని మామాటగా వారితో చెప్పుము." అనెను. ఆయాజ్ఞను గ్రహించి సుషేణుఁడు చనెను. సూర్యప్రభుఁడును ఒక్కొకరిని దేవతలనుయాజ్ఞవల్క్యాదులను రాజులను విద్యాధరులను తనయభిషేక మహోత్సవమునకై పిలుచుటకు ప్రభాసాది మిత్త్రులను పంపెను.

## సూర్యప్రభుని విద్యాధర రాజ్యాభిషేకము.

పిమ్మట పర్వతోత్తమ మైన కైలాసమునకు ఏకాకిగా అంబికాగిరీశులను స్వయముగా పిలిచి రాఁబోయెను. శుభ్ర భూతిధవళ మై దేవర్షిసిద్ధసేవ్యం బై శంకరునింబోలి రాజిల్లు చున్న యాకైలాసగిరిని సూర్యప్రభుఁడు దర్శించి, నగమునకు ఎక్కఁబ రెక్కి అటుపయి నెక్కలేక నలుదిక్కులు చూడఁగా అచట పగడపు ద్వార మొకటి యగపడెను. సిద్ధిమంతుఁడయ్యు అందు ప్రవేశము అసాధ్యము కాఁగా, ఏకాగ్రచిత్తుఁ డయి చంద్రశేఖరుని స్తుతింపసాగెను. అంతట గజముఖుఁ డైనయొక పురుషుఁడు ఆద్వారమును తెఱచి 'రమ్ము లోపలికి. హేరంబ

దేవుఁడు నీకు ప్రసన్నుఁ డయినాఁడు?' అనెను. సూర్యప్రభుఁడు ఆశ్చర్యపడి లోపలికిఁ బోయెను. అచట అతి విశాల జ్యోతీరస శిలాతలమందు పన్నిద్దఱు సూర్యుల ప్రభతో వెలుంగుచు కూర్చుండి యున్న యొంటికోఁటియేనుఁగుమోముబొజ్జదేవరను నానాజంతువుల మోములుగల ప్రమథులచే కొలువందుచున్న వానిని చూచి పాదముల వ్రాలెను. విఘ్న రాజు ప్రీతుం డై యతనిని వచ్చినకారణ మడిగి తెలిసికొని 'ఈ దారిని ఎక్కి పొమ్ము.' అని దయతో చెప్పెను. సూర్యప్రభుఁడు ఆదారిని అయిదు యోజనములు ఎక్కి ఒకగొప్ప పద్మరాగ ద్వారమును గాంచెను. లోపలికి ప్రవేశము లభింపక పినాకిని నామ సహస్రముతో ననన్యమానసుఁ డై స్తుతించెను. అంతట కుమార కుమారుఁడు విశాఖుఁడు స్వయముగా ఆ ద్వారమును తెఱచి, తన్ను తెలియఁ జెప్పి, సూర్యప్రభుని లోపలికి ప్రవేశించి, కొని పోయెను. అచట శాఖవిశాఖాంది పరస్పర సదృశ సుత పంచక పరియుక్తుం డై జాతమాత్ర బాధకము లయిన దుష్టగ్రహ శిశు గ్రహములచేతను చరణానతు లయిన కోటిమంది గణేశుల చేతను వేష్టితుఁ డై యున్న జ్వలదనల సమప్రభుని స్కందుని దర్శించెను. ఆశరవణభవదేవుండును తుష్టుఁ డై సూర్యప్రభుని వచ్చి కారణ మడిగి ఆపై మార్గము చూపించెను.

ఈ క్రమమున సూర్యప్రభుఁడు సానుచరులగు భైరవ మహాకాళ వీర భద్ర నందులచే విరుద్ధము లయిన కడమ రత్న

ద్వారములను అయిదింటిని దాటి, కొండపై ఒకస్ఫాటిక ద్వారమును కాంచెను. అచట దేవదేవుని స్తుతింపఁగా నొకరుద్రుఁడు తలుపు తీసి సాదరముగా నితనిని లోపలికి కొనిపోయెను. దివ్యగంధ వహద్వాతము సదాపుష్పఫల ద్రుమము గంధర్వారబ్ధ సంగీతము అప్సరోనృత్తరసోత్సవము నై స్వర్గాధిక మైన శంకరు నాలయమును సూర్యప్రభుఁడు చూచెను. అందు ఒక చోట పార్శ్వస్థిత యై గిరిజాదేవి సేవించుచుండ, స్ఫాటికసింహాసనాసీనుఁ డైన చంద్రార్ధశేఖరుని శూలపాణిని పింగజటాజూటుని స్వచ్ఛస్ఫటిక సన్నిభుని త్రిలోచనుని మహేశ్వరునిఁ గాంచి ఆనందసాగరమగ్నుఁ డై సూర్యప్రభుఁడు సదేవీకుఁ డయిన యాదేవుని పాదముల వ్రాలెను. మహేశ్వరుఁడు అతనిని వీఁపున చేయి పెట్టి లేపి కూర్చుండఁ బెట్టి 'ఏల వచ్చినాఁడ' వని యడిగెను. 'నాకు అభిషేకము సమీపించినది, ప్రభువుయొక్క సన్నిధానమును వేఁడ వచ్చితిని.' అని సూర్యప్రభుఁడు విన్నవించుకొనెను. 'పుత్త్రా, నాసన్నిధానమునకై ఇంత శ్రమపడితి వేల? అచటనే స్మరించిన రానా? కానిమ్ము వచ్చెదను.' అని భక్తవత్సలుఁడు పలికి చెంత నున్న ప్రమథు నొకనిం బిలిచి, 'లెమ్ము. ఇతనిని అభిషేకార్థము ఋషభపర్వతమునకు కొని పొమ్ము. అది యీచక్రవర్తులకు మహాభిషేకస్థానము గదా.' అని యాజ్ఞాపించెను. అంత నాగణోత్తముఁడు కృత శివ ప్రదక్షిణుని సూర్యప్రభుని ప్రణతుఁ డై ఒడిలో కూర్చుండఁబెట్టు

కొని తనసిద్ధి ప్రభావముచే తత్క్షణమే ఆ ఋషభపర్వతములో వదలి అదృశ్యుఁ డాయెను. సూర్యప్రభుఁ డచట నుండఁగా, అతనిచెలికాండ్రు, కామచూడామణ్యాదిభార్యలు, విద్యాధరాధిపతులు, ఇంద్రాదిదేవతలు, మయాద్యసురులు, మహర్షులు, శ్రుతశర్మ, సుమేరువు, సువాసకుమారుఁడును వచ్చిరి. వారి నందఱను సూర్యప్రభుఁడు యథార్హముగా సమ్మానించెను. అతనివలన రుద్ర దర్శన వృత్తాంతమును విని వా రందఱును సంతసిల్లిరి.

అంతట నానామహౌషధీసహిత మయిన నదీ నద సాగరతీర్థ జలములను మణి కనక కుంభములలో ప్రభాసాదులు స్వయముగా తెచ్చిరి. అంతలో గౌరీసమేతుఁ డై మహేశ్వరుఁడును అచటికి వచ్చెను. ఆయనపాదములకు దేవాసుర విద్యాధర నృపతి మహర్షు లందఱును ప్రణమిల్లిరి. ఆ సురాసుర విద్యాధరులు పుణ్యాహఘోషము చేయుచుండఁగా మహర్షులు సూర్యప్రభుని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి విద్యాధరాధిరాజ్యమునకు అభిషేకము చేసిరి. సంతోషముతో విజ్ఞానమయుఁ డైన మయాసురుఁడు అతనికి పట్టమును మకుటమును కట్టెను. తూర్యములతో దేవదుందుభులు మ్రోఁగెను. దివియందు అచ్చరలు నృత్యము చేసిరి. మహర్షి సమూహము ఆకామచూడామణిని కూడ అభిషేకము చేసి సూర్యప్రభునికి మహాదేవినిగా చేసెను. పిమ్మట, దేవాసురులు పోఁగా, సూర్య

ప్రభుఁడు బంధుమిత్రులతోఁ గూడ అచ్చట విద్యాధర చక్రవర్తియై మహోత్సవము చేసెను. కొన్ని దినము లయిన తర్వాత పూర్వము శంకరుఁ డాజ్ఞాపించినట్లు శ్రుతశర్మకు ఉత్తరవేదర్ధమును ఇచ్చి, ఇంక కొందఱు భార్యలను పొంది చిరకాలము విద్యాధరరాజ్యలక్ష్మిని అనుభవించుచుండెను.—

ఇట్లు మనుష్యమాత్రుఁ డయిన సూర్యప్రభుఁడు శివ ప్రసాదముచే విద్యాధర చక్రవర్తిత్వమును పొందెను.

ఇట్లు ఆ విద్యాధరశ్రేష్ఠుఁడు వజ్రప్రభుఁడు వత్సరాజు నెదుట కథ చెప్పి, నరవాహనదత్తునికి ప్రణమిల్లి ఆకాశమున పోయెను. అతఁడు పోఁగానే, నరవాహనదత్తుఁడు తనదేవి మదనమంచుకతోఁ గూడ తండ్రియింట విద్యాధరేంద్ర పద ప్రాప్తిని ఎదురుసూచుచు ఉండెను.

సూర్యప్రభలంబకము సమాప్తము.

---

# అలంకారవతీలంబకము.

## ౧ - వ తరంగము.

---

### అలంకారవతి కథ.

క. పర్వతములును నిశుంభ న
తోర్వీఖర్వీతము లగుచు నొగి మ్రొక్కఁగతిం
బర్వెడు నే నర్తిల్లు సు
పర్వుని, కా బొజ్జసామి పాలించు మముఁ.

ఇట్లు నరవాహనదత్తుఁడు కౌశాంబిలో ఆదియందే విద్యాధరాధీశులచే నుతులు గొనుచు తండ్రియింట ఉండెను. ఒకనాఁడు గోముఖసహాయుఁడై వేఁటకుఁ బోయి, సేనవెనుకఁ జిక్కఁగా, నొకమహారణ్యము ప్రవేశించెను. అతనికి కుడికన్ను అదరి శుభాగమమును చెప్పుచుండఁగా, దివ్యవీణారవమిశ్రమైన గీతనిస్వనము వినఁబడెను. దాని ననుసరించి పోయి చెంగట నొక శివాలయమును స్వయముగా వెలసిన దానిని చూచి, గుఱ్ఱమును నిలిపి అందు ప్రవేశించెను. అచ్చట దేవదేవునికి వీణాగానసేవ చేయుచున్న యొక దివ్యకన్యను అనేక వరకన్యాపరివృతను చూచెను. ప్రసరత్కాంతినిర్ఝరయైన యామె చంద్రమూర్తి సముద్రమునుంబోలె అతనిహృదయమును కలఁత

పెట్టెను. ఆమెయు నతనిని ప్రణయముగ్ధాలోకనములతోఁ జూచి తదేకగతమానస యై స్వరసారణను మఱచి పోయెను. నరవాహనదత్తుని మన మెఱిఁగి గోముఖుఁడు ఆచెలులను 'ఈమె ఎవరు? ఎవరికొమారిత?' అని యడిగెను. ఇంతలో ఆకాశమునుండి ఆమెకు సాటియైన హేమారుణప్రభ దిగెను. పిమ్మట ప్రౌఢ యైన యొకవిద్యాధరి దిగి ఆ కన్యప్రక్కఁ గూర్చుండెను. కన్యయు లేచి ఆమె పాదములకు ప్రణమిల్లెను. 'సర్వవిద్యాధరాధీశ్వరుఁడు నిర్విఘ్నముగా నీకు పతి యగునుగాక.' అని కన్యకు ప్రౌఢ ఆశీర్వదించెను. అంత నరవాహనదత్తుఁడు ఆమె యొద్దకుఁ బోయి నమస్కరించెను. ఆసౌమ్యరాలును ఆశీర్వదించెను. అంత నతఁడు ఆమెను 'అమ్మా, ఈకన్య యెవరు? నీ కేమి కావలయును? చెప్పుము.' అని యడిగెను. విద్యాధరి చెప్పుచున్నది.

గౌరిజనకుఁ డయిన పర్వతమందు శ్రీసుందరపుర మను నగరము కలదు. అందు అలంకారశీలుఁ డను విద్యాధరేశ్వరుఁడు కలఁడు. ఆ యుదారునికి కాంచనప్రభ యను పట్టపుదేవి కలదు. వారిరువురకు కాలక్రమమున నొకకొమరుఁడు పుట్టెను. 'వీఁడు ధర్మపరుఁడు అగును' అని కలలో పార్వతి ఆనతియ్యఁగా, తండ్రి వానికి ధర్మశీలుఁ డని పేరుపెట్టెను. వానికి యౌవనము రాఁగానే, తండ్రి కృతవిద్యునికి ఆ పుత్త్రునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేసెను, యౌవరాజ్యము చేయుచు వశి యై

యా కుమారుఁడు ధర్మైకపరముఁడై తండ్రికంటె నెక్కువగా ప్రజలను రంజించెను. పిమ్మట ఆ రాణి కాంచనప్రభ మరల గర్భిణి యై ఒక కన్యకను గనియెను. "ఈకన్య చక్రవర్తి నరవాహనదత్తునికి భార్య యగును." అని దివ్యవాణి ఆ తఱిని పలికెను. ఆమెకు అలంకారవతి యని తండ్రి పేరు పెట్టెను. ఆ కన్య క్రమముగా చంద్రకళయుంబోలె ఎదుగు చుండెను. ఆమె కాలక్రమమున జవ్వనియై తండ్రియొద్దనే సకలవిద్యలు నేర్చి నానా శివాలయములకును భక్తిచే భ్రమింప నుద్యోగించినది. అంతట ఆమెయన్న ధర్మశీలుఁడు లేఁబ్రాయమువాఁ డయ్యును ఏకాంతమున తండ్రితో నిట్లు విన్నవించెను.

"నాయనా, క్షణభంగురము లయినయీభోగముల మీఁద నాకు ప్రీతి లేదు. అంతమందు విరసము గానిది ఈసంసారములో ఏమి కలదు? వ్యాసముని వాక్యమును నీవు విన లేదా:—

'తే. పొడలుఁ దఱుఁగుటకై, పొడ వెదుగుఁ బడుట
కై, కడుం జేసుఁ బాయుటకై, జనించుఁ
బొలియుటకు నై, సుఖంబులఁ బొందు దుఃఖ
మొందుటకు నై పదార్థము లెందు నధిప.'

అట్టి నశ్వర భోగములయందు మనస్వులకు ఏమి ప్రీతి యుండును? భోగములు గాని, అర్థరాసులు గాని, పరలోకమునకు వెంట రావు. ధర్మ మొకటియే బంధువు, అదిమాత్రము

పురుషుని అడుగయినను పాయదు. కాఁబట్టి నేను అడవికిఁ బోయి ఉత్తమ మయిన తపస్సు చేసి శాశ్వత మయిన పరమ పదమును పొందెదను.” ఇట్లు కుమారుఁడు ధర్మశీలుఁడు పలుకఁగా తండ్రి యలంకారశీలుఁడు బాష్పాకులలోచనుఁడై యిట్లు పలుకుచున్నాఁడు:— ‘పుత్త్రా, బాలునికి నీకు అకాలములో ఏమి యీచిత్తభ్రమ! యౌవన మనుభవించిన పిమ్మటఁ గదా పెద్దలు శాంతిని విధించియున్నారు. వివాహమై ధర్మ్యముగా రాజ్యపరిపాలనము చేయుచు భోగము లనుభవించుట కిది కాలము గాని వైరాగ్యమునకుఁ గాదు.’ ధర్మశీలుఁ డనియె:— ‘శమమునకు అశమమునకు వయోనియమము లేదు. ఈశ్వరానుగ్రహ పాత్రమై బాలుఁడు కూడ శాంతిని భజించును. కాపురుషుఁడు వృద్ధుఁ డయ్యును శాంతిని సేవింపఁడు. నాకు రాజ్యమందును వివాహమందును ప్రీతి లేదు. నాకు తపస్సుచే శివుని ఆరాధించుటయే జన్మఫలము.’ కుమారుఁడు ఇట్లు పలుకఁగా తండ్రి అలంకారశీలుఁడు వానిపట్టుదలను నివారింప శక్యము గా దని గొణంగి కన్నీళ్లు విడుచుచు ‘పుత్త్రా, బాలునికి నీకే ఇట్టి వైరాగ్యమేని, వృద్ధునికి నాకు లేదా! కనుక నేనును తపముకై అడవికి వచ్చెదను.’ అని పలికి మనుష్యలోకమునకు పోయి, వేదబ్రాహ్మణులకు రత్నములును బంగారమును పదివేల బారువులు ఇచ్చి వచ్చి, భార్యతో ‘నీవు నాయాజ్ఞచే ఇచటనే నగరమందు అలంకారవతి

రక్షించుచు ఉండవలసినది. దీనికి ఇఁక ఒక సంవత్సరమునకు ఈతిథియందే వివాహార్థము శుభలగ్న మున్నది. నరవాహన దత్తునికి అప్పుడు దీనిని ఇచ్చెదను. ఆ యల్లుఁడు చక్రవర్తి యై మన యీ పురమును పరిపాలించును." అని పలికినవాఁడై విల పించుచున్న భార్యను బట్టు పెట్టి నిలిపి పుత్రునితో తపోవన మునకుఁ బోయెను.

భార్యయు భర్త్రాజ్ఞాపాలన చేయునదై కొమరితతోఁ గూడ నగరమందే ఉండెను. భర్త్రాజ్ఞను సాధ్వి యెవతె ఉల్లంఘించును ? ఆ కొమరిత యలంకారవతియు తల్లి స్నేహ ముచేఁ గూడ వచ్చుచుండఁగా అనేక శివాలయములకు భ్ర మించుచుండెను. ఒకనాఁడు ఆమెతో ప్రజ్ఞప్తివిద్య 'కాశ్మీర మండలి స్వయంభూ క్షేత్రములను పూజింపుము, అందువలన నిర్విఘ్నముగా సర్వవిద్యాధరేంద్రైకచక్రవర్తిని నరవాహన దత్తుని వివాహ మగుదువు.' అని చెప్పెను. అంత నామె తల్లితోఁగూడ పోయి ఆ పుణ్యక్షేత్రములందు శివుని పూజిం చెను. నందిక్షేత్రము, మహాదేవగిరి, అమరపర్వతము, సురేశ్వ రాద్రులు, విజయము, కపటేశ్వరము, మొదలైన క్షేత్రము లయందు గిరిజాపతిని పూజించి ఆ విద్యాధరేంద్ర కన్యయు తల్లియు ఇంటికి వచ్చిరి. ఓ సుందరుఁడా, ఆ యలంకారవతియే ఈమె, ఆకాంచనప్రభనే నేను. ఇప్పుడు ఈమె నాతో చెప్ప కయే యీ శివాలయమునకు వచ్చినది. దానిని నేను ప్రజ్ఞప్తి

విద్యచే నెఱిఁగి యిచటకి వచ్చితిని. ఆ విద్యవలననే నీవును ఇచటికి వచ్చితి వని ఎఱింగితిని. దేవతలు తెలిపిన యీ నా కన్యను స్వీకరింపుము. దీనితండ్రి చెప్పిన వివాహలగ్నము రేపు. ఇప్పటికి కౌశాంబికే పొమ్ము. మేమును ఇచటినుండి పోయెదము. రేపు దీనితండ్రి అలంకారశీలుఁడు తపోవనము నుండి వచ్చి దీనిని నీకు స్వయముగా ఇచ్చును.

ఇట్లు ఆమె పలుకఁగా అలంకారవతికిని నరవాహన దత్తునికిని ఇరువురకును అనిర్వచనీయ మైన దశావిశేషము కలిగెను. అపుడు సాయంకాలము ఆసన్నమై యుండఁగా చక్ర వాకమిథునము వోలె రాత్రిమాత్రవిరహమును సహింప లేక యా యిరువురును బాష్పాకులిత నేత్రులు కాఁగా చూచి కాంచనప్రభ యిట్లనియె:— ఏమి ఒకరాత్రి యెడఁబాపునకే మీకు ఈ యధైర్యము? ధీరులు పారము లేని విరహమును చిరకాలము సహింతురు. సీతారాములకథను వినుఁడు.—

## రాముఁడు సీతను విడనాడిన కథ.

తొల్లి అయోధ్యాధిపతి యైన దశరథుని కొమరుఁడు భరతశత్రుఘ్న లక్ష్మణుల యన్న శ్రీరాముఁడు ఉండెను. ఆయన రావణుని పరిమార్చుటకు అవతరించిన విష్ణువు. ఆయనకు జనకునికూఁతురు సీత భార్య యై ప్రాణప్రియయై యుండెను. తండ్రి విధియోగమున రాజ్యము భరతుని కిచ్చి ఇతనిని సీతా లక్ష్మణులతోఁ గూడ అడవికిఁ బంపెను. అచట రావణుఁడు

మాయచే సీతను హరించి, దారిలో జటాయువును సంహరించి, ఆమెను లంకకుఁ గొనిపోయెను. అంతట రాముఁడు విరహాతురుఁడై సుగ్రీవుని వాలివధచేత వశపఱుచుకొని, ఆంజనేయునిఁ బంపి ఆమెవృత్తాంతమును తెలిసికొని, పోయి, సముద్రమునకు అనకట్టు కట్టి, రావణుని సంహరించి, లంకారాజ్యము విభీషణుని కిచ్చి, సీతను కైకొనియెను. వనమునుండి వచ్చి భరతార్పితమయిన స్వరాజ్యమును రాముఁడు ఏలుచుండఁగా, సీత గర్భిణి యాయెను. ఒకనాఁడు రాముఁడు కొలఁదిమంది పరిజనులను వెంటఁ బెట్టుకొని ప్రజాచేష్టల నెఱుంగుటకై తిరుగుచుండ, ఒకపురుషుఁడు భార్యను, అది తనయిల్లు వదలి పరుని యింటికి పోయి వచ్చిన దని దోషము ప్రకటించి, చేయి పట్టి తొలఁగఁ ద్రోయుచుండఁగా చూచి, 'రక్షోగృహమున ఉండి వచ్చిన సీతను శ్రీరాముఁడు గ్రహించె నఁట; ఇతఁడు అంతకన్న గొప్పవాఁడు, జ్ఞాతియింటికి పోయి వచ్చిన నన్ను గ్రహింపఁడు.' అని ఆ భార్యయు చెప్పఁగా విని, ఖిన్నుఁడై నగరు సొచ్చి లోకాపవాదమునకు భయపడి సీతను వనమున విడిచి పెట్టెను. యశస్వి విరహక్లేశమును సహించునుగాని అయశస్సును సహింపఁడు. ఆమెయు గర్భాలసయై దైవవశమున వాల్మీకాశ్రమమునకుఁ బోయెను. అతఁడు ఆమెను ఓదార్చి అచటనే ఉంచి కాపాడెను.

'నిజముగా సీత దుష్టయే, కానిచో భర్త ఏల ఈమెను వదలినాఁడు? ఈమెను నిత్యము గూడుటచేత మనకు దోషము కలుగును. వాల్మీకి దయచే ఈమెను ఆశ్రమమునుండి పొమ్మనఁడు, ఈమెదర్శనమువలని పాపమును ఆయన తపస్సుచే పోఁగొట్టుకొనును. రండు మనము ఎక్కడి కైన మఱియొక యాశ్రమమునకు పోదము.' అని అచటి కడమ మునులు కలియఁ బలికికొనిరి. దాని నెఱిఁగి వారితో వాల్మీకి 'ఓ బ్రాహ్మణులారా, ఈమె శుద్ధాత్మురాలు, నేను సమాధిచేత నెఱిఁగితిని.' అని చెప్పెను, అప్పటికిని వారికి నమ్మకము కలుగ కుండుడు, సీత 'ఓ మహానుభావులారా, మీకు తెలిసినట్లు నన్ను శోధింపుఁడు. నాయందు దోష ముండిన నాకు శిరశ్ఛేద దండన చేయింపుఁడు.' అనెను. అంతట కనికరించి ఆ మునులు 'ఇచట అడవిలో టిట్టిభసరస్సని మహాతీర్థము కలదు. పూర్వ మొక టిట్టిభిని భర్త అన్యసంగినినిగా శంకించి మిథ్యాదూషణచేసెను. సాధ్వి యయిన యాటిట్టిభి అశరణ యై భూదేవిని లోకపాలురను గూర్చి ఆక్రందించెను. వారు తచ్ఛుద్ధ్యర్థ మై ఆతీర్థమును నిర్మించిరి. అందు ఈరామభార్య మాకు తన పారిశుద్ధ్యమును రుజువు చేయుఁగాక.' అని నియమించిరి. అంత సీత వారితోఁ గూడ ఆసరస్సునకుఁ బోయి ఆర్యపుత్త్రునికంటె వేఱొకనిని కలలో నయిన తలంపనయేని, ఓ భూదేవీ, ఈసరస్సు నవతలి గట్టునకు దాఁటుదును గాక.' అని పలికి, అందు చొచ్చెను.

భూదేవి యావిర్భవించి ఆపతివ్రతను ఒడిలో గూర్చుండఁ బెట్టు కొని అవతలిగట్టునకు కొనిపోయి విడిచెను. అంతట మును లందఱు ఆమహాసాధ్వికి ప్రణమిల్లి, ఆమెను వదలెనను కోప మున రాఘవుని శపింపఁ దలంచిరి. ఆమె కృతాంజలి యై 'ఓ మహానుభావులారా, ఆర్యపుత్రునికి అమంగళము తలంపకుఁడు, పాపాత్మురాలిని నన్నే శపింపుఁడు.' అని వేఁడుకొని, నివారించెను. అందులకు వారు అత్యంత ప్రీతు లై ఆమెకు మంచి పుత్త్రుఁడు గలుగ నాశీర్వదించిరి.

పిమ్మట ఆమె అచటనే ఉండి యథాకాలమున పుత్త్రునిఁ గనెను. వానికి వాల్మీకిముని లవుఁ డని పేరు పెట్టెను. ఒక నాఁడు ఆమె శిశువును కూడ తీసికొని స్నానమునకు పోయెను. ఆసమయమున పర్ణశాలకు వాల్మీకి వచ్చి శిశువును గానక 'ఈమె శిశువును ఇచట నుంచి స్నానార్థము పోవును. ఇపుడు ఆశిశువు ఏఁడి? నిశ్చయముగా ఘాతుకమృగము ఏదో వానిని కొని పోయి యుండఁబోలును. కనుక మఱి యొకనిని వానిచోట సృజించి యుంచెదను. పాపము! ఆమె స్నానమాడి వచ్చి శిశువుం గానక దుఃఖింపకుండునుగాక.' అని తలపోసి కుశతో పవిత్రము చేసి లవునిఁ బోలిన శిశువునుగా చేసి లవునిచోట నుంచెను. ఆమె వచ్చి ఆశిశువునుచూచి మునితో 'స్వామీ వీఁడుగో నాశిశువు ఉన్నాఁడు. ఈరెండవ శిశువు ఎవఁడు?' అని యడిగెను. అంతట ముని యథావృత్తమును చెప్పి

'ఓ పుణ్యాత్మురాలా, కాఁగలదానిని ఎవఁడు తప్పింపఁగలఁడు? వీఁడు నీ రెండవశిశువు పుచ్చుకొనుము. వీనిని నా ప్రభావముచే కుశతో చేసితిని గాన వీనికి కుశుఁ డనిపే రగుసుగాక.' అనెను. అంత నామె ఆశిశువును గ్రహించెను. వారికి ఆ మునియే సంస్కారములు జరిపెను. వారు ఆయాశ్రమమందే పెరుఁగుచుండిరి. బాల్యమందే వారికి మహాముని అస్త్రసమూహమిచ్చి సర్వవిద్యలను నేర్పెను. ఒకనాఁడు ఆక్షత్రియకుమారులు ఆశ్రమమృగమును చంపి దానిమాంసమును భక్షించి వాల్మీకియొక్క యర్చాలింగమును బొమ్మగా పెట్టుకొని ఆడుకొనుచుండిరి. అందులకు వగచి ముని సీతాదేవి* ప్రార్థనమీఁద ఆ కుమారులకు ప్రాయశ్చిత్తముగా, లవుఁడు కుబేరుని సరస్సునకుఁ బోయి అందుండి పసిఁడితామరలను, అతని యుద్యానమునుండి మందారపుష్పములను, తేవలయు ననియు, ఆపుష్పములతో ఇరువురు భ్రాతలును ఆలింగమును పూజింపవలయు ననియు విధించెను. ఆ మాట విని వెంటనే లవుఁడు బాలుఁ డయ్యును కైలాసమునకు పోయి యా కుబేరుని కాసా రోపవనములను ఆక్రమించి అందలియక్షులను కొట్టి తామరలను పువ్వులను కొని వచ్చుచు దారిలో బడలి ఒకచెట్టుక్రింద విశ్రమించెను.

### రాముఁడు మరల సీతను గలయుట.

ఈలోపల రాముఁడు నరమేధము చేయ యత్నింపఁగా అందులకు లక్ష్మణుఁడు సులక్షణుని పురుషుని వెదకువాఁడై ఆ

మార్గమున వచ్చి క్షత్త్రధర్మమున లవుని యుద్ధమునకు పిలిచి మోహనాస్త్రముచే మోహితుని చేసి కట్టి అయోధ్యానగరమునకు కొనిపోయెను. లవుఁడు రానందులకు వగచుచున్న సీతను ఓదార్చి, జ్ఞానదృష్టిచే వృత్త మెఱిఁగి, వాల్మీకి, కుశునితో 'నీయన్నను లవుని లక్ష్మణుఁడు కట్టి అయోధ్యకు కొనిపోయినాఁడు. ఈయస్త్రములచే అతనిని జయించి అన్నను విడిపింపుము.' అని దివ్యాస్త్రము లిచ్చి పంపెను. కుశుఁడు పోయి యజ్ఞభూమిని ఆక్రమించి దానిని కాచుటకై వచ్చిన లక్ష్మణుని ఆదివ్యమహాస్త్రములచే జయించెను. అంతట రాముఁడు యుద్ధమునకు వచ్చి వాల్మీకిప్రభావముచే ఆపిల్లవానిని జయింపనేరక 'అబ్బాయీ, ఏల యుద్ధము చేసెదవు ? నీ వెవరవు?' అని యడిగెను. 'లక్ష్మణుఁడు నాయన్నను కట్టి తెచ్చినాఁడు. నేను ఆయనను విడిపింప వచ్చినాఁడను. మేము లవకుశులము, రామతనయుల మని మాయమ్మ జానకి చెప్పినది.' అని తమవృత్తాంతమును చెప్పెను. అంతట రాముఁడు కన్నీళ్లు విడిచి లవుని తెప్పించి 'ఆపాపాత్ముఁడను రాముఁడను నేనే.' అని చెప్పుచు, వారి నిరువురను కంఠాలింగనము చేసెను. అంతట పౌరులు సీతాదేవిని పొగడుచు చూచుచుండఁగా రాముఁడు ఆ శిశువులను గ్రహించెను. సీతాదేవిని కూడ వాల్మీక్యాశ్రమమునుండి తెప్పించి రాజ్యభారము పుత్త్రులమీఁద మోపి ఆమెతో సుఖ

ముండెను — ఇట్లు ధీరులు చిరవిరహము నైనను సైతురు. మీరు ఒకరాత్రి నయిన సహింపలేరేమి?—

ఇట్లు కాంచనప్రభ వివాహోత్సుకను తనయ నలంకారవతిని, అల్లుని నరవాహనదత్తుని, ఊరడించి, ఆకాశ మార్గమున తననగరమునకు పోయెను. నరవాహనదత్తుఁడును వలవంతతో కౌశాంబికి పోయెను.

## పృథ్వీరూపరాజు కథ.

అచట రాత్రి నిద్రపట్టక అలఁగుచున్న యానరవాహనదత్తుని వినోదపెట్టువాఁడై గోముఖుఁడు, పృథ్వీరూపరాజు కథను చెప్పెదను వినుమని యిట్లనియె:—

దక్షిణాపథమందు ప్రతిష్ఠాన మని పట్టణము గలదు. అందు పృథ్వీరూపుఁ డను రాజు అతిరూపవంతుఁడు ఏలుచు ఉండెను. ఒకప్పుడు అతనియొద్దకు ఇరువురు శ్రమణులు జ్ఞానులు వచ్చి అతని యాయద్భుతరూపమును చూచి యిట్లనిరి.— 'దేవా, మేము భూలోక మెల్లఁ గ్రుమ్మరుచుందుము; కాని రూపములో నీపాటి పురుషునిఁ గాని స్త్రీని గాని చూడలేదు. కాని, ముక్తిపుర ద్వీపమున రూపధర మహారాజునకు హేమలతా దేవియందు జనించినతనయ రూపలత అనునది ఒక్కతెయే ఈలోకములో నీకు సాటి, ఆమెకు నీవొక్కఁడవే సాటి. మీకు ఇద్దఱకు కూటమి సంఘటిల్లిన శోభిల్లును.' ఈ శ్రమణ వచనములతోఁ గూడ మారనారాచములు శ్రవణమార్గమున

ప్రవేశించి రాజు హృదయమందుఁ గ్రుచ్చుకొనినవి. అంత నుత్సుకుఁడై రాజు తనచిత్రకరోత్తమునికి కుమారిదత్తనామునికి ఆన తిచ్చెను: ఓయి, నారూపమును సరిగా పటమున వ్రాసి చేకొని ఈ భిక్షువులతో ముక్తిపురద్వీపమునకు పొమ్ము. అందు రూపధరమహారాజునకును అతని కొమరితకును యుక్తిగా దానిని చూపుము. ఆ రాజు ఆకుమారిని నాకు ఇచ్చునో చూడుము. ఆముగుదను చిత్రములో వ్రాసి యిటకు తెమ్ము.' ఇట్లాజ్ఞాపించి తనప్రతిమను వ్రాయించి భిక్షువులతో ఆముచ్చిని ఆదీవికి పంపెను.

వారు ముప్వురును యథాక్రమముగా పోయి సముద్రతీరమందు పత్త్రపుర మను నగరము చేరి ఓడ యెక్కి సాగరమార్గమున అయిదు దినములకు ముక్తిపుర ద్వీపము చేరిరి. అచట చిత్రకరుఁడు రాజద్వారమున 'నాకు సాటి ముచ్చి యీ లోకములో లేఁడు' అని పతాక యెత్తెను. దానిని విని రూపధరమహారాజు పిలిపింపఁగా, చిత్రకరుఁడు పోయి ప్రణమిల్లి విన్నవించెను.—'దేవా, నేను లోక మెల్ల భ్రమించితిని, నాకు సాటిచిత్రకారుని చూఁడ నైతిని. దేవాసురమనుజులలో ఎవనిని వ్రాయుదును? ఆన తిమ్ము.' రాజు రూపలతను రావించి ఆమె ప్రతిమను వ్రాయు మనెను. కుమారిదత్తుఁడు రాజకన్యను సరిగా వ్రాసి చూపెను. రూపధరుఁడు చూచి సంతోషించి ఆముచ్చిని వివేకిగా నూహించి దానివలన అల్లుని పొందఁ

గోరి 'ఓయి, భూమండల మెల్ల తిరిగితివి కదా, ఎచట నైనను నాకౌమారితకు సాటి స్త్రీనిగాని పురుషునిఁగాని చూచితివా?' అని యడిగెను. 'ఈమెకు సాటి స్త్రీని గాని పురుషునిఁగాని కని యెఱుంగను. ప్రతిష్ఠానపురమందు పృథ్వీరూపమహారాజు ఈమెకు తగినరూపవంతుఁడు ఒక్కఁడు ఉన్నాఁడు. ఆయనతో ఈమెకు ఘటిల్లెనేని సొంపుగా నుండును. రాజ కన్య తుల్య రూప దొరకక ఆయన తరుణుఁ డయ్యును వివాహ మాడక యే యున్నాఁడు. లోక లోచనోత్సవ మయిన యారాజును చూచి నేను కుతూహలముచే ఆరూపమును పటములో వ్రాసి తెచ్చి యున్నాను.' అని ముచ్చి వాక్రుచ్చి పటము చూపెను. ఆ రూపమును చూచి రాజు ఆశ్చర్యముచే తల యూఁచి యూఁచి, 'చిత్తరువునం దయినను ఇతనిం జూచిన మేము ధన్యులము, ఎవరు అతనిని సాక్షాత్తుగా చూతురో వారికి నమస్కారము.' అనెను. తండ్రి పలికిన యీ మాటను వినియు ఆలేఖ్యమును కనియు ఉత్సుక యైన రూపలతకు మఱి యేమియు అగపడదు వినఁబడదు. ఆమె కామమోహిత యగుట యెఱింగి రాజు కుమారిదత్తునితో 'నీ వ్రాఁతయందు పొరఁబాటు ఉండదు. నిశ్చయముగా ఆరాజు నాకౌమారితకు తగిన రూపవంతుఁడే. కావున నీవు త్వరగా నా కౌమారిత పటమును కొనిపోయి అతనికి చూపి నాయభిప్రాయము తెలుపుము. ఆయన కిష్టమేని తత్క్షణమే వచ్చి నాకన్యను వివాహమాడునుగాక.' అని వానిని

ఆభిక్షువులను బహుధనము లిచ్చి సత్కరించి తనదూతతో కూడ పంపెను.

వారును సముద్రము దాటి ప్రతిష్ఠాననగరము చేరి రాజదర్శనము చేసి నజరు పెట్టి వృత్తము నివేదించి రూపధర సందేశమును తెలిపిరి. ముచ్చి అతనికి రూపలతాపటమును చూపెను. లావణ్యసరస్సయిన యామెదేహమును చూచుచున్న యారాజు అందు మునిఁగిన తన చూడ్కిని లేప నేరఁడాయెను. వెన్నెలను చకోరమువోలె కాంత్యమృత లహరిని ఆమెను ఆస్వాదించుచు అతనిచూపు తనియ దాయెను. రాజు చిత్రకరునితో 'మిత్రమా, ఈరూపమును సృజించిన వేధయు వ్రాసిన నీవును వంద్యులు. రూపధరమహీపతి యిష్టమును నే నంగీకరించితిని. ముక్తిపురద్వీపమునకుఁ బోయెద. ఆ కన్యను వివాహ మయ్యెద.' అని చెప్పి ఆ చిత్రకర దూత భిక్షువులను ధనము లిచ్చి సత్కరించి, చిత్తరువునే చూచుచు ఆదినమును ఉద్యానాదులయందు విహరించుచుఁ డయి గడపి, మఱునాఁడే లగ్న మేర్పఱుచుకొని ససైన్యుఁ డయి నానా హస్త్యశ్వ సామంత రాజపుత్త్ర సమేతుఁ డై, రూపధరదూత చిత్రకార శ్రమణులనుం దోడ్కొని, పయనము నడచెను.

తొలునాఁడు, మంగళఘట మను నాగేంద్రము నెక్కి సాగి, సాయంకాలమున వింధ్యారణ్య ముఖమున విడిసెను. మఱునాఁడు, శత్రుమర్దన మను నిభరాజము నెక్కి ఆ యరణ్య

ముం జొచ్చి పోవుచుండఁగా అతనిముందు నడచుచున్న బలము వెనుకకు విఱిగి చెల్లాచెదరై పాఱి పోవసాగెను. దానిం గని నివ్వెఱపడుచున్న యతని కడకు తత్క్షణమే నిర్భయుం డను రాజపుత్త్రుఁడు ఏనుఁగుమీఁద వచ్చి 'దేవా, ముందు గొప్ప భిల్లసైన్యము పైఁబడినది. భిల్లులు మనయేనుఁగులను ఏఁబదింటిని, వేయిమంది బంటులను, మున్నూఱు గుఱ్ఱములను, సంహరించినారు. మనసైనికులు రెండువేలమందిని భిల్లులను కూల్చినారు. మన యొక మొండెమునకు వారివి రెండు. పిడుగులను బోలిన వారికోలల కాఁగక మనసైనికులు విఱిగి పాఱఁ జొచ్చినారు.' అని తెలిపెను. అంత పృథ్వీరూపుఁడు కుపితుఁడై భిల్లసేనను తఱిమి పైఁబడి, అర్జునుఁడు కౌరవసైన్యముం బోలె, రూపుమాపెను. ఇతరదస్యువులను నిర్భయాదులు సంహరించిరి. రాజు ఒకభల్లమున భిల్లపతితలను డొల్లించెను. బాణంపు గండ్లనుండి కాఱుచున్న నెత్తురులచే అతని యేనుఁగు శత్రుమర్దనము ఎఱ్ఱని క్రొత్తనీటి సెలయేఱులతోడి యంజన భూధరేంద్ర మో యన నొప్పుచుండెను. విజయము నొంది మరలి రాజసైన్యమెల్ల వచ్చి కలసికొనఁగా హతశేషులైన భిల్లులు చెల్లాచెదరై పాఱిరి. రూపధర దూత తనపరాక్రమమును పొగడుచుండఁగా సంగ్రామము మాని పృథ్వీరూపభూపతి గాయపడిన సైనికుల విశ్రాంతికై ఆదినము ఒక సరస్తీరమందు విడిసి, మఱునాఁడు వేకువను తరలి యథాక్రమముగా కదలి రేవయిన యా పత్త్ర

పురము చేరెను. ఉదారచరితుఁ డను నచటి రాజుచే కృతోచితసత్క్రియుఁ డై ఆదినము అచట విశ్రమించి, మఱునాఁడు ఆరాజే సిద్ధము చేయించిన యోడల నెక్కి ఎనిమిది దినముల సబురున సముద్రమును దాఁటి ముక్తిపురము చేరెను.

ఇతని రాక యెఱింగి రూపధరుఁడు ఉప్పొంగి ఎదురు వచ్చెను. ఇరువురును ఒండొరువుల కంఠాలింగనము చేసిరి. రూపధరునితో పృథ్వీరూపుఁడు తన్ను త్రాగునవియుం బోలె పౌరనారీదృష్టులు చూచుచుండఁగా ఆ పురము ప్రవేశించెను. అచట రాణి హేమలతయు రూపధరమహారాజును తమకన్యకు అనురూపుఁ డైనభర్త లభించినందులకు సంతోషించిరి. అందు పృథ్వీరూపుఁడు ఆయత్తమూమలచే వారిసంపదకు తగిన యుపచారముల నంది, మఱునాఁడు వేదియందు రూపలతాకరమును మూర్తీభవించిన మహోత్సవముంబోలె గ్రహించెను. అప్పుడు అన్యోన్యరూపదర్శను లైనవారిదృష్టులు 'నీవు సత్యమే వింటివి' అని చెవులతో చెప్పునవియుంబోలె చెవులయొద్దకు వ్యాపించి యుండినవి. రూపధరుఁడు ఆ యిరువురకును లాజమోక్షముల యందు ఇచ్చిన లెక్క లేని రత్నములచే చూపఱు అతనినే రత్నాకరునిఁగా తలంచిరి. సుతావివాహము ముగియఁగానే అతఁడు చిత్రకరశ్రమణులను వస్త్రాభరణములతో పూజించెను. నాఁడు ఆపురమందు పృథ్వీరూపుఁడు అక్కడివాడుక యాహారపానములచే యానందించెను. పగలు నృత్తగీతాదులం గడవఁగా

రాత్రి ఉత్సుకుఁడై రూపలతతో వాసభవనము ప్రవేశించి, రతనాలపట్టెమంచము, రతనాలరాకట్టు, మణికంబంబులు, మణి దివ్వెలుం గలిగి కనులపండు వైన యచ్చోట, ఆమెతో చిరసం కల్పగుణిత మైన భోగకేళిం దేలి నిద్రించెను. వేకువను వంది మాగధ గీత బోధితుఁడై స్వర్గమున నింద్రుండు వోలె అట నుండెను.

ఇట్లు అచట అత్తమామ లలవరించిన దివ్యభోగముల ననుభవించుచు పదిదినము లుండి పదునొకండవనాఁడు గణక నిశ్చిత శుభలగ్నంబున శ్వశ్రూ రచిత మంగళుం డై రూపలతం దోడ్కొని వెడలెను. కడలివఱకు మామగారు సాగ నంపఁగా పృథ్వీధరుఁడు రూపలతతోను అనుచరులతోను ఓడ ఎక్కెను. ఎనిమిది దినములలో సాగరమును దాఁటి ఒడ్డున నున్న తన దండును కలసికొనెను. ఉదారచరితుఁడు ఎదురు వచ్చి ఇతనిని పత్త్రపురమునకు తోడ్కొని పోయెను. ఇతఁడు అతనివలన నుపచారము లొందుచు కొలఁది దినములు విశ్రమించి, మరల పయన మాయెను. ప్రియతమను జయమంగళ మను నాగేం ద్రముపై నెక్కించి, తాను కల్యాణగిరి యను కరింద్రము నెక్కి సంతతప్రయాణములచే తనరాకకై జెండా లెత్తి యున్న నిజ నగరము ప్రతిష్ఠానము ప్రవేశించెను. అందు పురాంగనలు రూపలతను అచ్చెరుపడి ఱెప్ప వాల్పక చూచి రూపగర్వమును వదలుకొనిరి. రాజధాని ప్రవేశించి పృథ్వీరూపుఁడు ఉత్సవము

చేసి, ముచ్చికి గ్రామము లిచ్చి, శ్రమణులను యథార్థ ధనముల సత్కరించి, సామంత సచివ రాజపుత్రులను సమ్మానించి, ప్రియతమ యైన రూపలతతో జీవలోకసుఖ మనుభవించుచుండెను.

ఇట్లు గోముఖుఁడు నరవాహనదత్తునికి వినోదార్థము కథ చెప్పి, ఉత్సుకుం డయిన యతనితో మరల నిట్లనియె— ధీరులు క్లేశములతోఁడి విరహమును చిరకాలము సహింతురు. దేవా, నీవు ఒకరాత్రి యైనను సహింప లేవేమి ? రేపు ప్రాతః కాలమున నీవు అలంకారవతిని వివాహ మగుదువు. ఇట్లు గోముఖుఁడు చెప్పుచుండఁగా, అచటికి అప్పుడు వచ్చిన యౌగంధ రాయణసుతుఁడు మరుభూతి యిట్లనియె.—"స్మరసంతాపము నెఱుఁగని నీవు స్వస్థముగా ఏమి చెప్పవు ! పురుషుఁడు కామమునకు గుఱి కానంతసేపే ధైర్యవివేక శీలములను దాల్చును. వస్త్రాంతమునకు అంటుకొన్న గడ్డిపోరకవలె మరుని దులిపివేసిన సరస్వతీ జన స్కందులు ముప్పూరే ధన్యులు." మరుభూతి యిట్లనఁగా గోముఖుఁడు బెగడుపడి ఊరకుండెను. అంతట నరవాహనదత్తుఁడు గోముఖుని మాటను ఇట్లు సమర్థించెను: 'వినోదనార్థము గోముఖుఁడు అట్లు చెప్పుట యుక్తమే. మిత్రుఁడు విరహాయాసమున బళి బళి యనునా? యథాశక్తి విరహాతురుని స్వజనులు సమాశ్వాసింపవలయును; అటు పైని విషమసాయకుని చిత్తము.' ఇట్లు పలుకుచును పరిజనమువలన ఆ యాకథలను వినుచును నరవాహనదత్తుఁడు ఆరాత్రి గడపెను.

మఱునాఁడు అతఁడు ప్రాతఃకాలమందు లేచి ఆవశ్యక క్రియలు తీర్చుకొని యుండఁగా, ఆకాశమునుండి కాంచనప్రభ భర్తను అలంకారశీలుని, కుమారుని ధర్మశీలుని, కొమారితను అలంకారవతిని, తోడ్కొని వచ్చి దిగెను. వారందఱు అతని చెంతకు వచ్చి, అతనివలన గౌరవ మొంది, అతనిని యథోచితముగా అభినందించిరి. ఇంతలో వేలకొలఁది విద్యాధరులు ఆకాశమునుండి హేమరత్నాది భారములను మోచుకొని వచ్చి దిగిరి. ఈ వృత్తాంతమును విని వత్సరాజు పుత్త్రుని యుత్కర్షకు సంతోషించి మంత్రులతోను భార్యలతోను అచటికి వచ్చెను.

వత్సరాజు యథార్హముగా ఆతిథ్యము చేయఁగా అతనితో ప్రణయానతుఁడై అలంకారశీలుఁ డిట్లనియె. "రాజా, ఈ నాతనయ యలంకారవతి పుట్టఁగానే గగనవాణి 'ఈమె సర్వవిద్యాధరేంద్రులకు చక్రవర్తి కాఁగల యీనీ కొమరుఁడు నరవాహనదత్తునికి భార్య యగు' నని పలికినది. కనుక దీనిని ఇతని కిచ్చెదను. వీరికి ఈలగ్నము శుభము. ఇందునిమిత్తము వీరి నందఱను తోడ్కొని యిచటికి వచ్చితిని." విద్యాధరేంద్రుని వచనమును వత్సరాజు మహానుగ్రహ మని పలికి ఆమోదించెను. అంతట నావిద్యాధరాధీశుఁడు తన విద్యాప్రభావమువలన తన యఱచేతఁ బుట్టినజలమును ఆయంగణభూమిపై చల్లెను. అంత నచట దివ్యవస్త్రచ్ఛన్నమైన బంగారపువేదియు నానారత్న

మయ మై సహజ మయిన కౌతుకగృహమును పుట్టినవి. 'లే, లగ్న వేళ వచ్చినది. స్నానము కానిమ్ము.' అని కృతార్థుఁ డయిన యలంకారశీలుఁడు నరవాహనదత్తుని హెచ్చరించెను. స్నానము చేసి వివాహకంకణము దాల్చిన యా నరవాహనదత్తుని వేదికి దెచ్చి యలంకారశీలుఁడు కృత వధూవేషను తన కొమారితను అలంకారవతిని దానము చేసెను. అలంకారశీలుఁడును కుమారుఁడును లాజమోక్షములయందు పెండ్లి కొమారితకు వేల కొలఁది మణి కనక వస్త్రభూషణముల బారువులను దివ్యాంగనలను ఇచ్చిరి. వివాహము ముగియఁగానే అలంకారశీలుఁడు అందఱను సమ్మానించి వీడ్కొని, భార్యాపుత్త్రులను తోడ్కొని, ఆకాశమార్గమునఁ బోయెను. ఇట్లు విద్యాధర రాజు లెల్ల వచ్చి సేవించుచున్న తనూజుని అభ్యుదయోన్ముఖుని చూచి వత్స రాజు చిరకాలము ఉత్సవము చేసెను. నరవాహనదత్తుఁడు సద్వృత్త మనోరమయు ఉదారగుణయు నైన యలంకారవతిని పొంది, అట్టివానిని పొందిన సుకవివలె, సుఖముగా నుండెను.

---

## ౨ - వ తరంగము.

### నరవాహనదత్తుఁడు సుందరపురమునకుఁ బోవుట.

నవవధు వైన యా యలంకారవతితో నరవాహనదత్తుఁడు తండ్రియింట ఆమెయొక్క చేటికల దివ్యనృత్తగీతము

లచే రంజితుఁడై సచివులతోఁ గూడ పానగోష్ఠి సలుపుచు సుఖముండెను. ఒకనాఁడు అత్తగారు కాంచనప్రభ వచ్చి ఆతిథ్యము నొంది యిట్లనియె. 'రా, మాయింటికి; ఆ సుందరపురమును చూడుము. అచటి యుద్యానవనములలో అలంకారవతీసహాయుఁడ వై విహరింపుము.' నరవాహనదత్తుఁడు వల్లె యని, ఈ వార్తను తండ్రికి తెలిపి అతని యనుజ్ఞను పొంది, వసంతకునిని మంత్రులను తోడ్కొని, ఆమె విద్యాప్రభావముచే నిర్మించిన విమానవరము నెక్కి ఆకాశమార్గమున బయలు వెడలెను. విమానమందు ఆకాశమునుండి క్రింద చూడ, నతనికి భూమండలము ఒక చిన్న దిబ్బగాను సముద్రము ఒక కందకముపాటిగాను అగపడెను. అత్తతోను భార్యతోను క్రమముగాకిన్నరీగీతనాదితమును స్వర్వధూసంఘ సుందరమును అయిన హిమాలయమునందు అనేకాద్భుతములు చూచుచు పోయి యా సుందరపురము చేరెను. అది రత్నఖచితములును కనకమయములును అయిన ప్రాసాదములచే హిమవంతమందుఁ గూడ సుమేరు శిఖర భ్రాంతిని కలుగఁజేయుచుండెను. ఆకసమునుండి క్రిందికి వచ్చి విమానము దిగి, లోల ధ్వజాంశుక మై సనాథత్వ దర్శన హర్ష నృత్య పరాయణముం బోలె నొప్పుచున్నట్టి యా నగరము ప్రవేశించెను. అత్త నీరాజనమంగళ మాచరించుచుండ, అలంకారవతీసమేతుఁడై సచివ వసంతక యుక్తుండునై రాచనగరు ప్రవేశించి, అచట ఆదినము శ్వశ్రూప్రభావజనితము లైన

దివ్యభోగములలోఁ గడపుచు, నరవాహనదత్తుఁడు మామ యింట స్వర్గమందుంబోలె సుఖముగా నుండెను.

మఱునాఁడు కాంచనప్రభ యతనితో 'ఈనగరమందు ఉమాపతి స్వయముగా వెలసియున్నాఁడు. దర్శించి పూజించిన వారికి ఆదేవుఁడు భుక్తిముక్తుల నొసంగును. అలంకారవతితండ్రి ఆదేవునికి అచట నొక మహోద్యానము నిర్మించినాఁడు. గంగాసరస్సను తీర్థమును కూడ అన్వర్థనామమును ఇచటికి తెచ్చినాఁడు. దేవుని పూజించుటకును విహరించుటకును అచటికి ఈ దినము పోందు.' అని చెప్పెను. అంతట నరవాహనదత్తుఁడు ఆశివోద్యానమునకు అలంకారవతిని వయస్య సచివులను తోడు కొని పోయెను. ఆ యుద్యానమందు చెట్లబోదెలు బంగారు, కొమ్మలు రత్నములు, పుష్పములు ముత్తెములు, చివుళ్లు పగడములు. అచట నతఁడు గంగాసరస్సునందు స్నాన మాడి, ఉమాపతి నర్చించి, రత్నసోపానములు కాంచనతామరసములు నయిన వాపికలలో జలక్రీడ సలిపి వానితీరములయందు మనో రమము లైన వేల్పుమ్రాఁకుల పొదరిండ్లలో అనుచర సమేతుఁ డై విహరించు చుండెను. దివ్య పాన గానములచేతను మరు భూతి సరళతచేఁ జేసిన మృదుపరిహాసములచేతను ఆనందించు చుండెను. ఇట్లు నరవాహనదత్తుఁడు మాసకాలము శ్వశ్రూ విద్యాకల్పితభోగము లనుభవించుచు, ఉద్యానవనములయందు క్రీడించుచుండెను. పిమ్మట కాంచనప్రభచే దేవోచిత వస్త్రాలం

త్యాగములతో సత్కృతుఁడై ఆ విమానమునే వధూ మంత్రి వయస్య సమేతముగా ఎక్కి కౌశాంబికి వచ్చి, తల్లిదండ్రులకు నేత్రోత్సవము చేసెను. అచట కాంచనప్రభ వాసవదత్తకును వత్సరాజునకును ఎదుట కౌమారిత యలంకారవతితో నిట్లనియె.—'నీవు ఎప్పుడును భర్తను ఈర్ష్యా కోపముచేత దుఃఖపెట్టకుము. ఆపాపమువలన విరహము కలిగి గొప్ప యనుతాపము పుట్టించును. ఈర్ష్యచే నేను పూర్వము నాపతిని దుఃఖపెట్టితిని, అందుచే ఇప్పుడు ఆయన వనమునకు పోఁగా, నేను పశ్చాత్తాపముచే కాలుచున్నాను.' ఇట్లు పలికి, కన్నీళ్లు విడుచుచు ఆమెను కౌఁగిలించుకొని ఆకసమున కెగసి తన నగరమునకు పోయెను.

## హరశర్మ కథ.

మఱునాఁడు నరవాహనదత్తుఁడు ప్రాతఃకృత్యములు సలిపి మంత్రులగోష్ఠిలో నుండఁగా, అలంకారవతియొద్దకు ఒక విలాసిని వచ్చి భయకంపములతో 'దేవీ, అబలను నన్ను కావుము కావుము. వీఁడుగో బ్రాహ్మణుఁ డొకఁడు నన్ను చంపఁ దలఁచుకొని వచ్చి బయట నున్నాఁడు, అతనిభయముచే నేను శరణార్థినినై ఇచటికి వచ్చితిని.' అని మొఱ పెట్టెను. 'భయపడకు, వృత్తాంతము చెప్పుము. ఎవఁడు అతఁడు? నిన్నెందులకు చంపఁ దలఁచుచున్నాఁడు?' అని యలంకారవతి యడుగఁగా, ఆమె మరల చెప్ప సాగెను.—

"దేవీ, నాపేరు అశోకమాల. నేను ఈనగరమందే బలసేనుఁడనెడు క్షత్త్రియుని కూఁతురను. నన్ను కన్యగా నున్నప్పుడు హారశర్మ యను నొక ధనికుఁడు రూపలుబ్ధుఁడై నా తండ్రిని యాచించెను. 'వికృతరూపుని ఘోరముఖుని అతనిని వివాహ మాడను, ఇచ్చినను వానియింట నుండను.' అని తండ్రితో నేను చెప్పితిని. నాప్రతిజ్ఞ వినియు హారశర్మ నాతండ్రియింట ప్రాయోపవేశము చేసెను. అతఁడు చచ్చునని వెఱచి నాతండ్రి అతనికి నన్నిచ్చి వేసెను. అతఁడు నన్ను బలాత్కారమున వివాహ మాడి తన యింటికి కొనిపోయెను. నేను వానిని వదలి యొకక్షత్త్రియ కుమారునియొద్ద చేరితిని. హారశర్మ ధనసాధనముచేత ఆ క్షత్త్రియుని అభిభవించెను. అంత నేను మఱియొకని నాశ్రయించితిని. హారశర్మ రాత్రి వానియిల్లు కాల్చివేసెను; అతఁడు నన్ను విసర్జించెను. నేను మూఁడవ క్షత్త్రియు నాశ్రయించితిని. వానికొంపను గూడ ఆ బాపఁడు రాత్రి కాల్చివేసెను. ఆ క్షత్త్రియుఁడును నన్ను వదలివేసెను. అంత అడుగయినను అవకాశమీయక తఱుముచున్న హారశర్మ నుండి, నేను, చంపఁ దఱుముచున్న నక్కనుండి గొఱ్ఱెపిల్లవలె భయపలాయితనై వచ్చి, ఇచటనే మీభృత్యుఁడయిన వీరశర్మ యను బలవంతునికి దాసినైతిని. దాని నెఱిఁగి హారశర్మ ఆశ వదలి నాతోడివియోగముచే కృశించి త్యాగస్థిరేషుఁడై నన్ను వేచియే యుండెను. అంత నారాజపుత్త్రుఁడు నారక్షణకొఱకు

ఇతనిని చెఱలో వేయుటకు యత్నింపఁగా నేనే నివారించితిని. ఇప్పుడు నేను దైవవశమున వెలుపలికి రాఁగా హారశర్మ చూచి కత్తి దూసికొని చంపఁ దలుముకొని వచ్చి యున్నాఁడు. నేను పలాయితనై వచ్చి దయార్ద్రయైన ప్రతీహారి లోపలికి వదలఁగా ఇటఁ జొచ్చితిని. అతఁడు హజారమువెలుపల కనుపెట్టుకొని యున్నాఁడు.”

ఆమె యిట్లు పలుకఁగా నరవాహనదత్తుఁడు ఆబ్రాహ్మణుని ఎదుటికి పిలిపించెను. ఆ వికృతరూపుఁడు క్రోధావేశమున మండుచున్న చూపులతో అశోకమాలను చూచుచు చేత కత్తిఁ బూని కోపముచే వడవడ వణఁకుచు వచ్చి నిలిచెను. ‘ఓయి చెడినబ్రాహ్మణుఁడా, స్త్రీని దీనిని చంపెద వేమి? దీనికై ఇతరులకొంపలను కాలిచెద వేమి? ఏల పాపము చేసెదవు?’ అని ప్రభు వడిగెను. బ్రాహ్మణుఁ డనెను: ‘ఇది నాధర్మభార్య, నన్ను వదలి ఇతరులకడకు పోయినది. నే నెట్లు సహింతును?’ అంత నశోకమాల వణఁకుచు ‘ఓ లోకపాలురారా, పలుకుఁడు నన్ను నాయిచ్ఛ లేక బలాత్కారమున ఇతఁడు వివాహమై ఇంటికిఁ గొనిపో లేదా? అప్పుడే ఇతనియింట నుండ నని నేను చెప్ప లేదా?’ అని మొఱ పెట్టెను.

అంతట దివ్యవాణి “అశోకమాల చెప్పునది సత్యము. అట్లే జరిగినది. ఇది మానుషి గాదు. ఈమెతత్త్వమును వినుఁడు. అశోకవరుఁ డని విద్యాధరేశ్వర వీరుఁడు కలఁడు. ఆతనికి

పుత్త్రులు లేక ఒక కన్యమాత్రము కలిగినది. దానిని తండ్రి అశోకమాల యని పేరు పెట్టి పెంచుచుండెను. ఆమె ప్రాప్త యౌవన యయి, తండ్రి ఎవని కీయఁ బోయినను అత్యంత రూపాభిమానముచే ఎవనిని వివాహ మాడ నంగీకరింపదాయెను. ఆనిర్బంధమునకు అలిగి తండ్రి ఆమెను ఇట్లు శపించెను.—'ఈపేరితోనే మానుషివిగా పుట్టుము, వికృతరూపుఁ డొక బ్రాహ్మణుఁడు బలాత్కారముగా నిన్ను పెండ్లియాడును. నీవు వానిని వదలి వరుసగా ముగ్గురు భర్తలను ఆశ్రయింతువు. అప్పటికిని ఆబ్రాహ్మణుఁడు ఉపద్రవపెట్టఁగా బలవంతు నొక రాజపుత్త్రుని దాసివిగా ఆశ్రయింతువు. అప్పటికిని ఆబ్రాహ్మణుఁడు వదలఁడు. నిన్ను కనిపట్టి ఉండి ఆతఁడు చంపఁదలఁచును. రాజభవనము చొత్తువు. అచట ఈ శాపము వదలును.' అట్లు తండ్రిచే శాపము నొందిన యా విద్యాధరి యశోకమాల యే యీమె. ఈమెకు ఆశాపము తీఱినది. ఈమె ఇప్పుడు తన వైద్యాధర పదమును పొంది తన మునుపటి దేహమున చేరును. పిమ్మట అభిరుచితుఁ డను విద్యాధరరాజును వరించి వివాహమాడి శాపమును స్మరించుచు క్రీడించును.' ఇట్లు పలికి ఆకాశవాణి విరమింపఁగానే అశోకమాల ప్రాణము లెడలి నేల వ్రాలెను. దానిని చూచి అలంకారవతియు నరవాహనదత్తుఁడును పరివారముతోఁ గూడ బాష్పాయితేక్షణు లయిరి.

ఆ బ్రాహ్మణుఁడు దుఃఖావేశముచే కోపము పోయి రాగాంధుఁడై విలపించుచు ఆకస్మికముగా హర్షోత్ఫుల్లాననుఁ డాయెను. ఏమి యిది యని యందఱు నడుగఁగా, విప్రుఁడు పలికెను—"నేను పూర్వజన్మమును స్మరించితిని. చెప్పెదను వినుఁడు. హిమాద్రియందు మదనపుర మని యుత్తమనగరము కలదు. అందు ప్రలంబభుజుఁ డని విద్యాధరేశ్వరుఁడు కలఁడు. అతనికి స్థూలభుజుఁ డని తనయుఁడు కలిగెను. ఆరాజపుత్త్రుఁడు క్రమముగా యౌవనస్థుఁ డాయెను. అంతట సురభివత్సుఁ డను విద్యాధరపతి స్వయముగా తన కన్యను కొని ప్రలంబ భుజుని యింటికివచ్చి యతనితో 'ఈమెను నాకూఁతును సురభిదత్తను నీ కుమారునికి స్థూలభుజునికి ఇచ్చితిని. ఆగుణవంతుఁడు దీనిని వివాహమాడునుగాక.' అనెను. అందుల కంగీకరించి ప్రలంబ భుజుఁడు కుమారుని పిలిచి అతనికి ఈవృత్తాంతమును తెలిపెను. స్థూలభుజుఁడు రూపగర్వముచేత 'నాయనా, ఈకన్య నాకు వలదు. ఈమె మధ్యమరూప.' అని నిరాకరించెను. పుత్త్రా, అత్యంతరూప మేల ? ఈమె గొప్పవంశముది, మాన్యురాలు, తండ్రి యిచ్చినాఁడు, నీకై నేను గ్రహించితిని.' అని తండ్రి మరల చెప్పినను స్థూలభుజుఁడు సమ్మతింప నందున కుపితుఁడై తండ్రి వానిని శపించెను.— 'ఈ రూపాహంకారముచేత నీవు మనుష్యలోకములో వికృతాస్యుఁడవుగా ఘోరరూపుఁడవుగా పుట్టుము. శాపచ్యుతను అశోకమాలను బలాత్కారమున

వివాహ మై, ఆమె నిన్ను త్యజించి యితరుల నాశ్రయింపఁగా దుఃఖకృశుఁడ వై రాగమోహితుఁడవు వై యిండ్లు కాల్చుట మొదలయిన పాపములు చేయుదువు.' ఇట్లు శాప మిచ్చిన ప్రలంబభుజుని పాదములవ్రాలి యేడ్చుచు ఆపతివ్రత సురభిదత్త మొఱ యిడెను. 'నాకును శాపము పెట్టుము. ఉభయులకును మాకు సమగతి అగుఁ గాక. నాయపరాధముచే నాభర్తకు మాత్రమే క్లేశము కలుగకుండుఁత.' ఆ ప్రార్థనకు సంతసించి రాజు ఆమెను ఓదార్చి కొమరునికి ఇట్లు శాపాంతము నను గ్రహించెను. 'అశోకమాలకు శాపము తీఱినప్పుడే ఇతఁడును పూర్వజన్మమును స్మరించి, శాపము తీఱి ఈ దేహమును పొంది అహంకారము మాని శాపము మరవక త్వరలో నిన్ను వివాహ మై ఇచట నీతో సుఖ ముండును.' ఇట్లు ఆ రాజు పలుకఁగా ఆసాధ్వి ఎట్టకేలకు ఊఱడిల్లెను. శాపచ్యుతుఁ డైన యాస్థూలభుజుఁడను నేనే యని యెఱుంగుఁడు. అహంకార దోషముచే మహాదుఃఖము పొందితిని. గర్వితులకు శ్రేయస్సు ఎక్కడిది? నాకు ఆశాపము ఇప్పుడు తీఱినది." ఇట్లని హర శర్మ తత్క్షణమే విద్యాధర కుమారుఁడై విద్యాప్రభావముచే అశోకమాలా దేహమును కనికరమున అదృశ్యముగా గంగలో వైచి, గంగాజలములు తెచ్చి క్షణములో అలంకారవతీవాస గృహములు క్షాళనము చేసి, భవిష్య ద్విద్యాధర చక్రవర్తిని నరవాహనదత్తుని నమస్కరించి, మింటి కెగసి, తన కార్య

సిద్ధికై పోయెను. అందులకు ఎల్లవారును ఆశ్చర్యపడుచుండఁగా ప్రసంగవశమున గోముఖుఁడు ఈయనంగరతికథను చెప్పం దొడంగెను.

## అనంగరతికథ.

శూరపుర మని యన్వర్థనామము ఒక నగరము కలదు. అందు మహాదుర్ధరుఁడు మహావరాహుఁ డని రాజు ఉండెను. అనపత్యుఁ డైన యతనికి గౌర్యారాధనముచేత పద్మరతిదేవి యందు అనంగరతి యను నొకతెయే కొమారిత కలిగినది. ఆమె కాలక్రమమున యౌవనవతి యై రూపాభిమానిని యై ఎందఱు రాజకుమారులు అడిగినను ఎవ్వనిని వివాహ మాడ నొల్ల దాయెను. శూరుఁ డై మంచివిద్య యొకటి చక్కఁగా నేర్చినవానికి తన్ను ఇయ్యవలసిన దని ఆమె తననిశ్చయమును తెలిపెను. ఇట్లుండఁగా ఆమెవృత్తాంతమును విని ఆమెకోరిన గుణములు కలవారు నలుగురు వీరులు ఆమెను బడయఁ గోరి దక్షిణదేశమునుండి వచ్చిరి. వారు ద్వారపాలకులచే తమరాక రాజున కెఱింగించుకొని యాస్థానము సొచ్చిరి. వారిని మహావరాహరాజు అనంగరతియెదుట 'మీపే రేమి? విద్య యేమి? జాతి యేమి?' అని యడిగెను. వారిలో నొకఁడు చెప్పెను—

దేవా, నాపేరు పంచపట్టికుఁడు, నేను శూద్రుఁడను, దినములకు అయిదు చాఁపులు నేయుదును. వానిలో నొకటి బ్రాహ్మణునికి దానము చేయుదును, రెండవది పరమేశ్వరునికి, మూఁడవది

నేనే ధరింతును; నాలవది నాకు భార్య యుండెనేని దానికి ఇత్తును. అయిదవదానిని అమ్మి జీవనము చేయుదును' రెండవ వాఁడు చెప్పెను.—'నేను వైశ్యుఁడను, నా పేరు భాషాజ్ఞుఁడు, సర్వ మృగ పక్షుల భాషలను ఎఱుంగుదును.' మూఁడవవాఁడు పలికెను.—'నేను క్షత్త్రియుఁడను, పేరు ఖడ్గధరుఁడు, ఖడ్గయుద్ధమున నన్నెవఁడును గెలువ లేఁడు.' నాలవవాఁడు 'నేను ద్విజోత్తముఁడను, నా పేరు జీవదత్తుఁడు. చచ్చిన స్త్రీని గౌరీ ప్రసాదముచేతను విద్యాప్రభావముచేతను నేను బ్రదికించెదను' అనెను. ఇట్లు అందఱు పలికి, శూద్ర వైశ్య క్షత్త్రియులు ముగ్గురు మరల తమతమ రూప శౌర్య బలములను చెప్పుకొనిరి. బ్రాహ్మణుఁడు రూపముమాత్రము లేక బలములను చెప్పుకొనెను. అంతట మహావరాహరాజు దౌవారికునికి 'ఇప్పుడే వీరిని అందఱను కొనిపోయి నీయింట విశ్రమింపఁజేయుము.' అని యాజ్ఞాపించెను. చిత్తమని దౌవారికుఁడు వెంటనే వారిని తనయింటికి తోడ్కొని పోయెను.

అంతట రాజు కొమారిత యనంగరతితో 'పుత్త్రీ, ఈ నలువురువీరులలో నీకిష్ట మయిన వాఁ డెవఁడు?' అని యడిగెను. ఆమె పలికెను.—'నాయనా, ఈ నలువురలో ఒకని నైన నేను ఇచ్ఛగింపను. ఒకఁడు శూద్రుఁడు, నేతగాఁడు, వానివలన నేమి ప్రయోజనము? రెండవవాఁడు వైశ్యుఁడు, పక్ష్యాదిభాషల నెఱింగిన నేమి ప్రయోజనము? నేను క్షత్త్రియ నయ్యు వారి

కెట్లు నన్ను అర్పించుకొందును ? మూఁడవవాఁడు గుణ వంతుఁడు, నాకు సవర్ణుఁడు అయినను సేవాజీవి, దరిద్రుఁడు, ప్రాణ మమ్ముకొనువాఁడు. రాజుకొమారిత నై వానియిల్లాల నె ట్లగుదును ? నాలుగవవాఁడు జీవదత్తుఁడు బ్రాహ్మణుఁడు, అతఁడును నాకు ఇష్టుఁడు గాఁడు; విరూపుఁడు కర్మహీనుఁడు పతితుఁడు; వానిని నీవు దండించుట యుక్తము. వానికి నన్ను ఎట్లు ఇత్తువు? నాయనా, నీవు రాజవు వర్ణాశ్రమధర్మరక్షకుఁడవు గదా. ఖడ్గశూరుఁ డైన రాజుకంటె ధర్మశూరుఁడు శ్రేష్ఠుఁడు, వేలకొలఁది ఖడ్గశూరులకు ధర్మశూరుఁడు పతి యగును.' ఇట్లు పలికిన తనయను అంతఃపురమునకు పంపి రాజు స్నానాది కృత్య ములకై లేచెను.

మఱునాఁడు ఆవీరులు దౌవారికుని యింటినుండి వెడలి కౌతూహలముచేత నగర మెల్లఁ దిమ్మరు చుండిరి. అంతలో పద్మకబళ మనుమదపు టేనుఁగు కట్టుఁగంబము విఱిచి, తబేలా నుండి వెలువడి, జనులను త్రొక్కుకొని వచ్చుచు ఆ వీరులను కని చంపుటకు తఱుమసాగెను. వారును దానిమీఁదికి ఆయుధ పాణు లై పరువెత్తిరి. వారిలో క్షత్త్రియుఁ డయిన ఖడ్గధరుఁడు కడమ ముగ్గురను నివారించి తాను ఒకఁడే గర్జించుచున్న యాయేనుఁగుమీఁదికిపోయి దాని తుండమును ఒక్కవ్రేటుతో తామరతూఁటింబోలె ఖండించి, దాని కాళ్ల నడుమనుండి వెలు వడి, లాఘవము చూపి వెనుకవైపున రెండవదెబ్బ కొట్టెను.

మూఁడవదెబ్బకు దాని రెండుపాదములను ఖండించెను. అంతట ఏనుఁగు చావు ఘీంకారము చేసి నేలఁగూలి ప్రాణము విడిచెను, ఆపరాక్రమమును చూచి జను లందఱు ఆశ్చర్యపడిరి. మహా వరాహరాజు కూడ దానిని విని ఆశ్చర్యపడెను.

మఱునాఁడు రాజు ఏనుఁగు నెక్కి ఈఖడ్గధరాదివీరులను నలువురను తోడ్కొని వేఁటకుఁ బోయెను. అచట తేఁడును సైనికులును వ్యాఘ్రమృగ వరాహాది జంతువులను చక్కాడు చుండఁగా, ఏనుఁగుల ఘీంకారములను విని కోపమున సింహ ములు గుహలు వెలువడి వారిమీఁదికి వచ్చినవి. అట్లు పైఁ బడుచున్న యొకసింహమును ఖడ్గధరుఁడు ఒక కత్తి దెబ్బతో రెండు తుండెములు చేసెను. మఱియొక సింహమును ఎడమ చేత కాలు పట్టుకొని గిఱగిఱఁ ద్రిప్పి నేలఁ గొట్టి కాలధర్మము నొందించెను. భాషాజ్ఞ జీవదత్త పంచపట్టికులు ఒక్కొకఁడు ఒక్కొక సింహమును అట్లే తెగటార్చిరి. ఇట్లు తేని కన్నుల యెదుటనే ఆ వీరులు పాదచారులై అవలీలగా ఆ సింహవ్యా ఘ్రాదుల నన్నిటిని రూపు మాపిరి. రాజు ఆశ్చర్యపడి సంతో షించి వేఁట సాలించి నగరమునకు వచ్చెను. ఆ వీరులును దౌ వారికుని గృహమునకుఁ బోయిరి.

రాజు అంతఃపురమునకుఁ బోయి, బడలి యుండియు త త్క్షణమే కౌమారితను రప్పించి, వేఁటలో తాను జూచిన యా వీరుల పరాక్రమములను వివరించెను. ఆమెయు ఆశ్చర్యపడెను.

రా జనియె-'పంచపట్టిక భాషాజ్ఞులు అసవర్ణులేని, జీవదత్తుఁడు విప్రుఁ డైనను రూపహీనుఁడును వికర్ముఁడు నేనియు, క్షత్రియుఁడయిన ఖడ్గధరునియందు దోషము ఏ మున్నది ? అతఁడు బల విక్రమశాలి, సుప్రమాణుఁడు, సురూపుఁడు, అట్టి మదపు టేనుఁగును కొట్టినాఁడు, సింహములను నేలఁ బెట్టి రాచినాఁడు, దరిద్రుఁడు సేవకుఁడు నని దోషము చెప్పుదువేవి, నేను అతనిని ఇతరులకు దొరనుగా సేవ్యునిఁగా నిమిషములో చేసెదను. పుత్త్రి, నీకు ఇష్టమేని వానిని వరింపుము.' అనంగరతి యి ట్లనియె: 'అ ట్లయిన ఆవీరుల నందఱును ఇట రావించి గణకుని అడుగుము. అతఁ డేమి చెప్పునో చూతము.' రాజు వారిని పిలిపించి వారియెదుట స్వయముగా గణకుని 'వీరిలో అనంగ రతికి ఎవరితో పొంతనములు కుదురునో చెప్పుము.' అని యడిగెను. గణకుఁడు వారినక్షత్రము లడిగి తెలిసికొని, చాలసేపు గణించి, రాజుతో 'దేవా, కోపము గాదేని మనవి చేసెదను. వీరిలో ఒకనితో నయినను అమ్మాయికి పొంతనములు కుదుర లేదు. ఈమెకు వివాహయోగము లేదు. ఈమె శాపమువలన జనించినది, విద్యాధరి. ఆశాపము ఇఁకను మూఁడునెలలకు నివర్తించును. కనుక వీరు ఇచ్చటనే మూఁడునెలలు కనుపెట్టుకొని యుందురుగాక. ఈమె యప్పటికి స్వలోకమునకు పోదేని అటుపయిని వివాహము కావచ్చును' మౌహూర్తికుఁ డిట్లు పలుకఁగా అందఱును నమ్మిరి.

ఆ వీరులు మూఁడునెలలు ఆ నగరమందే కనుపెట్టుకొని యుండిరి. పిమ్మట రాజు వారలను గణకుని అనంగరతిని పిలిపించి ఆకస్మికముగా అప్పుడు మునుపటికన్న అధిక సుందరి యయిన యాయనంగరతిని చూచి సంతోషించెను. గణకుఁడు ఆమెకు కాల మాసన్న మాయె నని తలంచెను. రాజు 'ఆ మూఁడు మాసములు గడచినవి గదా, ఇప్పుడు ఏమి చేయఁ దగునో చెప్పుము.' అని అడుగునంతలో ముఖమునకు పైఁటచెఱంగు ముసుఁగిడి ఆమె మానుషదేహమును వదలెను. ఏమి యిట్లున్న దని రాజు స్వయముగా ముసుఁగు తీసి మోము చూడఁగా మృత యై యుండెను. కనుఁదేంట్లు సోలి మోముఁదమ్మి కళ దప్పి మంజుల హంసనాద మేది మంచుదెబ్బ పడిన పద్మినియుంబోలె నుండెను. ఆ శోకావేగము పిడుగుఁ దెబ్బయుంబోలె నవియింప ఆ భూభృత్తు స్వపక్షచ్ఛేద మూర్ఛితుఁ డై నిశ్చేష్టుఁ డై నేల వ్రాలెను. రాజ్ఞి పద్మరతియు సొమ్మసిల్లి తొడవు లనెడు పువ్వులు రాల ఏనుఁగు త్రెంపిన పూలగిత్తియుంబోలె నేలఁ గూలెను. పరిజనులు ఎలుంగెత్తి రోదనములు సేయఁగా, ఆ వీరులు దుఃఖాక్రాంతు లై యుండఁగా, రాజు తెలివి వచ్చి జీవదత్తుని పిలిచి 'ఇప్పుడు ఇతరులకు శక్తిలేదు. నీ సమయ మిది. మృతి నొందిన స్త్రీని బ్రదికించెదనని ప్రతిజ్ఞ చేసితివి గదా. నీవిద్య నిజమేని నా కొమారితను బ్రదికింపుము, విప్రునికి నీకే దానిని ఇచ్చెదను.'

అనెను. జీవదత్తుఁడు రాజపుత్త్రిపై అభిమంత్రితజలంబులు సల్లి చాముండాదేవిని వేఁడెను:—

'అట్టాట్టహాసపహితా,
కరంకమాలాకులా, దురాలోకా,
చాముండా, వికరాళా,
సాహాయ్య మొసంగు నాకు సత్వర మంబా.'

ఇట్లు జీవదత్తుఁడు యత్నము చేసినను ఆబాలకు ప్రాణము రా దాయెను. అంత నతఁడు విషణ్ణుఁడై యిట్లనియె.—వింధ్య వాసినిచేత ఈఁబడిన దయినను నావిద్య నిష్ఫల మయినది. ఉపహాస భాజన మైన యీ నా బ్రదుకు ఏల?' ఇట్లు పలికి జీవ దత్తుఁడు తల ఖండించుకొనువాఁడై పట్టాకత్తిని ఎత్తఁగానే నింగి నుండి వాణి పలికెను: 'జీవత్తుఁడా, సాహసము సేయకు; విను. ఈ యనంగరతి యనంగప్రభ యనెడు పేరి విద్యాధర కన్యక. తల్లిదండ్రుల శాపముచేత ఇంత కాలము మనుష్యాంగన యై యుండినది. ఇప్పుడు ఈదేహమును వదలి తనలోకమునకుఁ బోయి తన దేహమును పొందినది. నీవు మరల పోయి వింధ్య వాసినినే కొలువుము. ఆ దేవి ప్రసాదముచే ఈ విద్యాధరినే పొందుదువు. ఈమె దివ్యభోగములలో నున్నది. నీవుగాని రాజు గాని ఈమెకై వగవ వలదు.' ఇట్లు పలికి దివ్యవాణి విరమించెను. అంతట రాజు కౌమారితకు సంస్కారము జరిపి దుఃఖము నూనెను. రాణియు ఓదారెను.

కడమ ముప్వురు వీరులును వచ్చినదారినే పోయిరి. జీవదత్తుఁడు శ్రద్ధాళు వై వింధ్యవాసిని నుపాసించెను. ప్రసన్న యై దేవి స్వప్నములో వర మిచ్చెను. "పుత్రా, నీ తపస్సునకు సంతోషించితిని. లే లెమ్ము ; వినుము.—ప్రాలేయాచలమందు వీరపురం బని నగరము కలదు. అందు సమరుఁ డని విద్యాధరాధీశుఁడు ఉన్నాఁడు. అతనికి అనంగవతీ దేవియందు అనంగ ప్రభ యని కొమారిత కలిగినది. ఆమె రూపయౌవనగర్వముచే ఎవనిఁ గాని పతినిగా అంగీకరింప కుండఁగా, ఆ మొండితనమునకు కోపగించి తల్లిదండ్రులు 'ఓసీ, మనుష్యస్త్రీ వగుము. అటు లయినను భర్తృసుఖము నెఱుంగక కన్యవ యై పదియాఱు వత్సరము లుండి ఆ దేహమును వదలి ఇటకు వత్తువు. అంతట నీకు మర్త్యుఁడు విరూపుఁడు ఖడ్గసిద్ధుఁడు పతి యగును. అతఁడు మునికన్యను కామించిన దోషమున శాపము నొంది మనుష్యుఁ డైనవాఁడు. నీకు ఇచ్ఛ లేకపోయినను వాఁడు బలాత్కారమున నిన్ను మర్త్యలోకమునకుఁ గొనిపోవును. నిన్ను మఱియొకఁడు కొనిపోవుటచే వానికి నీతో వియోగము కలుగును. పూర్వ జన్మమందు వాఁడు ఎనమండుగురను పరభార్యలను హరించి నాఁడు సుమా. అందువలన ఎనిమిదిజన్మముల ననుభవింపఁ దగిన దుఃఖమును వాఁడు ఒకజన్మములోనే అనుభవించును. నీవును విద్యాధరి పోయి మానుషి వై యొకజన్మమందే ఎనిమిది జన్మములదివోలె గొప్ప దైన దుఃఖమును అనుభవించెదవు.

ఎల్లవారికి పాపాత్ముల సంపర్కము పాప భాగము నొసంగును. స్త్రీలకు పాపాత్ముఁడైన భర్తతోడి సంపర్కము సమపాపము నిచ్చును. నీకు పూర్వజన్మస్మృతి యుండదు. పలువురు మర్త్య భర్తలను పొందుదువు. ఏల యన నీవు తగినవరుల ననేకులను మొండితనముచేత నిరాకరించితివి గదా. నిన్ను యాచించిన విద్యాధరుఁడు మదనప్రభుఁడు మనుష్యుఁడై రాజై పుట్టి చివరకు నీకు పతి యగును. అంతట నీవు శాపము తీఱి మరల ఈలోకమునకు వచ్చి, మరల విద్యాధరుఁ డగునట్టి యా మదన ప్రభునే యోగ్యుని పతిగాఁ బడయుదువు.' అని శపించిరి. ఆశాప మొందినయాకన్యయే భూమిలో ఈ యనంగరతియై, ఇపుడు తలిదండ్రులయొద్ద మరల అనంగప్రభ యై యున్నది. నీవు వీర పురమునకుఁ బోయి ఎఱింగినవాఁడయ్యు లోకవాదరక్షితుఁ డైన దాని తండ్రిని యుద్ధములో గెలిచి దానిని కైకొమ్ము. ఈఖడ్గమును పుచ్చుకొమ్ము. ఇది చేత నున్న నీకు ఆకాశగమ నము అజయ్యత్వమును కలుగును." దేవి ఇట్లు ఆనతిచ్చి కత్తి యిచ్చి యంతర్హితురా లాయెను.

జీవదత్తుఁడును మేల్కని చేతిలో దివ్యఖడ్గముం గాంచి, సంతోషముతో లేచి, అంబికకు ప్రణమిల్లి, ఆమె ప్రసాద మను నమృతముచే తపఃశ్రమ మెల్ల శమింప, చేత ఆకత్తిఁ గొని మింటి కెగసి హిమాలయము చేరి, వీరపురమందలి యావిద్యాధరపతిని సమరుని పోరికిం జీరి, పోర నోర్చి, తద్దత్తయైన యావిద్యాధ

రాంగనను అనంగప్రభను వివాహమై దివ్యభోగము లొందుచు అచట కొంతకాల ముండి, మామతోను భార్యతోను ఇట్లనియె. 'మే మిరువురము మనుష్యలోకమునకు పోయెదము. నాకు కోరికగా నున్నది. ప్రాణులకు జన్మభూమి నికృష్ట మైనను ప్రియము గదా.' మామ అంగీకరించెను. అనంగప్రభ ఎట్టకేలకు ఒప్పుకొనెను. అంత నామెను ఒడిలోఁ బెట్టుకొని జీవదత్తుఁడు నభోమార్గమున మర్త్యలోకమున నవతరించెను. అచట నొక రమ్యపర్వతమును చూచి యనంగప్రభ అందే విశ్రాంతి నొందఁ గోరెను. వల్లె యని యతఁడు ఆమెతోఁ గూడ అటనే దిగి ఆమెయొక్క విద్యాప్రభావముచే కల్పితము లయిన యాహారపానములను సేవించెను. అనంతర మాతఁడు విధిప్రేరితుఁడై అనంగప్రభను ఏమైన మధురముగా పాడు మనెను. ఆమె భక్తితో శివస్తుతి పాడ నారంభించెను. ఆ గీత మాధుర్యముచే ఆ బ్రాహ్మణుఁడు నిద్ర పోయెను.

ఆలోపల హరివరుఁడను నొకరాజు వేఁట బడలికచేత రథము వదలి ఒంటరిగా సెలయేటినీళ్లు వెదకుచు ఆగీతశబ్దము చేత జింకయుం బోలె ఆకృష్టుఁడై అచటికి వచ్చెను. అతనికి ముందుగా శకునములు శుభము చెప్పెను. ఆరాజు దఱియ వచ్చి యనంగప్రభను వాస్తవ మయిన యనంగుని ప్రభనుం బోలె చూచెను. ఆ గీతరూపములకు నివ్వెఱ పోయియున్న యతనిహృదయమును మదనుఁడు ఇచ్చ వచ్చినట్లు కొలలం

గాఁడ నేసెను. ఆమెయు ఆ యందగానిని చూచి మదన వికారమునకు లోనై 'ఇతఁ డెవరు? పుష్పచాపము వదలి వచ్చిన మదనుఁడా? లేక, గీతతుష్టుఁ డైన శివుని యనుగ్రహ మిట్లు మూర్తిభవించి వచ్చుచున్నదా యేమి?' అని తలపోసి, అతనిని 'నీ వెవరవు ? ఈవనమున కేల వచ్చితివి ? చెప్పుము.' అనెను. అతఁడు ఉన్నమాట చెప్పి ఆమెను 'ఓతామరసాననా, నీ వెవతెవు? ఈ నిద్రితుఁ డెవఁడు? చెప్పుము.' అని యడిగెను. ఆమె సంగ్రహముగా ననియెను. 'నేను విద్యాధరిని. ఈతఁడు ఖడ్గసిద్ధుఁడు నాపతి. నిన్ను చూచినమాత్రాన నీయందనురక్త నైతిని. రమ్ము; ఇతఁడు లేవక ముందే త్వరగా నీ పురికి పోదము. సర్వమును అచట సవిస్తరముగా చెప్పెదను.' అందులకు రాజు అంగీకరించి త్రైలోక్యరాజ్యము తనకు లభించినట్లు సంతోషించెను. 'ఈ రాజును ఒడిలో పెట్టుకొని త్వరగా ఆకాశమునఁ బోయెదను.' అని అనంగప్రభ మనసులో తలఁచి, ఆ భర్తృద్రోహదోషముచేత విద్యలు పోఁగా, తల్లిదండ్రుల శాపమును తలంచుకొని విషాదము నొందెను. దానిని చూచి రాజు కారణ మడిగి, ఆమెతో 'ఇది దుఃఖమునకు కాలము గాదు. నీ పతి మేలుకొనును. ఓ ప్రేయసీ, ఇది దైవాయత్త మయిన కార్యము, ఇందులకు దుఃఖము వ్యర్థము. తన తల నీడను విధిగతిని ఎవఁడు తప్పించుకొనఁ గలఁడు? రా పోదము.' అని పలికి ఆమెను తన మాట కొడంబఱిచి తన యొడిలోఁ

బెట్టుకొని నిధానము దొరకిన నిఱుపేదవలె తుష్టుఁడై త్వరగా పోయి రథము చేరి భృత్యులచే అభినందితుఁడై మనోవేగ మయిన రథమున రమణీ సమేతుఁడై నిజనగరమునకుఁ బోయి ప్రజలకు నేత్రోత్సవము చేసెను. హరివర మను పేరి యా స్వ నగరమందు ఆ హరివరరాజు అనంగప్రభతో దివ్యభోగము లను భవించుచుండెను. అనంగప్రభ శాపమహిమచేత తనసర్వప్ర భావములు కోలుపోయి అతనియందే అనురక్తయై యచటనే యుండెను.

ఈలోపల ఆకొండలో జీవదత్తుఁడు మేలుకొని అనంగ ప్రభను మాత్రమే గాక తన కత్తిని గూడ గానక, 'అయ్యో, అనంగప్రభ ఏది? ఖడ్గమును హరించి ఎచటికైన పోయినదా? లేక, ఆమెను ఖడ్గమును ఎవరైన హరించిరా?' అని ఉద్భ్రాంతుఁ డై నానావిధముల తలపోయుచు మూఁడుదినములు మదనానలముచే దందహ్యమానుఁడై ఆకొండలో పరిభ్రమించు చుండెను. అటనుండి దిగి పదిదినములు అడవులలో వెదకి వెదకి ఆమెయడుగుల జాడనైనను ఎచటను కానక, 'అయ్యో! పాపీ! దైవమా, ఇచ్చియు మరల ఖడ్గసిద్ధితోఁగూడ ప్రియను అనంగ ప్రభను హరించితివి!' అని యంగలార్చుచు తిరిగి తిరిగి ఒక గ్రామములో సంపత్సమృద్ధమైన యొకబ్రాహ్మణగృహమునకు పోయెను. అచట అందగత్తెయు సువస్త్రయునైన యిల్లాలు ప్రియ దత్తయనునది అతనిని ఆసనమున కూర్చుండఁబెట్టి చేటికలతో

'త్వరగా జీవదత్తునిపాదములు కడుగుఁడు. ఇతఁడు విరహముచే భోజనము మాని ఇది పదుమూఁడవ దినము' అనెను. అందులకు విస్మితుఁడై జీవదత్తుఁడు 'ఇచటికి అనంగప్రభ వచ్చినదా? లేక, ఈమె యోగినియా?' అని వితర్కించుచు కాలుసేతులు గడుగుకొని, ఆమె పెట్టిన భోజనమును భుజించి, ఆమెకు ప్రణమిల్లి, మహార్తిచే అడిగెను.—'ఓమహానుభావురాలా, ఒకటి చెప్పుము, నావృత్తాంతము నెట్లెఱిఁగితివి? రెండవది కూడ చెప్పుము, నాప్రియ ఎటుఁబోయినది? నాఖడ్గమే మయినది?'

పతివ్రత ప్రియదత్త యనియె.—'నేను కలలోనైనను భర్తకంటె అన్యుని తలంపను. పుత్త్ర భ్రాతృ సమానులనుగా ఇతరపురుషులను చూచెదను. ఎప్పుడును అతిథిని అర్చింపక పంపను. ఆమహిమచేత నేను భూత వర్తమాన భవిష్యత్తుల నెఱుంగుదును. నీప్రియను అనంగప్రభను నీవు విధియోగమున నిద్రించుచుండఁగా ఆమార్గమున గీతాకృష్టుఁడై వచ్చి స్వనామపురవాసి హరివరరాజు కొనిపోయినాఁడు. ఆమెను నీవును పొందఁజాలవు. ఆచెడిప అతనిని కూడ వదలి మఱియొకనిని తగులుకొని పోవును, అనంగప్రభను సాధించుటకై దేవి నీకు ఖడ్గ మిచ్చినది. ఆ దివ్యఖడ్గము దానిని సాధించినది, ఇతరుఁడు హరింపఁగా మరల దేవి యొద్దకే పోయినది. దేవియే నీకు స్వప్నములో అనంగప్రభా శాపవృత్తాంతమును చెప్పినప్పుడు నీకు సంభవించెడు వృత్తాంతమును కూడ చెప్పినది; దానిని

మఱచితివా? భవితవ్యము విషయమై ఈవ్యామోహము ఏల? దీనిని మానుము. మరల మరల అతిదుఃఖకర మయిన యీ పాపానుబంధమును మానుము. అన్నా, అన్యాసక్త యీపాపాత్ము రాలు మనుష్యత్వము పొందినది; నీకు ద్రోహ మాచరించిన పాపమున విద్యలు కోలుపోయినది. అట్టియది నీ కేల?'

ఆపతివ్రత యిట్లు బోధింపఁగా జీవదత్తుఁడు అనంగప్రభ మీఁది వెఱ్ఱి మాని ఆమెతో నిట్లనియె—'ఓ పతివ్రతా, నీ మాటచే నాయజ్ఞానము పోయినది. అమ్మా, పుణ్యాత్ములతోడి సంగము ఎవరికి శ్రేయస్సును చేయదు? పూర్వ పాపవశమున నాకు ఈదుఃఖము కలిగినది. దానిని కడిగికొనుటకై మత్సరము మాని తీర్థములకు పోయెదను. అనంగప్రభకొఱకు ఇతరులతో వైరము పూనుటచే నా కేమి ఫలము? క్రోధమును జయింతు నేని ఈలోకము నంతయు జయించినవాఁడనే.' ఇట్లు అతఁడు పలుకు చుండఁగా ఆమెపతి ధార్మికుఁడు అతిథివత్సలుఁడు వచ్చి జీవదత్తునికి ఆతిథ్యము నొసంగి శోకాపనోదనము చేసెను. జీవదత్తుఁడు అచట విశ్రమించి వారి నిరువురను వీడ్కొని తీర్థయాత్రకై పోయెను. వరుసగా పృథివిలోని సకలతీర్థములను తిరిగి అనేక కాంతారములందు కష్టముల ననుభవించి కందమూల ఫలాశనుఁడై చివరకు ఆవింధ్యవాసిని యొద్దకే పోయి అచట నిరాహారుఁడై కుశాస్తరాసీనుఁడై యుగ్రతపము సలిపెను. తుష్టయై యంబిక యనియె—

“ పుత్త్రా, మీరు నలువురును నా ప్రమథులు. పంచమూల చతుర్వక్త్ర మహోదరముఖులు ఆ ముగ్గురు. వారికన్న నీవు అధికుఁడవు వికటవదననాముఁడవు. మీరు ఒకనాఁడు గంగా పులినంబున విహారార్థము పోయి, అచట జలకమాడుచున్న యొక మునికన్యను చాపలేఖ యను పేరి దానిని కపిలజటముని కూఁతును చూచి యందఱు మదనార్తులై దానిని ప్రార్థించితిరి. ‘పొండి, నేను కన్యను.’ అని అది పలుకఁగా వారు మువ్వురును ఊర కుండిరి. నీవు దానిని బలాత్కారమున చేయి పట్టు కొంటివి. ‘నాయనా, నాయనా, కావుకావు’ మని అది అంగలార్చెను. చెంగట నున్న ముని వచ్చెను. అతనిని చూచి నీవు వదలితివి. అతఁడు మిమ్ము ‘ఓపాపాత్ములారా మీ రందఱును మనుష్యజన్మ మెత్తుఁడు.’ అని శపించెను. వారు శాపాంత మడుగఁగా ముని ‘మీరు రాజసుతను అనంగప్రభను కోరఁగా ఆమె విద్యాధరలోకమునకు ఎప్పుడు పోవునో అప్పుడు వీరు ముగ్గురును శాపవిముక్తు లగుదురు. ఓవికటవదనుఁడా నీవు, ఆ విద్యాధరిని ఎపుడు కోలుపోదువో అపుడు మహాదుఃఖము పొంది చిరకాలము దేవి నారాధించి శాపముక్తుఁడ వగుదువు. నీవు ఈచాపలేఖ హస్తమును స్పృశించితివి గాన, పరదారాపహార పాపము నీయందు అధికము.’ నాకింకరులు మీరు ఆఋషి శాపమువలన దక్షిణాపథమందు మహావీరులరుగా పుట్టితిరి. నీచెలికాండ్రు పంచపట్టిక భాషాజ్ఞ ఖడ్గధరు లయిరి;

నీవు జీవదత్తుఁడ వయితివి. అనంగరతి విద్యాధరలోకమునకుఁ బోఁగానే ఆమువ్వురు నాప్రసాదంబున శాపముక్తు లై ఇచటికి వచ్చినారు. నీవును నన్ను ఆరాధించితివి. ఇపుడు నీశాపము తీఱినది. ప్రసన్న నయితిని. ఈ యాగ్నేయ ధారణను నేర్చి నీ దేహమును త్యజింపుము. ఎనిమిది జన్మముల ననుభవింపఁ దగిన యాపాపమును ఒక్కమాత్రే కాల్పుము." ఇట్లు పలికి ధారణను నేర్పి దేవి అదృశ్య ఆయెను. అతఁడు ఆధారణచే మర్త్యదేహమును పాపమును కాల్చి గణోత్తముఁ డాయెను. దేవతలకుఁ గూడ పరస్త్రీసంగమ పాపానుభవము ఇట్టిదయి యుండఁగా ఇతరులగతి చెప్ప వలయునా?

అనంగప్రభ హరివరుని యంతఃపురములలో ప్రాధాన్యము నొందెను. ఆ రాజు రాజ్యమును మంత్రికి ఒప్పగించి దివానిశము ఆమెతోఁ గ్రీడించుచుండెను. ఒకనాఁడు ఆ రాజు నొద్దకు మధ్య దేశమునుండి లబ్ధవరుఁ డను క్రొత్తనాట్యాచార్యుఁడు వచ్చెను. రాజు వాద్య నాట్యములలో వాని నేర్పును చూచి సమ్మానించి అంతఃపురములకు నాట్యము నేర్పు మని వానిని నియమించెను. వాఁడు అనంగప్రభకు మిక్కిలి చక్కఁగా నృత్యము నేర్పెను. ఆమెనృత్యము చూచి సపతులు కూడ ఆమెయం దనురక్త లయిరి. సహవాసముచేతను నృత్తశిక్షారసముచేతను అనంగప్రభ నాట్యాచార్యునియందు అనురక్త యాయెను. ఆమె యొక్క రూపనృత్తములచే ఆకృష్టుఁడై ఆ నాట్యాచార్యుఁడు

కూడ కామునిచే వీ మేమో న ర్తింపింపఁబడెను. ఒకనాఁడు ఏకాంతమందు నాట్యశాలయందు అనంగప్రభ తనంతట తానే వానిని రతార్థము పైకొనెను. రతాంతమందు ఆమె అత్యంత సానురాగ యై యతనితో ని ట్లనియె.—'నీవు లేక నేను నిమిష మయిన నిలువలేను. హరివరరాజు మనవృత్తము నెఱింగిన క్షమింపఁడు. కనుక రాజునకు తెలియని చోటికి ఎచటికైనను పోవుదము రా, నీకు రా జిచ్చినట్టిది హేమహయోష్ట్రాదికము విస్తారము కలదు, నాకును అమితము ఆభరణజాత మున్నది, త్వరగా నిర్భయముగా పోవుదము.' ఈ మాటకు నాట్యా చార్యుఁడు అంగీకరించెను. అనంగప్రభ మగవేసము వేసికొని, తనకు మిగుల నంతరంగమిత్త్ర మైన యొక చేటిని తోడ్కొని, నాట్యాచార్యునియింటికిఁ బోయెను. వెంటనే నాట్యాచార్యుఁడు ధన మంతయు లొట్టిపిట్టలమీఁద ఎక్కించి బయలు వెడలెను. వానితో ఆమె గుఱ్ఱ మెక్కి పయనము చేసెను. మొదట వైద్యాధరలక్ష్మిని వదలి రాజశ్రీని ఆశ్రయించినది, ఇప్పుడు చారణలక్ష్మిని కోరినది! ఛీ! స్త్రీలమనస్సు ఎంత చపలము! వానితోఁగూడ దూరము పోయి అనంగప్రభ వియోగపుర మను నగరము చేరి అచట వానితో సుఖ ముండెను. ఆమె లభించినందున ఆనటాగ్రణియు తనలబ్ధవరనామము సార్థకముగా తలంచి సుఖ ముండెను.

ఇంతలో ఆమెపోక యెఱింగి దుఃఖముచే హరివరుఁడు ప్రాణత్యాగోన్ముఖుఁడు కాఁగా, మంత్రి సుమంత్రుఁడు అతని నాశ్వాసించుచు ని ట్లనియె.- 'దేవా, నీ వెఱుఁగనిది ఏ మున్నది? స్వయముగా ఆలోచించుకొనుము: పతిని ఖడ్గసిద్ధుని వదలి నిన్ను చూచినమాత్రమున వలచి వెంట వచ్చిన యా పడఁతికి నీయందుమాత్రము నిలుకడ ఎట్లు గలుఁగును? ఎవనినో నీచుని తగులుకొని, మంచివస్తువుపై యిచ్ఛలేక, తృణాదృష్టయను రాగముచేత తృణరత్న శలాకయుం బోలె, పోయినది. నిక్కము గా ఆమెను నాట్యాచార్యుఁడు కొనిపోయినాఁడు. వాఁడు లేఁడు. సంగీతగృహమందు వా రిరువురును ఉండి రని తెలియ వచ్చినది. దేవా. ఎఱిఁగియు ఆమెయందు ఈపట్టుదల నీ కేల? సంధ్యవలె విలాసిని అందఱియందును క్షణరాగిణి.' మంత్రి యిట్లు పలుకఁగా రాజు విచార మవలంబించి 'ఓహో ! ఈ బుద్ధిమంతుఁడు నాకు నిజమునే చెప్పినాఁడు! పర్యంతవిరసయు కష్టయు ప్రతిక్షణవివర్తినియు నై భవస్థితియుం బోలె విలాసిని అనిత్యసంబంధ గదా. పడినవానిని ముంచుచు ఉత్కలికలు చూపుచు ఉండునట్టి యగాధనదులలోను అట్టి స్త్రీలలోను ప్రాజ్ఞుఁడు ఎవఁడు పడును? వ్యసనములందు భయపడనివారు, విభవములందు గర్వింపనివారు కార్యములందు వెనుదివియని వారును ఎవరో ఆధీరులు లోకమును జయించినవారు.' అని

యాలోచించి వగమాని మంత్రిబోధ గ్రహించి హరివరుఁడు తన రాణులతోనే సంతుష్టుఁడై యుండెను.

అనంగప్రభ వియోగపురమందు నాట్యాచార్యునితోఁ గూడ కొంతకాల ముండెను. అచట నాట్యాచార్యునికి దైవ యోగమున సుదర్శనుఁ డనెడు వడుచు జూదగానితో చెలిమి కలిగెను. వాఁడు అనంగప్రభయెదుటనే నాట్యాచారుని సర్వ ధనమును త్వరలో జూదముచే హరించెను. ఆ రోషముచేతనుం బోలె ఆమె నిర్ధనుని నాట్యాచార్యుని వదలినదై తానుగానే సుదర్శనుని పతిగా కలసికొనెను. ఆలిని ధనమును కోలుపోయి నాట్యాచార్యుఁడు చేయునది లేక విరక్తుఁడై జడలు దాల్చి తపస్సుకై గంగాతీరమునకుఁ బోయెను.

అనంగప్రభ నవ నవప్రియ యై జూదగాఁడైన యా సుదర్శనునితోనే యుండెను. ఒక రాత్రి సుదర్శనుని ధనము నంతయు దొంగలు ఇల్లు చొరఁబడి హరించిరి. అంతట ధనము లేమిచే దిగులుపడి అనుతపించుచున్న యా యనంగ ప్రభతో సుదర్శనుఁడు దైవోపహతచేతస్కుఁడై 'హిరణ్య గుప్తుఁ డని నాకు స్నేహితుఁడు మహాధనుఁడు కలఁడు, అతని యొద్ద ఏ మయిన అప్పు తెచ్చుకొందము రమ్ము' అని పలికి, ఆమెను తోడ్కొని హిరణ్యగుప్తుని యొద్దకు పోయి, ఋణ మడిగెను. వర్తకుఁడు అనంగప్రభను, ఆమె అతనిని, చూచి పర స్పరము అన్యోన్యసాభిలాషు లయిరి. వర్తకుఁడు సుదర్శనునితో

ఆదరపూర్వకముగా 'తేపు ఇచ్చెదను బంగారము మీకు, ఇప్పుడు మాయింటనే భోజనమునకు నిలుపుఁడు.' అనెను. ఆమాట వినియు, ఆయిరువురభావము అన్యాదృశముగా నుండుట కనియు, సుదర్శనుఁడు నాకు దేహము సరి లేదు. నేను నేఁడు భుజింపను,' అనెను. 'మిత్రమా, అట్లయిన, నీ భార్యను మాత్రమైన మాయింట భోజనము సేయనిమ్ము. ఈమె ఇదే తొలిమాఱు గదా మాయింటికి వచ్చుట.' అని హిరణ్య గుప్తుఁడు బలవంత పెట్టెను. సుదర్శనుఁడు జూదగాఁ డయ్యెను ఊరకుండెను. వైశ్యుడు అనంగప్రభను లోపలికి తీసికొని పోయి, అతర్కితోపనతయు లసన్మదవివాసయు నయిన యా యనంగప్రభతో యథేచ్ఛముగా పానాహారాదులు సలిపెను. సుదర్శనుఁడు ఆమె బయట వచ్చు నని కనుపెట్టుకొని యుండి వర్తకభృత్యులవలన ఇట్లు హెచ్చరిక పొందెను.—'ఆమె భోజనము చేసి యింటికి పోయినది. పోవుచుండఁగా నీవు చూడవైతివి. నీ వేల ఇంకను ఇచటనే యున్నావు ? ఇంటికి పొమ్ము.' సుదర్శనుఁడు 'అది లోపల నున్నది, పోలేదు, నేను పోను.' అని చెప్పఁగా వానికి పాదప్రహారము లిచ్చి ఆకింకరులు తఱుమఁ గొట్టిరి. అంతట సుదర్శనుఁడు దుఃఖించుచు పోయి 'ఆహా, ఏమి, వైశ్యుఁడు నాకు మిత్ర మయ్యెను నాభార్యను హరించినాఁడు. ఇచటనే నాపాపమునకు ఫల మిట్లు అనుభవమునకు వచ్చినది. నేను ఒకనికి ఏమి చేసితినో నాకు మఱి

యొకఁడు అదియే చేసినాఁడు. మరల నాకు ఇట్టి పరాభవము రాకుండ జన్మరాహిత్యము చేసికొనెదను.' అని యాలోచించి కోపము మాని బదరికాశ్రమమునకుఁ బోయి జన్మరాహిత్యమునకై తపస్సు చేసెను.

ఆమెయు సురూపుని వైశ్యుని ప్రియుని పతినిగాఁ బొంది, పువ్వునుండి పువ్వునకు వచ్చిన భృంగివలె, క్రీడించుచుండెను. మహాధనుఁ డయిన యాయనురక్త వణిజుని ధనప్రాణములకు స్వామిని యాయెను. అచటిరాజు వీరబాహుఁడు ఆజగదేక సుందరి నెఱిఁగియు ధర్మపరుఁడై హరింపకుండెను. కొన్నాళ్లకు వైశ్యుఁడు వ్యయాతిరేకముచే నిర్ధనుఁ డాయెను. బంధకి యేలునింట కులస్త్రీవలె శ్రీ కృశించును గదా. అంతట హిరణ్యగుప్తుఁడు వ్యాపారార్థము మూలధనము గొని సువర్ణభూమి యనుదీవికి పయన మాయెను. విరహమునకు తాళలేక ఆయనంగప్రభను వెంటఁ గొని మార్గవశమున సాగరపుర మను నగరమునకుఁ బోయెను. అందు సాగరవీరుఁడను చెంబడివాఁడు కడలివలన బ్రదుకువాఁడు ఇతనితోఁ గలసెను. వాఁడు ఇతనికి ఓడ తెప్పించెను. అందులో ఇతఁడు ప్రియాసహితుఁడై యెక్కెను. ఓడ యెక్కి సాగరవీరునితో పోవుచుండఁగా కొన్ని దినము లాయెను.

అంత నొకనాఁడు మెఱయుచున్న మెఱపుఁగన్నులవాఁడు ఉగ్రుఁడు సంహారభయంకరుఁడు కాలమేఘుఁడు వచ్చి ప్రబల

వాయు ప్రేరణచే ఏనుఁగుతొండములావు ధారలుగా వర్షింప సాగెను. ఓడ కరళ్లలో మునుఁగసాగెను. పరిజనులు ఆక్రందనము చేయఁదొడఁగిరి. హిరణ్యగుప్తుఁడు తనమనోరథమువోలె ఓడ భంగపడుచుండఁగా ఉత్తరీయమును నడుమునకు కట్టుకొని అనంగప్రభ ముఖమును గానక 'హా, ప్రాణనాయికా, ఎట నున్నావు?' అని మొఱవెట్టుచు సంద్రములో దుమికెను. కొంతదూరము ఈఁదుకొనిపోయి, దైవవశమున ఆదారిని వచ్చిన యొక వర్తకనావను కని పట్టుకొని యెక్కెను. సాగరవీరుఁడు పలకలను త్రాళ్లతో కలియఁగట్టి తెప్పచేసి, అనంగప్రభను అందు ఎక్కించుకొని, తాను కూడ ఎక్కి, ఆమెను భయము తీర్చుచు చేతులతో నీళ్లు త్రోయుచు నడపుచుండెను. క్షణములో ఓడ పగిలెను. మేఘములు పోయి, సముద్రము కోపము తీఱిన సాధువువలె స్తిమితపడెను. హిరణ్యగుప్తుఁడు దైవవశమున మంచిగాలి కొట్టఁగా అయిదు దినములలో రేవు పొంది దిగి ప్రియావిరహదుఃఖితుఁడై విధివిలాసమునకు ప్రతీకారము లేదని యెఱిఁగి క్రమముగా తననగరము చేరి ధైర్యమవలంబించి మరల వర్తకము చేసి ధన మార్జించి సుఖముండెను.

అనంగప్రభయు పలకపై నొకదినమే ఉండి గట్టు చేరెను. ధీవరేంద్రుఁడు ఈమెను ఓదార్చి సాగరపురములో తనయింటికిఁ గొనిపోయెను. అచట రాజసమైశ్వర్యుఁడు వీరుఁడు శ్లాఘ్యయౌవనుఁడు ప్రాణప్రదాయి ఆజ్ఞావిధాయి అగు నతనినే ఆమె

కామించి పతినిగా చేకొనెను. భ్రష్టచారిత్ర యయిన స్త్రీ మెఱక పల్లములు చూడదు గదా. ఆమె ఆ చెంబడిదొరతో అతని యైశ్వర్యము నెల్ల అనుభవించుచు వానియింట ఉండి ఒకనాఁడు వీథిలోఁ బోవువానిని విజయవర్మ యను క్షత్త్రియ కుమారుని అందగానిని మేడతుదనుండి చూచి వలచి దిగి వచ్చి నిన్ను చూచి వలచి వచ్చితి, నన్ను కైకొనుము.' అనెను. వాఁడును స్వర్గమునుండి తనకై దిగివచ్చినదానింబోలె తలంచి హృష్టుఁడై ఆ త్రైలోక్యసుందరిని గ్రహించి తనయింటికి కొని పోయెను. ఆమె యెచటికో పోయె నని తలఁచి సాగరవీరుఁడు దుఃఖతుఁడై సర్వస్వత్యాగము చేసి దేహత్యాగము చేయుటకై గంగకు పోయెను. వానికి అట్టిదుఃఖము ఎట్లు కలుగకుండును! చెంబడితన మెక్కడ! అట్టి విద్యాధరి సంగమ మెక్కడ!

అనంగప్రభ విజయవర్మతో అనర్గళముగా సుఖములను అనుభవించుచుండెను. పిమ్మట నొకనాఁడు ఆ పురి రాజు సాగర వర్మ యనునతఁడు పురము చూడఁదిరుగుచుండెను. తన పేరి యా తననగరమును చూచుచు ఆరాజు విజయవర్మునియింటి వీథిని పోవుచుండెను. రాజు వచ్చుచున్నాఁడని యెఱిఁగి చూడ కుతూహలిని యై అనంగప్రభ మేడ యెక్కి అతనిని చూచిన మాత్రాన మదనవశయై అతని యేనుఁగు మావటీని 'ఓయి మావటీ, నే నెప్పుడును ఏనుఁగు నెక్కి యెఱుఁగను. నన్ను ఎక్కింపుము. ఎట్లుండునో చూచెదను.' అనెను. ఆధోరణుఁడు

రాజు మొగము చూచెను. రాజు ఆకాశమునుండి జాఱినచంద్ర కళయో యనఁనొప్పుచున్న యామెను చకోరమువోలె తనియని దృష్టులతోఁ జూచి మోహించి మావటీనితో 'ఓయి, ఏనుఁగును దగ్గఱకు నడిపి ఆ రమణి కోరికను తీర్పుము. ఆ యిందు వదనను త్వరగా దీనిమీఁదికి ఎక్కింపుము.' అని యాజ్ఞా పించెను. అంత మావటీఁడు ఆ పిడియేనుఁగును ఆమె యున్న మేడ క్రిందికి నడపెను. పిడి దగ్గఱకు రాఁగాఁ జూచి ఆమె తన్ను జేనియొడిలో పడవైచికొనెను. మొదట ఆభర్తృద్వేష మేమి! ఇప్పుడు ఎందఱు భర్తలకును ఈతనియందు ఏమి? ఆమెకు పితృ శాపమున ఎట్టి మహావిపర్యయము కలిగినది? పడుదు నను భయముచేతనుంబోలె ఆమె యతని కంఠమును ఆలింగించెను. తత్స్పర్శామృతసిక్తాంగుఁ డయి యా మహారాజు మహానందము పొందెను. యుక్తిగా త న్నర్పించుకొని ముద్దుగొన నువ్విళ్లూరు చున్నట్టి యాభామను చేకొని రాజు వెంటనే నగరి కేఁగి అచట ఆమె వృత్తాంతమును విని ఆమెను అంతఃపురమునకుఁ బంపి మహాదేవినిగా చేసికొనెను. ఆమెను రాజు హరించినాఁ డని తెలిసికొని ఆక్షత్రియకుమారుఁడు విజయవర్మ వచ్చి రాజ భృత్యులతో వెన్ను చూపక పోరి మడిసెను. శూరులు స్త్రీ నిమిత్తమైనపరాభవమును సహింపరు గదా. 'ఈవరాకి ఏల? మమ్ము భజింపుము.' అని సురస్త్రీలచే చేకొనఁబడియెనో యన నతఁడు వీరస్వర్గమునకుఁ బోయెను.

అనంగప్రభ సాగరవర్మయందు సముద్రమందు నది యుంబోలె అనన్యగామిని గాక స్థిరముగా నెలకొని భవితవ్యతా ప్రభావముచే ధన్యమ్మన్య యై యుండెను. అతఁడును ఆమెవలన తనజన్మము సఫల మాయె నని యానందించెను. కొన్నాళ్లకు అనంగప్రభ గర్భిణి యై యథాకాలము కుమారునిఁ గనెను. వానికి తండ్రి సముద్రవర్ముఁ డని పేరు పెట్టి అతివిశేషముగా పుత్త్రోత్సవము చేసెను. క్రమముగా ఎదిగి గుణవంతుఁడై యువ యై బలపరాక్రమశాలి యైన యాకుమారునికి రాజు యౌవరాజ్య పట్టాభిషేకము చేసెను. పిమ్మట అతనికి సమరవర్మయను రాజుకొమారితను కమలవతి యనుదానిని తెచ్చి వివాహము చేసి, గుణాకృష్టుఁడై తన రాజ్యమునే యిచ్చివేసెను. పరాక్రమవంతుఁడు సముద్రదత్తుఁడు రాజ్యమును పొంది క్షత్త్రధర్మము నెఱింగి తండ్రికి ప్రణమిల్లి విన్నపించుకొనెను.—'నాయనా, దిగ్విజయమునకుఁ బోయెదను, నాకు సెల విమ్ము; జయశీలుఁడు గాక భూమికి పతి అగువాఁడు స్త్రీకి పతి యగు నపుంసకుఁడువోలె నిందనీయుఁడు. నిజబాహుబలముచే పరరాష్ట్రములను గెలిచి ఆర్జించిన లక్ష్మి రాజులకు ధర్మ్యయు కీర్తికరియు. తమప్రజలనే పిల్లులువోలె భక్షించు లుబ్ధులకు రాజ్యము ఐశ్వర్యకరమా?' సాగరవర్మ యిట్లనియె. 'పుత్త్రా, నీకు రాజ్యము క్రొత్త, ముందుగా దానిని దృఢము చేసికొనుము. ప్రజలను ధర్మ్యముగా పరిపాలించువారికి

అపుణ్యముగాని అకీర్తిగాని లేదు. తనశక్తియెఱుఁగక రాజుల మీఁదికి యుద్ధమునకు పోవుట ఉచితము గాదు. నీవు శూరుఁడ వైనను నీకు మహాసైన్యము ఉన్నను నమ్మరాదు. రణములో జయశ్రీ చపలురాలు.'

ఇట్లు తండ్రి వల దన్నను ఎట్టకేలకు అతనిని సమ్మతి పఱిచి తేజస్వి సముద్రవర్మ దిగ్విజయమునకు వెడలి, వరుసగా ఎల్లదిక్కులను గెలిచి రాజులను వశపఱుచుకొని హస్త్యశ్వ హేమాదికమును పొంది నిజనగరమునకు వచ్చి నానా దేశముల మహారత్నములతో తల్లిదండ్రుల పాదములకు పూజ చేసెను. వారియాజ్ఞచే బ్రాహ్మణులకు హస్త్యశ్వ హేమరత్నమయము లయిన మహాదానములు చేసెను. అర్థులకును భృత్యులకును అవారిగా బంగారము వర్షించి దరిద్రశబ్దమును అర్థహీనము చెసెను. కుమారుని ప్రాభవమును చూచి సాగరవర్మయు అనంగప్రభయు కృతకృత్యమ్మన్యు లయిరి. రాజు ఆదినములను ఉత్సవములలో గడపి మంత్రులయెదుట పుత్త్రునితో ననియె: "పుత్త్రా, నేను ఈజన్మములో చేయవలసినది అంతయు చేసితిని. రాజ్యసుఖములను అనుభవించితిని, ఇతరులవలన పరాజయము నెఱుఁగను. సామ్రాజ్యప్రాప్తుని నిన్ను చూచితిని. నాకు ప్రాప్యము మఱే మున్నది? కనుక దేహ ముండుపఱకు తీర్థము సేవించెదను. చూడుము, 'సర్వాంగ జైన యీశరీరమందు ఇంకను నీకు అభిమానమా ?' యని చెప్పునదియుం బోలె

ప్రీతియుక్తయైన యామెను దోడ్కొని, నిజనగరమునకుఁ బోయి సుఖముండెను. ఈ రీతిగా దివ్యులు తప్పు నడవడులచే శాపచ్యుతులై మనుష్యలోకములో జనించి ఆదోషముల ఫలమును అనుభవించి, తమ పూర్వ సుకృత విశేషములచేత మరల నిజపదమును పొందుదురు.

ఇట్లు నరవాహనదత్తుఁడు గోముఖ మంత్రివలన అలంకారవతీ సమేతుఁడై కథ విని సంతోషించి దినకృత్యములకై లేచెను.

---

## 3 - వ తరంగము.

మఱునాఁడు అలంకారవతీ సమేతుఁడై యున్న నరవాహనదత్తునితో మిత్త్రుఁడు మరుభూతి విన్నపించెను: 'చూడు చూడు, దేవా, నీసింహద్వారమునందు జడదారి కార్పటికుఁడు మిక్కిలి ధూళి గ్రమ్మి దివారాత్రము చలిలోను ఎండలోను ఒక తోలుచీలికగోచి మాత్రము పెట్టుకొని కాచి యున్నాఁడు. అకాలమున ఎచ్చు ఇచ్చుటకంటె కాలమున కొంచె మిచ్చినను మేలు. కనుక వీఁడు చావకముందే వీనిపై కనికరింపుము.' అని. దానిని విని గోముఖుఁ డనియె.— మరుభూతి చెప్పినది సరియే గాని, దేవా, ఈవిషయమున నీతప్పు లేదు. పాపము క్షయించుపఱకు దాత యయ్యును ప్రభువు ఇయ్యఁడు; పాపము

ఘటియించెనా ప్రయత్నపూర్వకముగా నివారించినను ఇయ్యనే ఇచ్చును. ఇది కర్మవశము గదా.

### పాపము తీఱని కార్పటికుని కథ.

పూర్వము ఈ లోకములో లక్షపుర మని యొక నగర ముండెను. అందు దాత్రాగ్రణి లక్షదత్తుఁడు అని రాజు ఉండెను. అతఁడు యాచకునికి లక్షకు తక్కువ యిచ్చి యెఱుఁగఁడు. ఎవనితో పలుకునో వానికి లక్ష, ఎవనితో సంతోషించెనో వానిని నిర్దారిద్ర్యనే చేసెను. అందువలననే అతనికి లక్షదత్తుఁ డని పేరు కలిగెను. అతని సింహద్వారమున లబ్ధదత్తుఁడను కార్పటికుఁడు తోలుగోచి మాత్రము గలిగిన జడదారి చలిలోను వానలోను మండు వేసవి యెండలోను కదలక నిలిచి యుండెను. అట్లు ఎంతకాలము కష్టపడుచు నిలిచి యున్నను వానికి రాజు దాత యయ్యును దయాళు వయ్యును ఏమియు ఈ లేదు. ఒకనాఁడు రాజు వేటకుఁ బోయెను. కార్పటికుఁడు దుడ్డుగుదియ చేతఁ గొని కూడఁ బోయెను. అడవిలో రాజు ససైన్యుఁడై వాహనమంద ఉండి ధనుస్సు ఎక్కుపెట్టి బాణ ప్రయోగముచేసి వ్యాఘ్రములను వరాహములను లేళ్లను చంపుచుండెను. కార్పటికుఁడు రాజుప్రాల పాదచారియై దుడ్డుతోనే వ్యాఘ్ర వరాహ హరిణములను అనేకములను కొట్టి చంపెను. రాజు దానిని చూచి, 'ఆహా వీఁడు ఎంతటి శూరుఁడు!' అని ఆశ్చర్యపడి సంతోషించెనే గాని, వానికి ఏమియు ఇయ్య

లేదు. వేట చాలించి వచ్చి రాజు నగరు సొచ్చెను. కార్పటికుఁడు ఎప్పటి యట్లు సింహద్వారమందు నిలుచుండెను. ఒకమాఱు లక్షదత్తునకు ఎల్లజగడముచే దాయాదులతో మహాయుద్ధము జరిగెను. ఆ యుద్ధమునందు రాజు నెదుట కార్పటికుఁడు గట్టి చంద్రదుడ్డు తలదెబ్బలతో శత్రువుల ననేకులను మడియించెను. రాజు శత్రువులను జయించి తన నగరమునకు వచ్చెను. అట్లు కార్పటికుని పరాక్రమము చూచియు వానికి ఏమియు ఈయ లేదు. రాజును కార్పటికుఁడును ఈరీతిని ఉండఁగా అయిదు సంవత్సరములు గడచినవి. కార్పటికుఁడు తన దుడ్డుకఱ్ఱచేతనే జీవించు చుండెను.

ఆఱవ సంవత్సరము రాఁగా రాజు ఒకనాఁడు దైవ యోగమున వానిపై కనికరించి యిట్లు చింతించెను.—'వీనికి ఎంతకాలము కష్టపడినను ఇప్పటికి ఏమియు ఇయ్యనైతిని. ఇప్పుడు యుక్తిగా వీని కేమయిన ఇచ్చి చూచెదను. ఈ వీనునికి పాపక్షయ మయినదో లేదో, ఇప్పటి కైనను లక్ష్మి వీనికి దర్శన మిచ్చునో ఈయదో, చూచెదను గాక.' ఇట్లు ఆలోచించి రాజు స్వయముగా కోశాగారమునకుఁ బోయి యొక మాతులుంగ ఫలమును బరిణవలె చేసి రత్నములతో నిండించెను. బయటనే నిండోలగంబు తీర్చెను. పౌర సామంత మంత్రు లందఱును ప్రవేశించిరి. వారిమధ్యలో కార్పటికుఁడు గూడ ప్రవేశింపఁగా రాజు వానిని దగ్గఱకు రమ్మని స్నేహముగా పలికెను. కార్పటి

కుఁడు సంతోషించి రాజునొద్దకు వచ్చి యెదుట కూర్చుండెను. వానిని రాజు ఏదయినను మంచి సూక్తిని పాడు మనెను. కార్పటికుఁడు పాడెను.—

గీ. నిండినట్టివాని నిండించు నెప్పుడు
సాగరమును నదుల సమితివోలె,
మెట్ట నయిన మెట్ట దొట్టు పెట్టినయట్టు
లధను కనుల బ్రోల నబ్జనిలయ.

దానిని విని మఱల పాడించి రాజు మిక్కిలి సంతసించి గొప్ప గొప్ప రత్నములు నిండి యున్న యా మాతులుంగఫలమును ఇచ్చెను. 'ఈరాజు ఎవనికి సంతసించునో వాని దారిద్ర్యమును పోఁగొట్టును. పాపము ఈ కార్పటికుఁడు కేవలము అదృష్ట హీనుఁడు. రాజు సంతోషించియు వీనికి ఈమాతులుంగమును ఇచ్చినాఁడు. అదృష్టహీనులకు కల్పవృక్షముగూడ మోదుగు అగును.' అని ఆ యోలగములో అంతయును పరమార్థము నెఱుఁగక విషాదముతో ఒండొరువులతోఁ బల్కుకొనుచుండిరి. కార్పటికుఁడు మాతులుంగమును గ్రహించి వెడలిపోయి చింతించుచుండెను. వాని యెదుటికి రాజవందియను భిక్షు వొకఁడు వచ్చి వానికి తన శాటి యిచ్చి మనోహర మయిన యా మాతులుంగమును కైకొని రాజదర్శనము చేసి దానిని కానుక పెట్టెను. రాజు దానిని గుర్తుపట్టి శ్రమణుని 'భదంతా, ఈఫలము నీ కెక్కడిది?' అని యడిగెను. కార్పటికుఁ డిచ్చె

నని యతఁడు పలికెను. రాజు 'ఆహా! వీని పాపము ఇప్పటికిని క్షీణింపదాయెను గదా.' అని విషాదపడి ఆశ్చర్యపడి యా ఫలమును గైకొని సభ చాలించి తత్క్షణమే లేచి పోయి దిన కృత్యములు జరిపెను. కార్పటికుఁడు ఆ కొటిని అమ్మి అన్న పానములు నెఱవేర్చుకొని మరల యథాప్రకారము సింహ ద్వారమున నుండెను.

మఱునాఁడు రాజు యథాప్రకారము ఆస్థానము నలంకరించెను. అందులకు పురజను లందఱును యథాప్రకారము వచ్చిరి. కార్పటికుఁడును వచ్చెను. వానిని రాజు చెంగటికిఁ బిలిచి కూర్చుండఁబెట్టి ఆసూక్తినే మరల పాడించి కరుణించి రత్నగర్భ మయిన యా మాతులుంగమునే మరల అతనికి ఇచ్చెను. 'ఆహా! ప్రభువు వీనిపై రెండవపర్యాయము అనుగ్రహించినను వృథా అయినది! ఏమి యిది!' అని సభాసదు లందఱును ఆశ్చర్యపడిరి. కార్పటికుఁడు ఫలమును గైకొని వ్యాకులుఁడై రాజానుగ్రహమును సఫలమునుగాఁ దలంచి సభ వెడలి పోయెను. అంతలో దేశాధికృతుఁ డొకఁడు వచ్చి రాజదర్శనము చేయువాఁడై, శుభశకునము గోరుచుండి, యా ఫలమును గాంచి, రెండు వస్త్రములు వెల యిచ్చి దానిని గ్రహించి, ఓలగంబు సొచ్చి, రాజునకు ప్రణమిల్లి, ముందు ఆ మాతులుంగమును, పిమ్మట తాను తెచ్చిన నజరును అర్పించెను. ఈపండు నీ కెక్కడిదని రాజడుగఁగా కార్పటికునివలనిది యని

అధికృతుఁడు పలికెను. 'అహో! ఇప్పటికిని లక్ష్మి వానిని కటాక్షింపదాయెఁ గదా!' యని రాజు మనస్సులో చింతించి, మిగుల విషాదము నొంది, ఆఫలమును చేతఁగొని యాస్థానము చాలించి లేచెను. కార్పటికుఁడును ఆవస్త్రములలో నొకటి బజాఋులో అమ్మి అన్నపానములు తీసుకొని రెండవదానిని రెండు తుండెములుగా చింపి తాను ధరించెను.

మూఁడవనాఁడు రాజు నిండోలగంబున ఆ సూక్తినే మరల పాడించి కార్పటికునికి ఆమాతులుంగమునే ఇచ్చెను. అందఋను ఆశ్చర్యపడిరి. కార్పటికుఁడు వెలువడి ఆ బీజపూరమును రాజవిలాసినికి ఇచ్చెను. జంగమ మైన రాజసమ్మాన తరువల్లియుంబోలె ఆ విలాసిని యతనికి అగ్రఫలసూచక మయిన కుసుమముంబోలె సువర్ణము నొసంగెను. దాని నమ్మి కార్పటికుఁడు ఆదినము సుఖ ముండెను. ఆమె రాజదర్శనము చేసి ఆ ఫలమును నజరు పెట్టెను. నీకిది యెక్కడి దని రాజడుగఁగా కార్పటికునివలననిది యని యామె చెప్పెను. 'ఇప్పటికిని లక్ష్మి వానిని కటాక్షింపదాయెఁ గదా. ఈ పుణ్యహీనుఁడు నా కరుణ నిష్ఫలము గా దని యెఋుంగఁడు. ఆహా! ఈ మహారత్నములు నాయొద్దకే మరల మరల వచ్చుచున్నవి!' అని తలపోసి యా ఫలమును పదిలపఱిచి ఆహ్నికకృత్యములకు రాజు లేచెను.

నాలవనాఁడు సభలో సామంత సచివాదు లెల్లరు నిండి యుండ, ప్రభువు కార్పటికుని తన చెంతఁ గూర్చుండఁ బెట్టుకొని

ఆ సూక్తిని పాడించి ఆమాతులుంగఫలమునే ఇచ్చెను. అది వానిచేతఁ బడెడు త్వరలో చేతికి తగిలియు తగులకయే నేలపైఁ బడి రెండుగా బ్రద్దలాయెను. మూఁత వీడఁగానే దానినుండి మహార్ఘము లయిన గొప్ప రత్నములు రాలి సభ నెల్ల దేదీప్యమానము కావించినవి. వానిని చూచి ఎల్లవారును 'అహో! ప్రభు కటాక్షము ఇట్లు ఉండఁగా మేము పరమార్థ మెఱుఁగక మూఁడుదినములు పరిపరివిధముల భ్రమల పాలై యుంటిమి!' అనిరి. ఆమాట విని రా జనిరెు:-'వీనికి సిరి దర్శన మిచ్చునో ఈయదో అని ఈయుక్తిచేత నేను పరీక్షించితిని. ఈమూఁడు దినములు వీని పాపము తీఱకుండినది, ఇప్పుడు తీఱినది. కాననే ఇప్పుడు వీనికి లక్ష్మి దర్శన మిచ్చినది' ఇట్లు పలికి ప్రభువు కార్పటికునికి ఆరత్నములను గ్రామములను ఏనుఁగులను గుఱ్ఱములను బంగారమును ఇచ్చి సామంతుని చేసి ఎల్లవారివలన పొగడ్త లంది ఆస్థానమునుండి లేచెను. కార్పటికుఁడు కృతార్థుఁడై బసకు పోయెను. ఇట్లు పాపము తీఱిననే గాని ఎంత కష్టపడినను ఏమి చేసినను భృత్యులకు స్వామి ప్రసాదము కలుగదు.

ఈకథను చెప్పి మంత్రి ముఖ్యుఁడు గోముఖుఁడు నరవాహనదత్తునితో 'దేవా, ఈ నీ కార్పటికునికి పాపక్షయము కాలేదు. కావుననే వానిపై నీకు ప్రసాదము కలుగలేదు.' అని వెండియు పలికెను. ఆమాటకు ప్రభువు సరియే యని తన కార్పటికనామునికి తత్క్షణమే గ్రామములు హస్త్యశ్వహేమ

కోట్లు మంచి వస్త్రాభరణములు ఇచ్చెను. ఇట్లు కార్పటికుఁడు రాజతుల్యుఁ డాయెను. ప్రభువు కృతజ్ఞుఁ డై చెంతనుండువారు సజ్జను లైన, సేవ నిష్ఫల మగునా ?

## ప్రలంబబాహునికథ.

ఈరీతిని నరవాహనదత్తుఁడు అచట కాలము గడపు చుండఁగా ఒకానొకప్పుడు దాక్షిణాత్యుఁడు ద్విజకుమారుఁడు ప్రలంబబాహు వను వీరుఁడు సేవార్థము వచ్చి విన్నవించు కొనెను: 'దేవా, నీకీర్తి విని వచ్చి నీపాదముల నాశ్రయించితిని. గజవాజి రథములచే నీవు భూమిలో పోవునప్పుడు నిన్ను నేను అడుగైనను ఎడఁబాయను, ఆకాశమునఁ బోవు నప్పుడు మాత్రము వెంట రాలేను. నీవు విద్యాధరేంద్రుఁడవు అగుదు వని ప్రసిద్ధి కావున ఇట్లు విన్నవించితిని. నాకు ఒక దినమునకు నూఱు సువర్ణములు జీత మీావలయును.' ఇట్లు పలికిన మహా తేజునికి బ్రాహ్మణునికి ఆ ప్రభువు ఆతని కోరినట్లే కొలువును ఒసంగెను. ఆసమయములో గోముఖుఁ డి ట్లనియె:—

## వీరవరునికథ.

దేవా, సేవకులు రాజులకు ఇట్టివారుగా నుందురు. అందులకు ఈకథను వినుము. విక్రమ పుర మని గొప్పపట్టణము కలదు. అందు విక్రమతుంగుఁ డని రా జుండెను. నీతికోవిదునికి అతనికి తైక్ష్ణ్యము ఖడ్గమందుఁ గాని దండమందుఁ గాదు, సంత తాసక్తి ధర్మమందుఁగాని స్త్రీమృగయాదులఁ గాదు. అతఁడు

రాజై యుండఁగా రజస్సునకు కులయము, సాయకములకు గుణ విచ్యుతి, గోష్ఠములకు అవిచారమును. ఒకనాఁడు అతనికడకు మాళవదేశీయుఁడు అందగాఁడు శూరుఁడు వీరవరుఁ డనుపేరి బ్రాహ్మణుఁడు సేవార్థము వచ్చెను. అతనిభార్య ధర్మవతి, కూఁతురు వీరవతి, కుమారుఁడు సత్త్వవరుఁడు; ఇదే అతని యింటి సకలపరికరము. సేవార్థమైె అతనికి వేఱు పరికరము ఉండెను. ఏమనఁగా, మొలను కత్తి, ఒకచేత కరతల, ఒకచేత డాలు, మంచియద్దమును. ఇదే పరికరముగా అతఁడు వచ్చి, ప్రభువును కొలువు వేఁడి, దినమునకు ఏనూఱు దీనారములు జీత మడిగెను. రాజు అతని తేజస్సును చూచి 'ఇతని విశేషమును చూతును గాక' అని, అతనికి ఆప్రకారమే జీత మొసఁగి 'ఇన్ని దీనారములను రెండుచేతులవాఁడు ఇతఁడు ఏమి చేయునో కను పెట్టుఁ డ' ని అతనిపై చారుల నుంచెను. వీరవరుఁడు నూఱు దీనారములు భోజనార్థము భార్యచేతి కిచ్చి, నూటికి వస్త్ర మాల్యాదులను కొని, నూఱు దీనారములను స్నానానంతరము హరిహరాదుల పూజకు వ్యయించెను. మిగత రెండువందలును బ్రాహ్మణులకును దీనులకును దానములు చేసెను. ఇట్లతఁడు అనుదినమును ఆ యైదు వందలను వినియోగించు చుండెను. మధ్యాహ్నము వఱకు అరదినము రాజద్వారముకడ నిలిచి యుండును. ఆహ్నికాదికము ముగించుకొని వచ్చి మరల అచటనే రాత్రి యంతయు నుండును. అతని యా దినచర్యను

నిత్యము చారులు తెలియఁ జేయుచుండిరి. వీరవరుఁడును ఆరీతిని స్నానాది సమయములఁ దక్క దివానిశము రాజ ద్వారమందు ఆయుధపాణి యై నిలిచి యుండెను.

ఇట్లుండఁగా వీరవరుని జయింపఁ గోరియుంబోలె సూర్య ప్రతాపమును సహింపక గర్జితోగ్రమయి ఘనాగమమువచ్చెను. మేఘము ఘోరముగా ధారాశరావళులను వర్షించుచుండఁగా వీరవరుఁడు సింహద్వారమున స్తంభమో యన కదల కుండెను. విక్రమతుంగుఁడు ఆతనిని పలుమాఱు మేడనుండి చూచి రాత్రి అతనివృత్తమును తెలియఁ గోరి మేడ యెక్కెను. 'ఎవరు సింహద్వారములో?' అని రాజు కేక వేసెను. 'నేను ఉన్నాను.' అని వీరవరుఁడు ఉత్తరము చెప్పెను. 'ఆహా! ఇతఁడు మహా సత్త్వుఁడు, గొప్పస్థితికి తగినవాఁడు; ఇట్లు వర్షించుచున్నను సింహద్వారమును ఎడఁబాయఁడు!' అని రాజు తలపోయు చుండఁగా దూరమున ఒక స్త్రీయేడ్పు వినఁబడెను. 'నారాష్ట్రములో దుఃఖితులు లేరు. ఈమె యెవరు? ఎందులకు ఏడ్చు చున్నది?' అని యాలోచించి రాజు వీరవరుని 'వీరవరా, ఎవ తెయో ఒకస్త్రీ దూరమున ఏడ్చుచున్నది విను. ఆమె ఎవరో, ఆమెకు ఏమి కష్టమో విచారింపుము.' అని యాజ్ఞాపించెను. అతఁడు సరియే యని కత్తి కట్టుకొని కరతలను జళిపించుచు బయలు వెడలెను. మేఘము మెఱుపులతోడ రోదోరంధ్రము పూడునట్లుగా వర్షించుచున్నను అతఁడు వెడలుట గని, రాజు

కౌతుకముతోను కరుణతోను మేడ దిగి అతనికి తెలియనీక వెంటఁ బోవు చుండెను. వీరవరుఁడు ఏడ్పును వెంబడించుచు ఊరివెలుపల ఒక సరస్సునొద్దకు పోయి, అచట 'హా నాథా! హా కృపాళూ! శూరుఁడా! నీవు వదలిన నేనెట్లు బ్రదుకుదును!' అని ఆసరస్సునడుమ ఏడ్చుచున్న స్త్రీని చూచి 'అమ్మా, నీ వెవ్వ తెవు? నీనాథుఁ డెవఁడు? ఆతనింగూర్చి యేల విలపించెదవు?' అని యడిగెను.

ఆవనిత యిట్లు వక్కాణించెను:—పుత్త్రా, వీరవరా, నన్ను భూదేవతనుగా నెఱుంగుము. అట్టి నాకు ధార్మికుఁ డయిన యీ విక్రమతుంగుఁడు ఇప్పుడు నాథుఁడు. నేఁటికి మూఁడవనాఁడు ఇతనికి మృత్యువు కలుగును. ఇట్టిపతి నాకు మరల ఎచట కలుగును కుమారుఁడా? కావున అతనికై విలపించు చున్నాను. సుప్రభుఁ డను దేవకుమారుఁడు స్వర్గమందు ఉండి పూర్వము ఎట్లుచూచెనో అట్లే నేనును దివ్యదృష్టిచేత భవిష్యత్తును చూడఁగలను.—

సుప్రభుఁడు తనపుణ్యము క్షయించుటయు తనకు ఏడవ నాఁడు స్వర్గమునుండి భ్రంశంబును పందికడుపునఁ బుట్టువును దివ్యదృష్టిచేత నెఱింగి సూకరీ గర్భ వాస క్లేశమును తలఁచి తలఁచి ఆ దివ్యభోగములు పోవునే యని దుఃఖింపసాగెను. 'హా! స్వర్గమా! హా! అచ్చరలారా! హా! నందనవన లతా గృహంబులారా! పందికడుపులో ఎట్లు నివసింతును? పిమ్మట

బురదలో నెట్టుందును!' ఈవిలాపములు విని ఇంద్రుఁడు వచ్చి వానిని దుఃఖహేతు వడిగెను. అతఁడును చెప్పెను. అంతట నింద్రుఁడు "అందులకు ఉపాయమున్నది వినుము. 'ఓం నమః శివాయ' యని జపించుచు ఈశ్వరుని శరణు చొరుము. ఆతని శరణుఁ జొత్తువేని నీ పాపమును పోనడఁచి పుణ్యము పొందుదువు. దానిచే పందికడుపునఁ బుట్టవు. స్వర్గమునుండి పడిపోవు." అని యుపదేశించెను. అంత సుప్రభుఁడు వల్లె యని 'ఓం నమః శివాయ' యనుచు శంభుని శరణుఁజొచ్చెను. తన్మయుఁడై ఆఱుదినములకు అతఁడు శివప్రసాదముచేత సూకరీగర్భమును తప్పించుకొనుటయే గాక, స్వర్గమును గూడ దాఁటి పైకి పోయెను. ఏడవనాఁడు వానిని స్వర్గమునం గానక యింద్రుఁడు పై లోకమునకు పోయె నని యెఱింగెను. సుప్రభుఁడు ఈరీతిని తనకు రాఁబోవునమంగళమును కనినయట్లే నేనును రాజునకు రా నున్న మృత్యువును ఎఱింగి దుఃఖించుచున్నాను.

భూదేవి యిట్లు పలుకఁగా వీరవరుఁడు 'అమ్మా, ఇంద్ర వచనమున సుప్రభునికి ఉపాయము కలిగినట్లు రాజునకును రక్షోపాయము ఉన్నం జెప్పుము.' అని యడిగెను. 'ఒకటియే ఉపాయ మున్నది, అది నీకే స్వాధీనము.' అని పృథివి పలికెను. 'అట్లయిన త్వరగా చెప్పుము దేవీ. నాప్రాణములచేతఁ గాని నా భార్యాపుత్త్రుల ప్రాణములచేతను గాని రాజు బ్రదుకునేని నాజన్మము సఫల మగును' అని వీరవరుఁడు చెప్పెను, అంత

భూదేవి 'ఓరీ, రాచనగరి చెంత చండికాదేవి యున్నది గదా, ఆమెకు తత్క్షణము నీపుత్త్రుని బలి యిత్తువేని రాజు బ్రతుకును. వేఱే ఉపాయము లేదు.' అనెను. వీరవరుఁడు 'అమ్మా, ఇప్పుడే అట్లుచేసెదను.' అనెను. 'నీవలె స్వామిహితము చేయువాఁడు మఱి యెవఁడు ? పో, నీకు మేలు కలుగును గాక.' అని పలికి భూదేవి యంతర్హితురా లాయెను. చెంత నున్న రాజు సర్వ మును వినుచుండెను. పిమ్మట విక్రమతుంగుఁడు వెంట ప్రచ్ఛన్న ముగా వచ్చుచుండగా, వీరవరుఁడు ఆ నిశీథమందు ఇంటికిపోయి భార్యను ధర్మవతిని నిద్ర లేపి భూదేవిమాటఁబట్టి రాజుకై తనపుత్త్రుని చండికి బలి వేయవలయు నని ఆమెతో చెప్పెను. ఆమెయు 'స్వామిహితము ఆవశ్యకము; కావున పుత్త్రుని లేపి చెప్పుము.' అనెను. అంతట బాలుని లేపి వానితో వీరవరుఁడు 'రాజుకొఱకు భూదేవి మాట ప్రకారము నిన్ను బలివేయ వలసి యున్నది' అని చెప్పెను. ఆ మాట విని యన్వర్థనాముఁడు ఆ బాలుఁడు సత్త్వవరుఁడు 'నాయనా, నా ప్రాణము ప్రభు కార్య మునకు ఉపయోగపడునేని పుణ్యవంతుఁడను కానా! నేను ఎవరి యన్నముభుజించితినో, ఆఋణము తీర్చుకొనవలయును. కావున నన్నుఁ గొనిపోయి ఆయనకొఱకు చండీదేవికి బలి యిమ్ము.' అనెను. అందులకు వీరవరుఁడు 'నీవు సత్యముగా నా కొమారుఁ డవే.' అని సంతోషముతోఁ బలికెను. ఇది యెల్ల బయటనుండి విని విక్రమతుంగుఁడు 'ఆహా ! వీ రెల్ల సమానసత్త్వులు!' అని

యాశ్చర్యపడెను. అంతట వీరవరుఁడు పుత్త్రుని సత్త్వవరుని బుజముపైఁ గొని బయలు వెడలెను. భార్య ధర్మవతియు కొమారితను వీరవతిని గొని అతనివెంటనే పోయెను.

విక్రమతుంగ మహారాజు వారివెంటనే ప్రచ్ఛన్నుఁడై చండికాగృహమునకు పోయెను. అచట తండ్రి బుజమునుండి దిగి సత్త్వవరుఁడు దేవిని నమస్కరించి యిట్లు విన్నవించెను. 'దేవీ నాశిరమును బలి గొనుము. మా ప్రభువు విక్రమతుంగ మహారాజు శాశ్వతముగా పృథివిని ఏలు చుండును గాక' ఆమాటకు తండ్రి సంతోషించి కత్తి దూసి కుమారునిశిరమును ఖండించి 'రాజునకు శ్రేయము కలుగుఁ గాక' అని పలుకుచు చండికాదేవికి అర్పించెను. స్వామి భక్తులకు పుత్త్రునియందుఁ గాని తమయందుఁ గాని స్పృహ యుండదు గదా. "బళి! వీరవరా! నీవు కొమారుని ప్రాణము నిచ్చి స్వామి ప్రాణమును కాపాడితివి!" అని ఆకాశ వాణి పలికెను. రాజు అత్యాశ్చర్యమగ్నుండై అది యెల్ల చూచుచు వినుచు ఉండఁగా, వీరవతి యను కన్య అన్న తలను ఎత్తి కౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొని 'హా! అన్నా!' అని ఏడ్చి గుండెపగిలి చచ్చిపోయెను. కొమరితయు గతించుట చూచి వీరవరునిభార్య ధర్మవతి కేలు మోడ్చి వీరవరునితో నిట్లనియె. 'రాజునకు మేలు చేసితివి, కనుక, ఇఁక నాకు సెల విమ్ము. నేను ఈ యిరువురు పిల్లలతోను అనల ప్రవేశము చేసెదను. ఏమియు నెఱుఁగని యిట్టిపసికూన కూడ

అన్నకై వగచి ప్రాణములు విడిచినది. ఇద్దఱు పిల్లలును పోయినపిమ్మట నాకు ఇఁక నేమి బ్రదుకు!' ఇట్లు నిశ్చయముతో ఆమె పలుకఁగా వీరవరుఁడు 'అట్లే చేయుము, ఏమి చెప్పుదును! సుతశోకమయ మయిన సంసారములో నీ కేమి సుఖము కలదు? కనుక నీకు చిత పేర్చెదను. కొంచెము ఓర్చుకొనుము' అని పలికి చండికాలయ నిర్మాణార్థము అచట వేయఁబడి యున్న కొయ్యలతో చిత చేసి దీపముతో దానిని తగులఁ బెట్టెను. అంత ధర్మవతి అతని పాదములకు ప్రణమిల్లి 'ఆర్యపుత్త్రా, నీవే నాకు జన్మాంతరమందును పతివి గావలయును. రాజునకు మేలు కలుగునుగాక.' అతని పలికి పతివ్రతోచితముగా జ్వాలాజటాల మయిన యా యగ్నిలో చల్లనిమడుగునం బోలె ప్రవేశించెను. అదియును ప్రచ్ఛన్నుఁడై చూచి విక్రమతుంగుఁడు 'వీరి ఋణ మును నేను ఎట్లు తీర్చుకోఁగలను?' అని ఏమియు తోఁపక ఆలోచించు చుండెను.

అంతట ధీరుఁడు వీరవరుఁడు ఇట్లు తలపోసెను. 'స్వామి కార్యము నెఱవేఱినది. దివ్యవాణి కూడ వినఁబడినది. భరణీ యము ప్రియము నయిన సకల కుటుంబమును వ్యయము చేసి రాజాన్నమునకు ఋణము తీర్చుకొంటిని. ఒంటిగాఁడ నై తన పొట్ట పోసికొనుట ఏమి బ్రదుకు? కనుక నన్ను బలి వేసికొని ఈయంబికను ఏల ఆరాధింపరాదు!' ఇట్లు వీరవరుఁడు సత్త్వ

సిష్ఠుఁడు సంకల్పపూర్వకముగా ఆదేవిని ముందుగా స్తోత్రము చేసెను:—

మహేశ్వరి ప్రణతాభయదాయినీ సంసారపంకమగ్నుని శరణాగతుని నన్ను లేవ నెత్తుము. నీవు భూతముల ప్రాణశక్తివి. నీవలన ఈజగత్తు చేష్టించుచున్నది. నీవు సృష్టికి పూర్వము నందు స్వయంభూత వయి ఉచ్చండాకాండ బాలమార్తాండ కోటిపంక్తివో యన తేటిచూడరాని తేజస్సుతో వెలుంగుచు లోకములను వెలుంగొందించుచు, ఖడ్గ ఖేట కోదండ శర శూలాది ధారి యయిన భుజచక్రవాళముతో శంభునికి అగపడి, ఆయనవలన నిట్లు స్తుతులం బడసితివి. 'చండీ చాముండా మంగలా త్రిపురా జయా నీకు నమస్కారము. అద్వితీయా అఖండా శివా దుర్గా నారాయణీ సరస్వతీ భద్రకాళీ మహాలక్ష్మీ సిద్ధా రురువిదారిణీ, నీవు మహారాజ్ఞివి గాయత్రివి రేవతివి వింధ్యవాసినివి ఉమవు కాత్యాయనివి కైలాసవాసినివి.' ఇత్యాది నామములతో శివుఁడు స్తుతించుచుండఁగా విని స్కందుఁడు వసిష్ఠుఁడు బ్రహ్మాదులును నిన్ను స్తుతించిరి. అమరులు ఋషులు నరులును నిన్ను స్తుతించి కోరికలకు ఎక్కువగా సిద్ధి పొందున్నారు. ఓ వరదా, నాపై కరుణింపుము. మచ్ఛరీరోపహారపూజను గ్రహింపుము, నా రాజునకు మేలు కలుగును గాక.

ఇట్లు పలికి వీరవరుఁడు తన తలను ఖండింప నుంకించు చుండఁగా ఆకాశవాణి పలికెను:— 'పుత్త్రకా, సాహసము చేయకుము. నీసత్త్వమునకే నేను సంతసించితిని. నీ కిష్ట మైన వరము కోరుము' 'దేవీ, తుష్టురాలవేని విక్రమతుంగుఁడు ఇఁక నూఱు సంవత్సరములు బ్రదుకును గాక. నా భార్యయు శిశువులును బ్రదుకుదురు గాక.' అని వీరవరుఁడు వేఁడెను. 'అట్లే అగునుగాక' అని మరల వాణి వినఁబడెను. ఆ ముప్వు రును తత్క్షణమే అక్షత దేహు లై బ్రదికి లేచిరి. వీరవరుఁడు సంతోషించి వారిని ఇల్లు సేర్చి తాను మరల పోయి రాజద్వా రమున నిలిచెను.

విక్రమతుంగుఁడు అది యెల్ల చూచి సంతోషపడి ఆశ్చ ర్యపడి ప్రచ్ఛన్నుఁడు గానే తన మేడమీఁదికి పోయి 'సింహ ద్వారములో ఎవరు?' అని పలికెను. విని వీరవరుఁడు క్రింది నుండి 'నేను, ఇక్కడ నున్నాను. ఆ స్త్రీని చూడఁ బోయితిని. ఆమె ఎవరో దేవత, నేను చూడఁగానే, ఆమె అంతర్ధానము పొందినది.' అని చెప్పెను. సర్వ వృత్తాంతమును ప్రత్యక్షముగా చూచిన రాజు ఆ మాట విని విచారించెను: 'అహో! ఇతఁ డెవఁడో మహాపురుషుఁడు. ఇట్టి శ్లాఘ్యకృత్యము చేసియు చెప్పకొనఁడు. గంభీరుఁడు విశాలుఁడు మహాసత్త్వుఁడు నయ్యు సముద్రుఁడు మహావాతస్పర్శకును కదలని యీవీరునికి సాటి గాఁడు. పరోక్షముగా రాత్రియందు పుత్త్రదారవ్యయముచే

నాప్రాణమును కాపాడినయితనికి ఏమి ప్రత్యుపకారము నేను చేయఁగలను!' ఈరీతిగా తలపోసి రాజు మేడదిగి లోపలికి పోయి ఆశ్చర్యమగ్నుఁడయి రాత్రిని గడపి తెల్లవాఱఁగానే ఆస్థానమందు అందఱయెదుటను వీరవరుని రాత్రి చరితాద్భుతమును అతఁడుండఁగానే వర్ణించెను. ఎల్లరును వీరవరుని పొగడుచుండఁగా, రాజు అతనికి సపుత్త్రునికి పట్టముగట్టి, పెక్కుదేశములు గుఱ్ఱములు రత్నములు ఏనుఁగులు పదికోట్ల సువర్ణములు అఱువదియింతల జీతమును ఇచ్చెను. తత్క్షణమే వీరవరుఁడు సకుటుంబముగా ఉచ్ఛ్రితాతపత్త్రుఁడై రాజతుల్యుఁడై కృతార్థుఁడాయెను.

ఇట్లు కథ చెప్పి ముగించుచు గోముఖమంత్రి నరవాహనదత్తునితో మరల నిట్లనియె: 'దేవా, ఇట్లు స్వామికొఱకు దేహాపేక్ష వదలినవారయి రెండు లోకములను తమ సత్త్వమహిమచే జయించునట్టి యేకవీరులగు భృత్యులు రాజులకు ఎక్కడనో పుణ్యవిశేషముచే దొరకుదురు. స్వాకృతియు మహాసత్త్వుఁడును అయిన యీక్రొత్తవాఁడు నీసేవకుఁడు బ్రాహ్మణవీరుఁడు ప్రలంబబాహువు కూడ అట్టివాఁడుగానే అగపడుచున్నాఁడు.'—మతిమంతుఁడైన యామంత్రివలన ఈకథ విని మహోదారుఁడు రాజపుత్త్రుఁడు మిగుల సంతోషించెను.

## ౪-వ తరంగము.

---

### ప్రలంబబాహువుకథ.

ఈరీతిని తండ్రియింట గోముఖాదిమంత్రులచే సేవ్యమానుఁడై అత్యంతానురక్తయయిన యలంకారవతీదేవితో విహరించుచు ఉండి, నరవాహనదత్తుఁడు, ఒకనాఁడు, ప్రలంబబాహువు ముందు నడువ, గోముఖసమేతుఁడై రథ మెక్కి అనుచరులతోఁగూడి వనమునకు వేఁటకుఁ బోయెను. రథాశ్వములు ఎంతవేగముగా పరు గెత్తినను ప్రలంబబాహువు వానిని అతిక్రమించి ముందే పోవుచుండెను. రాజు సింహవ్యాఘ్రాదులకు రథమునం దుండియే బాణములతోఁ గూల్చుచుండెను. ప్రలంబబాహువు పాదచారిగానే వానిని కత్తితో సంహరించెను. 'ఏమి ఇతని శౌర్యము! ఏమి యితని విక్రమబలము!' అని నరవాహనదత్తుఁడు ఆ విప్రవీరుని చూచి చూచి ఆశ్చర్యపడెను. వేఁట ముగించి బడలి సారథి గోముఖ సమేతుఁడై ప్రభువు రథ మెక్కి మహావీరుఁడయిన ప్రలంబబాహువు అగ్రేసరుఁడుగా దప్పిచే జలము వెదకుచు మఱియొక మహావనము చొచ్చెను. అచట వికసించిన బంగారుకమలములతో నిండిన యొక మహాసరస్సును బహురవిబింబ మయి భూగత మయిన యాకసమో యన నొప్పుచుండఁగా చూచి అందు నీరాడి జలము త్రాగి

అనుచరులును స్నాతపీతు లయిన పిమ్మట, ఆసరస్సులో నొక చోట దూరమున నలువురు పురుషులను చూచెను.

## శ్రీహరి నలువు రచ్చరల నిచ్చుట.

దివ్యాకృతులు దివ్యవస్త్రులు దివ్యాభరణ భూషితులు నయిన యాపురుషులు సరస్సునుండి బంగారుతామరలను కోసి కొను చుండిరి. నరవాహనదత్తుఁడు కౌతుకముచే వారిని దరిసి, వారు నీ వెవర వని యడుగఁగా తనపేరును వంశమును చెప్పెను. వారును అతనిదర్శనముచే సంతసిల్లి అతఁ డడుగఁగా ఇట్లనిరి: "మహాసముద్రమునకు నడుమ నారికేళద్వీప మని యొక ద్వీపము కలదు; అందు నాలుగు పర్వతములు దివ్య భూములు మైనాకము వృషభము చక్రము బలాకము అను నవి కలవు. అందు మేము నలువురము నివసింతుము. మాలో ఒకఁడు రూపసిద్ధి యనువాఁడు నానారూపములు దాల్చును. ఒకఁడు ప్రమాణసిద్ధి గొప్పప్రమాణములను చిన్నప్రమాణము లను చూచును. జ్ఞానసిద్ధి మూఁడవవాఁడు త్రైకాల్యజ్ఞానము కలవాఁడు. నాలవవాఁడు దేవసిద్ధి సకలదైవత సిద్ధికలవాఁడు. మేము ఈ బంగారుకమలములను చేకొని శ్వేతద్వీపములో శ్రీ పతిని పూజించుటకు పోవుచున్నాము. మేము అందఱము శ్రీపతి భక్తులము కదా. ఆయన ప్రసాదముచేతనే గదా మాకు ఆ పర్వతములయందు ఆధిపత్యము సిద్ధులు సంపదలును కలిగి యు న్నవి. నీవును రమ్ము, శ్వేతద్వీపములో హరిని చూపెదము. నీకు

ఇష్టమేని ఆకాశమార్గమునఁ గొని పోయెదము.' ఇట్లు ఆదేవపుత్త్రులు పలుకఁగా వల్లె యని నరవాహనదత్తుఁడు సులభ జలఫలాదిక మయిన యా సరస్తీరమందు గోముఖాదులను నిలిపి, దేవసిద్ధియొడిలో కూర్చుండి, ఆకాశమార్గమునఁ బోయి, దూరముననుండియే దిగెను. ప్రక్కను జలధికన్యయు పాదాంతమందు భూదేవియుఁ గొలుచుచుండఁగా సవిగ్రహములయిన శంఖ చక్ర గదా పద్మములు సేవించుచుండఁగా, నారదాది మహాత్ములును గంధర్వులును స్తుతులు పాడుచుండఁగా, సిద్ధ విద్యాధరులు తెలచుచుండఁగా, గరుడుఁడు ఎదుట కూర్చుండఁగా, శేషశాయి యై వెలుంగొందుచున్న శ్రీమహావిష్ణువును ఆనలువురు దేవపుత్త్రులతో దర్శించెను. సాధుసమాగమము ఎవరికి అభ్యుదయము ను ఈయదు! దేవపుత్త్రులు హరిని అర్చించిరి, కశ్యపాదులు స్తుతించిరి. నరవాహన దత్తుఁడును కేలు మోడ్చి హరిని ఇట్లు పొగడెను.

'దేవా లక్ష్మీ కల్పల తాలింగిత దేహ మయిన భక్తకల్ప మహీరుహమా అభీష్టదాయీ నీకు నమస్కారము. సన్మానస వాసి దివ్యహంసా సతతోదితనాదా పరాకాశవిహారీ నమస్కారము. సర్వాతిశాయీ సర్వాంతర్యామీ త్రిగుణాతీతరూపా పూర్ణషాడ్గుణ్యమూర్తి నీకు నమస్కారము. స్వాధ్యాయోద్యన్మృదుధ్వని యై ఉద్భూత బహుచరణుఁ డయ్యును బ్రహ్మ నీ నాభికమలములో షట్చరణాయమానుఁడుగా నున్నాఁడు. నీకు

భూమి పాదములని ఆకాశము శిర మని దిక్కులు శ్రోత్రములని సూర్యచంద్రులు నేత్రము లని బ్రహ్మాండము జఠర మని నీవు అనిర్వచనీయుఁడ వని పెద్దలు వర్ణింతురు. దేవా, ధామనిధి వైన నీవలననుండి యీ భూతగ్రామము మండుచున్న యగ్ని నుండి స్ఫులింగసంఘాతమువోలె పుట్టుచున్నది. సాయంకాల మున పక్షిసంఘము వాసవృక్షమునుంబోలె ఈ భూతసంఘా తము ప్రళయకాలమందు మరల నిన్నే చొచ్చుచున్నది. నీవే ఉల్లసితుఁడవై నీయంశములనే ఈ లోకేశ్వరులనుగా అనంత వేలాక్షుభిత మయిన సముద్రము తరంగములనుబోలె సృజించు చున్నావు. నీవు విశ్వరూపుఁడ వయ్యును అరూపుఁడవు, విశ్వ కర్త వయ్యును అకర్తవు; విశ్వాధారుఁడ వయ్యును అనాధా రుఁడవు, నీతత్త్వమును ఎవఁడు ఎఱుఁగ నేర్చును ? నీకటాక్ష ముచే దేవతలు ఆ యా సంపదలను పొందిరి. నన్నును కరుణా పూర్ణకటాక్షముతో చూడుము.'

ఇట్లు పొగడుచున్న నరవాహనపత్నుని శ్రీహరి ప్రసాద పూర్ణ కటాక్షమునఁ జూచి నారదునితో 'మహామునీ, మున్ను పాల సముద్రమునుండి పుట్టిన యే నా కలికి యచ్చరలను నేను ఇంద్రునియొద్ద ఇల్లడ యుంచితినో వారిని అతని యొద్దనుండి నామాటవలన అతని రథములోనే ఎక్కించి త్వరితముగా ఇచటికి కొనితెమ్ము.' అనియె. అంతట నారదుఁడు వల్లె యని పోయి ఆయచ్చరలను ఇంద్రరథమున మాతలి సమేతుఁడై

కొని తెచ్చెను. ఆయన అచ్చరలను తెచ్చి ప్రణమిల్లఁగా భగవంతుఁడు నరవాహనదత్తునితో 'నరవాహనదత్తా, వీరిని భవిష్యద్విద్యాధరచక్రవర్తి వైన నీకు ఇచ్చితిని. నీవు వీరికి తగినభర్తవు. వీరును నీకు తగినభార్యలు, నిన్ను మదనునియవతారముగా శివుఁడు సృజించెను గదా' అని యానతిచ్చెను. ఆ ప్రసాదమునకు హృష్టుఁడై వత్సరాజతనూజుఁడు ప్రణమిల్లఁగా, శ్రీహరి మాతలితో 'నీవు ఈనరవాహనదత్తుని అచ్చరలతో కూడ అతని కిష్టమయిన మార్గమున అతనినగరమునకు ఈ రథములో కొనిపొమ్ము.' అని ఆజ్ఞాపించెను. అంత నరవాహనదత్తుఁడు అప్సరస్సమేతుఁడై సర్వజగద్రక్షకుఁడైన శ్రీహరికి ప్రణమిల్లి మాతలిసారథికమైన యారథమును ఆదేవపుత్త్రులతోఁ గూడ నెక్కి వారు పిలువఁగా ఆనారికేళద్వీపమునకు పోయెను.

అచట రూపసిద్ధిప్రభృతు లయిన యా దివ్యపురుషులు నలువురు తన్ను అర్చించుచుండఁగా ఇంద్రసారథితోఁ గూడ మైనాకవృషభాదులగు నా నాలుగు పర్వతములయందు అచ్చరలఁ గూడి మధుమాసాగమ సంఫుల్ల నానా తరువల్లరు లయిన యా యుద్యానవనరాజులయందు కౌతుకముతో క్రీడించెను. 'చూడుము ఈతరుమంజరులు వచ్చుచున్న కాంతుని వసంతుని విపుల పుష్ప విలోచనముతో చూచుచున్నవి! ఇందు, తమ పుట్టినింట సూర్యకరతాపజ మయిన సంతాపము కలుగకుండును

గాక యనియుంబోలె కమలములు సరస్సును కప్పివైచినవి చూడుము! ఇచట తుమ్మెదలు ఉజ్జ్వల మయిన కర్ణికారమును దఱిసి విసారభ మని, నీచుఁ డయిన శ్రీమంతుని సాధువులు వోలె, వదలు చున్నవి, చూడుము! ఇట కిన్నరీగీతములచేతను కోకిలకూజితములచేతను అళిరుతములచేతను ఋతురాజునకు సంగీతము వర్ధిల్లుచున్నది, చూడుము!' ఇత్యాదివాక్యములు పలుకుచు ఆదేవపుత్త్రులు నరవాహనదత్తునికి తమ యుప వనావళిని చూపుచుండిరి. వారి నగరములయందు నరవాహన దత్తుఁడు వసంతోత్స వోద్దామ ప్రనృత్య త్స్వైర చర్చరులను చూచుచు క్రీడించుచుండెను. అచట దేవోచితభోగములను అచ్చరలతో అనుభవించుచుండెను. సుకృతి యెచటికి పోవునో అచట సమృద్ధము లయిన భోగములు ముందుగానే పోయి యుండును గదా. ఇట్లు మూఁడునాలుగు దినము లుండి నర వాహనదత్తుఁడు ఆమిత్త్రులతో నేను నాయనను చూచుటకు మానగరమునకు పోయెదను. మీరును అచటికి నాతో వచ్చి నన్ను కృతార్థుని చేయుఁడు.' అని కోరెను. వా రనిరి:—
'ఆనగరముయొక్క సారము వయిన నిన్ను చూచితిమి, ఇఁక నేమి? నీకు విద్యలు లభించినపిమ్మట మమ్ము స్మరింపుము.'

అట్లు పలికి వారు సాగ నంపఁగా నరవాహనదత్తుఁడు ఆ యింద్రరథ మెక్కి మాతలితో 'నామిత్త్రులు గోముఖాదులు ఏ దివ్యసర స్తీరమున నున్నారో ఆదారిని నానగరికి రథమును

తోలుము.' అని, అతఁడును సరియే యనఁగా, అచ్చరలతో రథ మెక్కి గోముఖాదు లున్నచోటికిఁ బోయి, వారిని చూచి వారితో 'మీరు మీమార్గమున త్వరితముగా ఇంటికి రండి, అచట అంతయు చెప్పెదను.' అని పలికి, తాను ఆకాశమునఁ బోయి స్వనగరము చేరి మాతలిని సత్కరించి వీడ్కొలిపి, ఆయచ్చరలతో తన నగరు చొచ్చెను. అచ్చరలను అంతఃపురమున నిలిపి తాను పోయి తండ్రి పాదములకును తల్లికి వాసవదత్తకును, తల్లికి పద్మావతికిని ప్రణమిల్లెను. వారు తనివి తీఱక చూచుచు సంతోషించిరి. ఇంతలో రథారూఢుఁడై ససారథియై గోముఖుఁడు ప్రలంబబాహువుతోఁ గూడ వచ్చెను. అంతట తండ్రి యడుగఁగా నరవాహనదత్తుఁడు మంత్రి వర్గము నెదుట తన యద్భుత వృత్తాంతమును వక్కాణించెను. 'ఈశ్వరుఁడు ఏ పుణ్యాత్మునికి అనుగ్రహము చేయఁ గోరునో వానికి కల్యాణ మిత్త్ర సంయోగమును ఇచ్చును.' అని యందఱును పలుకు చుండఁగా రాజు సంతోషించి కుమారునిపై హరానుగ్రహము కలిగినందులకు మహోత్సవము చేసెను. గోముఖుఁడు తెచ్చి తనకును తన భార్యలకును పాదప్రణామము చేయించిన యా యచ్చరకోడండ్రను హరిప్రసాదలబ్ధలను చూచి రాజు సంతోషించి, దేవరతి దేవరూప దేవమాల దేవప్రియ యని వారి నామములు చేటికలవలన నెఱిఁగెను. ఆకౌశాంబీనగరి 'నే నెక్కడ, నాయందు అప్సరస లెక్కడ? నరవాహన

దత్తుఁడు నన్ను భూలోకములో అమరావతినిగా చేసినాఁడు!' అనుసంతసమునం బోలె సిందూరము చల్లుచు రక్తపతాకల నాడించుచు నొప్పారుచుండెను. పిమ్మట నరవాహనదత్తుఁడు తనకై ఎదురు సూచుచుండిన తన భార్యలను సంభావించెను. వారు ఆ నాలుగు దినములను నాలుగు సంవత్సరములుగాఁ గడపిన తమ విరహవేదలను వర్ణించి అతనిని సంతోషపెట్టిరి. గోముఖుఁడు వనవాసములో రథాశ్వములను కాపాడుచుండిన ప్రలంబబాహువుయొక్క సింహాది వధ శౌర్యమును వర్ణించెను. ఇట్లు శ్రోత్రపేయము లగు సల్లాపములను వినుచు నయనామృత మగు కాంతల రూపమును చూచుచు, చాటుకారుఁ డయి సచివసమేతుఁడై మధుపానము సేయుచు, నరవాహనదత్తుఁడు ఆకాలమును సుఖముగాఁ గడపుచుండెను.

## రుద్రసెట్టికథ.

ఒకనాఁడు అతఁడు వయస్య సమేతుఁడై అలంకార వతీ వాసగృహస్థుఁడై వెలుపల వాద్యముల మ్రోఁతను విని 'ఏల ఇచట ఆకస్మికముగా తూర్యములు మ్రోఁగుచున్నవి?' అని తన సేనాపతిని హరిశిఖుని హెచ్చరించెను. అతఁడును తత్క్షణమే పోయి తెలిసికొని వచ్చి యిట్లు విన్నవించెను: 'దేవా ఈనగరములో రుద్రుఁడని వర్తకుఁ డున్నాఁడు. అతఁడు ఇట నుండి బేహారమునకై సువర్ణద్వీపమునకు పోయి యుండెను.

అతఁడు సంపాదించి తెచ్చుకొన్న ధన మెల్ల దారిలో ఓడ పగిలి నందున మునిఁగి పోఁగా, తానుమాత్రము బ్రదికి వచ్చి ఇట చేరి ఆఱు దినము లాయెను. ఇచట ఇంతలో అతనికి తన తోఁటలో దైవవశమున మహానిధి యొకటి దొరకెను. అతని దాయాదుల వలన ఆవృత్తాంతము వత్సరాజునకు తెలియఁగా ఆవర్తకుఁడు స్వయముగా వచ్చి ప్రభువుతో ఇట్లు చెప్పుకొన్నాఁడు. 'దేవా, నాకు రత్నరాశి సమేతము లయిన నాలుగు సువర్ణ కోటులు దొరకినవి. ఏలినవారి యాజ్ఞయేని వానిని తెచ్చి సమర్పించెదను.' 'నీ సొత్తంతయు జలాశయుఁడు హరించె నన్న కనికరమునం బోలె బ్రహ్మ నీ కిచ్చిన యీధనమును అజడాశయుఁడు ఎవఁడు హరించును? పొమ్ము. నీ భూమిలో నీకు దొరకిన ధనమును యథేచ్ఛముగా నీవే అనుభవింపుము.' అని వత్సరాజు ఆన తీయఁగా అతఁడు హర్షనిర్భరుఁ డై రాజుపాదముల వ్రాలి తూర్యములు మ్రోఁగించుచు అనుచర సమేతముగా ఇంటికి పోవుచున్నాఁడు.' ఇట్లు హరిశిఖుఁడు పలుకఁగా నరవాహన దత్తుఁడు తండ్రి ధార్మికతను పొగడుచు తనమంత్రులతో ని ట్లనియె: 'విధి ధనములను హరించు నేని మరల వెంటనే ఇయ్య నేల ? చిత్రము! విధి మనుష్యుల యుచ్ఛ్రాయ పాతములచే క్రీడించుచుండును !' గోముఖుఁడు పలికెను:—విధి విలాసము ఇట్టిదే, ఇందులకు సముద్రశూరుని కథను వినుము.

## సముద్రశూరుని కథ.

పూర్వము హర్షపుర మని ఒక నగర ముండెను. దానిని హర్షవర్మ యను ప్రభువు ధర్మ్యముగా పరిపాలించుచుండెను. అందు కులీనుఁడు ధార్మికుఁడు ధీరుఁడు మహాధనుఁడు ధీర సత్త్వుఁడు నగు వర్తకుఁడు సముద్రశూరుఁ డనువాఁ డుండెను. అతఁడు ఒకనాఁడు వ్యాపారార్థమై సువర్ణద్వీపమునకు పోవు వాఁడై ఓడయెక్కెను. మార్గము స్వల్పావశిష్టముగా నుండఁగా, తుపాను కొట్టి ఓడ పగులఁగా, అతఁడు నడుము బిగించి కట్టు కొని నముద్రములో దుమికి ఈఁదుకొని బోవుచుండఁగా, నొక పురుషశవము గాలికి అతనియొద్దకు కొట్టుకొని వచ్చెను. అంత నతఁడు దానిమీఁద నెక్కి యీఁదుచు అనుకూలవాయువుచే ఆద్వీపము చేరెను. అచట ఆశవముయొక్క నడుమున నున్న శాటిలో నొక ముడియఁ గాంచి దానిని విప్పి, అందు రత్నాఢ్య మును దివ్య మును ఐన యొక కంఠాభరణమును చూచి, వెలలేని యాయలంకారమును పుచ్చుకొని, స్నాన మాడి, దానిముందఱ సముద్రములో నష్ట మయిన తన ధనమును తృణముగా తలంచి, సంతోషించెను. ఆకంఠెను చేతఁ గొని క్రమముగా కలశపుర మను నచటి నగరమునకు పోయి, యొక దేవాలయము చొచ్చి, అచట జలవ్యాయామ మాయాసముచే నీడలో విధివశమున ఒడ లెఱుఁగక నిద్రించెను. అంతలో నచటికి ఆరక్షకులు వచ్చి అతని చేతి కంఠకమును గాంచి, 'ఇదే రాజసుత చక్రసేన కంఠ

మునుండి దొంగిలింపఁబడిన కంఠె! దొంగ దొరకినాఁడు!' అని పలుకుకొని వర్తకుని లేపి రాజకులమునకు కొనిపోయిరి. రాజడుగఁగా వర్తకుఁడు ఉన్నది యున్నట్లు చెప్పెను. 'వీఁడు దొంగ అసత్యము పలుకుచున్నాఁడు, ఇదిగో కంఠకము చూడుఁడు.' అని దానిని చూపుచు రాజు సభ్యులతో పలుకుచుండఁగా గద్ద యొకటి ఆకాశమునుండి వ్రాలి, దేదీప్యమాన మైన యాకంఠాలంకారమును తన్నుకొని ఎగిరిపోయెను. రాజు వర్తకునికి ఉరి ఆజ్ఞాపించెను. వర్తకుఁడు అతిదుఃఖితుఁ డై శివుని శరణము వేఁడుచు ఏడ్చుచు ఉండెను. అంతట ఆకాశమున అశరీరవాణి ఇట్లు పలికెను: 'రాజా, ఇతనిని చంపకుము. ఇతఁడు సాధువు, సముద్రశూరుఁడు అను వణిజుఁడు. వ్యాపారవశమున ఇపుడు నీ దేశమునకు వచ్చినాఁడు. ఈ కంఠకమును దొంగలించిన దొంగ ఆరక్షకుల భయముచే పలాయితుఁ డై సముద్రములో పడి రాత్రి చచ్చినాఁడు. ఇతఁడు ఓడ పగులఁగా వాని శవమును చూచి ఎక్కి సముద్రమును దాఁటి ఇచటికి వచ్చినాఁడు. వాని నడుమున నున్న కొంగునుండి యీకంఠకమును ఇతఁడు విప్పుకొన్నాఁడు. మీయింటి నుండి ఇతఁడు దొంగిలించిన వాఁడు గాఁడు. ధార్మికుని ఇతనిని వదలుము, సన్మానించి పంపుము.' రాజు విని సంతోషించి అతనిని వదలి ధనము లిచ్చి పంపెను.

అతఁడు ఆ ధనముతో సరకులు కొని, స్వదేశము పోవువాఁ డై ఓడ యెక్కి, సముద్రము దాఁటి, ఒక సాతుతో చేరి,

క్రమముగా ఒకనాఁడు అడవిలో సంజవేళ పోవుచుండెను. అచట పాతు విడిసినది. ఆరాత్రి సముద్రశూరుఁడు మేలు కొనియుండఁగా, దొంగల దండు వచ్చి పాతును కొట్టుచుండఁగా, అతఁడు తన సరకులను వదలి అలక్షితముగా పలాయితుఁడై ఒక మఱ్ఱిచెట్టెక్కెను. దొంగలదండు ధన మెల్ల కొల్ల గొనిపోఁగా అతఁడు దుఃఖించుచు భయపడుచు ఆరాత్రిని ఆ చెట్టుమీఁదఁ గడపెను. వేకువను అతఁడు దైవికముగా పైకి తలయెత్తి చూడఁగా ఆకులనడిమినుండి దీపప్రభ అగపడెను. ఆశ్చర్యపడి యెక్కి పోయి చూడఁగా, అచట నొక గద్దగూఁటిలో పెక్కు రత్నాభరణములు దేదీప్యమానములు రాశిగా నుండెను. వాని నెల్ల నతఁడు కైకొనెను. అందులో స్వర్ణద్వీపమున గద్ద తన్ను కొని పోయిన కంఠకము కూడ ఉండెను. అట్లు అమితధనమును పొంది వస్తుఁడు సంతోషించి చెట్టు దిగి క్రమముగా తన హర్షపురము చేరెను. అచట మఱి ధనాశ మాని సముద్రశూరుఁడు స్వజనులతో కూడి సంతోషముగా కాలముగడుపుచుండెను. సముద్రములో పడుట ధననాశము, సముద్రము దాఁటుట, కంఠకము దొరకుట, అది పోవుట, నిష్కారణముగా దండ్యుఁడగుట, తత్క్షణమే తుష్టుఁడయిన ద్వీపేశ్వరువలన సత్కారము, మరల సముద్రమును దాఁటుట, దారిలో దొంగలు సర్వస్వమును హరించుట, చివర చెట్టుమీఁద ధనప్రాప్తి, ఇది యెల్ల విధియొక్క విచిత్రవిలాసము గదా.

పుణ్యాత్ముఁడు దుఃఖము లనుభవించినను తప్పక సుఖ మనుభవించును.

ఇట్లు గోముఖుఁడు చెప్పఁగా అంగీకరించి నరవాహనదత్తుఁడు సభ చాలించి, స్నానాది దివస కృత్యములకై లేచెను.

## సమరతుంగుని కథ.

మఱునాఁడు నరవాహనదత్తుఁడు ఆస్థానమున నుండఁగా బాలసేవకుఁడు సమరతుంగుఁ డను రాజపుత్త్రుఁడు 'దేవా, నా దేశమును సంగ్రామవీరుఁ డను నాదాయాది వీరజితుఁడు మొదలగు తన నలుఁవురు పుత్త్రులతోఁగూడి నాశము చేసినాఁడు. నేను పోయి ఆయేఁవురను పట్టి కట్టి తెచ్చెదను. దీనిని యేలిన వారు ఎఱిఁగి యుండవలయును.' అని విన్నవించి పోయెను. ఆతనిదండు కొంచె మనియు పరులసైన్యము అధిక మనియు విచారించి వత్సరాజసుతుఁడు వానితో గూడ తన బలమును పంపెను. అతఁడు పరువుచే ఆదండును తోడుకొనకయే పోయి ఆయేవురను తన బాహుమాత్రముచేతనే రణములో జయించి కట్టి తెచ్చెను. అట్లు వచ్చిన యావీరుని ప్రభువు సమ్మానించి, 'చిత్రము! ఆక్రాంతవిషయులను సబలులను ఇంద్రియోపములను ఏవురను శత్రువులను జయించి యితఁడు పురుషార్థమును సాధించినాఁడు.' అని పొగడెను. 'దేవా, ఇట్టికథను ఇంత వఱకు విని యుండని యెడల, చమరవాల మహారాజు కథను చెప్పెదను వినుము.' అని గోముఖుఁడు ఇట్లు చెప్పసాగెను.

## చమరవాల మహారాజుకథ.

హస్తినాపుర మని నగరము కలదు. అందు కోశదుర్గ బలాన్వితుఁడు చమరవాలుఁ డను రాజు ఏలుచుండెను. దాయాదులు సమరబలాదులు ఏవురు అన్ని ప్రక్కలను రాజులుగా నుండిరి. వారు ఒకప్పుడు 'ఈ చమరవాలుఁడు మనలను ఒక్కొక్కరినిగా సదా బాధించుచున్నాఁడు. మన మందఱము కలిసి వీనిని కొట్టుదము.' అని కలియఁ బలికికొని అతనిపై దండెత్తుటకై జోస్యుని మంచిలగ్నము పెట్టు మనిరి. అతఁడు శుభలగ్నము కానక అశకునములు చూచి 'మీకు సంవత్సరములోపల లగ్నము లేదు. లగ్నశుద్ధి లేకయే వెడలుదురేని మీకు జయము కలుగదు. అతని యైశ్వర్యమును చూచిన మాత్రాన మీకు ఈ వృథాభినివేశ మేల ? లక్ష్మికి భోగము ఫలము; అది వానికంటె మీకే అధికముగా నున్నది. ఇందులకు ఇద్దఱు వర్తకుల కథను చెప్పెదను వినుఁడు.' అని యిట్లు చెప్పఁ దొడఁగెను.

## అర్థవర్మ భోగవర్మల కథ.

కౌతుకపుర మనెడు నగరములో బహుసువర్ణకుఁ డని అన్వర్థ నామధేయుఁడు రాజు ఉండెను. అతనికి క్షత్త్రియుఁడు పడుచువాఁడు యశోవర్మ యని యొక సేవకుఁడు ఉండెను. దాత యయ్యును ఆ ప్రభువు ఆ సేవకునికి మాత్రము ఎప్పుడును

ఏమియు ఇయ్యఁ డాయెను. అతఁడు అడిగినప్పు డెల్ల సూర్యుని చూపి, 'నీకు నేను ఇయ్యఁ దలఁచుచు నే యున్నాను. ఈ దేవుఁడు ఇయ్య నీయఁడు. ఏమి చేయుదును!' అని పలుకు చుండెను. అతఁడు దుఃఖితుఁ డై సమయము ఎదురు సూచు చుండఁగా సూర్య గ్రహణము కలిగెను. ఆసమయమున మహాదానములు సేయుచున్న రాజును దఱిసి యశోవర్మ 'దేవా, నాకు ఇయ్య నీయని యీ దేవుఁడు ఇప్పుడు శత్రువుచే గ్రస్తుఁ డై యుండఁ గానే నా కేమయిన నిమ్ము.' అని వేఁడెను. రాజు ఆమాటకు అలరి, వానికి విస్తారముగా వస్త్ర హిరణ్యాదికమును ఇచ్చెను. ఆ ధనము వ్యయితము కాఁగా, ప్రభువు మరల ఇయ్యకుండఁగా, తన భార్యయు మరణముఁ బొందఁగా, యశోవర్మ వింధ్య వాసినిని గొలువఁ బోయెను. 'నిర్ధనము జీవన్మృతము నైన యీ దేహమువలన నా కేమి ప్రయోజనము? దీనిని దేవిమ్రోల వదల నయిన వదలెను, లేక, అభీష్ట మయిన వరమయినను పొందెను.' ఇట్లు నిశ్చయించుకొని అతఁడు వింధ్యవాసిని మ్రోల దర్భాసనాసీనుఁ డై తదేకాగ్రచిత్తుఁ డై మహాతపస్సు చేసెను. దేవి వానికి స్వప్నములో అగపడి 'పుత్రా, నీతపస్సుకు మెచ్చితిని, నీకు అర్థశ్రీని ఇత్తునా, భోగశ్రీని ఇత్తునా?' అని యడిగెను. 'తల్లీ నాకు వానిలో భేదము తెలియదు' అని యశోవర్మ పలికెను. 'నీదేశములో భోగవర్మ అర్థవర్మ అని యిరువురు వణిజులు కలరు, పోయి వారిసిరిని చూచి వచ్చి,

అందులో ఎవనిసిరి నీ కిష్ట మగునో దానిని వేఁడుము.' అని దేవి ఆన తిచ్చెను.

అంతట నతఁడు మఱునాఁడు పారణ చేసి తన యూరికి కౌతుకపురమునకు పోయి ముందుగా అచ్చట వాణిజ్యముచేత పరిమితి లేని హేమ రత్నాదికము నార్జించి యున్న యర్థవర్మ యింటికి పోయి, ఆతఁడు భోజనమునకు నిలువు మనఁగా నిలిచి, ఘృతమాంస భూయిష్ఠముగా అర్థవర్మతోఁగూడ భుజించెను. అర్థవర్మ అరపలము నేతితో కొంచెము పిండిని కొంచెము మాంసవ్యంజనమును భుజించెను. 'సాహుకారా, ఏమి చక్కఁగా భోజనము చేయవు?' అని యశోవర్మ యడుగఁగా అర్థవర్మ 'నేఁడు నీబలాత్కారముచే ఈమాత్ర మైన ఘృతమాంససక్తువులను భుజించితిని. కర్షము నేయియు పిండియు మాత్రమే నేను భుజింతును. మందాగ్నినైన నాకు అంతకన్న నెక్కువ జీర్ణము కాదు.' అని యుత్తర మిచ్చెను. యశోవర్మ వానిసిరిని నిష్ఫల మని మనస్సులో నిందించెను. రాత్రి అర్థవర్మ యశోవర్మకై అన్నము పాలును తెప్పించెను. యశోవర్మ వానిని తృప్తిగా భుజించెను. అర్థవర్మ ఒకపలము క్షీరము త్రాగెను. పిమ్మట ఇరువురు ఒకచోటనే పరుండి నిద్రించిరి. కలలో యశోవర్మ అచ్చట దండహస్తులై వచ్చిన కొందఱు భయంకరపురుషులను చూచెను. వారు 'ఛీ! పనికిమాలినవాఁడా! ఈదినము కర్షము కంటె ఎక్కువ నేయియు మాంసమును భుజించితివి! పలము

పాలుకూడ త్రాగితివి!' అని అర్థవర్మను బెదరించి దుడ్డులతో కొట్టిరి. ఎక్కువగా తిన్న ఘృత పయో మాంస భక్తములను కడుపులోనుండి లాగి వైచిరి. అట్లు కల గని మేలుకొన్న యశోవర్మ యెదుట అర్థవర్మ కడుపులో శూల కలిగి ఏడువ సాగెను, సేవకులు కడుపు పిసుకఁగా అర్థవర్మ ఎక్కువగా తిన్న తిండి యెల్ల క్రక్కుకొనెను. శూల శాంతించెను. యశోవర్మ 'ఛీ! ఛీ! ఏల యీ యర్థశ్రీ! దీనిభోగము ఇట్లున్నది! ఇట్టిసిరి వలదు.' అని తలపోయుచు ఆరాత్రి శేషమును గడపెను.

మఱునాఁడు ఆ వర్తకుని ఆమంత్రించి యశోవర్మ భోగవర్మయింటికి పోయి, అతఁడు వేఁడఁగా ఆదినము అచ్చట భోజనార్థము నిలిచెను. వానియింట ధనసంపద యేమియు అగపడ లేదు. ఇల్లు వస్త్రములు మంగళాభరణములును సొంపుగా నుండెను. యశోవర్మ యెదుటనే భోగవర్మ తన వ్యాపారము ఆరంభించెను. ఒకరిసరకు మఱియొకరికి అమ్మి దళారిదీనారములు సంపాదించి వానిని కింకరునిచేత విచి త్రాన్న పాన సంపాదనార్థము తన భార్యకు పంపెను. ఆక్షణమందే ఇచ్ఛాభరణుఁడను చెలికాఁడొకఁడు వచ్చి యతనిని తనయింటికి భోజనమునకు రమ్మనియు కడమచెలికాండ్రు అందఱును వచ్చి యున్నారనియు ఇతనినే ఎదురుచూచుచున్నారనియు నిర్బంధించెను. 'ఈదినము నేను రాను, ఈ యతిథి వచ్చియున్నాఁడు.' అని భోగవర్మ పలుకఁగా, 'ఈయనకూడ నీతో రావలయు, ఇతఁడు మాత్రము

మా మిత్రము కాఁడా? లెండు.' అని ఇచ్ఛాభరణుఁడు వారి నిరువురను కొనిపోయెను. అచ్చట భోగవర్మ మృష్టాన్నము భుజించి పానము సేవించి సాయంకాలము తనయింట మరల యశోవర్మ సమేతముగా విచి త్రాన్న పానములు ఆరగించెను. రాత్రి పరిజనులను పానార్థము సమృద్ధిగా సారాయి కలదా అని యడిగెను. వారు లేదనిరి. 'అపర రాత్రమున జల మెట్లు త్రాఁగుదుము?' అని పలుకుచు వస్త్రకుఁడు పరుండెను. వాని పార్శ్వమందే యశోవర్మ శయనించెను. అతనికి స్వప్నములో కొందఱు ఆయిల్లు సొచ్చినట్లును వారిని తమవెంట వచ్చిన మఱి కొందఱు 'శఠులారా, ఏల ఈయపరరాత్రమునకు భోగవర్మ కొఱకు మీరు సారాయి ఉంపక పోయితిరి?' అని బెదరించి లగుడములతో కొట్టినట్లును, 'ఈ తప్పు క్షమింపుఁడు' అని దెబ్బలు తిన్నవారు వేఁడుకొన్నట్లును, ఎల్లరును వెడలి పోయి నట్లును. అగపడెను. అంతట యశోవర్మ మేలుకొని తలఁపని తలంపుగా వచ్చుచున్న భోగవర్మయొక్క యాభోగశ్రీకి ఆశ్చర్య పడి అర్థసమృద్ధ మయ్యును అర్థవర్మసిరి భోగహీన మగుటచే మంచిది గా దని తలపోయు చుండఁగా, తెల్లవారెను. అంత యశోవర్మ సెలవు పుచ్చుకొని, వింధ్యవాసినీపాదమూలమునకు పోయి తపస్సుచేసి, ఆదేవిని ప్రసన్నురాలిని చేసికొని, భోగశ్రీని వేఁడెను. ఆమెయు ఇచ్చెను. యశోవర్మ ఇంటికి పోయి దేవి

ప్రసాదముచే చింతితోపగామిని యగు భోగశ్రీ ననుభవించుచు సుఖ ముండెను.

ఇట్లు భోగసంపన్న మగు సిరి కొంచె మయినను మేలు; భోగహీన మగు సిరి మహావిస్తీర్ణ మయ్యును నిష్ప్రయోజనము. ఏల కార్పణ్య యుక్త మయిన చమరవాలుని సంపదకు దుఃఖించెదరు? దానభోగాఢ్య యగు మీసంపదను చూచుకొన రేమి? అతనిపై వెడలుట శ్రేయము గాదు. యాత్రకు మంచి లగ్నము లేదు, జయము కలుగదు.—

ఇట్లు గణకుఁడు చెప్పినను ఆయేవురును కూడి చమరవాలుని మీఁదికి దాడి వెడలిరి. వారు తనయొల్లకు వచ్చుచు, చమరవాలుఁడు స్నానము చేసి హరుని పూజించి ఆలువది శుభనామములతో స్తుతించెను. 'రాజా, నిశ్చయముగా పోరు. శత్రువులను గెలిచెదవు.' అని ఆశరీరవాణి పలికెను. అంతట సంతోషించి సన్నాహమై, చమరవాలుఁడు శత్రువుల పైకి వెడలెను. అతని శత్రువుల బలములో ముప్పది వేల యేనుఁగులు, మూఁడులక్షల గుఱ్ఱములు, ఒక కోటి పాదాతికమును ఉండెను. తన బలములో ఇరువదిలక్షల పాదాతికము, పదివేల యేనుఁగులు, లక్ష గుఱ్ఱములును ఉండెను. మహాయుద్ధము తొడఁగఁగా, వీరుఁ డను నన్వర్థనాముఁడు ప్రతీహారుఁడు ముందు పోవు చుండఁగా, చమరవాలుఁడు స్వయముగా మహావరాహదేవుఁడు మహార్ణవముం బోలె రణాంగణము ప్రవేశించెను.

స్వల్పసైన్యుఁ డయ్యును పరులమహాసైన్యమును మర్దించి వారి హయ గజ పదాతులను రాసులుగా కూల్చెను. ఎదురుకొనిన సమరబలుని చమరవాలుఁడు ఈఁటెతోఁ బొడిచి పాశముతో లాగి కట్టివైచెను. వెంటనే రెండవశత్రువును సమరశూరుని ఎదలో కోలం గూల నేసి పాశముతో లాగి కట్టెను. మూఁడవ వానిని సమరజితుని వీరుఁ డను నాప్రతిహారుఁడు కట్టి చమర వాలుని మ్రోల తెచ్చి పెట్టెను. అతని సేనాపతి దేవబలుఁడు నాలవ రాజును ప్రతాపచంద్రుని కోలలతోఁ గూల నేసి తెచ్చి ఎదుటనుంచెను. దానిం గని అయిదవ రాజు ప్రతాపసేనుఁడు కోపముతో చమరవాలుని మీఁదికి వచ్చెను. చమరవాలుఁడు వాని బాణములను స్వబాణములతోఁ గొట్టి మూఁడుకోలల నతని లలాటము నేసి కాలపాశముంబోని పాశముతో నతని నాకర్షించి తనకడ కట్టి వయిచెను. అంత వారిసేనలు పలా యమానము లయి దిక్కుమొగము లాయెను. అమితమైన హేమరత్నాదికమును, రాణివాసముల గుంపును ఆరాజులవి, చమరవాలునికి వశ మాయెను. ఆ రాణివాసములలో ప్రతాప సేనుని భార్య ఉత్తమాంగన యశోలేఖ యను మహాదేవి అతని చేఁ జిక్కెను. అంత నతఁడు నగరమునకు మరలి వచ్చి వీర దేవబలులకు ప్రతిహార సేనాధిపతులకు పట్టము గట్టి వెల లేని బహుమానము లిచ్చెను. క్షత్రధర్మజిత యని ప్రతాపసేనుని భార్యను యశోలేఖా దేవిని తన రాణివాసముగా చేసికొనెను.

ఆమెయు చపలయ్యు తాను అతనికి భుజార్జిత యని అంగీకరించెను. పిమ్మట ఆ యశోలేఖ వేడఁగా చమరవాలుఁడు ఆయేవురు రాజులను పొగ రణఁచి చెఱనుండి విడుదల చేసి సత్కరించి వారి రాజ్యములకుఁ బంపెను. పిమ్మట చమరవాలభూపతి రాజ్యమును నిష్కంటకము చేసి సకలైశ్వర్యములు కలిగి శాత్రవ విజయపతాకయుం బోని యశోలేఖతో అప్సరోధికలావణ్యతో క్రీడించుచుండెను. ఇట్లు ద్వేషాకులులై ఆత్మపరతారతమ్య మెఱుఁగక త్వరపడి మార్కొను శత్రువులను పలువురను ఒకఁడే ధీరుఁడు అనన్యసామాన్య పరాక్రముఁడు రణములో వెలార్చును.

ఇట్లు గోముఖుఁడు కథ చెప్పఁగా విని మెచ్చి నరవాహనదత్తుఁడు స్నానాది కృత్యములకై సభ చాలించి లేచెను. ఆరాత్రి స్త్రీగోష్ఠిలో సంగీతముచే స్వయముగా పాడుచుండెను. గగనవాణియు అతని ప్రియలతోఁగూడి శ్లేషవచనములు పలికెను.

---

## ౫ - వ తరంగము.

మఱునాఁడు అలంకారవతీవాసగృహమునందు నరవాహనదత్తుఁడు సకల మంత్రి సమేతుఁడై యుండఁగా మరుభూతిసేవకుఁడు సౌవిదల్లుని సోదర్యుఁడు వచ్చి 'దేవరా, నేను

ఈమరుభూతిని, రెండువత్సరములు కొలిచితిని, ఇతఁడు నాకును నాభార్యకును అన్నపానములు మాత్ర మిచ్చినాఁడు. మొదట ఇతఁడు నాకు సంవత్సరమునకు ఏఁబది దీనారములు జీతము ఇచ్చునట్లు మాటలాడినాఁడు. వానిని మాత్రము ఈయఁడు. నేను పోయి ఇమ్మని అడుగఁగా నన్ను తన్ని పంపినాఁడు. అందు చేత నేను తమ సింహద్వారములో ప్రాయోపవేశము చేసి యున్నాను. ఏలినవారు విచారింపరేని నేను అగ్నిప్రవేశము చేసెదను, ఇఁక నేమి చెప్పుకొందును?' అని విన్నవించు కొనెను. అంత మరుభూతి 'దేవా, వీనికి దీనారములు ఇయ్య వలయు ననుట వాస్తవమే, అయినను ఇప్పుడు నాయొద్ద లేవు.' అని పలికెను. అందఱు నవ్విరి. అంత నరవాహనదత్తుఁడు అత నితో 'ఏమి నీకు ఈమూర్ఖబుద్ధి? తత్క్షణము లేచిపోయి వానికి దీనారములు ఇచ్చి వేయుము.' అనియె. అతఁడు లజ్జితుఁడై వెంటనే తెప్పించి వానికి నూఱు దీనారములు ఇచ్చెను. గోము ఖుఁడు ఆసమయమున 'దేవా, మరుభూతిని అనఁగూడదు. బ్రహ్మసృష్టి నానాచిత్రములుగా నున్నది! చిరదాత యను రాజు యొక్కయు అతని సేవకుఁడు ప్రసంగుఁడను వానియొక్కయు కథను చెప్పెదను వినుము.' అని యిట్లు చెప్పందొడంగెను.

## చిరదాతృప్రసంగులకథ.

పూర్వము చిరపుర మను నగరమున చిరదాత యను రాజు ఏలుచుండెను. అతఁడు సుజనుఁడైనను అతని పరివార

జనము దుర్మార్గులుగా నుండిరి. ఒకప్పుడు దేశాంతరమునుండి ప్రసంగుఁడను నొకఁడు ఇరువురు మిత్త్రులతోఁ గూడ వచ్చి అతనిని సేవించుచుండెను. అట్లు ఐదు సంవత్సరములు గడచినవి. రాజు వానికి ఉత్సవాదిసమయములలోఁగూడ ఏమియు ఇయ్యఁడాయెను. ప్రభువుతో మనవి చేసికొనుటకు పరివారజనుల దౌరాత్మ్యముచేత ప్రసంగాదులకు అవకాశము కలుగకుండెను. ఒకప్పుడు రాజు కొమరుఁడు బాలుఁడు మృతిఁ బొందెను. దుఃఖితుఁడై యున్న రాజును భృత్యులందఱును చుట్టుకొని యుండిరి. వారినడుమ ప్రసంగుఁడు కూడ శోకాకులుఁడై యుండి, సఖులు నివారించుచున్నను రాజుతో నిట్లు విన్నపించెను. 'దేవా, మేము చిరకాలము సేవించుచున్నను, మాకు ఏమియు ఇయ్యకైతివి, ఐనను నీ కుమారుఁడైనను పిమ్మట ఇచ్చునను నాశచే ఇటనే కొలుచుచునే ఉంటిమి. అతనిని దైవము హరించినది. ఇఁక మాకు ఇచట నేమి పని? పోయెదము.' ఇట్లు పలికి రాజుపాదముల వ్రాలి సఖులతోఁ గూడ వెడలిపోయెను. 'ఆహా! ఈసేవకులు నాపుత్త్రునియందుఁ గూడ ఆశపెట్టుకొని యున్నారు. వీరు నాకు స్థిరసేవకులు. వీరిని వదలఁ గూడదు.' అని తలంచి రాజు వారిని మరలించి మరల దారిద్ర్యము నెఱుంగకుండునట్లు మహాధనసమృద్ధులను చేసెను. ఇట్లే లోకుల స్వభావములు విచిత్రములుగా నుండును! ఆరాజు కాలములో ఈయక అకాలములో ఇచ్చెను గదా!

## కనకవర్షునికథ.

ఇట్లు కథ చెప్పి ఆఖ్యానప్రవీణుఁడు గోముఖుఁడు మరల వత్సరాజసుతాదేశమున వక్కాణింపఁ దొడంగెను. పూర్వము గంగాతటములో మంచిపరిపాలనలో కనకపుర మని ఒక నగర ముండెను. అందు బంధంబులు కవివాక్కులయంద, ఛేదములు పత్త్రములయంద, భంగములు నార్యలకములయంద, ఖరావళి సస్యసంగ్రహణములయంద. అందు వాసుకితనయుఁ డైన ప్రియ దర్శనుఁ డనువానికి యశోధర యను రాజపుత్త్రియందు ఉద్భ వించినవాఁడు కనకవర్షుఁ డను రాజు ఏలుచుండెను. అతఁడు సర్వభూభారమును మోచువాఁ డయ్యును అశేషగుణభూషితుఁ డయి యుండెను. యశస్సునందు లుబ్ధుఁడు గాని ధనమందుఁ గాఁడు, పాపములకు వెఱచును గాని శత్రువులకు వెఱవఁడు, పరాపవాదములయందు తెలియనివాఁడుగాని శాస్త్రములలో తెలియనివాఁడు గాఁడు. అల్పత్వము ఆమహాత్ముని కోపమందే గాని ప్రసాదమందు లేదు, బద్ధముష్టిత్వము చాపమందే గాని దానమందుఁ గాదు. అఖిల జగద్రక్షకుని అతనిని చూచిన మాత్రాన అబలాజనములు మారవ్యథాకులము లగుచుండెను. అతఁ డొకనాఁడు నోష్ణంబు ఉన్మదవారణము రాజహంసపరీ వారము సోత్సవానందితప్రజంబు నై ఆత్మతుల్యగుణ మైన శర త్కాలమున కమలామోదము వెదచల్లుచు చల్లగాలి వీచు చున్న చిత్రప్రాసాదమును క్రీడార్థము ఎక్కెను.

అంతట ఆచిత్రమును చూచి రాజు వర్ణించుచుండఁగా ప్రతీహారుఁడు వచ్చి విన్నవించెను. 'దేవా, విదర్భదేశమునుండి ఇచ్చటికి చిత్రకారుఁ డొకఁడు వచ్చియున్నాఁడు. చిత్రవిద్యలో తనకు ఈడు లే రని పలుకుచున్నాఁడు. వానిపేరు రోలదేవుఁడు. సింహద్వారమున ఈవిషయమునే ఒక గుడ్డమీఁద వ్రాసి ప్రకటించి యున్నాఁడు.' దానిని విని రాజు ఆచిత్రకారుని రప్పించెను. వాఁడు ఏకాంతమందు తనచిత్రములు చూడఁ గోరి ఎదురు చూచుచున్న కనకవర్షభూపాలుని వరనారీకుచోత్సంగ సమర్పిత తనూభరుని సహేల లోదంచిత కరోపాత్త తాంబూల వీటికుని చూచి ప్రణమిల్లెను. రాజు ఆదరింపఁగా కూర్చుండి చిత్రకారుఁడు 'దేవా, నేను నీదర్శన మపేక్షించి చీరిక వ్రాసి ప్రకటించితిని గాని విజ్ఞానమదముచేతఁ గాదు. ఈనా యవినయమును ఏలినవారు మన్నింతురు గాక. ఏచిత్రము వ్రాయుదునో ఆనతిండు, నావిద్య సఫల మగును గాక.' అని పలికెను. 'ఒజ్జా, నీకుఁ దోఁచినట్లు ఏ మయినను వ్రాసి చూపుము, నీ నేర్పువిషయమై సందేహ మెక్కడిది? మాకు నేత్రోత్సవ మగునుగాక.' అని రాజు పలికెను. 'రాజునే వ్రాయుము, ఇతరులను రూపహీనులను వ్రాసి ఏమి ఫలము?' అని పార్శ్వస్థులు పలికిరి. అంతట రాజుయొక్క తుంగనాసావంశము, దీర్ఘరక్తనేత్రములు, విశాలలలాటము, కుటిలనీలకుంతలములు, రూఢబాణాదివ్రణశోభి యగు విస్తీర్ణవక్షంబు, దిగ్గజకరానురూప మగు బాహు

ద్వయము, పరాక్రమ పరాజితములైన కేసరీంద్ర కిశోరకములు పెట్టిన కానుకయో యన ముష్టి మేయ మగు మధ్యంబును, యౌవన ద్విరదాలాన నిభం బగు నూరు యుగము, అశోక పల్లవనిభం బగు సుందరాంఘ్రి యుగళంబును, ఒప్పారంగా, చూచి చిత్రకారుండు రాజును ఉన్నది యున్నట్లు లిఖించెను. అందఱును బళి యనిరి. 'ప్రభువును ఒంటిగానిని మేము చూడ నొల్లము, కావున ఈరాణులలో ఒకతెను తగినదానిని ఇతని ప్రక్కను వ్రాయుము. మాకు నేత్రోత్సవము పూర్ణ మగును గాక.' అని తత్రత్యులు పలికిరి. అతఁడు వారి నెల్ల చక్కఁగా పరికించి యి ట్లనియె:—

వీ రింద ఉన్నను, వీరిలో ఒకతెయు ఇతనికి తగినది కాదు. ఈజగత్తులో ఇతనికి తుల్యరూప లేదు. ఒకరాజకన్య మాత్రము కలదు, విదర్భదేశములో కుండిననగరమున దేవశక్తి యని విఖ్యాతుఁడు రాజు కలఁడు. అతనికి అనంతవతి యని ప్రాణాధికప్రియ రాణి కలదు. ఆమెయం దతనికి మదనసుందరి యని కొమరిత గలిగినది. ఆమె రూపమును ఒక జిహ్వతో వర్ణించుటకు మముబోంట్లకు నలవి గాదు. ఆమెను నిర్మించి విధి ఆరసముచే మరల అట్టిదానిని నిర్మింపఁ గోరియు ఎన్ని యుగముల కైనను ఇష్టము నెఱవేర్చుకొన సమర్థుఁడు గాఁడు. రూప లావణ్య వినయ వయః కులములచే ఆరాజకన్య యొక తెయే యీయనకు తగినది. నన్ను ఒకన్నాఁడు ఆమె చేటికా

ముఖమున అంతఃపురమునకు పిలిపించెను. అప్పుడు ఆమె చల్లగా చందనపు మైపూఁత పూసికొని మృణాలహారములు దాల్చి తామరాకు పాన్పుపై దొరలు చుండెను. సఖు లామెను కదలీపత్త్రపవనముల వీచు చుండిరి. ఆమె పాండుక్షామ యయి స్పష్టము లయిన స్మర జ్వర లక్షణములతో నొప్పు చుండెను. 'చెలులారా, ఈ చందనాలేప కదళీదళ మారుతములు వేల? వృథా శ్రమపడియెద రేల? ఇవి చల్లని వయ్యును మందభాగ్యురాలిని నన్ను దహించుచున్నవి.' అని ఆమె వారించుచుండెను. చెలులు ఆ యవస్థను గని ఏమి చేయ నగు నని తలపోయు చుండిరి. నేను ఆమెకు ప్రణమిల్లి ఎదుటఁ గూర్చుంటిని. 'ఒజ్జా, ఇట్టిరూపమును చిత్రములో వ్రాసి యిమ్ము,' అని పలికి, ఆమె చేత వర్తిని పట్టుకొని, చేయి కంపిల్లుచుండ, మెల్లగా భూమిమీఁద రూపాధికుని ఒకానొక పడుచువానిని వ్రాసిచూపెను. నేను అట్టివానిని సుందరుని వ్రాసి 'సాక్షాత్కామదేవునే ఈమె నాచేత వ్రాయించినది! అయినను చేత పూలవిల్లు వ్రాయించినది కాదు, కావున ఇతఁ డెవరో కామరూపుఁ డైన పురుషుఁడు, ఇతనిని ఈమె చూచినదియుఁ గాదు విన్నదియుఁ గాదు. ఇతని నిమిత్తమే ఈ స్మరవిజృంభితము కలిగినది. కనుక నేను వెంటనే ఇటనుండి పోవలయును. ఈమె తండ్రి దేవశక్తి ఉగ్రదండుఁడు. ఈ వృత్తాంత మెఱిఁగిన నన్ను క్షమింపఁడు!' అని తలపోసి నేను ఆ రాజకన్యను మదనసుందరిని నమస్కరించి,

ఆమెవలన సత్కారములు వడసి వెడలితిని. ఆమె పరిజనము ఒండొరులతో పలికికొన్న మాటలవలన నేను ఈపాటి తెలిసి కొంటిని: ఆమె నిన్ను గుఱించి విని నీయందు అనురక్త యై యున్నది. అంత నేను ఆమెను గుప్తముగా చిత్రపటములో వ్రాసికొని నీపాదమూలమునకు త్వరితముగా వచ్చితిని. నీ యాకారము చూడఁగా నిన్నే ఆమె నాచేత వ్రాయించిన దని నాకు స్పష్ట మయినది. ఆమెను పలుమాఱు వ్రాయుట శక్యము గాదు కావున నీకు సమానురా లయినను ఆమెను ఇచ్చట ఇప్పుడు నేను వ్రాయను.—

అంత రాజు అతనిని యా చిత్తరువు నయిన చూపు మనెను. చిత్రకారుఁడు గొట్టములోనుండి మదనసుందరియొక్క పటమును తీసి చూపెను. కనకవర్షుఁడు చిత్రగత యైనను విచిత్రరూప యైన యామెను చూచి వెంటనే మదనపరవశుఁ డాయెను. బహుసువర్ణము లిచ్చి రోలదేవుని సత్కరించి ఆమె పటమును చేతఁగొని లోపలి యంతిపురమునకుఁ బోయి, అచట ఆమెయొక్క రూపలావణ్యమును చూచుచు నేత్రములు తనియ తదేకమయమానసుఁ డై సర్వవ్యాపారములు మాని యుండెను. అతనిని రూపమాత్సర్యముచేతనుం బోలె మదనుఁడు తఱి గొని కోలల నేసి ధైర్య మెడలించెను. తన రూపమునకు లోనైన వనితలకు తాను అమితముగా కలిగించిన యార్తి రాజునకు ఇపుడు నూఱింతలుగా ఫలించెను. కొన్నాళ్లకు రాజు విరహ

పాండు క్షామున్ డై కారణ మడిగిన యాప్త సచివులకు తన మనోగతమును వివరించి, వారితో కలియఁ బలికి, దేవశక్తిని ఆ కన్యను గూర్చి యాచించుటకై దూతను సంగస్వామి యను వానిని విప్రుని కాలజ్ఞుని కార్యవేదిని కులీనుని మధురోదాత్త భాషణుని పంపెను. ఆ బ్రాహ్మణుఁడు మహాశ్వ పరికరసమేతుఁడై కుండిన నగరమునకుఁ బోయి దేవశక్తిని దర్శించి తనదొరకై అతనిని కన్య నిమ్మని యడిగెను. 'కన్య ఎట్లయినను ఒకరికి ఇయ్యవలసినదే గదా. మాకు తగినవాఁడే కనకవర్ష మహీపాలుఁడు ఈమెను అడుగుచున్నాఁడు. కనుక ఇతనికి ఇచ్చెదను' అని దేవశక్తి యాలోచించి సంగమస్వామిపలుకు లాదరించి, అతనికి ఆమె రూపమువలెనే అద్భుతమైన తదీయ నృత్తమును చూపి, ఆరూపమునకును నృత్తమునకును ప్రీతుఁడైన సంగమస్వామిని సత్కరించి, కొమరితెను కనకవర్షుని కిచ్చెద నని పలికి, పంపెను. వివాహామునకు లగ్నము పెట్టుకొని మాకు ముందుగా తెలిపి, బయలువెడలి రావలసిన దని కనకవర్షునికి తెలుపుమని ఆయనతోఁ గూడ తన ప్రతిదూతను, పంపెను.

సంగమస్వామి ప్రతిదూతతోఁ గూడ పోయి కనకవర్ష రాజునకు కార్యసిద్ధిని నివేదించెను. అంతట ప్రతిదూతను సత్కరించి మదనసుందరి తనయం దనురక్త యని అతనివలన పలుమాఱు విని లగ్నము నిర్ణయించి దుర్వారవీర్యుఁడైన యా రాజు కుండినపురమునకు తరలి విదర్భదేశము చేరఁగా, దేవశక్తి

ఎదురు కోలు వచ్చి యీతనిని తోడ్కొని పోయెను. కుండిన నగర మందు పౌరస్త్రీలకు నేత్రోత్సవముగా ఊరేఁగి కనక వర్షుఁడు వివాహార్థము అలంకృత మై సన్నద్ధ మై యున్న రాచనగరు సొచ్చెను. ఆదినము సపరివారముగా శ్వశురకృతాచార రంజితుఁ డై అచట విశ్రమించెను. మఱునాఁడు దేవశ క్తి అతనికి మదనసుందరి నిచ్చి వివాహము చేసి తన రాజ్యము తప్ప కడమ సకలధనమును అరణమిచ్చెను. అచట కనకవర్షుఁడు ఏడుదినము లుండి నవవధూసమేతముగా నిజనగరమునకు పోయెను. జగ దానందదాయి యతఁడు కౌముదీసమేతుఁ డైన చంద్రుఁడుం బోలె కాంతాసమేతుఁ డై రాఁగా, ఆనగర మెల్ల మహో త్సవముగా నుండెను. అతనికి అంతఃపుర స్త్రీలు ఎంద ఱున్నను మదనసుందరి అచ్యుతునికి రుక్మిణి వోలె ప్రాణాధిక ప్రియగా నుండెను. ఆదంపతులు అన్యోన్యవదనాసక్తములు చారుపక్షు ములు నగు తమ లోచనములచే స్మరసాయకములచేతనుంబోలె కీలితు లై యొప్పారుచుండిరి.

ఒకనాఁడు వికసత్కేసరావళి యై మానినీమానమాతం గమును చీల్చుచు మధుకేసరి వచ్చెను. లగ్నాళిమాలావకార్వి కుండు కుసుమాకరుండు నై పుష్పబాణుఁడు వికసచ్చూతవల్లీ ధనుర్లతను ఎక్కువెట్టెను. మలయ మారుతుఁడు సముద్దీ పితకామము లైన యధ్వగనారీమానసములను ఉపవనములనుం బోలె కంపిల్లఁ జేయుచు వీవఁదొడంగెను. నదులకు పూరములు,

తరువులకు పుష్పములు, చంద్రునికి కళలును, క్షీణించినట్టివి మరల వచ్చును; దేహులకు యౌవనముమాత్రము మరలరాదు; ప్రణయకలహములు మాని యథేష్టముగా దయితాసమేతులై క్రీడింపుఁడు.' అని యువజనులను బోధించునవియుంబోలె కోకిలలు కూయుచుండెను. ఆసమయమున మధూద్యానమందు విహారార్థము కనకవర్ష మహారాజు సర్వాంతఃపుర కామినీ సహాయుఁడై ప్రవేశించెను. రక్తము లగు పరిజనాంబరములచే అశోకముల శోభను, వరాంగనా గీతములచేత కోకిల భ్రమరనాదములను, హరించుచు ఆరాజు సర్వావరోధసమేతుఁడయ్యును మదనసుందరీదేవితోనే కుసుమాపచయాది క్రీడలందేలెను. అనంతరము అంతఃపురికాసమేతుఁడై గోదావరి జొచ్చి జలకేళి నోలలాడెను. మొగములచే పద్మములను, నయనములచే నుత్పలములను, పయోధరములచే రథాంగ యుగళములను, నితంబములచే నిసుక తిన్నెలను, జయించి యతని వరాంగనలు క్షోభపెట్టిన యాయాసమును ఆ తటిని తరంగరూప భ్రూభంగములచే తెలిపినదియుంబోలె నొప్పారెను. జలవిహారముచే నంబరము లెడలఁగా నభివ్యక్తము లయిన వారియంగముల సౌష్ఠవమును గాంచుచు కనకవర్షుఁడు వారితో క్రీడించెను. ఒక రాణిని విస్రస్తవసనమై హేమకుంభద్వయోపమంబై యున్న కుచయుగ్మంబున కరవారితోఁ గొట్టెను. దానిం గని మదనసుందరి ఆమెపై ఈసు పూని 'ఎంతసేపు

నదిని కలంచుట!' అని పలికి, వెలువడి వస్త్రాంతరము తాల్చి ప్రియునిపై తప్పుచెప్పుచు తనచెలులతోఁ గూడి నగరి కేఁగెను.

ఆ యభిప్రాయ మెఱిఁగి జలక్రీడమాని కనకవర్షుఁడు ఆమె వాసగృహమునకు వచ్చెను. అచట పంజరములలో నున్న చిలుకలు గూడ తన్ను. లోపలికి పోనీయక నివారించుచున్నను పోయి అతఁడు కోపకలుషిత యై యున్న దేవిని చూచెను. ఆమె ఎడమచేత వదనాంబుజమును వాల్చి స్వచ్ఛమౌక్తికసదృశము లయిన బాష్పబిందువులు గురియుచు గద్గదస్వరముతో దంతాంశుహారిణియు నపభ్రంశముగ్ధయు నైన వాక్కుతో ఇట్లు పాడుచుండెను:—

క. విరహము నోరుతువేనిం, । బరివర్ధన సేయు డెందమా, మానంబున్
విరహము నోరువవేనిం, । బరివర్జన సేయు వేగపడి మానంబున్.

క. చక్కఁగ దీని నెఱిఁగి యిం। దొక్కమతముఁ బూనుపదము లుభయతటములన్
నిక్కి లిపెదేని, నడుమన్ । దక్కకపడి నాశ మొందెదవు సుమ్ము వెసన్.

కోపావస్థయందున్నై తము అట్లు మనోహారిణిగా నున్న యాలేమను రాజు లజ్జాభయములు పెనఁగొన మెల్లనఁ దఱిసెను. పరాఙ్ముఖిగా నున్న ప్రియను కౌఁగిలించి సవినయ మధుర వచనములతో నెంతయు ననునయింపఁ దొడంగెను. పరివార జనము తనతప్పిదమును వక్రోక్తులచే సూచించుచుండఁగా కనకవర్షుఁడు తన్నుతానే నిందించుకొనుచు మదనసుందరీపాద ముల వ్రాలెను. ఆమె తన నేత్రములనుండి రాలిన బాష్ప

ములచేత మూర్తీభవించిన దుఃఖము చేతనుంబోలె అతనిం దడుపుచు ప్రసన్నయై కంఠాలింగనము చేసెను. రాజు సంతుష్టుండై కుపితతుష్ట యయిన యామెతో ఆరాత్రి భోగములం గడపి నిద్రించెను. స్వప్నములో ఆరాజునకు వికృతస్త్రీ ఒకతె అగపడి యతనిమెడనుండి ఏకావళిని శిరస్సునుండి చూడారత్నమును హరించెను. అంత నానాప్రాణ్యంగదేహుఁడు బేతాళుఁడు అగపడి రాజుతో బాహుయుద్ధము చేయందొడంగెను; రాజు వానిని నేలఁగూల్చెను; వాఁడు రాజును వీఁపుపై నెక్కించుకొని పక్షివలె ఆకాశమార్గమునఁ బోయి సముద్రమధ్యమున విడిచి పెట్టెను ; రాజు ఎట్టకేలకు అందునుండి గట్టు చేరెను; అంత మరల కంఠమున ఏకావళియు శిరమున చూడామణియు ఉండెను— ఇట్లు కల గని మేలుకొని తెల్లవాఱఁగా తన యొద్దకు పరిచితుఁడు ఒక క్షపణకుఁడు రాఁగా రాజు అతని ఆస్వప్నమునకు ఫల మడిగెను! 'అప్రియము చెప్ప రాదు. అడిగినప్పుడు చెప్పక యె ట్లుందును ! ఏకావళీ చూడామణులు నష్టమగుటచేత దేవితోను పుత్త్రునితోను నీకు వియోగము కలుగును. సముద్రమును దాఁటఁగానే నీకు మరల ఏకావళీ రత్నములు కలుగుటవలన దుఃఖాంతమందు నీకు మరల దేవీపుత్త్ర సమాగమము కలుగును.' అని క్షపణకుఁడు పలుకఁగా ఆలోచించి రాజు 'ఇంతవఱకు నాకు కుమారుఁడు లేఁడు; కుమారుఁడు కలుగును.' అని వచించెను. ఆసమయమున వచ్చిన

రామాయణపాఠకునివలన పుత్త్రార్థ మై ప్రయాసపడిన దశరథ మహారాజు కథను ఆలించెను.

అంతట రాజు తనకు పుత్త్రప్రాప్తి చింత గలుగుడు, క్షపణుఁడును పోవుడు, ఆదినమును విమనస్కుఁ డై గడపెను. రాత్రి నిద్ర పట్టక ఏకాకియై శయనగతుఁ డై యుండఁగా ఒక స్త్రీ తలుపు తెఱవకయే లోపలికి ప్రవేశించెను. రాజు ఆశ్చర్యపడి లేచి వినీతుఁ డై ప్రణమిల్లఁగా ఆమె ఆశీర్వదించి యిట్లనియె:- 'పుత్త్రా, నేను నాగరాజు వాసుకి కొమరితను, నీ తండ్రికి అక్కను, నా పేరు రత్నప్రభ. నిన్ను రక్షించుటకు ఎప్పుడును నీ యొద్ద అదృశ్యురాల నయి వసించుచున్నాను. ఈదినము నీవు మిగుల చింతాక్రాంతుఁడ వై యుండుటంబట్టి నీకు అగపడితిని. నీదుఃఖమును నేను చూడ నోల్లను.' అత్త యిట్లు పలుకఁగా రా జనియె:— 'అత్తా, ఈ నీప్రసాదముచేత నేను కృతార్థుఁ డను. నా దుఃఖమునకు పుత్త్రుఁడు లేమియే కారణము. దశరథాది రాజన్యులు కూడ పూర్వము స్వర్గార్థము పుత్త్రుని కోరిరి, నాబోంట్లు కోరరా?' ఆమాటకు రత్నప్రభ అల్లునితో 'అట్లయిన, పుత్త్రా, ఇందులకు ఉపాయము చెప్పెదను, దానిని చేయుము. కుమారస్వామి కడకు పోయి తపస్సు చేయుము. నీ తలమీఁద కుమారుని ధార దుస్సహముగా పడును. దానిని నీ దేహమందు ప్రవేశించియున్న నాప్రభావముచేత ఓర్తువు. ఇతర విఘ్నములను కూడ జయించి అభీష్టసిద్ధిని పొందుదువు.' అని

పలికి నాగాంగన అంతర్ధానము పొందెను. రాజు సంతసించి రాత్రి గడపి మఱునాఁడు ప్రాతః కాలమున రాజ్యమును మంత్రుల యధీనము చేసి పుత్త్రార్థి యై కుమారస్వామి పాద మూలము చేరెను.

అచట తనదేహమందు చొచ్చియున్న నాగి యొసంగిన బలము చేత ఆయాసముల నోర్చుచు తీవ్రతపస్సు నారంభించెను. అంతట పిడుగు వోలె అతనితలను కుమారవారిధార అనారతము పడసాగెను. అతఁడు దానిని శరీరాంతర్గత నాగీ బలము చేత ఓర్చెను. అంత మఱియు విఘ్నములు కలిగించుటకు కుమారుఁడు హేరంబుని ప్రేరించెను. హేరంబుఁడు ధారా మధ్యమున మహావిష మగు మహోగ్రాజగరమును సృజించెను. దానికిని రాజు చలింపఁడు. సురలకును అజయ్యుఁడు ఆ వినాయకుఁడు తానే రాజును ఱొమ్మున దంతాగ్రముతో కుమ్మ సాగెను. రాజు ఆపోటుల నోర్చి గణ నాయకుని దుర్జయుని స్తుతించెను.

సర్వార్థ సంసిద్ధి నిధికుంభోపమ స్వరూప లంబోదరా, విఘ్నేశ్వరా, వ్యాళాలంకారా, నీకు నమస్కారము. గజాననా, బ్రహ్మను గూడ లీలోత్క్షిప్తక రాఘాత విధూతాసన పంకజునిఁ గావించి ఆదరించుచు జయింపుము. శంకరపుత్త్రా! నీవు తుష్టి నొందవేని సురాసుర మునీంద్రులకుం గూడ సిద్ధులు లేవు. పాపఘ్న ఘటోదర శూర్పకర్ణ గణాధ్యక్ష మదోత్కట పాశహ

స్తాంబరీష జంబక త్రిశిఖాయుధ-అనెడి పాపఘ్న నామాష్టకము తోడ తదన్సంఖ్యా స్థాన నియతముగా సురోత్తములు నిన్ను స్తుతించిరి. నిన్ను స్మరించువానికి స్తుతించువానికి రణ రాజకుల ద్యూత చౌరాగ్ని శ్వాప దాది కృతభయములు ఉండవు.'

ఇట్లు నానా ప్రకారముల కనకవర్షుఁడు విఘ్నేశ్వరుని పూజించెను 'తుష్టి నొందితిని, నీకు విఘ్నము చేయను, పుత్త్రుస పొందుము.' అని పలికి విఘ్నరాజు అంతర్హితుఁ డాయెను. రాజునకు ధార నోర్చినందుకై కుమారస్వామి 'ధీరుఁడా, సంతోషించితిని, వర మడుగుము.' అని యాన తిచ్చెను. 'దేవా, నీ ప్రసాదముచే నాకు పుత్త్రుఁడు కలుగును గాక.' అని రాజు వేఁడెను. 'అట్లే అగును. మద్గణాంశమున హిరణ్యవర్షుఁ డను పేర నీకు సుతుఁడు కలుగును.' అని పలికి దేవుఁడు విశేష ప్రసాదము చేయుటకు రాజును గర్భగృహమునకు రమ్మని పిలిచెను. అంతట రాజు దేహమునుండి నాగి అగపడకయే వెడలి పోయెను. స్త్రీలు శాపభయముచే కుమార గృహమున ప్రవేశింపరు. అంత కనకవర్షుఁడు మానుష తేజోమాత్రము కలవాఁడై బర్హివాహనుని గర్భభవనము సొచ్చెను. దేవుఁడు పూర్వ తేజో విహీనుని రాజును చూచి ఆలోచించి, నాగీబలమున, ఇతఁడు తన వారిధారను ఓర్చినాఁడని సమాధిచే నెఱింగి, అతనిని 'వ్యాజము చేసితివి గావున, నీకు కలుగు కొమరుని తోను మహాదేవితోను భరింపరాని వియోగము కలుగును.'

అని శపించెను. పిడుగుదెబ్బవంటి యీమాటకు రాజు మూర్ఛితుఁడై లేచి దేవుని స్తుతించెను. స్తుతుల కలరి దేవుఁడు 'రాజా, తుష్టి నొందితిని, శాపాంతము చెప్పెదను వినుము. నీకు ఈవియోగము ఒక సంవత్సరము కలుగును. ఆలోపల మూఁడు అపమృత్యువులను తప్పించుకొని పిమ్మట వారిని చేరుదువు.' అని పలికెను. రాజు ప్రణమిల్లి ఆప్రసాదామృతము చేత తనిసి నిజనగరము చేరెను.

క్రమముగా మహారాజునకు మదనసుందరీ దేవియందు చంద్రునికి జ్యోత్స్నయందు అమృతస్యందమువోలె కుమారుఁడు పుట్టెను. సుతముఖము చూచి రాజును రాణియు పట్టరాని హర్షమును పొందిరి. ఆసమయమున రాజు ఉత్సవము చేసి బంగారమును వర్షించి తననామమును సార్థకము చేసెను. అయిదురాత్రులు గడవఁగా ఆఱవరాత్రి పురుటింట సకలరక్షా విధానములును సమగ్రముగా నుండఁగానే, ఒకచిన్న మేఘము ఆకాశములో పొడమి క్రమముగా వర్ధిల్లి, ఉపేక్షితుఁడైన శత్రువు ప్రమాదవంతుఁడగు తేని రాజ్యమును బోలె ఆకాశము నెల్ల ఆక్రమించెను. వాత మత్త మతంగజము మదధారవోలె వర్షధారలు గురియుచు చెట్లు పెకలించు, పరుగులు వాఱు చుండెను. ఆసమయమున సార్గళం బయినను ఆ జాతగృహమును ఒకానొకస్త్రీ క్షురికాహస్త ప్రవేశించినదై మదనసుందరీదేవి స్తనముల పాలు త్రాగుచున్న శిశువును హరించి పరిజనమును

మైకములో మునిచి పాఱిపోయెను. 'హా హా! రాక్షసి నా సుతుని కొనిపోయినది!' అని అఱచుచు రాణి ఆరాక్షసి వెంటనే పోయెను. ఆరక్కసి బాలునితోఁగూడ ఒక సరస్సులో మునింగెను. రాణియు సుతతృష్ణచే కూడనే అందే మునింగెను. క్షణములో మేఘము పోయెను. తెల్లవాఱెను. పురుటింటి పరివారము ఆక్రందించు చుండెను. రాజు విని అచటికి వచ్చి ప్రియాపుత్త్రులు లేమింగని మూర్ఛితుఁడై మేల్కొని 'హా దేవి! హాపుత్త్రక, శిశూ!' అని యేడ్చుచు, సంవత్సరభోగ్య మయిన యాఁకుమారశాపము స్మరించి 'దేవా మందపుణ్యునికి నాకు సవిష మయిన యమృతము వోలె శాప సంపృక్త మయిన వరము నెట్లొసంగితివి! హా! హా! యుగసహస్ర దీర్ఘ మగు నీవత్సరమును జీవితాధిక యగు మదనసుందరీదేవి లేక నే నెట్లు గడపుదును!' అని యేడ్చుచుండెను. మంత్రులు ఎంత ఓదార్చినను దేవితో పోయిన ధృతిని మరల పొందఁడాయెను.

క్రమక్రమముగా మదనావేగవివశుఁడై పురము వెలువడి భ్రమ్మరుచు వింధ్యకాంతారము చేరెను. అచట బాలమృగీ నయనములచే ప్రియా లోచన సౌందర్యమును, చమరీవాలసంచయములచే తత్కేశపాశమును, కరికరేణుగమనములచే ఆమె నడకను స్మరించి, అత్యంతము మదనానలదందహ్యమాన మానసుఁడై తిరుగుచు, ఆఁకటికి ఎండకు డస్సి, వింధ్యపాద మూలమున సెలయేట నీరు త్రావి చెట్టునీడ విశ్రమించెను

అంత వింధ్యగుహనుండి వింధ్యుని యట్టహాసమో యన నొక గర్జన వినఁబడెను. సింహము ఒకటి సటలు నిక్కఁబొడుచుకొని అతనిమీఁద పడ వచ్చెను. ఆక్షణమందు గగనమార్గమున నెవఁడో విద్యాధరుఁడు వచ్చి సింహమును కత్తితో రెండుగా తెగ నఱికి, రాజును దఱిసి, 'కనకవర్ష మహారాజా, ఇట్టి యీ చోటికి ఏల వచ్చితివి?' అని యడిగెను. అంతట స్మృతి తెచ్చుకొని రాజు 'విరహానలవిక్షిప్తుని నన్ను నీ వెట్లు ఎఱింగితివి?' అని యడిగెను. విద్యాధరుఁడు పలికెను. 'నేను పూర్వము బంధుమిత్త్రుఁ డను పేర మనుష్యుఁడనుగా ప్రవ్రాజకుఁడనుగా నీనగరమం దుండి నిన్ను సేవించి నీవు చేసిన సాహాయ్యము చేత బేతాళసాధన చేసి విద్యాధరుఁడ నయితిని. ఇప్పుడు నిన్ను ఆనవాలు పట్టితిని, నిన్ను చంప వచ్చినట్టి యీ సింహమును ప్రత్యుపకారేచ్ఛచే చంపితిని. ఇప్పుడు నాకు బంధుప్రభుఁ డని పేరు.' అంతట కనకవర్షుఁడు అతనిపై ప్రీతి వొడమి యి ట్లనియె.—'ఆహా! జ్ఞప్తివచ్చుచున్నది. ఆహా! మైత్రిని చక్కఁగా నెఱవేర్చితివి. నాకు భార్యా పుత్త్ర సమాగమము ఎప్పుడు కలుగునో చెప్పుము.' విద్యాధరుఁడు విద్యాప్రభావముచే నెఱిఁగి పలికెను. 'నీవు వింధ్యవాసినిని ఎప్పుడు చూతువో అప్పుడు నీ పత్నీపుత్త్రులు నిన్ను కలసికొందురు. అచటికి పొమ్ము. నేను నాలోకమునకు పోయెదను.' అని బంధుప్రభుఁడు ఆకాశమార్గమునఁ బోయెను.

రాజు సంతసించి మెల్లగా వింధ్యవాసినీ దర్శనమునకుఁ బోయెను. దారిలో గొప్ప యడవి యేనుఁగు తల యూఁచుచు తొండము చాఁచుచు అతనిని తఱిమెను. అతఁడు గోతుల దారిని పరుగెత్తెను. ఏనుఁగు గోతిలో పడి చచ్చెను. అతఁడు పయనపు బడలికతోనే నడచుచు, ఉద్దండ పుండరీక మండిత మయిన యొక మహాసరస్సు చేరి, అందు నీరాడి త్రాగి మృణాలములు భక్షించి, చెట్టునీడ శయనించి నిద్రపోయెను. అంతలో వేఁటనుండి పల్లికి పోవువారై శబరులు ఆదారిని వచ్చి, సులక్షణుని ఆతని చూచి, దేవికి బలి వేయుటకై కట్టి, ముక్తాఫలుఁడను తమ దొరకడకుఁ గొనిపోయిరి. అతఁడు రాజును లక్షణవంతునిఁగా నెఱింగి, బలి వేయుటకొఱకు వింధ్యవాసి న్యాలయమునకు కొనిపోయెను. రాజు దేవిని చూచి నమస్కరింపఁగానే ఆమె యనుగ్రహము చేతను కుమారస్వామివరము చేతను అతని బంధనములు ఊడిపోయినవి. దానింగని యాశ్చర్యపడి శబర రాజు అతనిని బలి వేయక వదలెను. ఇట్లు కనకవర్షునికి మూఁడవ యపమృత్యువు తప్పెను. శాప వర్షముకూడ అప్పుడే ముగిసినది. ఆ క్షణమునందే అతని యత్త యా నాగాంగన మదనసుందరీ దేవిని పుత్త్రసమేతముగా తెచ్చి యతని మ్రోల నుంచి యిట్లనియె— 'కనకవర్షా, కుమారస్వామిశాప మెఱిఁగి నేను వీరిని నాయింటికిఁ గొనిపోయి ఇంతకాలము కాపాడితిని. నీ భార్యా

సుతులను కైకొనుము. ఈ పృథివీ రాజ్యమును ఏలుము. నీ శాపము తీఱినది.'

రాజు ఆ భార్యా సుతాగమమును స్వప్నముగా తలంచెను. చిరకాలము ఒండొరువులను కౌఁగిలించుకొనిన యా దంపతుల విరహక్లేశము హర్ష బాష్పాంబువులతోఁగూడి జాఱి పోయెను. ముక్తాఫలుఁడు రాజును కనకవర్షుఁ డని తెలిసికొని ఆయన పాదముల వ్రాలి, క్షమింపఁ జేసి, తన పల్లికి కొనిపోయి, తనచేత నయిన యుపచారములుచేసి, సపుత్త్ర భార్యుని అతనిని ఉపచరించెను. అటనుండి రాజు దూతలను పంపి, తన మామను దేవశక్తిని, తన నగరమునుండి స్వసైన్యమును, రప్పించి, పిడియేనుగుమీఁద మదనసుందరీదేవిని ఎక్కించి, కుమారస్వామి చేతనే హిరణ్యవర్షుఁ డని కృతనామధేయుఁ డైన యా కుమారుని ముం దిడుకొని, శ్వశురునితో అతనియింటికి తరలి, స్వల్ప దినములలో విదర్భరాజధానియైన కుండిన నగరముచేరి అందు శ్వశుర సత్కృతుఁ డై తనయ దార సేనా యుతుఁ డై సకల భోగములలోను కొన్నిదినములు గడపెను. పిమ్మట అచటి నుండి వెడలి కనకపురమునకు పోయి పౌరనారీనయనములకు మహోత్సవము గావించి అచట మదనసుందరిని పట్టాభిషేకము చేసి సర్వాంతఃపుర ముఖ్యనుగావించి, ప్రకృతుల నెల్ల సత్కరించెను. ఆదేవితోను పుత్త్రునితోను సుఖముండి నిత్యోత్సవ

ములు చేయుచు, మరల విరహ మెఱుఁగక ఆ కనకవర్షుఁడు ఈ చతురంత మహీమండలమును చిరకాలము ఏలు చుండెను.

ఇట్లు గోముఖునివలన నరవాహనదత్తుఁడును అలంకారవతియు కథ విని మిక్కిలి సంతోషించిరి.

## ౬-వ తరంగము.

ఈ ప్రకారము ప్రియాసఖుఁడై నరవాహనదత్తుఁడు గోముఖోదిత కథకు సంతోషింపఁగా, ఆ యీర్ష్యచే మరుభూతి వికృతుఁడై యుండెను. అంత నాతని చూచి రాజు మంచిమాటలాడుచు 'మరుభూతీ, నీవును ఒకకథ చెప్పరాదా!' అనెను. అతఁడు సంతోషించి ఇట్లు చెప్ప నారంభించెను.

### మహీపాలుని కథ.

పూర్వము కమలవర్మ యను రాజుని నగర మైన కమలపురమున చంద్రస్వామి యని బ్రాహ్మణోత్తముఁడు ఉండెను. అతనికి లక్ష్మీ సరస్వతులకు మూఁడవది దేవమతి యనునది భార్యయై యుండెను. ఆ యిరువురకు సులక్షణుఁ డొక కుమారుఁడు కలిగెను. వాని జననసమయమున ఆకాశవాణి యిట్లు పలికెను. 'చంద్రస్వామీ, ఈశిశువునకు మహీపాలుఁ డని పేరు పెట్టుము. ఇతఁడు రాజై చిరకాలము భూమిని పాలించును.' ఈ దివ్యవాక్కు విని, చంద్రస్వామి ఉత్సవము చేసి, కుమారునికి అట్లే

పేరు పెట్టెను. క్రమముగా మహీపాలుఁడు ఎదిగి సకల విద్యల తోడ శస్త్రాస్త్రవేదమును గూడ చక్కఁగా నేర్చెను. అంతట ఆబ్రాహ్మణుని భార్య దేవమతి సర్వావయవసుందరి నొకకన్యను కనియెను. ఆమెకు తండ్రి చంద్రవతి యని పేరిడెను. మహీపాలుఁడును చంద్రవతియు క్రమముగా తండ్రియింట పెరుఁగు చుండిరి. అట్లుండఁగా ఆదేశమున వఱపు గలిగి సస్యము లెల్ల ఎండకు మాడి                    సంభవించెను. ఆదోషముచే అచట రాజు తానె దొంగవర్తన మారంభించి సన్మార్గము మాని అధర్మముచే ప్రజలధనమును హరింపఁ దొడంగెను. దేశ మెల్ల ఇట్లు నశించుచుండఁగా, దేవమతి భర్తతో 'రా' నాతండ్రి ఇంటికి పోవుదము. ఈశిశువులు అన్నము లేక ఇచట చచ్చి పోయినను పోవుదురు.' అనెను. చంద్రస్వామి ఆమెతో 'అట్లు చేయఁ గూడదు, దుర్భిక్షములో ఇల్లు వదలి పోవుట మహా పాపము. నేను ఈశిశువులను కొనిపోయి నీతండ్రియింట వదలి శీఘ్రముగా వచ్చెదను, నీవు ఇచటనే యుండుము.' అని పలికి, ఆమెయు అంగీకరింపఁగా, ఆమెను ఇంట నిలిపి శిశువుల నిద్దఱను తోడుకొని మామయింటికి పయన మాయెను.

దారిలో ఎడమెడముగా నున్న యెండుచెట్లును ఎండకు కాలిన యిసుకయుఁ గల యడవిం జొచ్చి, అందు శిశువులకు దప్పి కాఁగా, వారిని ఒకచోటఁ బెట్టి చంద్రస్వామి తన్నిమిత్తమై జలము వెదకుచు దూరము పోయెను. ఆ సమయమున సింహ

దంష్ట్రుఁడను శబరనాయకుఁడు పనిమీఁద ఎచటికో పోవుచు అతని తావునకు వచ్చెను. భిల్లుఁడు బ్రాహ్మణుని అడిగి జలార్థి యని తెలిసికొని, అతనిని నీళ్లయొద్దకు కొని పొమ్మని, భృత్యులను సైఁగచేసి ఆజ్ఞాపించెను. ఇద్దఱు భిల్లులు సరళమతిని చంద్రస్వామిని తమపల్లికి తోడ్కొనిపోయి కట్టివైచిరి. చంద్రస్వామి బలికై తన్ను కట్టిరని ఎఱిఁగి అడవిలోని తన శిశువుల గతికై యేడ్చుచుండెను. 'అయ్యో! మహీపాలా! అయ్యో! చంద్రవతీ! అడవిలో మిమ్ము సింహవ్యాఘ్రములకు ఆహారము, చేసితిని! నన్ను దొంగలు పట్టుకొన్నారు. నన్ను రక్షించువాఁడు లేఁడు.' అని ఏడ్చుచు చంద్రస్వామి దుఃఖావిష్టుఁడై సూర్యుని గని 'ఆహా! అజ్ఞానము మాని ఈ ప్రభువును ఈ దేవుని స్తుతి చేసెదను గాక.' అని తలంచి యట్లు చేయ నారంభించెను. 'పరాపరాకాశశాయిజ్యోతి వగు విభునికి బాహ్యాభ్యంతర తమః ప్రకాశకునికి నీకు ప్రణమిల్లితిని. నీవు త్రిజగద్వ్యాపి విష్ణుఁడవు, నీవు శ్రేయోనిధి యగు శివుఁడవు, నీవే నిద్రించిన విశ్వమునకు చేష్ట కలిగించు ప్రజాపతివి. తేజోహీను లగు నగ్నిచంద్రులు ప్రకాశింపుదురుగాక యని దయచేతనుం బోలె నీవు వారియందు నీ తేజస్సును ఉంచి రాత్రి అంతర్ధానము పొందుచున్నావు. ఓ భాస్వంతుఁడా, నీవు ఉదయింపఁగా రాక్షసులు పాఱిపోవుదురు, దొంగలశక్తి తగ్గును, గుణవంతులు సంతోషింతురు. ఓ త్రైలోక్యైకప్రదీప, దేవా, శరణాగతుని నన్ను రక్షింపుము'

ఈ నా దుఃఖాంధకారమును చీల్పుము.’ ఈ రీతిని భక్తితో చంద్రస్వామి స్తుతింపఁగా ఆకాశమునుండి ఇట్లు వాక్కు వినఁబడెను: ‘చంద్రస్వామీ, తుష్టుఁడ నయితిని. నీకు వధ తప్పును, నా ప్రసాదముచే నీకు పుత్త్రాది సంగమము కలుగును.’ దివ్యవాణి యిట్లు పలుకఁగా ధైర్యము కలిగి చంద్రస్వామి శబరులు సిద్ధపఱిచిన స్నానభోజనములు సేవించెను.

ఈలోపల చెల్లెలితోఁ గూడ అడవిలో ఉండి మహీపాలుఁడు తండ్రి రామికి ఏడ్చుచు అశుభము శంకించుచుండెను. ఆ దారిని సార్థధరుఁ డను నొక గొప్ప సార్థవాహుఁడు వచ్చి, వానిని వృత్తాంత మడిగి విని కనికరించి ఓదార్చి, లక్షణవంతుని ఆ శిశువును చెల్లెలితోఁ గూడ తన దేశమునకుం గొనిపోయెను. మహీపాలుఁడు బాలుఁ డయ్యును తన్ను పుత్త్రస్నేహముతో పెంచుచున్న యావర్తకునింటయింట అగ్నిక్రియాపరాయణుఁ డై యుండెను.

ఒకనాఁడు తారాపురరాజు తారాధర్ముని మంత్రి అనంతస్వామి యను బ్రాహ్మణుఁడు గజ వాజి పదాతి యుతుఁ డై కార్యవశమున ఆ మార్గమున పోవుచు తనమిత్త్రమయిన యావర్తకుని యింటికి వచ్చి, అచ్చట విశ్రాంతుఁ డయి, జపాగ్నికార్యాది రతుని శుభాకృతిని మహీపాలుని కని, తద్వృత్తాంత మడిగి, సార్థవాహునివలన ఆ చిన్నవాడు బ్రాహ్మణుఁ డని యెఱిఁగి తాను అనపత్యుఁ డగుటచేత వానిని వాని చెల్లెలిని

'వీరిని నా కిమ్ము. నేను పెంచుకొనియెదను.' అని వర్తకుని అడిగి, అతఁడును ఇయ్యఁగా, కైకొని, తారాపురమునకుఁ బోయెను. అందు మహీపాలుఁడు మంత్రి పెంపకములో ఉండి సకల సంవత్సమృద్ధ మయిన యతని యింట విద్య నేర్చుచుండెను.

ఈ లోపల భిల్లరాజు సింహదంష్ట్రుఁడు పల్లికి వచ్చి, చంద్రస్వామితో 'బ్రాహ్మణా, నాకు స్వప్నములో సూర్య దేవుఁడు ఆజ్ఞాపించినాఁడు, నిన్ను పూజచేసి భోజనము పెట్ట వలసినది గాని, చంపఁగూడదు అని. కనుక, లే, నీ యిచ్చ ప్రకారము పొమ్ము.' అని చెప్పి, ముత్తెములు కస్తురియు నొసంగి, కొందఱను అనుచరులను వెంట నిచ్చి తరలించెను. చంద్రస్వామి అచటినుండి తరలి వనములో ఎచటను కొమరుని కొమరితను గానక, తిరిగి తిరిగి, సముద్రతీరమందు జలపురమను నగరము చేరి, యొక బ్రాహ్మణుని యింటికి అతిథిగా పోయి భుజించి, తన వృత్తాంతమును ప్రసంగవశమున చెప్పుకొనఁగా, ఆ గృహస్వామి చంద్రస్వామితో 'అయ్యా, కనకవర్మ యను వర్తకుఁడు స్వల్పదినముల క్రిందట ఇచటికి వచ్చియుండెను. అతనికి అడవిలోపల దారిలో ఇద్దఱు బ్రాహ్మణ శిశువులు దొరకినారు. అతిసులక్షణులను ఆ శిశువులను కైకొని అతఁడు నారికేళద్వీపమునకు పోయినాఁడు. వారిపేరుమాత్రము అతఁడు చెప్పలేదు.' అని చెప్పెను. అంతట చంద్రస్వామి వారు తన శిశువులే యని ఆ ద్వీపమునకు పోవుటకు నిశ్చయించుకొని,

రాత్రి గడపి, మఱునాఁడు నారికేళద్వీపమునకు పోవుచున్న విష్ణువర్మ యను నొకవర్తకునితో ఒడంబడిక చేసికొని అతని యోడలో ఆ ద్వీపమునకుఁ జోయెను. అచటి వర్తకులు ఈతనికి 'కనకవర్మ యను వర్తకుఁడు ఇచట వచ్చి యుండెను. అడవిలో దొరకి రని ఇద్దఱను విప్రదారకులను తెచ్చి యుండెను. వారిని తోడ్కొనియే యిపుడు కటాహద్వీపమునకు పోయినాఁడు' అని చెప్పిరి. అంత చంద్రస్వామి దానవర్మ యను వణిజునితో మాటలాడుకొని అతనియోడ యెక్కి కటాహద్వీపమునకు పోయెను. కనకవర్మ కర్పూరద్వీపమునకు పోయె నని అచటి వారు చెప్పిరి. ఇట్లు క్రమముగా చంద్రస్వామి కర్పూర సువర్ణ సింహళ ద్వీపములకు వర్తకులతోఁగూడ పోయియు కనక వర్మను కలయ లేఁడాయెను; అతఁడు చిత్రకూట మను తన నగరమునకు పోయెనని సింహళమువారు పలికిరి. అంత కోటీశ్వరుఁడను వణిజునితోఁ గూడ అతని యోడ యెక్కి చంద్ర స్వామి సముద్రములను దాఁటి చిత్రకూటపురమునకుఁ బోయి, కనకవర్మను కలసికొని, శిశువులకై ఉవ్విళ్లూరుచు తనవృత్తాంత మును అతనితో చెప్పుకొనెను. అతని దుఃఖమును విని కనక వర్మ తనకు అడవిలో దొరకిన యిరువురు శిశువులను చూపెను. వారు ఎవరో అన్యులు, చంద్రస్వామి శిశువులు కారు. అంత చంద్రస్వామి 'ఇంత తిరిగినను, అయ్యో! నా శిశువులు దొరక రాయెను, బ్రహ్మదేవుఁడు కుప్రభువువలె నాకు ఆశ చూపును

గాని నెలవేర్పఁడు, నిష్ప్రయోజనముగా దూరము త్రిప్పి నాఁడు.' అని యేడ్చుచుండెను.

కనకవర్మ యోదార్పఁగా చంద్రస్వామి 'భూమి యెల్ల తిరిగెదను, సంవత్సరములోపల నాశిశువులు దొరకరయేని గంగాతీరమున తపఃపూర్వకముగా దేహత్యాగము చేసెదను.' అని ప్రతిజ్ఞ చేసెను. ఆమాట విని సమీపమున నున్న యొక జ్ఞాని 'అయ్యా, నీకు నారాయణీదేవి ప్రసాదముచేత దారక సమాగమము కలుగును.' అనెను. అంత నతఁడు సంతోషించి, భాస్కర ప్రసాదమును స్మరించుచు, వణిక్ప్రాజితుఁడై, అటనుండి బయలువెడలెను. క్రమముగా అగ్రహారములలోను గ్రామముల యందును, నగరములందును, వెదకుచు ఒకనాఁడు సాయం కాలమున గొప్పగొప్ప చెట్లు గల యొక యడవి చేరి, అచట రాత్రి గడపుటకై ఫలాంబువులచే ఆహారము కావించి, సింహ వ్యాఘ్రాది భయముచే చెట్టెక్కి నిద్ర పట్టక చూచుచుండెను. అర్ధరాత్రమందు అచటికి నారాయణీప్రముఖ మయిన మాతృ వర్గము వచ్చెను. నానారూపము లగు నిజోచితోపహారములను చేతులం గొని, మాతలు భైరవదేవుని రాకను ఎదురు చూచు చుండిరి. 'ఏల ఈదినము దేవుఁడు ఇంకను రాఁడు?' అని వా రడుగఁగా నారాయణీదేవి నవ్వెను గాని చెప్పలేదు. వారు నిర్బంధింపఁగా ఆమె 'ఈ విషయము లజ్జాకరముగా నుండును, అయినను చెప్పెదను వినుఁడు.' అని చెప్పందొడంగెను.

ఇచట సురపుర మను నగరములో సురసేనుఁ డని రాజు కలఁడు. అతనికి విద్యాధరి యని సురూప కన్య కలదు. అతఁడు దానిని విమలుఁ డను నృపుని కుమారునికి ప్రభాకరుఁ డను వానికి ఇయ్య నిశ్చయించుకొనెను. విమలుఁడును ఆమె తన కుమారునికి తగిన దని విని దూతముఖమున ఆమె తండ్రిని తన కుమారునికై ఆమెను యాచించెను. సురసేనుఁడును సంతోషించి యథావిధిగా ఆకన్యను ప్రభాకరునికి ఇచ్చెను. ఆమె విమలపురమునకుఁ బోయి రాత్రి భర్తతో శయనించెను. సంభోగము లేకయే భర్త నిద్రించెను. అంత నామె అతనిని నపుంసకుఁ డని కని పట్టి 'అయ్యో! షండుఁడు నాకు పతి యయినాఁడు!' అని దుఃఖించుచు, రాత్రి గడపి, మఱునాఁడు 'విచారింపక నన్ను నపుంసకునికి ఇచ్చినాఁడవు.' అని తండ్రికి జాబు వ్రాసెను. అతఁడు జాబు చూచుకొని, విమలుఁడు తన్ను మోసము చేసె నని విమలునిపై క్రోధము వహించి 'నీవు మోసము చేసి నా సుతను నపుంసకుఁ డయిన నీకొమరునికై గ్రహించితివి, అందులకై నిన్ను సంహరించెదను. ఫల మను భవింపుము.' అని యతనికి లేఖము వ్రాసెను. విమలుఁడు మంత్రులతోఁగూడ లేఖమును చదివి చూచుకొని, దుర్జయుని సురసేనుని తప్పించుకొనుటకు ఏమియు నుపాయము కానక, చింతించుచుండెను. అంత పింగదత్తుఁ డను మంత్రి విమలునితో దేవా, ఒక యుపాయ మున్నది, దానిని చేయుము, మేలు

కలుగును. స్థూలశిరుఁ డని. యక్షుఁ డొకఁడు కలఁడు. అతని మంత్రము నాకు తెలియును. దానిచే నారాధించిన ఆయక్షుఁడు ఇష్టవరమును ఇచ్చును. ఆ మంత్రమును నావలన గ్రహించి దానిచే యక్షుని ఆరాధించి నీ కుమారునికై లింగమును యాచింపుము. అందుచే సురసేనునితోడి వైరము శమించును.' అని పలికెను. విమలుఁడు ఆమంత్రమును తెలిసికొని యక్షుని ఆరాధించి, సుతునికొఱకు లింగమును యాచించెను. స్థూలశిరుఁడు లింగ మిచ్చెను. ప్రభాకరుఁడు పురుషుఁ డాయెను. యక్షుఁడు నపుంసకుఁ డాయెను. విద్యాధరి తనపతి ప్రభాకరుఁడు పురుషుఁ డగుట యెఱింగి, అతనితో యథేష్ట సంభోగము లనుభవించి 'నేను మదదోషముచేత భ్రమపడితిని. ఈయంవగాఁడు నపుంసకుఁడు గాఁడు, పురుషుఁడే, ఇందు సందేహము లేదు.' అని తలంచి లజ్జిత యై ఆవిషయమును తండ్రికి వ్రాసెను. అతఁడు శమించెను. ఈ వృత్తాంతము నెఱిఁగి భైరవుఁడు కోపించి స్థూలశిరుని పిలిపించి 'లింగము వదలి నపుంసకుఁడ వైతివి గావున నీవు నపుంసకుఁడవుగానే యుండుము. ప్రభాకరుఁడు ఆజీవము పురుషుఁడుగానే యుండును గాక.' అని శపించెను. ఇట్లు యక్షుఁడు నపుంసకుఁ డై దుఃఖించుచున్నాఁడు, ప్రభాకరుఁడు పురుషుఁ డై భోగసుఖము లనుభవించుచున్నాఁడు. ఈపనిచేత దేవునిరాకకు కొంచెము విలంబము కలిగినది. త్వరలోనే దేవుఁడు వచ్చును.

ఇట్లని నారాయణీదేవి పలుకుసమయమందే చక్రేశ్వరుఁడు భైరవుఁడు వచ్చెను. సర్వోపహారములతోను యోగినులచేత పూజితుఁడై క్షణము నర్తించి క్రీడించెను. అది యెల్ల చెట్టుమీఁదనుండి చూచుచు చంద్రస్వామి నారాయణీదేవియొక్క దాసీజనములో నొకతెపై కన్నువైచెను. అదియు అతనిం గాంచెను. ఇరువురు నన్యోన్యసాభిలాషులైరి. నారాయణీదేవియు ఆ యవస్థలో నున్నట్టి యాయిరువురం గనియెను. భైరవుఁడు మాతృకలతోఁ గూడ పోఁగా నారాయణి వెనుకఁబడి, చెట్టుపైనున్న చంద్రస్వామిని దిగి రమ్మని, అతనిని ఆ దాసిని, 'మీ కేమి అన్యోన్యాభిలాష కలదా?' అని యడిగెను. 'కలదు దేవీ.' అని యిరువురును నిజము పలుకఁగా, దేవికోపము మాని చంద్రస్వామితోఁ బలికెను. 'మీ సత్యమునకు సంతసించితిని, శపింపను, ఈదాసిని నీ కిచ్చెదను, ఇరువురును సుఖముండుఁడు.' అంత విప్రుఁడు 'దేవీ నామనస్సు చంచలమైనను నిరోధింతునుగాని పరస్త్రీని స్పృశింపను. ఇది మనస్సుయొక్క ప్రకృతి, కాయికపాపమును మాత్రము తప్పింపవలసినది.' అని పలికెను. అంతట దేవి ఆధీరవచనములకు సంతోషించి, పుత్త్రాదులను శీఘ్రముగా కలసికొందు వని వర మిచ్చి, విషాదిహార మయిన యొక వాడని కలువను ఇచ్చి, దాసితోఁ గూడ అంతర్ధానము పొందెను.

అతఁడు ఆ యుత్పలమును గ్రహించి తెల్లవాఱఁగానే తరలి అటనట తిరిగి తారాపురము చేరెను. అందు ఇతని పుత్త్రుఁడు మహీపాఁడును పుత్త్రికయు అనంతస్వామి యను మంత్రియింట నున్నారు గదా. ఆ మంత్రి అతిథిప్రియుఁ డని చంద్రస్వామి విని, అతని యింటికే పోయి, ద్వారమందు అధ్యయనము చెప్పుచుండెను. ప్రతీహారుఁడు నివేదింపఁగా మంత్రి చంద్రస్వామిని దర్శనమాత్రముననే విద్వాంసునిఁగా నెఱింగి భోజనార్థము నిలువు మనెను. అట్లు నిమంత్రితుఁడై చంద్రస్వామి స్నానార్థమై పాపహర మైన యనంతహ్రదమునకు పోయెను. స్నానమై వచ్చు నాతనికి మార్గమందు నగర మంతటను 'అయ్యో! అయ్యో!' అని ఏడ్పు వినఁబడెను. కారణ మితఁ డడుగఁగా జనులు చెప్పిరి. 'ఇచట మహీపాలుఁ డని బ్రాహ్మణ పుత్త్రుఁడు, అడవిలో సార్థహారుఁ డను సార్థవాహునికి దొరికినవాఁడు, అతనివల్లనుండి అనంతస్వామిచే చెల్లెలితోఁగూడ సులక్షణుఁ డని గ్రహింపఁబడి పిల్లలు లేమిచే, పెంచుకొనఁబడినవాఁడు, తన సద్గుణములచే తారావర్మరాజున కేగాక ఈ రాష్ట్రమున కంతటికి ప్రియమైనవాఁడు, ఇప్పుడు నల్లత్రాఁచువాతఁ బడినాఁడు. అందులకై యీ నగర మెల్ల ఇట్లు ఘోషిల్లుచున్నది.' ఈమాట విని, వాఁడే తన కొమరుఁ డని తలంచి, చంద్రస్వామి శీఘ్రముగా మంత్రియింటికిపోయి, అచట నెల్లవారును చుట్టుకొని యుండఁగా సుతుని చూచి, దేవీదత్త

నీలోత్పలమును చేతఁగొని సంతోషముతో పిల్లవానిముక్కునఁ బెట్టెను. ఆ గంధముచే మహీపాలుఁడు నిర్విషుఁ డై నిద్ర నుండియుంబోలె లేచెను. నగరమందు సకలజనులును రాజును ఉత్సవము చేసిరి. చంద్రస్వామిని ఇతఁ డెవరో దేవాంశుఁడు మహానుభావుఁ డని అనంతస్వామియు, పౌరులును, రాజును, బహుధనము లిచ్చి పూజించిరి.

చంద్రస్వామి సత్కృతుఁ డై మంత్రియింటనే కుమారుని మహీపాలుని కొమరితను చంద్రవతిని చూచుచు ఉండెను. వారు ఒండొరువుల నెఱింగియు బయటఁ బెట్టరైరి. కార్యపరులగు బుద్ధిమంతులు అకాలమందు రహస్యమును వెల్లడి చేయుదురా? పిమ్మట మహీపాలునికి అపుత్త్రుఁ డైన తారావర్మమహారాజు గుణాకృష్టుఁడై బంధుమతి యను తన కన్య నిచ్చి వివాహము చేసి, యర్ధరాజ్య మిచ్చి, క్రమముగా సకల రాజ్యమును ఇచ్చి, సుఖముగానుండెను. మహీపాలుఁడు తనకు రాజ్యము రాఁగానే, చంద్రస్వామి తన తండ్రి యని ప్రకటించి, చెల్లెలిని తగినవరుని కిచ్చి వివాహము చేసి, సుఖముగా రాజ్యము చేయు చుండెను. ఒకనాఁడు చంద్రస్వామి యదృచ్ఛగా 'నాయనా, రమ్ము, స్వదేశమునకు పోయి నీ తల్లిని కొనివత్తము. నీవు రాజ వైతి వని యెఱిఁగి ఆమె తన్ను మఱచితి వని కోపించి దుఃఖముచే ఒకవేళ శపించినను శపించును. తల్లిదండ్రులచే శప్తుఁ డగువానికి

సుఖము కలుగదు. అందులకై ఒక వణిక్పుత్త్రకథ చెప్పెదను వినుము.' అని యీ కథను వక్కాణించెను.

## చక్రపెట్టికథ.

ధవళ మను నగరమున చక్రుఁ డను వణిక్కుమారుఁడు ఉండెను. వాఁడు తల్లిదండ్రులు వల దని వారించు చున్నను లక్ష్యము సేయక వాణిజ్యమునకై స్వర్ణద్వీపమునకుఁ బోయెను. అయిదు సంవత్సరములకు అమితధనమును ఆర్జించి ఇంటికి వచ్చువాఁడై ఓడను రత్నములతో నిండించుకొని, సబురుమై వచ్చు చుండెను. ప్రయాణము అల్పావశిష్టమై యుండఁగా మహావాత వేగాకులమై వరించుచు మేఘము లేచెను. తల్లి దండ్రులను అవమానించి వీఁడేల యిటు రావలయును అను క్రోధము చేతనుంబోలె మహాతరంగములు ఓడను బద్దలు కొట్టినవి. అందలిమనుష్యులను కొందఱను మొసళ్లుభక్షించినవి, కొందఱను అలలు కొట్టుకొనిపోయినవి. చక్రుని ఆయుర్బలము వలన అలలు కొట్టుకొనిపోయి గట్టున పాఱవైచినవి. అచట లేవ లేక పడి యుండి చక్రశ్రేష్ఠి స్వప్నమందుంబోలె పాశ హస్తుని ఒక పురుషునిఁ గాంచెను. అతఁడు చక్రుని పాశముతో కట్టి లేపి కొనిపోయి ఒకచోట సభలో సింహాసనాసీనుఁడై యున్న యొక పురుషుని యెదుట నుంచెను. ఆ ప్రభువు ఆజ్ఞా పింపఁగా ఆ పాశహస్తుఁడే చక్రుని కొనిపోయి లోహామయ మయిన యొక యింట పడవైచెను. అందు నెత్తిమీఁద కాలిన

లోహచక్రము గిఱగిఱ తిరుగుచుండఁగా దివానిశము పీడ నొందుచున్న యొకపురుషుని చక్రుఁడు గాంచి 'నీ వెవరవు ? ఏ దోషముచే నీకు ఈపీడ కలిగినది ? ఎట్లు జీవించియున్నావు ?' అని యడిగెను. వాఁ డి ట్లనియె.

"నేను వణిక్పుత్త్రుఁడను, పేరు ఖడ్గుఁడు. నేను తల్లి దండ్రులమాట విననందున కోపముచే వారు 'మమ్ము తలనున్న కాలిన లోహచక్రమువలె బాధించుచున్నావు గావున దురా చారునికి నీకు ఇట్టిపీడయే కలుగునుగాక' అని శపించిరి. అంతట నేను ఏడువఁ దొడంగుడు, 'ఏడువకుము, నీకు ఇట్టిపీడ ఒక మాసము మాత్రమే కలుగును.' అనిరి. నేను ఆ దినమును శోక ముతోఁ కడపి రాత్రి శయనగతుఁడ నై స్వప్న మందుం బోలె భయంకరుని ఒక పురుషునిఁ గాంచితిని. అతఁడు నన్ను బలా త్కారముగా కొనితెచ్చి యీలోహగృహమం దుంచి నా నెత్తి మీఁద ఈమండుచున్న తిరుగుడుచక్రమును పెట్టినాఁడు.మాతా పితృశాపముచే నాకు ప్రాణములు పోకయున్నవి. ఆమాస కాలము కడచినది. చక్రము నన్ను ఇంక వదల లేదు."

ఖడ్గుఁ డిట్లు చెప్పుకొనఁగా చక్రుఁడు కరుణావిష్టుఁ డై యి ట్లనియె.— 'నేనును ధనార్థము బయలువెడలువాఁడ నై తల్లిదండ్రులమాటను పాటింప నైతిని. నాకు దొరకిన ధనమెల్ల నష్ట మగు నని తల్లిదండ్రులు నన్ను శపించిరి. అట్లే నాకు ద్వీపాంతరార్జిత మయిన ధనమెల్ల నష్ట మయినది. మరల వ్యా

పారము చేసినను ఇదే ఫలము. నాకు ఇఁకను జీవితముచే ఏమి ఫలము ? ఆచక్రము నానెత్తిని పెట్టుము. ఖడ్గుఁడా నీశాపము తీఱునుగాక.' ఇట్లు చక్రుఁడు పలుకఁగా ఆకాశవాణి 'ఖడ్గా, నిన్ను చక్రము వదలినది. దానిని వీని తల నుంపుము.' అనెను. అంత ఖడ్గుఁడు చక్రమును చక్రుని తలను బెట్టెను. ఎవఁడో అదృశ్యపురుషుఁడు ఖడ్గుని తలిదండ్రులయింటికి కొనిపోయెను. ఖడ్గుఁడు పిమ్మట వారియాజ్ఞను మీఱక సుఖముగా నుండెను. చక్రుఁడు చక్రమును శిరమునం గొని దానిని గూర్చి యిట్లనియె.—'లోకములోని యితర పాపులనుకూడ పాపమునుండి కాపాడుము. అందఱ పాపము క్షీణించువఱకు నీవు నాతలపైనే యుండుము.' ఇట్లు పలికిన యా మహాసత్త్వునిపై తుష్టిమై పువ్వులవాన గురియుచు దేవతలు పలికిరి.—'బళి బళి! మహాసత్త్వా, ఈకరుణచే నీ పాపము క్షయించినది. నీకు అక్షయమగు ధనము కలుగును.' అంత చక్రుని శిరమునుండి ఆయినుప చక్రము పోయి అదృశ్య మాయెను. అంతట ఆకాశమునుండి ఒకవిద్యాధర కుమారుఁడు తుష్టిచే ఇంద్రుఁడు పంపిన మహార్ఘ రత్నసముదాయమును ఇచ్చి చక్రుని తన యొడిలో కూర్చుండఁ బెట్టుకొని ధవళనగరమునకు కొనిపోయి విడిచి, తాను నిజ ధామమునకుఁ బోయెను. చక్రుఁడు తల్లిదండ్రులనుగూడి బంధువులకు నేత్రోత్సవముచేసి తన వృత్తాంతమును వారికి చెప్పి ధర్మము మీఱక సుఖ ముండెను.

ఇట్లు కథ చెప్పి చంద్రస్వామి మహీపాలునితో 'పుత్రా, తల్లిదండ్రులను విరోధించుటకు ఫల మిట్టిది. వారియందలి భక్తి కామధేనువు. అందులకు ఈకథను వినుము.' అని మరల నిట్లు చెప్పం దొడంగెను.

## మ హా త పు ని క థ.

పూర్వము వనచారి మహాతపుఁ డను నొకముని తపము సేయుచు చెట్టునీడం గూర్చుండుడు, అతనిపై చెట్టుపైనుండి కొంగ యొకటి రెట్ట వేసెను. అతఁడు కోపముతో దానిని చూచినమాత్రాన అది బూడిద యై నేలఁ గూలెను. మునికి ఆతపఃప్రభావమునకై అహంకారము కలిగెను. ఒకనాఁడు ఒక నగరములో ఆ ముని ఒక బ్రాహ్మణగృహమునకుం బోయి అందలి యిల్లాలిని భిక్ష యడిగెను. 'కొంచెము సేపుండుము, భర్తృపరిచర్య చేయుచున్నాను వచ్చెదను' అని ఆపతివ్రత పలికెను. ముని కోపముతో చూడఁగా ఆమె 'మునీ, నేను కొంగను కాను జుమా.' అనెను. అందులకు ఆశ్చర్యపడి ముని అటఁ గూర్చుండి 'ఈమెకు ఇదియెట్లు తెలిసినది?' అని చింతించు చుండెను. ఆమెయు అగ్నికార్యాదికమునకై భర్తృశుశ్రూష ముగించి మునికి భిక్ష తెచ్చెను. ముని చేతులు మోడ్చి 'అమ్మా, నాకొంగ వృత్తాంతము పరోక్ష మయ్యును నీకెట్లు తెలిసినదో ముందు చెప్పుదువేని నేను పిమ్మట భిక్షను గ్రహించెదను.' అనెను, 'నేను భర్తృభక్తికంటె వేఱు ధర్మ మెఱుఁగను, ఆ

మహిమచే నాకు ఇట్టి జ్ఞానబలము కలదు. ఈ చెంత ధర్మ వ్యాధుఁ డని యొక కసాయివాఁడు కలఁడు. పోయి వానిని దర్శింతు వేని నీ యహంకారము పోవును. నీకు మేలు కలుగును.' అని యాపతివ్రత పలుకఁగా ముని ఆతిథ్యము గ్రహించి ఆమెకు ప్రణమిల్లి పోయి, మఱునాఁడు ధర్మవ్యాధుని వెదకి బజాఱులో మాంసము విక్రయించుచుండఁగా కనిపట్టి దగ్గఱఁ బోయెను.

మునిని చూచిన మాత్రముననే 'ఆ పతివ్రత నిన్ను ఇచటికి పంపినదా బ్రాహ్మణోత్తమా?' అని ధర్మవ్యాధుఁడు అడిగెను. ముని ఆశ్చర్యపడి 'మాంస మమ్ముకొను నీకు ఇట్టి జ్ఞాన మెట్లు కలిగినది?' అని యడిగెను. 'నేను తల్లిదండ్రులకు భక్తుఁడను, వారు నాకు పరాయణము. వారికి స్నానము చేయించి నేను స్నానము చేయుదును. వారికి అన్నము పెట్టి వారి భోజన మయినపిమ్మట నేను భుజింతును. వారిని పరుండఁ బెట్టి నేను పరుందును. ఇతరులు కొట్టిన జంతువులమాంసము నేను వృత్త్యర్థముగా స్వధర్మనిరతుఁడ నయి విక్రయింతును, ధనాశచేఁ గాదు. జ్ఞానవిఘ్న మయిన యహంకారమును నేను ఆ పతివ్రతయు వదలితిమి. అందువలన మాకు ఇట్టి జ్ఞానము కలదు. కనుక నీవును అహంకారము మాని శుద్ధబుద్ధిము మునివ్రతుఁడ వై స్వధర్మము ఆచరింపుము. అందుచే నీకు పరజ్యోతి అగపడును.' అని ధర్మవ్యాధుఁ డుపదేశింపగా ముని అతని యింటికిఁ బోయి, అచట వానిచర్యను చూచి తుష్టుఁడై, వన

మునకుఁ బోయి ఆ యుపదేశమును ఆచరించి సిద్ధుఁ డాయెను. ఆ పతివ్రతయు ధర్మవ్యాధుఁడును ధర్మచర్యచే సిద్ధు లయిరి. పతియందును తల్లిదండ్రులయందును భక్తి కలిగిన, ఇట్టి ప్రభావము కల్గును. కనుక నిన్నుచూడఁగోరుచున్న తల్లిని చూతువు రమ్ము.

ఇట్లు తండ్రి చెప్పఁగా మహీపాలుఁడు అంగీకరించి, తల్లిని చూడఁబోవువాఁడై, ధర్మపిత యయిన యనంతస్వామికి ఆ యుద్యమము తెలిపి సకల రాజ్యభారమును ఆయనకు ఒప్పగించి రాత్రి తండ్రితోఁ గూడ బయలువెడలెను. క్రమముగా స్వదేశము చేరి, వసంతుఁడు పికవధువునుంబోలె మహీపాలుఁడు తల్లిని సంతోషపెట్టెను. కొంతకాలము బంధుసత్కారములు పొందుచు మహీపాలుఁడు అచటనే యుండెను. నడచిన వృత్తాంతములను తండ్రి అందఱకును చెప్పుచుండెను. ఇంతలో తారాపురములో మహీపాలుని భార్య బంధుమతీదేవి తెల్లవాఱఁగానే మేలుకొని పతి యెచటికి పోయినదియు నెఱుఁగక విరహాతుర యై ప్రాసాదోపవనాదులయం దెచటను వినోదము నొందక బాష్పధారలు రెండవహారముగా రాలు చుండఁగా ప్రలపించుచు మరణోద్యత యాయెను. మంత్రి అనంతస్వామి 'అమ్మా, మహీపాలుఁడు కార్యవశమునఁ బోయినాఁడు, త్వరగా వచ్చెద నని చెప్పినాఁడు. దుఃఖపడకుము.' అని ఓదార్పఁగా ఆమె ఎట్టకేలకు ధైర్య మవలంబించెను. పిమ్మట నామె భర్తృవృత్తాంత జ్ఞానార్థము దేశాంతరాగతు లయిన బ్రాహ్మణోత్త

ములనెల్ల సత్కరించుచుండెను. వారిలో దానార్థమై వచ్చిన యొక వేదబ్రాహ్మణుని సంగమదత్తుఁడనువానిని ఆనవాలును పేరును చెప్పి తనభర్తవృత్తాంత మడిగెను. ఆ బ్రాహ్మణుఁడు 'అట్టివాని నెవనిని నేను కాననైతిని, అయినను, దేవీ, నీవు అధైర్యపడ వలదు. మంచి కర్మలు చేయుచుండిన, కొలఁది కాలమునకు అభీష్ట సంయోగము కలుగును. అందులకు నేను చూచిన యీ యాశ్చర్యమును చెప్పెదను వినుము.' అని యిట్లు పలికెను.

## త్రిభువనరాజు కథ.

నేను తీర్థయాత్రాపరాయణుఁడనై హిమాద్రియందు మానససరస్సునకుఁ బోయి అందు అద్దమువంటి యొక మణిమయ గృహమును గాంచితిని. అందునుండి ఆకస్మికముగా వెడలి ఖడ్గపాణి యొక పురుషుఁడు దివ్యనారీగణాన్వితుఁడై గట్టెక్కి, అచటి యుద్యానమందు ఆస్త్రీలతోఁ గూడ పానక్రీడ ననుభవించు చుండెను. నేను దూరమునుండియే వారి కగపడకయే కుతూహలముచే చూచుచు ఉంటిని. అంతట ఎక్కడనుండియో యందగాఁడు ఒకఁడు నా యున్న తావునకు వచ్చెను. అతనికి నేను చూచిన యా విశేషమును చెప్పి యా పురుషుని స్త్రీలను చూపితిని. దానిని చూచి ఆ పురుషుఁడు తన వృత్తాంతమును నాకు చెప్పెను.

“ నేను త్రిభువనపురమున త్రిభువనుఁ డను రాజను. అందు నన్ను ఒక పాశుపతుఁడు చిరకాలము ఆశ్రయించెను. ఏల నన్ను ఆశ్రయించెద వని నే నడుగఁగా తాను బిలఖడ్గముఁ సాధింప నున్నాఁ డనియు నేను తనకు సాయము చేయవలయు ననియు వేఁడెను. నేనును అంగీకరించితిని. అంత నతఁడు నన్ను తోడ్కొని యరణ్యమునకుఁ బోయి హోమాదులచే రాత్రి వివరమును కనిపట్టి నన్ను 'ఓయి మహావీరుఁడా, నీవు ముందుగా ఇందు ప్రవేశింపుము. నీకు దివ్యఖడ్గము దొరకఁగానే వెలువడి వచ్చి నన్ను ప్రవేశ పెట్టుము. ఇట్లు చేసెద నని నాకు ప్రతిజ్ఞ చేయుము.' అని పలికెను. నేను అతనికి ప్రతిన చేసి వివరములో ప్రవేశించి లోపల నొకరత్నమయగేహమును కంటిని. అందునుండి ప్రధానమైన యసుర కన్యక ఒకతె వెలువడి నన్ను లోనికి తోడుకొని పోయి నాకు ఖడ్గమును ఇచ్చి 'ఈ ఖడ్గము సర్వసిద్ధిప్రదము ఆకాశగతిదాయి, దీనిని పదిలముగా కాపాడు కొనుము.' అని పలికెను. నేను ఆమెతో కొంతకాల ముంటిని. జ్ఞప్తి తెచ్చుకొని వెలువడి పాశుపతుని ఆ యసురమందిరమునకు కొనిపోయితిని. నేను అచట సపరివార నైన మొదటి యసుర కన్యతోను అతఁడు మఱియొక యసురకన్యతోను ఉంటిమి. ఒక నాఁడు నేను పానమత్తుఁడ నై యుండఁగా, పాశుపతుఁడు నా ప్రక్క నున్న నాదివ్యఖడ్గమును వంచించి హరించి తన వసము చేసికొని దానివలనఁ గలిగిన మహాసిద్ధియొక్క ప్రభావముచేత

నన్ను పట్టుకొని బిలము వెలుపలికి త్రోసివైచెను. అది మొదలు పండ్రెండు సంవత్సరములు వాఁడు ఎక్కడనైన వెలువడెనేని పట్టుకొందును గాక యని బిలముఖములను వెదకుచున్నాను. వాఁడు ఇన్నాళ్లకు ఇప్పుడు ఈ నాయసురకన్యతోనే క్రీడించుచు ఇక్కడ అగపడినాఁడు.”

ఇట్లు త్రిభువనరాజు నాతో పలుకుసమయముననే ఆపాశుపతుఁడు పానమదముచే నిద్రపోయెను. రాజు నిద్రించుచున్న యాతని చెంతనున్న యా ఖడ్గమును హరించి దాని మహిమ చేత మరల దివ్యప్రభావమును పొందెను. పాశుపతుని తన్ని లేపి బెదరించెను గాని చంపఁడాయెను. తాను పరివారసమేతగా మరల తనకు దొరకిన యా యసురకన్యతోఁగూడ సిద్ధితోసుం బోలె బిలప్రవేశము చేసెను. పాపము! పాశుపతుఁడు, సిద్ధి భ్రష్టుఁడాయెను! చిరసిద్ధార్థు లయ్యును కృతఘ్నులు భ్రంశము పొందుట నిశ్చయముగదా. దీనిని నేను సాక్షాత్తుగా చూచి, దేవీ, దేశములు భ్రమ్మరుచు ఇటకు వచ్చితిని. దేవీ, నీకును చిరకాలమునకైనను ప్రియ సంయోగము తప్పక కలుగును. త్రిభువనరాజునకుఁ గాలేదా. శుభకర్ములకు చెఱుపు రాదు. ఇట్లు ఆబ్రాహ్మణుఁడు పలుకఁగా బంధుమతి సంతోషించి, అత నిని బహుధన మిచ్చి కృతార్థునిఁ జేసెను.

మఱునాఁడు మఱి యొక బ్రాహ్మణుఁడు దూరదేశము నుండి అచటికి వచ్చెను. అతనిని బంధుమతి భర్తయొక్క ఆన

వాలును పేరును చెప్పి వృత్తాంత మడిగెను. ఆ విప్రుఁడు పలి కెను: దేవీ, నీ భర్తను నేను చూడ లేదు. నాకు సుమనసుఁ డని అన్వర్థ నామము. నీకు మనస్సు తుష్ట మగు నని నా మనస్సు చెప్పుచున్నది. చిరకాలమున కైనను నీకు ప్రియసమాగమము కలుగును. అందులకు ఈ కథను వినుము.

## ద మ యం తి క థ.

పూర్వము నలుఁ డని నిషధదేశమున రా జుండెను. అతని రూపమునకు ఓడియే కాముఁడు త్రిపురారాతి నేత్రాగ్ని యందు పడి దేహమును త్యజించెను. ఆయన తనకు తగిన భార్యను వెదకుచు దమయంతి యొకతె కలదని వినెను. దమ యంతి తండ్రి విదర్భరాజు భీముఁడు తన కన్యకు తగిన భర్తను వెదకుచు నలుఁడు తప్ప ఆమెకు తగిన వరుఁడు మఱి లేఁ డని తెలిసికొనెను. ఈ లోపల దమయంతి యొకనాఁడు తన నగర మున జలవిహారార్థమై సరోవరములో దిగియెను. అందు ఒక రాజహంస కమలోత్పలములను కొఱుకుచు నుండఁగా చూచి ఆమె క్రీడాదరముచే దానిని ఉత్తరీయము పైనిగప్పి పట్టుకొ నెను. ఆ దివ్య హంస మనుష్యవాక్కులతో దమయంతితో 'రాజపుత్త్రి నీకు ఉపకారము చేసెదను నన్ను వదలుము. నలుఁ డని సద్గుణ గుంఫితుఁడు నిషధరాజు కలఁడు. అతనిని దివ్యాంగనలు కూఁడ హారముంబోలె హృదయములం దాల్తురు. అతనికి నీవు తగిన భార్యవు. ఆయన నీకు తగిన భర్త. మీా

యిరుపుర యీాతుల్యసంయోగమునకు నేను కామదూతనయ్యె దను.' అనెను. దమయంతి ఆ దివ్యహంసమువాక్కు తప్ప దని తలఁచి అట్లే చేయు మని దానిని వదలెను. శ్రవణమార్గ ప్రవిష్టుఁడయిన యానలుఁడు తన మనస్సును హరించెను గావున దమయంతి 'నలుని తప్ప మఱియొకని వరియింపను.' అని హంసతోఁ బలికెను.

ఆ హంస అటనుండి పోయి నిషధదేశమున జలక్రీడా పరాయణుఁడై నలుఁడు అధ్యాసించియున్న సరస్సునఁ బ్రవే శించెను. నలమహారాజు మనోహర మయిన యారాజహంసను చూచి వినోదముచే తన యుత్తరీయమును మీఁద వైచి పట్టు కొనెను. హంసయు 'రాజా నన్ను వదలుము, నేను నీకు ఉపకారము చేయవచ్చితిని. వినుము: విదర్భరాజు భీమునకు దమయంతి యని కొమరిత భూలోకతిలోత్తమ దేవతలకును కోరఁదగినది కలదు. నీగుణములు నేను చెప్పఁగా ఆమె నిన్నే వరియించినది. ఆ వృత్తాంతమును నీకు నేను చెప్ప వచ్చితిని.' అని పలికెను. సత్ఫలోజ్జ్వలము లయిన యీహంస వచనముల చేతను పుష్పేషు విశిఖములచేతను నలమహారాజు ఒక్కుమ్మడి కొట్టువడెను. 'విహంగోత్తమా, మూర్తీభవించిన మనోరథ సంపత్తియుంబోలె ఆమె నన్ను వరించుటచే నేను ధన్యుఁడ నయితిని.' అని పలికి, నలమహారాజు హంసను వదలెను.

హంసయు దమయంతికడకుఁ బోయి ఆమెకు ఆవృత్తాంతమును చెప్పి యథాకామముగా పోయెను.

దమయంతియు యుక్తిగా తల్లిచే నలప్రాప్తికై స్వయంవరము చాటుమని తండ్రిని వేఁడించెను. అతఁడును అంగీకరించి లోకమెల్ల సకలరాజులను పిలుచుటకు దూతలను పంపెను. రాజులెల్లరును విదర్భనగరమునకు స్వయంవరార్థము పోవుచుండిరి. నలుఁడును రథమెక్కి తరలి పోవుచుండెను. ఆ సమయమున ఇంద్రాదిలోకపాలురు నారదమునివలన దమయంతీ స్వయంవరమును ఆమెకు నలునిపైఁ గూర్మియు వినిరి. ఇంద్ర వాయు యమాగ్ని వరుణులు కలయఁబలికికొని దమయంతీబద్ధమానసులై విదర్భనగరమునకుఁ పోవుచున్న నలునికడకు వచ్చి ప్రణతుఁడైన యతనితో "రాజా, నీవు పోయి మామాటగా దమయంతితో 'మాయేవురలో ఒకనిని వరియింపుము. మరణధర్ముఁడయిన మనుష్యుని ఏల కోరెదవు ? మేము అమరులము.' అని పలుకుము. మావరముచే నీవు ఇతరులకు అగపడకయే ఆమెయొద్దకు పోవుదువు." అని కోరిరి. నలుఁడును అంగీకరించి ఆప్రకారమే అదృశ్యుఁడై అంతఃపురము చొచ్చి దమయంతితో ఆ దేవాజ్ఞను విన్నవించెను. ఆ సాధ్వి విని 'సరియే, దేవతలు గొప్పవారే, అయినను నేను వారలను కోరను. నాకు నలుఁడే భర్త.' అని పలికెను. ఆమె యిట్లు నిశ్చయముగా చెప్పఁగా నలుఁడు ఆమెకు తన్ను తెలుపుకొని ఇంద్రాదులకడకు వచ్చి,

ఆవృత్తాంతమును నివేదించెను. 'ఓయి సత్యవాదీ, మేము నీకు వశ్యులము, నీవు తలఁచిన మాత్రాన మేము వచ్చెదము.' అని పలికి దేవతలు దమయంతిని వరించువారై నలరూపము దాల్చి మనుష్యధర్మము నవలంబించి స్వయంవర మందిరములో నలుని చెంతఁ గూర్చుండిరి.

అంత దమయంతి వచ్చి, క్రమముగా భ్రాత ఒక్కొక్క రాజును తెలుపు చుండఁగా ఎక్కడను మనస్సును నిలుపక నలునిచోటికి వచ్చినదై, భ్రాత నలరూపులను ఛాయానిమేషాది చిహ్నలను ఆఱుగురను కని చింతించుచుండఁగా, వ్యాకులిత హృదయ యై 'నిశ్చయముగా లోకపాలురు ఏవురును నన్ను వంచించుటకు ఈమాయ పన్నినారు. ఆఱవవాఁడు నలుఁడు, నాకు నలుఁడు తప్ప మఱియొకఁడు వరుఁడు గాఁడు.'అని తలంచి, నలైకాయత్త మానస యై, దేవతల వైపు తిరిగి యీ రీతిని విన్నవించెను:- 'ఓ లోకపాలకులారా, స్వప్నమం దైనను నామనస్సు నలుని తప్ప మఱియొకనిపై నుండదేని, నాయందు కరుణించి ఆ సత్యముచే మీ నిజరూపములను దాల్పుఁడు. ముందు వరింపఁబడిన వరునికంటె ఇతరు లందఱును కన్యకు పర పురుషులు, వారికి ఆమెయు పరభార్య. ఇట్లుండఁగా మీకు ఈ యజ్ఞాన మెట్లు గలిగినది! ఆమాటవిని ఇంద్రాది దేవతలు ఏవురును నిజరూపములు దాల్చిరి. నలమహారాజు మాత్రము ఏక రూపముననే యుండెను. దమయంతి సంతసించి, అతనియందు

ఫుల్లేందీవర సుందరములను దృష్టి వరణమాలలను వైచెను. దివి నుండి పువ్వులవాన గురిసెను. భీమరాజు నలునికి దమయంతికి వివాహమంగళము జరిపెను. దేవతలును రాజులును విదర్భ రాజుచే ఉచితసత్కారములు వడసి నిజధామములకు పోయిరి.

ఇంద్రాదులకు దారిలో కలిద్వాపరులు ఎదురుపడిరి. వారు దమయంతీ స్వయంవరమునకు పోవుచున్నారని యెఱిఁగి ఇంద్రాదులు 'మీరేల విదర్భదేశమునకు పోయెదరు ? నలుని దమయంతి వరియించినది. మేము అటనుండియే వచ్చుచున్నారము.' అనిరి. పాపాశయులు కలిద్వాపరులు ఆమాటకు మిము బోంట్లను 'దేవతలను వదలి ఆమె మర్త్యుని వరియించినది గదా! అందులకై అవశ్యము వారిరువురను ఎడఁబాపెదము. అని ప్రతినవట్టి పోయిరి. నలుఁడు ఏడుదినములు మామ యింట నుండి కృతార్థుఁడై దమయంతిం దోడ్కొని నిషధదేశమునకుఁ బోయెను. అచట ఆ దంపతుల ప్రేమ గౌరీశర్వాధికముగా నుండెను. శర్వునికి గౌరి దేహార్థము, నలునికి దమయంతి ఆత్మగానే యుండెను. కాలక్రమమున దమయంతి నలునివలన ఇంద్రసేనుఁడను కొమరుని ఇంద్రసేన యను కొమరితను కనియెను. కలి ఇంతకాలమును తన ప్రతిన నెఱవేర్చుకొనువాఁడై యతనియందు ప్రవేశించుకొఅకు యథాశాస్త్ర వర్తనుఁడైన యతనియందు దోషమేమయిన పుట్టునా యని వేచియుండెను. ఒకనాఁడు నలుఁడు పానమదముచే మఱచి పాదప్రక్షాలనము చేయక

సంధ్యోపాసన చేయక నిద్రించుచుండెను. దివానిశము వేచి యున్న కలి ఆ రంధ్రమున నలుని శరీరము చొచ్చెను. అంతట నలమహారాజు ధర్మము నతిక్రమించి యథారుచి దురాచారుఁ డాయెను. జూదము లాడుట, దాసీజనములతో గమించుట, అసత్యము లాడుట, పగలు నిద్రించుట, రాత్రులు మేలుకొనుట, నిష్కారణముగా కోపించుట, అన్యాయముగా ధనము కొనుట, సజ్జనులను అవమానించుట, దుర్జనులను సన్మానించుట. ఇట్టి పనులు చేయుచుండెను. అట్లే ద్వాపరుఁడు నలుని తమ్ముఁడైన పుష్కరునియందు సమయము గని చొచ్చి నలునివలెనే వానిని దురాచారునిఁ గావించెను.

ఒకనాఁడు నలుఁడు తమ్ముని యింట అంద మయిన తెల్ల యెద్దును దాంత మను పేరిదానిని కని తన కిమ్మని యడిగెను. పుష్కరుఁడు ద్వాపరప్రేరణచే అన్నపై భక్తిచెడి దానిని నలునికి ఈయక 'నీకు ఈ వృషభము కావలయునేని నాతో జూదమాడి కైకొనుము.' అని పలికెను. నలుఁడు తెలివి మాలి జూద మాడఁ దొడంగెను. పుష్కరుని పందెము ఆ యెద్దు, నలుని పందెము ఏనుఁగులు మొదలగునవి. పుష్కరుఁడు సదా గెలుచు చుండెను, నలుఁడు సదా ఓడుచుండెను. రెండుమూఁడు దినములలో బలమును కోశమును నలుఁడు ఓడెను. ఎందఱు వారించినను కలిసమావిష్టుఁడై నలుఁడు జూదము మానఁ డాయెను. అంతట రాజ్యము పోయిన దని నిశ్చయించుకొని

దమయంతి తన శిశువుల నిరువురను మంచి రథ మెక్కించి తన తండ్రి యింటికిఁ బంపెను. నలుఁడు రాజ్యమంతయు తమ్మునికి ఓడెను. పుష్కరుఁడు జయోత్సవముతో నలుని 'నీ యితర ధనము లెల్లను అయినవి దమయంతిని ఒడ్డుము.' అనెను. ఆ మాటకు నలుఁడు గాలికి నిప్పువలె మండుచు ఉండెను, బదులు పలుకలేదు, పందెము వేయలేదు. అంత పుష్కరుఁడు 'భార్యను పందెము ఒగ్గవేని, ఆమెతోఁగూడ ఈనాదేశము వదలిపొమ్ము'. అనెను. అంతట నలుఁడు దమయంతిం దోడ్కొని వెలువడెను. రాజపురుషులు వారిని ఎల్లనలకును పంపి వచ్చిరి. ఆహా! నలునికిఁ గూడ కలి యిట్టియవస్థను కలిగించె ననఁగా క్రిమిప్రాయులయిన యితరుల గతి చెప్పవలయునా? చీచీ! ధర్మదూరము నిఃస్నేహము అయిన యీజూదము రాజర్షులకుఁ గూడ నిట్టి యాపదలను కలిగించినది. కలిద్వాపరుల జీవిత మిది.

అట్లు తమ్ముఁడు సకలైశ్వర్యములు హరింపఁగా నలుఁడు దమయంతీ సహాయుఁడయి విదేశమునకుఁ బోవుచు ఆఁకటికి బడలి వనమార్గమున నుండెను. ఆమెపాదములు దర్భాంకుర క్షతములగుడు నచట నొకసరస్తీరమున నిరువురు విశ్రామార్థము కూర్చుండిరి. అంత నచటికి రెండు హంసలు వచ్చినవి. ఆహారార్థము రాజు వానిని పట్టుకొనుటకై వానిమీఁద తన యుత్తరీయమును విసరెను. ఆ యంచలు ఉత్తరీయమును హరించుకొని పోయినవి. 'హంసరూపున ఆ యక్షములు వచ్చి నీ వస్త్ర

మునుగూడ హరించుకొని పోయినవి.' అని ఆకాశమునుండి నలునికి వాక్కు వినఁబడెను. అంత నారాజు దుఃఖితుఁడై ఏకవస్త్రుఁడై కూర్చుండి దమయంతీదేవికి విదర్భ నగర మార్గమును చూపించెను. 'ప్రియా, ఈదారి విదర్భదేశమునకు నీతండ్రి యింటికి నడచును. ఇది అంగదేశమునకు దారి. ఇది కోసలమునకు దారి.' ఆ మాటలు విని దమయంతి 'ఆర్యపుత్త్రుఁడు నన్ను వదలివేయ నున్నాఁడు కాఁబోలును, కాదేని ఈమార్గముల నేల చూపును?' అని భయపడెను, వారు ఆవనములో ఫలము లారగించి రాత్రి కుశశయనమున పరుండిరి. దమయంతి దారి నడచినబడలికచే త్వరలో ఒడలెఱుఁగక నిద్ర పోయెను. నలుఁడు కలిమోహితుఁడై నిద్రపోక దమయంతిని ఎడఁబాయ నుద్యోగించి దమయంతియొక్క వస్త్రార్ధమును తఱిగి తాను చుట్టుకొని ఆమెను విడనాడి వెడలిపోయెను.

దమయంతి రాత్రియెల్ల నిద్రించి మేల్కొని పతినిగానక, తన్ను వదలి పోయె నని తలఁచి విలపింపఁ దొడంగెను. 'హా! ఆర్యపుత్త్రా, మహాసత్త్వా, శత్రువులయందును దయగలవాఁడా, మద్వత్సల, ఎవరు నిన్ను నాపై నిష్కరుణునిఁ గావించిరి. ఒంటరిగా కాలినడకచే అడవులలో ఎట్లు తిరుగుదువు? ఎవరు నీకు శ్రమాపనోదనార్థము పరిచర్య చేయుదురు? రాజులమౌళిమాలాపరాగములచే రంజితము లయిన నీపాదములను దారిలో ఇప్పుడు ధూళి కలుషము చేయుచున్నది గదా! హరిచందన

చూర్ణమునకుఁగూడ కందున దైన నీయంగము మధ్యాహ్నా ర్కాతపమును ఎట్లు సహించును ? నాకు బాలుఁ డైన పుత్త్రుఁ డేల? కొమరిత యేల? నేను పతివ్రతనయేని దేవతలు నీకు మేలు చేయుదురు గాక.' ఇట్లు ఏకాకిని యై ఏడ్చుచు దమయంతి అతఁడు పూర్వము చూపిన మార్గమునఁ బోవుచుండెను. ఎట్టకేలకు నదులను శైలవనావళులను దాఁటెను గాని నలునిపై భక్తిమాత్రము వదలలేదు. ఆమె పాతివ్రత్య తేజస్సు ఆమెను మార్గములో రక్షించెను. ఎట్లనిన, లుబ్ధకుఁ డొకఁడు ఆమెను పాపమునుండి రక్షించి కామాతురుఁ డై క్షణములో భస్మమై పోయెను. అంతట దైవవశమున వచ్చిన యొక బిడారుతో చేరి ఆమె క్రమముగా సుబాహుమహారాజు నగరము చేరెను. అచట రాజసుత మేడనుండి దూరమునందే ఈమెను చూచి ఆ సౌందర్యమునకు ప్రేమించి రప్పించి తమతల్లికి కానుకగా నొప్పగించెను. మహాదేవి ఆదరించి అడుగఁగా దమయంతి తన్ను భర్త వదలి పోయె నని పలికి, కాలము గడపుచుండెను.

ఈలోపల ఆమెతండ్రి భీమరాజు నలవృత్తాంతము విని వారి నిరువురను వెదకుటకు ఆప్త జనులను నలు దిక్కులకుఁ బంపెను. వారిలో సుషేణుఁ డను నొకమంత్రి బ్రాహ్మణరూపమున ఆ సుబాహు రాజధానికి వచ్చెను. అచట ఆగంతువులను వెదకుచున్న యా దమయంతిని అతఁడు చూచెను. ఆమెయు తండ్రియొక్క మంత్రిని అతనిం జూచెను. ఇరువురును బంధొరు

వుల ఆనవాలు పట్టి వెదువఁ దొడంగిరి. సుబాహురాజ్ఞి ఆ వృత్తాంతము విని వారిని పిలిపించి దమయంతి తనభగినీసుత యని తెలిసికొని తన భర్తకు తెలిపి ఆమెను సన్మానించి రథ మెక్కించి సుషేణునితోను సైన్యముతోను తనపురికిఁబంపెను.

దమయంతి తన బిడ్డలను కలసికొని తండ్రిచేత నలుని వెదకించుచుండెను.

క. "వనమున నిద్రిత బాలన్
మునుకొని విడనాడి వడిఁ గుముద్వతిఁ గాంతన్
గొని యంబరఖండంబున్
గనఁబడకే యేఁగి తెటకొ ఘాతుకచంద్రా."

అని నలుఁ డుండఁదగు తావుల బిగ్గరగా పాడుఁ డని భీమరాజు చారుల కాన తిచ్చెను.

ఈలోపల నలమహారాజు ఆవనములో రాత్రి అర్ధవస్త్రావృతుఁడై దూరము పోవుచుండెను. ఒకచో దావాగ్నిలో 'నేను కాలకముందే నన్ను వెలికిఁ దీసి కాపు కావుము.' అని మొఱ వినఁబడెను. అంతట నలమహారాజు దావానల సమీపమున చుట్టుచుట్టుకొని అట్లు మొఱపెట్టుచున్న యొకనాగముం గాంచి, వనవహ్నిచే ఉగ్రహేతిహస్తముతో సిగఁ బట్టుకొనఁబడినదో యన శిరమున ఫణారత్న ప్రభాజాలజటిల మైన యా నాగమును దజెసి కృపతో నెత్తి రొమ్మునఁ గొని దూరము పోయి క్రింద విడువఁబోయెను. అంత నా నాగము మరల 'ఇఁక పదియడుగులు బిగ్గరగా లెక్కించుచుం బోయి తుదను నన్ను వదలుము.' అని వేఁడెను. 'ఏకమ్, ద్వే, త్రీణి, చత్వారి, పఞ్చ, షట్, సప్త, అష్ట, నవ, దశ' అని పలుకఁగానే బుజముమీఁద

నున్న పాము లలాటమునఁ గఱచెను. అంత నలుఁడు చేతులు కుఱుచ లై విరూపుఁ డై నల్ల నాయెను. సర్పమును బుజము నుండి దింపి రాజు పామును 'నీ వెవరవు ? నాకు ఏమి యిట్టి ప్రత్యుపకారము జేసితివి ?' అని యడిగెను. 'రాజా, నేను కర్కోటకుఁ డను నాగరాజను. మేలుకొఱకే నిన్నుఁ గఱచితిని. అజ్ఞాతవాసమున వైరూప్యము గొప్పవారికి కార్యసిద్ధిని కలిగించును. అగ్నిశౌచమనుపేరి యీవస్త్రద్వయమును కైకొమ్ము. దీనిని ధరింతువేని నిజరూపమును పొందుదువు.' అని పలికి వస్త్రద్వయ మిచ్చి కర్కోటకుఁడు పోఁగా, నలుఁడు ఆవనము నుండి క్రమముగా వెలువడి, కోసలదేశమునకుఁబోయి, తత్పతిని ఋతుపర్ణరాజును దర్శించి, అతనియింట హ్రస్వబాహు వను పేర సూదుఁడుగా కొలువుండి, దివ్యరసము లయిన బోనముల వంటచేతను రథవిద్యచేతను అచట ప్రసిద్ధుఁ డాయెను.

అచట నలుఁడు హ్రస్వబాహు వను పేరఁ గొలుచు చుండఁగా, విదర్భనాథుని చారులలో నొకఁడు వచ్చి, అచట హ్రస్వబాహు వని క్రొత్త సూదుఁడు సూద రథవిద్యలలో నలతుల్యుఁడు కలఁ డని అచటివారివలన విని, అతఁడే నలుఁ డని తలంచి, అతఁడు రాజాస్థానమున నుండఁగా, పోయి యుక్తిగా నచట ఆ పద్యమును పాడెను.

అందలివారు ఉన్మత్తవాక్యాభమును ఆ వాక్యమును నరకు గొనరైరి. సూదవేషి యైన నలుఁడు ఇట్లు పలికెను,—

గీ. క్షీణుఁ డంబరైకకోణంబు గొని చంద్రుఁ
డన్యమండలమున కరుగువాఁడు
తిరుగఁ దాఁ గుముద్వతికిఁ గానఁబడకుంట
యతని ఘాతుకత్వ మనుట యెట్లు ?

ఈ యుత్తరము విని చారుఁడు, అతఁడే నలుఁడని విపత్తుచే అట్లు విరూపుఁడై యున్నాఁడని నిశ్చయించుకొని, వెడలిపోయి విదర్భనగరము చేరి, రాజునకు రాణికి దమయంతికిని చూచినది విన్నది ఎల్లను వర్ణించెను. అంత దమయంతి తండ్రితో "నిస్సందేహముగా అతఁడే ఆర్యపుత్త్రుఁడు గావలయును, సూదవ్యాజమున నున్నాఁడు కనుక అతనిని రప్పించుటకై ఋతుపర్ణరాజునే ఇక్కడికి రావింపవలయును; అందులకై అతనికి దూతను పంపవలయును. దూత ఋతుపర్ణుని చూచి యిట్లు పలుకవలయును:—'నలమహారాజు ఎచటికో పోయినాఁడు, ఆయన వార్త తెలియలేదు. కావున రేపు ఉదయమున దమయంతి పునస్స్వయంవరము కావించును. కనుక మీరు ఇప్పుడే శీఘ్రముగా విదర్భనగరమునకు పోవలయును.' అని—ఈమాట విని ఋతుపర్ణుఁడు రథవిద్యావిశారదుఁడైన నలునిమహిమచే ఒకదినమునకే ఇంతదూరము వచ్చును." అని పలికెను. అతఁడు అంగీకరింపఁగా, దమయంతి కోసలదేశమునకు దూతను యథోచితముగా సందేశము కఱపి పంపెను. దూతయు పోయి ఋతుపర్ణునితో నలుఁడు ప్రక్క నుండఁగా వినయముతో ఆ దూత్యమును నివేదించెను. 'హ్రస్వబాహూ, రథజ్ఞానము నీకు కల దని పలికితివి గదా, నీవు నేర్పుగలదేని ఈదినమే నన్ను విదర్భనగరము చేర్పుము.' అని ఋతుపర్ణుఁడు

అడిగెను. అట్లే చేర్చెదనని నలుఁడు పలికి వెంటనే వరాశ్వము లను పూంచి రథమును సజ్జముచేసెను. 'ఈస్వయంవర ప్రవాద నన్ను రప్పించుకొనుటకే దమయంతి కల్పించినది. స్వప్నమం దైనను వాస్తవముగా ఆమె ఇట్టితలంపును దాల్పదు. కనుక అచటికిఁ బోయి చూచెదను గాక.' అని తలంచి హ్రస్వబా హుఁడు సజ్జమయిన యారథమును ఋతుపర్ణుని కడకు తోలు కొని వచ్చెను.

ఋతుపర్ణుఁడు రథము నెక్కఁగానే నలుఁడు గరుఁడుని వేగమును తిరస్కరించు వేగముతో తోల నారంభించెను. దారిలో రథవేగముచే ఉత్తరీయము జాఱిపడిపోఁగా ఋతు పర్ణరాజు దాని తెచ్చుకొనుటకై నలుని రథమును ఆఁపు మనెను. 'రాజా, నీ యుత్తరీయము, ఎక్కడ నున్నది? ఈ క్షణములోనే రథము అనేకయోజనములు దాఁటి వచ్చినది గదా.' అని నలుఁడు పలికెను. అంతట ఋతుపర్ణుఁడు నలుని తనకు ఆ రథవిద్య నేర్పుమనియు, తాను ఆతనికి అక్షజ్ఞాన మిచ్చెద ననియు, ఆ యక్షవిద్యచే అక్షములు వశ్య మగు ననియు, సకల వస్తు సంఖ్యయు తెలియు ననియు, పలికి అందులకు తార్కాణగా అప్పుడు చెంతనున్న యొక చెట్టు యొక్క ఫల పర్ణసంఖ్యను చెప్పెను. అంత నలుఁడు లెక్క పెట్టఁగానే చెట్టులో పండ్లు ఆకులును అన్నియే యుండెను. అంత నలుఁడు రథవిద్యను ఋతుపర్ణునికి ఉపదేశించి అతని వలన అక్షవిద్యను గ్రహించెను. నలుఁడు ఆవిద్యను మఱి యొక చెట్టున పరీక్షించి, సిద్ధిని నిశ్చయము చేసికొనెను.

అంత నలునిశరీరమునుండి నల్లనిపురుషుఁడొకఁడు వెలువడెను. నలుఁడు వానిని, నీ వెవఁడ వని, యడిగెను. 'నేను కలిని, దమయంతి నిన్ను వరించిన దన్న యీసుచే నీ దేహము చొచ్చితిని, ఆకారణమున నీసిరి యెల్ల జూదములో నష్ట మయినది. పిమ్మట కర్కోటకుఁడు నిన్ను వనములో కఱచినను ఆకాటునకు కాలవైతివి. దానిచేత నేను దగ్ధుఁడ నై నీయం దుంటిని. నిష్కారణముగా పరాపకారము చేయువారికి ఎవరికి మేలు కలుగును? వత్సా, పోయి వచ్చెదను. ఇతరులపై నాకుఁ బ్రవేశము లేకపోలేదు.' అని ఆపురుషుఁడు పలికి అంతర్హితుఁడాయెను. నలుఁడు యథాపూర్వము ధర్మబుద్ధి యాయెను. మరల రథ మెక్కి నలుఁడు ఋతుపర్ణుని ఆదినమే విదర్భనగరమునకు కొనిపోయెను. ఋతుపర్ణుని ఆగమనకారణ మడిగి పురజనులు పరిహాసించిరి. అతఁడును రాచనగరి చెంత నొక లోఁగిట విడిసెను.

అంత దమయంతి ఆఘోష విని నలుఁడు వచ్చె నని తలంచి సంతోషించి, తత్త్వము తెలిసికొని రమ్మని ఒకచేటిని పంపెను. చేటికయు వచ్చి విచారించి పోయి ఆమెతో 'దేవీ, నేను పోయి విచారించితిని. ఈ కోసలరాజు నీవు మరల స్వయంవరము చేయుదు వని మిథ్యాప్రవాదము విని వచ్చినాఁడు. హ్రస్వబాహు వను సూదుఁడు రథవిద్యావిశారదుఁడు ఇతనిని ఒక దినములోనే ఇచ్చటికి తోలుకొని వచ్చినాఁడు. ఆసూదుని నల్లనివానిని విరూపుని నేను వంటసాలలో

చూచితిని. అతని ప్రభావము అద్భుతముగా నున్నది. పాత్రములయందు స్వయముగానే నీరు నిండును. స్వయముగానే కొయ్యలు మండును. క్షణములో నానాదివ్యభోజనములు సిద్ధమయినవి. ఈ మహాశ్చర్యమును కని నే నిటకు వచ్చితిని' అని విన్నవించెను. అంత దమయంతి 'అగ్నివరుణులు నాభర్తకు వశ్యులు, ఆయన రథవిద్యా రహస్యములను ఎఱిఁగినవాఁడు, సూదుఁడు. ఇతఁడే నాభర్త గావలయును. ఏ కారణముననో విరూపుఁ డయినాఁడు. నావియోగముచే ఇట్లు కాఁబోలును. కనుక చక్కఁగా విచారించెదను.' అని సంకల్పించి తన శిశువుల నిరువురను అతని కడకుఁ దోడ్కొనిపొమ్మని చేటి నాజ్ఞాపించెను. నలుఁడు తన శిశువులను జూచి ఒడిలో కూర్చుండఁ బెట్టుకొని చాల సేపు సంతతధారగా ఏడుచుచుండెను. 'నా బాలురు ఇరువురు ఇట్టివారే మాతామహుని గృహమున నున్నారు, వీరిని చూడఁగా వారు స్మృతికి వచ్చిరి. అంతట దుఃఖమై కన్నీళ్లు పెట్టుకొంటిని' అని నలుఁడు పలికెను. ఆచేటి అది యెల్లం గని పోయి దమయంతికి నివేదించెను.

ఆమెయు ఆస్థ ప్రబలి మఱునాఁడు ఆ చేటిని పిలిచి "ఓసీ, నీవు పోయి ఋతుపర్ణునిసూదునితో నామాటగా 'నీకు సాటి సూపకారుఁడు లేఁ డని వింటిని, కనుక ఈ పూఁట మాయింటికి వచ్చి వ్యంజనము చేయుము.' అని పలుకుము." అని యాజ్ఞాపించెను. అట్లే చేటి పోయి నలుని పిలిచెను. నలుఁడును ఋతు

పర్ణుని యనుమతిచే దమయంతికడకు వచ్చెను. దమయంతియు అతనిని 'సత్యముగా చెప్పుము, నీవు సూదవేషమున నల మహారాజవు గావా, అట్లయేని చింతాబ్ధిమగ్నను నన్ను గట్టెక్కింపుము.' అని యడిగెను. నలుఁడును స్నేహహర్ష దుఃఖ త్రపాకులుఁడై తలవాంచి అశ్రుగద్గదముగా నిట్లు పలికెను.— 'ఆ నలుఁడనే నేను, సత్యము, పాపుఁడను, కులిశకర్కశుఁడను, నిన్ను సంతాపపెట్టి అనలుఁడ నైతిని.' 'అట్లయిన నీకు ఈ వైరూప్య మెట్లు కలిగినది?' తని దమయంతి యడుగ, నలుఁడు కర్కోటకసఖ్యము మొదలుగా కలినిర్గమన పర్యంతము తన వృత్తాంత మంతయు చెప్పి కర్కోటకదత్తమును అగ్నిశౌచ మను వస్త్రయుగమును దాల్చి నిజరూపము పొందెను.

దమయంతి అవాప్తనిజరూపుని నలుని మరలఁ గాంచి వికస ద్వదనారవింద యై, కన్నీటిధారలచే హృదయ దుఃఖ దవాగ్నిని చల్లార్చుకొనునదివోలె నొప్పారి, అనిర్వచనీయ హర్షములో మునింగెను. ఆమె పరిజనములు ప్రమదావేశ మునఁ బోయి ఆ వృత్తాంతమును తెలుపఁగా, విదర్భరాజు వచ్చి ఆ నలదమయంతులను అభినందించి, పురిలో నెల్ల మహోత్సవము గావించెను. భీమరాజు సంతోషమున చేసిన సత్కారములు వడసి ఋతుపర్ణమహారాజు సంతోషించి నలుని ప్రతిపూజించి, సెలవుగొని కోసలమునకుఁ బోయెను. పిమ్మట నిషధరాజు ఆ కలిదౌరాత్మ్య విజృంభితమును వర్ణిం చుచు కొంతకాలము ప్రాణప్రియాసహితుఁ డై అచటనే

సుఖముండి, మామగారి సైన్యములను గొని నిషధమునకుఁ బోయి అక్షవిద్యచే పుష్కరుని ఓడించి, ద్వాపర విముక్తిచే నమ్రుఁడైన యాతనికి ధర్మాత్ముఁడై, కొంత దేశ మిచ్చి, దమయంతీప్రాప్తిహృష్టుఁడై, సుఖముగా రాజ్యము చేయుచుండెను—

మెండియు సుమనసుఁడు బంధుమతితో నిట్లనియె. 'దేవీ, ఈరీతిని గొప్పవారు దుఃఖము లనుభవించి కల్యాణము పొందుదురు. సూర్యాదులు అస్తమించి గదా ఉదయము పొందుదురు. కనుక పుణ్యాత్మురాలవు నీవును త్వరలోనే నీ పతిని కూడుదువు. ధైర్యముగా నుండుము. ఖేదము మానుము. పతిని రప్పించు పుణ్యకర్మలు చేయుము' ఇట్లు మంచి మాటలు పలికిన యాసజ్జనుని ద్విజవరుని బహుధనముల సత్కరించి బంధుమతి ప్రాణనాథుని రాక నెదురుసూచుచు ఉండెను. అల్ప దినములకే మహీపాలుఁడును తల్లిని తోడ్కొని పితృసమేతుఁడై పూర్ణిమాచంద్రుఁడు సముద్రజల లక్ష్మిని బోలె జనులకు కన్నుల పండువుగా వచ్చి బంధుమతిని సంతోషపెట్టి రాజ్య మేలుచు ఆమెతో యథేచ్ఛ భోగము లనుభవించు చుండెను.

ఇట్లు తనమంత్రి మరుభూతివలన నరవాహనదత్తదేవుఁడు వనితాసఖుఁడై చిత్రకథను విని మిగుల సంతోషము పొందెను.

అలంకారవతి లంబకము ముగిసినది.

UNIVERSITY OF HYDERABAD
ABH

UNIVERSITY OF HYDERABAD LIBRARY

Acc. No. 311

Call No. ____________

Author వెంకటరాయశాస్త్రి వేదము

Title శ్రీకథాసరిత్సాగరము.

UNIVERSITY OF HYDERABAD

LIBRARY

HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**